
# విజేతలు మీరే

ఆచార్య ఆత్మ ప్రేరణలు




సంపాదకులు

**ఆలపాటి**

సంకలన కర్తలు

**రమాకాంత్ మిద్దెల, USA**
**శ్రీనివాస్ కొత్తూరు, USA**

సమన్వయకర్త

**ప్రొ॥ వై. అరుణాచార్య**

# ఆచార్యను దేశానికి పరిచయం చేసిన రాష్ట్రపతి కలాం



ప్రజల రాష్ట్రపతి డా.ఎ.పి.జె అబ్దుల్ కలాంగారు డా. సుదర్శన్ ఆచార్యరిని రెండవ జాతీయ ఉద్యమం అయిన లీడ్ ఇండియా 2020 ను పరిచయం చేస్తు భారత రాష్ట్రపతిగా తన అంతిమ ప్రసంగం 22-7-2007న చేశారు. తన ప్రసంగంలో ఇంత గొప్ప ఉద్యమం వ్యాప్తికి ప్రతి ఒక్కరు భాగస్వాములవాలని ఆయన జాతికి పిలుపునిచ్చారు.



सत्यमेव जयते

Dr. A.P.J. Abdul Kalam
Former President of India

10, Rajaji Marg
New Delhi-110011
06th April 2012

Dear Shri kapil Sibal Ji,

I thought of apprising you a bout a silent but dynamic revolution taking place among millions of high school students below the age of 20 years. In this simple programme teachers also trained with ten point oath. In a five days "Aap Badho Deshko Badhao" programme, Students have become self-reliant,confidant and transformed themselves and also facilitate transforming their parents and neighbours.This Lead India 2020 Movemement is spreading fast in Andhra Pradesh and in some parts of Tamil nadu and Karnataka. I am writing this letter to you to suggest, itroduction of Lead India 2020 which inclates ethical way of life among the youth to be introduced in the whole country at a minimum cost and minimum utilization of time of students.

Pro N.B. Sudershan Acharya is the Coordinator and CEO of the Lead India 2020 Mission (e-mail-acharya.leadindia@gmailcom) will present the salient features of the programme imparted to the students, teachers and families and the society impact there of I myself witnesses, the beatiful results during my interaction with thousands and thousands of students who have undergone the Lead India 2020 programme in the School.

Greetings and regard,

Your's sincerely,

(A.P.J. Abdul Kalam)

Hon'ble Shri Kapil sibal
Minister for Human resource Development & IT
Shastri Bhavan
New Delhi.



కలాం మాట... ఆచార్య బాట

Middle Page - front

# ఆచార్యులవారి ఆచార్యులు





# Middle Page - Back







Dr.Kalam Statue opening by Sri.Pullela Gopichand,
Dr.N.B.Sudershan Achayra & Justice Eswaraiah






విద్య ఉద్యోగం కొరకే  అంటున్నారు దేశంలోని 95% పట్టభద్రులు.

**మరి చదువు కేవలం ఉద్యోగం కొరకేనా?**

కాదు నలుగురికి ఉద్యోగాలు ఇవ్వాలి.

కుటుంబాన్ని, దశాన్ని  గొప్పగా అభివృద్ధి చేయాలి.

ఆచార్య ద్వార దివ్యాంగుడైన లీడ్ ఇండియన్ శ్రీకాంత్ బొల్లా ఎంట్రప్యూనర్ 2015 అవార్డు అందుకున్నాడు

## సంపూర్ణ అభివృద్ధి కి అంశాలు



Srikantha Bolla in 2004 at Rastapathi Bhavan

https://youtu.be/PmBfk-oa8GA






http://www.bollant.com/

" श्री Sudershana Chakram" is the ultimate tool developed by Dr.Nallaboina Sudershan Acharya to evaluate 47 Values and skills (mentioned in the above circle,) propounded by UNO, UNICEF, WHO, International Baccalaureate (IB), India Constitution, 12th Five year plan and National Curriculum aFramework (NCF) of Government of India. These values are derived out of "Aap Badho Desh Ko Badhao" training programme which Acharya integrated with former President of India Dr.A.P.J. Abdul Kalam research publication " India by 2020"

Back


# ఒక్క క్షణం ఆలోచించండి!

## చదివిన చదువులు నిజ జీవితంలో 25% మాత్రమే ఉపయోగపడేది.

## మిగితా 75% విజ్ఞానం ఎక్కడ నుండి వస్తుంధో తెలుసా ?

## చదవండి! **విజేతలు మీరే...**

## విజేతల మనోగతం



**పద్మ పుల్లెల గోపి చందు గారు** - Brand Ambassador, Founder Gopichand Academi

ప్రజల అధ్యక్షుడు అబ్దుల్ కలాంగారిని నేను గౌరవిస్తాను. అయినా! నేను లీడ్ ఇండియా ట్రస్టీగా సేవలు అందిస్తున్నది ఆచార్యగారి అకుంటితమైన దీక్షతో ఉద్యమాన్ని నడిపిస్తున్న విధానం విద్యార్థులలో వస్తున్న మార్పులు నన్ను ఆకర్షిస్తున్నాయి. ఈ శిక్షణ “ గోపి చందు అకాడమి లో ఉన్న విద్యార్థులకు కూడ ఇప్పిస్తుంటాను. అభివృది భారత్ సాధించుటకు ఇది ఒక అద్భుత ఉద్యమం.




**డా. వరప్రసాద్ రెడ్డి గారు** - పద్మభూషణ్

లీడ్ ఇండియా 2020 ఉద్యమం నచ్చి దానికి అధ్యక్షులుగా సేవలు చేస్తు వేల విద్యార్థులలో జరిగిన మార్పు గమనించాను. వారందరికి ఈ శిక్షణా స్పూర్తి కొనసాగుటకు యువత అభివృద్ధి ద్వారా దేశాభివృద్ధికి నా వంతు గా 50 కోట్ల యువతను మార్చుటకు ఒక మంచి షార్టు ఫిల్మి తయారు చేసి ఇచ్చాను.



**డా. బండి పార్థ సారథిరెడ్డి గారు** - CMD – Hetere Drugs Ltd

1989లో బాల భారతి శిక్షణా శిభిరంలో వారి కుమారుడులో వచ్చిన మార్పును చూసి సంతోషించి నాటి నుండి నేడు లీడ్ ఇండియా మిషన్ 2020 వరకు ఒక ట్రస్టీగా నిరంతరం ఎనలేని సేవ చేస్తున్నారు. 2004లో ఎల్.బి స్టేడియంలో 50 వేల మంది విద్యార్థుల సమక్షంలో జరిగిన కలాంగారి 74వ జన్మదినోత్సవ వేడుకలో ప్రదాన పాత్ర పోషించిన లీడ్ ఇండియా ప్రాణదాత .



**అతీమ్‌త్యాబ్‌జీ గారు** – Byte Mobiles - USA

మనిషి శారీరకంగా, మానసికంగా,బుద్ధి వికాసంగా,భావసమతుల్యంగా, సామాజికంగా, ఆధ్యాత్మీకంగా ఎదిగి తనలో దాగిన శక్తిని వెలికి తీసి ఒక దేశాన్ని నిర్మాణం చేయడానికి ఆచార్యగారు నడిపిస్తున్న లీడ్ ఇండియా ఉద్యమం ప్రపంచంలోనే ఎక్కడా లేనటువంటి మనషులను మార్చే నిశబ్ద విప్లవం.



**వి.వి. లక్ష్మీనారాయణ గారు** – IPS DG-Maharastra (Formed JD-CBI)

ఆచార్యగారు రచించి, నిర్వహిస్తున్న లీడ్ ఇండియా మీ అభివృద్ధే దేశాభివృద్ధి శిక్షణను నేను చదివిన ప్రభుత్వ పాఠశాల, శ్రీశైలం విద్యార్థులకు ఇప్పించాను. తరువాత గ్రామాలలో వారు ఈ రోజుకు మార్పు ప్రతినిదులుగా మారుతున్నటువంటి విధానం అధ్వీతీయం . ఈ శిక్షణ దేశంలోని విద్యార్థులందరికి ఇప్పించాలని నా ఆకాంక్ష.


**ప్రచురణలు**


**లీడ్ ఇండియా** క్రియెషన్స్, లీడ్ ఇండియా భారత రత్న స్కూల్స్

బండ్లగూడ, కీసర, రంగారెడ్డి, తెలంగాణ ఇండియా 501301 హెల్ప్ లైన్: 9701376647

www.leadindia2020.org

# 1. అంకితం

## కలాం! నీకు సలామ్!




కలాం నీకు సలామ్
“జాతికి కలాం పిలుపు”
పుస్తకంతో పరిచయం అయ్యావు
దేశానికి నన్ను పరిచయం చేశావు
ఇద్దరి లక్ష్యాలు ఒక్కటే నన్నావు

“లీడ్ ఇండియా 2020
2వ జాతీయ ఉద్యమం”
అని ప్రకటించావు, ప్రచురించావు.
“మీ అభివృద్ధే దేశాభివృద్ధి” శిక్షణ
దేశ మార్పునకు నాంది అన్నావు
మానవత్వ పునాది అన్నావు
మారిన యువతే దేశాన్ని అభివృద్ధి చేస్తుందనీ
2020 నాటికి అభివృద్ధి భారత్ సాధిస్తుందనీ
కలలెన్నో కన్నావు. కర్తవ్యం ప్రబోధించావు
కాలంలో కలిసిపోయినా మా కళ్ళల్లో, కలల్లో
నిలిచే ఉన్నావు. నిరంతర స్ఫూర్తిని ఇస్తున్నావు
మీ కంటే మీ శక్తి గొప్పదనీ
యువశక్తిని దేశశక్తిగా మార్చవచ్చనీ
మన “లీడ్ ఇండియా మిషన్ 2020”ని
ఆశీర్వదిస్తున్నావు



కలాం! నీకు సలామ్!!

**ఆచార్యజీ**

## 2. ఇది ఒక పుస్తకం మాత్రమే కాదు... జీవన దిక్సూచి




లీడ్ ఇండియా సూత్రధారి ప్రొ॥ సుదర్శన్ ఆచార్యగారి విభిన్న కోణాలని ఆవిష్కరించే ఈ పుస్తకం అక్షరాలతో నింపిన పేజీల సమూహం కాదు. ప్రతి ఒక్కరి జీవితానికీ వెలుగుబాట చూపించే జీవన దిక్సూచి ఇది. మానవీయ విలువల పరిమళాలు విరజిమ్మే మహనీయ మార్గదర్శి ఇది.

ఆచార్యగారి జీవన యాత్రని వివరించడంతోపాటు, వారి నుండి ప్రేరణనందిన మహానుభావులెందరో వెలిబుచ్చిన అభిప్రాయాలు, అభినందనల ప్రసూన మాలిక ఇది. అంతర్గత శక్తులని ఉద్దీప్తం చేసుకుని, మనిషి మహామనిషిగా ఎలా ఎదగాలో పథ నిర్దేశం చేసే విశ్వమానవ వికాసయాత్ర గైడ్ ఇది.

అత్యంత అద్భుత వ్యక్తిత్వం కలిగి, లీడ్ ఇండియాకి ప్రాణం అయిన మాజీ భారత రాష్ట్రపతి డా॥అబ్దుల్ కలాం గారిని గురించి ఎవరికీ తెలియనివి ఎన్నో విశేషాలు ఈ పుస్తకంలోని మరో విశిష్టత! ఇంత మంచి పుస్తకానికి సంపాదకత్వం వహించడం నా అదృష్టం!!

“చదివాం – ప్రక్కన పెట్టాం” అని కాకుండా ప్రతి అక్షరం పనికొచ్చేలా ముస్తాబైన ఈ పుస్తకం “పునరపి పఠనం... పునరపి మననం”తో బ్రతుకుల్ని బంగారంగా చేసుకుని దేశానికీ, ప్రపంచానికీ వికాససారథులుగా అందరినీ మలచే ప్రక్రియకి అవసరమైన అన్ని అంశాలతో విలక్షణం.

జీవితాలకి అసలు సిసలు తోడు ఇది!!!

ఇక చదవండి.... విజేతలు కండి!!!

**ఆలపాటి**

*మీడియా డైరెక్టర్, లీడ్ ఇండియా 2020*

# 3. ఈ పుస్తకం ఎందుకు?



చదివే ప్రతి వ్యక్తినీ ఒక శక్తిగా మారుస్తుంది ఈ పుస్తకం. "నా శక్తి ఇంతే, నా కుటుంబం ఇంతే, నేను చేయగలిగింది ఇంతే" అని ప్రతి ఒక్కరూ పరిమితులు విధించుకుంటారు. ఆ పరిమితులను మార్చుకోలేమా? చదవండి! ఈ పుస్తకం ప్రతి ఒక్కరి జీవితంలోని సవాళ్ళను ఎదుర్కోవడానికి కావలసిన ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుంది. తల్లిదండ్రులు పిల్లలను గొప్పవారిగా తీర్చిదిద్దే విధానాలను సూచిస్తుంది.

నమ్మండి! మీ బిడ్డలు మీ బిడ్డలు మాత్రమే కాదు, భరతమాత బిడ్డలు కూడా. వారు భారతదేశానికి చెందిన గొప్ప సంపద. వారిని తీర్చి దిద్దడం మనందరి బాధ్యత. ఆచార్యగారి జీవితం మీ పిల్లల కొరకే. మీ బిడ్డలందరినీ విలువలతో, నైపుణ్యాలతో విశ్వనాయకులుగా చేసి, భారత్‌ను తిరిగి విశ్వనాయకురాలుగా తీర్చిదిద్దడానికి ఈ పుస్తకంలోని ప్రతి సంఘటన సమకూర్చబడింది. ఇది మీ ఇంటికీ, మీ విద్యాలయాలకూ మంచి మార్గదర్శిని. శ్రద్ధగా చదవండి! సంపూర్ణ లాభం పొందండి!

మీతో మీ కుటుంబం, మీ ప్రాంతం, మన దేశం. సర్వ మానవాళి ఎదగడానికి ప్రేరణ కల్గిస్తుంది. ఇది ఆచార్యగారి అనుభవాల మాలిక. ప్రతి ఒక్కరికీ ఒక బహు చక్కనైన ఉపకరణంగా ఉపయోగపడుతుంది.

**జస్టిస్ ఈశ్వరయ్య**

మరియు లీడ్ ఇండియా పరివారం

# 4. సర్వమానవాళికీ ప్రేరణ



భగవంతుడు భారతదేశాన్ని మళ్ళీ విశ్వగురువుగా మారుస్తున్న సంధి కాలం ఇది. ఈనాటి దేశ జనాభాలో దాదాపు 20 కోట్ల మంది 12-24 సంవత్సరాల మధ్య ఉండి పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులే. మన దేశ భవిష్యత్తుకై దిశ, దశ నిర్మాణం చేసే నవయుగ నాయకులు ఈ విద్యార్థులే. వీరిని నడిపించే నావ మన విద్యావ్యవస్థ.

35 సంవత్సరాల అనుభవంతో విద్యావ్యవస్థలో ఉన్న అసమానతలను గుర్తించడం జరిగింది. ఈ రోజు చదువుతున్న పట్టభద్రులను సర్వే చేసి "నీవు ఎందుకు చదువుతున్నావు?" అని ప్రశ్నించినప్పుడు, 90% మంది "ఉద్యోగం కొరకు" అని సమాధానం ఇస్తున్నారు.

**మనమే నేటి విద్యావిధానంలో లోపాలను సరిదిద్దుకోవలసి ఉంటుంది.**

ఆనాటి ఆంగ్లేయ జనరల్, లార్డు మెకాలే మహాశయుని కుతంత్రం ఇది.

ఈ ఉద్యోగానికి ⇨ ఈ కోర్సు ⇨ ఈ సిలబస్ ⇨ ఈ పరీక్ష ⇨ ఈ సర్టిఫికెట్ అని ప్రవేశపెట్టారు. అదే విధానం ఈనాటికీ కొనసాగుతోంది. మెకాలే మహాశయుడు గీసిన ఆ గీతల వలన ఇప్పటికీ విద్యావ్యవస్థను మార్చలేక పోతున్నాం, మన పిల్లల రాతలను మార్చలేకపోతున్నాం.

ఆంగ్లేయులు వెళ్ళిపోయినా, మనకి స్వాతంత్ర్యం వచ్చినా, ఇప్పటికీ

మనం స్వతంత్రమైన భావాలతో స్వతంత్రమైనటువంటి పని చేయలేక పోతున్నాము. ప్రభుత్వం ఎన్ని నైపుణ్యాభివృద్ధి పథకాలు చేపట్టినా సత్ఫలితాలు ఇవ్వలేకపోతున్నాయి. ఉద్యోగాల కొరకే చదువు కాకుండా, నలుగురికీ ఉద్యోగాలు ఇచ్చేవారుగా మన పిల్లలను మనమే మార్చుకోవలసి ఉంటుంది.

మన పిల్లల భవిష్యత్తుకై మన దేశ భవిష్యత్తుకై మనమే మార్చగలం. మన పిల్లలను విశ్వనాయకులుగా తీర్చిదిద్దగలం.

నాటి స్వామీ వివేకానంద మొదలు నేటి డా॥ అబ్దుల్ కలాంగారి జీవితాలు లక్షల మంది విద్యార్థుల జీవితాలను నిత్యం ఎలా ప్రభావితం చేశాయో, ఎలాంటి మార్పులు తీసుకువచ్చాయో ఈ పుస్తకంలో చదవండి.

**తల్లిదండ్రులే పిల్లల మార్గదర్శకులు**

తల్లిదండ్రులు – కుటుంబ సభ్యులు పిల్లల జీవితాలకి పునాదులు వేస్తారు. వారి మాటలు, పనులు అన్నీ పిల్లలు గమనించి సహజంగానే అనుకరిస్తారు. ఇంట్లో జరిగే ప్రతి విషయమూ అప్పుడప్పుడు, అనునిత్యం జరిగే వేడుకలు, పర్యటనలు, సంఘర్షణలు, మంచి–చెడులు మనకు తెలియకుండానే పిల్లలను ప్రభావితం చేస్తాయి.

ఈ రోజుల్లో పిల్లల్లో పెరిగిపోతున్న తెలివితేటలు, సాంకేతిక పరిజ్ఞానం, వాటి ద్వారా వచ్చే భావోద్రేకాలను నియంత్రించలేక, వారి వ్యక్తిగత స్వేచ్ఛను ఆపలేక పోవడంతో పిల్లలకూ, తల్లిదండ్రులకూ మధ్య ఏమాత్రం చిన్నపాటి వ్యత్యాసాలు వచ్చినా, పిల్లలు పెట్రేగిపోతున్నారు. వాళ్ళు అన్నట్లు నడుచుకోవలసిందే అనే విధానం నడుస్తుంది. ఇంట్లో ఏ చిన్న పేచీలు వచ్చినా, పిల్లలు ఏమి చేసుకుంటారో అనే ఆందోళనలు పెరిగిపోతున్నాయి.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు  కావలసిన ధైర్యాన్ని ఇవ్వలేక, జీవితం విలువలు  తెలియక, తెలపక, జీవితానికి ఒక లక్ష్యం లేక, నిజ జీవితంలో ఎదురయ్యే కష్టాలను కడతేర్చుకునే ఆత్మస్థైర్యం లేక తల్లిదండ్రుల కోరికల మేరకు మార్కులు, ర్యాంకులు సాధించలేక, కార్పొరేట్ శిక్షలు, అవమానాలు భరించలేక ఎందరో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటువంటి సమయంలో వాటిని పరిష్కరిస్తూ, వారికి ఉజ్వల భవిష్యత్తును ఎలా నిర్మాణం చేయాలో ఈ పుస్తకం మార్గదర్శనం చేస్తుంది.

అంతేకాదు. కుటుంబాలలో ఆలుమగలు సుఖసంతోషాలతో, ఆనందంగా ఉండలేక, ఒకరిని ఒకరు అర్థం చేసుకుని సర్దుబాటు చేసుకోలేక, అనుమానాలతో చాలా మంది భార్యాభర్తలు విడాకులు తీసుకుంటున్నారు. ప్రేమికులు ఉన్మాదులుగా మారిపోతున్నారు. దేశంలో చట్టాలు ఎంత  బిగించినా మానభంగాలు, అత్యాచారాలు, అవినీతి ఆగడం లేదు. పాలనా విధానాలు ఎలాగో మారుతున్నాయి. మామూలు మనిషి జీవించడానికి ఎన్నోరకాల విషమ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కులం, మతం, ఉన్నవాడు – లేనివాడు వంటి అనేక తారతమ్యాలతో అలజడులు రేగుతున్నాయి. ఉగ్రవాదం, తీవ్రవాదం తీవ్రత పెరిగిపోతున్నది.

ఈ రోజు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఎక్కడో ఉండి, ఒక్క క్లిక్‌తో విశ్వాన్ని  నాశనం చేసే పరిస్థితి లోకి ఎదిగాము.

ఏది ఏమైనా, భారతదేశం మాత్రమే విశ్వ గురువుగా విశ్వాన్ని సంరక్షించగలదు. ప్రతి ఒక్కరి జీవితంలో 3 లేదా 4 తరాలను చూస్తాము.

ఒక తరానికి ఇంకొక తరానికి మధ్య ఆలోచన, అలవాట్లు, ఆచరణలు, పరిసరాలు, పరిస్థితులు, ప్రభావాలు అన్నీ మారిపోతుంటాయి. ఈ రోజు పిల్లలకు సెల్‌ఫోన్ ఆటలు, ఇంటర్‌నెట్ ఆకర్షణలు, దేశ/విదేశీ తినుబండారా లతో ఆటలు/వ్యాయామాలకు దూరమై కళ్ళద్దాలే కాదు, లావు, బరువు పెరగడమే కాదు, డయాబెటీస్, గుండె నొప్పులు అనేక రకాలైన మానసిక వ్యాధులతో ఈ తరం తలరాతలు మారిపోతున్న తరుణాన్ని మనం మార్చవలసిన బాధ్యత మనపై ఉంది.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ధర్మాన్ని ఆచరించి మానవీయ విలువలతో భవిష్యత్తు నిర్మాణం చేసి, అందరూ ఆచార్యులు అవడానికి విద్యార్థుల ద్వారా దేశ భవిష్యత్తుకు దిశ, దశ నిర్దేశం చేసి, ఒక వ్యక్తి శక్తిగా మారి ఎలా ప్రేరణ కల్గిస్తున్నారో, లక్షలాది మంది ఎలా మార్చబడుతున్నారో చాటి చెప్పే ఒక అపురూపమైన, అరుదైన, నిరూపించబడిన ఉదాహరణే ఈ పుస్తకం. సనాతన భారతీయ వేదశాస్త్రాల సారాంశం, సర్వమతాల సామరస్యం. ఆత్మతత్వం రగిలించడం మానవత్వాన్ని మేల్కొల్పడమే ఆచార్యత్వం. వాటిని ఆచరించడమే జీవన సాధన. ఆచరణే ప్రచారం.

అటువంటి ఆచార్యత్వం ఈ పుస్తకం చదివిన అందరికీ ఆలోచనలలో పవిత్రత, మాటలలో సత్యవ్రతం, చేసే పనులలో ధర్మనిష్ఠ, మానవీయ విలువల ద్వారా ప్రసాదించాలని ప్రతి ఒక్కరినీ ఆచార్యులుగా మార్చాలని ఆ భగవంతునికి అర్పణ చేస్తున్నాను.

అసలు ఇటువంటి పుస్తకం ఒకటి రావాలనీ ఆచార్య జీవితం లోతులు అందరికి తెలియాలని, లీడ్ ఇండియా ఉద్యమానికి తోడ్పడలనీ సంకల్పించిన రమాకాంత్ మిద్దెలకు, రాత్రింబగళ్ళు కష్టపడి అందరిని

సంప్రదించి, ఒక పుస్తక రూపానికి తీసుకువచ్చిన కొత్తురు శ్రీనివాస్‌కు, ఒక బృందముగా ఏర్పడి, అమెరికాలో ఉంటున్నా కాని లీడ్ ఇండియా ఉద్యమానికి పుస్తక సేవ చేయాలని ఈ కార్యానికి పూనుకున్న రవి మరడాపులకు, రాధాకృష్ణ, బిందులకు, ఈ పుస్తక రూపానికి టైపింగ్ చేసి తన ప్రేమతో రంగరించిన లీడ్ ఇండియా ఉద్యమ కవి తోటపల్లి భాస్కర్‌కు మరియు ముఖ చిత్రం గీసిన అంతర్ జాతీయ స్యాన్ ఆర్టిస్టు వేణుగోపాల్ జలాకు, అంతర్ చిత్రములను గీసిన మా ఓయాసిస్ లీడ్ ఇండియన్ గాయిత్రికి, లీడ్ ఇండియన్స్ ఐ.స్వామి,ఆరీఫ్, వెన్నం వంశీలకు తదితర ఎంతో మంది దీనికి సహకారం అందించిన మిత్రులకు ముందుగా నా ఆశీస్సులు.

అలా తయారైన అమృత పదార్థాన్ని ముచ్చటగా తీర్చిద్ధి, ఎన్నెన్నో మెరుగులు దిద్ది, ఓ గొప్ప కృతిగా అలంకరించి, “ఒక యోగి ఆత్మకథ ” లా ఈ పుస్తకం ఆవిర్భవించాలనే తపనతో అహర్నిశలూ శ్రమించిన ప్రియ మిత్రులు ఆలపాటిగారిని నేను ఎన్నటికీ మరువలేను. వారికి నా అభివందనాలు.... అభినందనలు!!

కాలం ద్వారా, లీడ్ ఇండియా ఉద్యమం ద్వారా, మారుతున్న దేశ, కాలమాన పరిస్థితులను మార్చి, భారతదేశాన్ని విశ్వగురువుగా చేస్తున్న ఆ భగవంతుడు ఈ పుస్తకం చదివిన వారి జీవితాలను మార్చుతాడనే నమ్మకంతో, ప్రార్థనతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ ఆచార్యులు అవ్వాలనీ తిరిగి భారత్ విశ్వగురువు కావాలనీ ఆకాంక్షిస్తూ...

**- మీ ఆచార్య**



# 5. నేడు దేశానికి అవసరమైన ఆచార్యత్వం



నేను ఒక ఉపాధ్యాయుడిని. రసాయన శాస్త్ర బోధన, లీడ్ ఇండియా శిక్షణ

నా జీవితం. విద్యార్థుల అభివృద్ధే దేశాభివృద్ధి అనేది నా ధ్యేయం.

ఈ ఉద్దేశాలతో సాగే నా జీవన ప్రయాణంలో, 1985లో బాలభారతి శిక్షణ ద్వారా విద్యార్థులలో కలిగిన మార్పులు నన్ను ఆచార్యగారికి దగ్గరకు చేశాయి. అప్పటి నుండి ఇప్పటి వరకూ వారు చేసే ప్రతి సేవాకార్యక్రమంలో నేను ఒక భాగస్వామినే కాదు, వారి కుటుంబ, వ్యక్తిగత జీవితానికీ, వృత్తి ప్రవృత్తులకూ, వారి జీవితంలో జరిగే మంచి చెడులన్నిటికీ, ఒక ఆత్మీయ మిత్రునిగా, సాక్షిగా ఉంటున్నాను. వారిది అరుదైన వ్యక్తిత్వం. వారి దూరదృష్టి, దేశభక్తి , వారి ప్రణాళికలు, శ్రమశక్తి, ధర్మనిష్ట, సేవాతత్పరత, అంకితభావం, ఆధ్యాత్మిక సాధన అందరికీ సాధ్యం కాదు. 2006లో గిరిజన బాలబాలికలకు లీడ్ ఇండియా శిక్షణ శిబిరాలు జరుగుతున్న సమయంలో వారి భార్యకి క్యాన్సర్ శస్త్ర చికిత్స అయింది. ఆచార్యగారు వారికి సేవ చేస్తూ అర్ధరాత్రి  నాతో పాటు ముఖ్యమైన లీడ్ ఇండియా నాయకులను పిలిపించుకుని వ్యూహ రచన చేసి మాకు బాధ్యతలనిచ్చి, స్ఫూర్తినిచ్చిన సన్నివేశం నేను ఎప్పటికీ మరచిపోలేను.

వారు ఐ.డి.పి.ఎల్, జి.పుల్లారెడ్డి సంస్థలలో, మహదేవ్.కామ్‌లో అంకిత భావంతో చాలా కష్టపడి, వాటి బాధ్యతంతా తన మీదనే వేసుకుని ఆఖరికి ప్రాణానికి తెగించి మరీ పని చేసిన సంఘటనలకు కూడా నేను సాక్షినే.

రామాలయ పునరుద్ధరణలో శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామీజీగారు, శ్రీశ్రీశ్రీ కల్కి భగవాన్ గారు ముఖ్యంగా మా గురుదేవులు బ్రహ్మజ్ఞాని శ్రీ సాయిగంగా మహదేవ్ గారు ఆచార్యగారిని విశేషంగా ఆశీర్వదించేవారు. ఆచార్యగారి ద్వారా దేశ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది, వారికి తోడుగా ఉండి దేశసేవ చేసిన వారికి పునర్జన్మ ఉండదని శ్రీ సాయిగంగా మహాదేవ్ గారు ఆశీర్వదించడం ఓ అనిర్వచనీయమైన మధురానుభూతి. మా గురువు గారన్నట్లుగానే లక్షల సంఖ్యలో మా విద్యార్థులు చాలా ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు. వారి ఆదేశానుసారం మేమందరం ఆచార్యగారి అడుగుజాడలలో ముందుకు సాగుతున్నాం.

ఆచార్యగారు పుట్టపర్తికి వచ్చిన ప్రతిసారీ భగవాన్ శ్రీ సత్యసాయీశ్వరుల వారు పాదనమస్కారములు ఇచ్చే అరుదైన ఆశీస్సులకు సైతం నేను సాక్షిని.

బాలభారతి, లీడ్ యూత్ సేవలలో ఆచార్యగారు, డా॥ కలాంగారిని కలసిన తరువాత వారు లీడ్ ఇండియా 2020 స్థాపించినప్పటి నుండి ఇప్పుడు కొనసాగుతున్న లీడ్ ఇండియా మిషన్ 2020 సేవలు అన్నింటిలో నేను వారికి ఉడతా భక్తి భాగస్వామిని అవడం అదృష్టంగా భావిస్తున్నాను.


ఆచార్యగారి జీవితం ఓ తెరిచిన పుస్తకం. లీడ్ ఇండియా శిక్షణ ద్వారా ఆచార్యగా తెలిసిన విషయాలు ఒక కోణం మాత్రమే. కాని వారి

గురించి తెలియవలసినవి అసంఖ్యాకం. ఆచార్యగారి లాగా ఆచరించి, జీవించే ఆదర్శవంతమైన ఆచార్యులందరి జీవిత చరిత్రలు విద్యార్థులకందించి, సనాతన భారతీయ ఆచార్యత్వాన్ని నిలుపుకోవలసిన అవసరం అందరికీ, ప్రత్యేకించి ఉపాధ్యాయులందరికీ చాలా చాలా అవసరం. అందుకే ఇటువంటి పుస్తకాలు రావలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ పుస్తకంలోని ప్రతి విషయం, ప్రతి సంఘటన మీకు ఒక కొత్త ఆలోచన అందిస్తుంది. ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుతుంది. ప్రభావితం చేస్తుంది. అందరి జీవితాలలో, కుటుంబాలలో, విద్యాలయాలలో విజ్ఞానాన్ని అందిస్తుంది, అందరినీ ఆచార్యులుగా మారుస్తుందని నా ప్రగాఢ విశ్వాసం.

**ప్రొ॥ యజ్ఞంభట్ల అరుణ్ కుమార్**
జాయింట్ నేషనల్ కో– ఆర్డినేటర్,
ఫౌండర్ ట్రస్టీ, లీడ్ ఇండియా 2020 ఫౌండేషన్

## 6. ఒక మాట మనిషిని మార్చేస్తుంది.



- "నేనే దేశం. నేను మాట్లాడుతున్నానంటే దేశం మాట్లాడుతున్నట్లే. నేను పని చేస్తున్నానంటే దేశం పని చేస్తున్నట్లే" అన్నారు స్వామీ రామానంద తీర్థ.
- "దేశం నాకేమి ఇచ్చిందని కాదు, నేను దేశానికి ఏమి ఇచ్చాను" అని ఆలోచించమన్నారు మాజీ అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనెడి.
- "ఋణానుబంధ రూపేణ పశు పత్నీ సుతాలయ" అనేవి వేదవాక్కులు. ఇవన్నీ ఆచార్యగారిని ఆలోచింపచేశాయి. దేశం కోసం అవధులు లేకుండా పని చేయించాయి.
- ఒకనాడు పాఠశాల రుసుము కట్టలేని ఒక పేద విద్యార్థి అయిన ఆచార్యగారిని రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారికి స్నేహితుడిగా, సన్నిహితుడిగా దగ్గరకు చేర్చాయి. కలాంగారు రాష్ట్రపతిగా జాతిని ఉద్దేశించి చేసిన తమ చివరి సందేశంలో ఆచార్యగారినీ మరియు లీడ్ ఇండియా ఉద్యమాన్నీ దేశానికి పరిచయం చేసి భారతీయులందరూ కూడా సహాయపడవలసిందిగా అర్థించారు. దీనిని పురస్కరించుకుని కలాంగారి ఆశయ సిద్ధికి 2020 నాటికి అభివృద్ధి భారత్ సాధించుటకు ఆచార్యగారు లీడ్ ఇండియా అనే 2వ జాతీయ ఉద్యమాన్ని ఆరంభించారు.

**ఒక సంఘటన జీవితాన్నే మారుస్తుంది.**



ఆంగ్లేయులు దక్షిణాఫ్రికాలో గాంధీగారిని నల్లవాళ్ళు తెల్లవాళ్ళతో సమానంగా రైల్లో ప్రయాణించడానికి వీలు లేదని బయటకు గెంటేశారు. ఆ సంఘటన గాంధీజీ అనే సాధారణ వ్యక్తిని ఒక అసాధారణ శక్తిగా మార్చింది. ఆయన క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చి, మొదటి జాతీయ ఉద్యమం నడిపి, మన దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చారు.

అలాగే ఆచార్యగారికి "జాతికి కలాం పిలుపు" అనే పుస్తకం ద్వారా పరిచయం అయిన ఆనాటి రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలాంగారు "లీడ్ ఇండియా 2020"ని 2వ జాతీయ ఉద్యమంగా ప్రకటించారు. మరియు దానికి తామే నాయకత్వం వహించారు.

తమ పిల్లలు అమెరికాలో ఉంటున్నా "నేను నా సొంత భోగభాగ్యాలకు అమెరికా వెళ్ళను. వెళ్ళవలసి వస్తే స్వామీ వివేకానందుడిలా దేశం కొరకు మాత్రమే వెళతానని" 15 సంవత్సరాలు భీష్మించుకున్న ఆచార్యగారిని డా॥ అబ్దుల్ కలాంగారు ఉద్యమం కొరకు అమెరికా తీసుకు వెళ్ళారు.

జూలై 2016న ఆచార్య గారు అమెరికాకు చేరగానే శ్రీ మిద్దెల రమాకాంత్ వారి పాదాలు పట్టుకుని పది నిముషాలు ఎడతెగక ఏడుస్తూ "ఆచార్యా! నేను ఇక్కడ ఉన్నా, మీరు అక్కడ ఉన్నా, నన్ను నడిపించే స్వామి మీరు. మీ వల్ల నా జీవితం ఎంతో ఎదిగింది. నా తల్లిదండ్రులు, ఎంతో మంది గురువులు ఉన్నా, మీరే నాకు దేవుడు. మీరు అమెరికాలో

ఉన్నన్నాళ్ళు మీ పాదాల వద్ద కూర్చుని మీ మాటలు వింటాను" అని అన్నారు.

"మీరు లీడ్ ఇండియా ఆచార్యగా అందరికీ తెలుసు. కాని మీ లోతు ఏమిటో? మీ అంతర్యమేమిటో? మీ అంతిమ లక్ష్యం ఏమిటి? మాలాంటివాళ్ళకు మాత్రమే తెలుసు. మీలోని ఈ లోతు, మీ ఆలోచనలు అందరికీ అర్థమైనప్పుడు అందరూ నాలాగా ఎదుగుతారు. అప్పుడు మీరు తలపెట్టిన లీడ్ ఇండియా ఉద్దేశం సులభంగా నెరవేరుతుంది" అని అన్నారు రమాకాంత్.

ఆనాటి ఆ సంఘటన ఈ ఆత్మకథకు మూలం.

# 7. నిత్య కృషితో నిరంతర ఎదుగుదల

**రమాకాంత్ మిద్దెల**



నా పేరు రమాకాంత్ మిద్దెల. (43 సం.లు) అమెరికాలో ఎం.ఎస్. చేసి సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా మరియు యోగా గురువుగా డల్లాస్‌లోని హనుమాన్ దేవస్థానంలో పని చేయుచున్నాను. నేను సిద్ధ సమాధి యోగా అకాడమి, ఆర్ట్ ఆఫ్ లివింగ్, రేఖి గురువుగా సేవలు చేస్తుంటాను. చైనా ఆక్యూప్రెషర్, ఫ్లావర్ థెరపీ ఇత్యాది వంటి వాటిపై పరిశోధనలు చేస్తుంటాను. ఆచార్యగారికి లీడ్ ఇండియా పరిశోధనా సంచాలకులుగా పనిచేయుచున్నాము.

"ఆప్ బఢో దేశ్‌కో బఢావో "ట్రైనర్స్ (శిక్షకులు) ట్రైనింగ్ కేవలం మొదటి భాగం మాత్రమే ఆచార్యగారు అందించినారు. కాని మీరు శిక్షకుల నుండి ఆచార్య స్థాయికి ఎదగడానికి 7 స్థాయిలలో పరిశోధనా విభాగములను అభివృద్ధి చేస్తుంటాను. ప్రస్తుతం నా సోదరుడు, సోదరితో పాటు 20 కుటుంబాలను అమెరికాకు తీసుకు వచ్చాను.

ఈ రోజు నా జీవితంలో ఆచార్య గారు వేసిన ముద్రలు, వాటి వలన జరిగిన ప్రగతి ప్రయాణం, అనుభవాలను కొన్ని మీతో పంచుకోవలసిన అవసరం ఉన్నది. మీ అందరికీ ఆచార్య గారు ఒక లీడ్ ఇండియా 2020 ఉద్యమం వ్యవస్థాపకులుగా, గౌరవనీయులైన డా॥ కలాంగారితో కలసి పనిచేసిన వ్యక్తిగానే పరిచయం. కాని మీకు తెలియని వారి వ్యక్తిత్వంలో దాగి ఉన్న చాలా విషయాలు ఎంతో ఉపయోగకరమైనవి.

"సూర్యుని అనంత కోటి కాంతి పుంజములలో ఆచార్యగారు మీకు అందించిన

లీడ్ ఇండియా 2020 ఉద్యమం "ఆప్ బఢో దేశ్‌కో బఢావో" శిక్షణ అఖండ సూర్య కాంతిలో ఒక్క కాంతి పుంజం మాత్రమే." వారు నాకు గురువు, నాతో మాట్లాడుతూ నడిచి, నడిపించే దైవము. నడిపించే శక్తి, జ్ఞాన మూర్తి. నాకు అలాంటి వారిని వదిలి అమెరికాకు వెళ్ళడం ఇష్టం లేకపోయినది. కాని "నీవు లీడ్ ఇండియా వివేకానందుడివై అమెరికాకు వెళ్ళాలి. మన ఆధ్యాత్మిక జ్ఞానం వారికి పంచాలి. వారి భౌతిక అభివృద్ధి అంశాలు, సాంకేతిక పరిజ్ఞానం భారతదేశ అభివృద్ధికి అందించాలి" అని నన్ను మా అమ్మానాన్నలతో కలసి బలవంతాన అమెరికాకు పంపించినారు. కాబట్టి ఇప్పుడు లీడ్ ఇండియన్స్ అందరికీ, మీ అందరి అభివృద్ధికీ ఉపయుక్తమగు మంచి ఆణిముత్యాలైన నా మధుర స్మృతులను మీతో పంచుకుంటున్నాను.

**ఆచార్యగారి మొదటి దర్శనం**



నేను అమెరికా రాక ముందు 1991లో బి.టెక్ మొదటి సంవత్సరం చదువుచున్న నాటి నుండి 1996లో అమెరికాకు వచ్చే వరకు ఆచార్యగారి సన్నిధిలో కొన్ని వారాలు, నెలలు, సంవత్సరాల పాటు రాత్రి, పగలు వారితో తిరిగాను. ఆ రోజులు ఎన్నో జన్మలనుండి వచ్చుచున్న నా జన్యువులను (డి.ఎన్.ఎ), నా ఆలోచనా సరళిని, నా నడవడిని, నా మాట తీరు తెన్నులను, నా జీవన విధానాన్ని సంపూర్ణంగా మార్చివేశాయి.

ఆచార్యగారి కుమారుడు, నేను జె.ఎన్.టి.యూలో ఇ.సి.ఇ.లో సహ విద్యార్థులం. ఒక రోజు పుస్తకాలు తిరిగి ఇవ్వడానికి వారి ఇంటికి వెళ్ళాను. ఆ సమయంలో ఆచార్యగారు వరండాలో పొడవు నామాలు, అడ్డ నామాలు (వైష్ణవ, శైవ తిలకములను) ధరించి, "హరే రామ హరే కృష్ణ" శాలువా కప్పుకొని, చిన్ముద్ర వేసుకుని, గాఢమైన ధ్యాన స్థితిలో దర్శనం ఇచ్చారు. వారిని చూసి వీరు ఒక చాదస్తపు బ్రాహ్మణులు అని అనుకున్నాను .

ఈ దృశ్యం వారి ఇంటికి వెళ్ళిన ప్రతి ఉదయం చూసేవాడిని. భగవత్ ప్రేరణతో వీరిని నేను దగ్గరగా పరిశీలించాలి. వీరి గురించి తెలుసుకోవాలనే కుతూహలం ప్రారంభమైనది. వారు ప్రతిరోజూ ఉదయం వెళ్ళి అర్ధరాత్రి ఇంటికి తిరిగి రావడం గమనించాను. వారు పని చేసే జి.పుల్లారెడ్డి విద్యా సంస్థలలో, శ్రీ జి.పుల్లారెడ్డిగారితో సన్నిహిత సమాలోచనలను, ఉపాధ్యాయులను దేశ నిర్మాతలుగా మార్చేలా ప్రభావితం చేసే ప్రబోధనలను విన్నాను. విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సమావేశాలలో తల్లిదండ్రులకు వారి కర్తవ్యం కూడా ప్రబోధించడం చూశాను. విద్యార్థులకు జీవిత లక్ష్యాలను నిర్దేశించడం విన్నాను. అంతేకాదు. పండుగ వేళల్లో శ్రీ జి. పుల్లా రెడ్డి గారి మిఠాయి దుకాణంలో వారు నమ్మినబంటుగా డబ్బులు లెక్క పెట్టడం చూశాను. వీటి అన్నిటికీ అతీతంగా వారి కుటుంబంతో వారిని 24/7 పరిశీలించాను.

మెల్లమెల్లగా వారితో సన్నిహిత సంబంధం ఏర్పరుచుకున్నాను. ఈ సాన్నిహిత్యంతో ఇది అడగవచ్చు, ఇది అడగకూడదు అనే సంకోచం

లేకుండా, నా వ్యక్తిగత సమస్యల దగ్గర నుండి చదువు, ఉద్యోగం, పెళ్ళి, కుటుంబం, దేశం, ప్రకృతి, పరమాత్మ – ఇలా అణువు నుండి ఆటం బాంబ్ వరకు 360 డిగ్రీల ప్రశ్నలను అడిగే వాణ్ణి. వారు అభ్యంతరం తెలుపక, అలుపు సొలుపులు లేక అర్ధరాత్రి అయినా ఓపికతో తమ కుమారుడిలా, మిత్రుడిలా, ప్రేమతో ఒకటి అడిగితే పది రకాలుగా అర్థం చేయించేవారు. వారు విసిగించుకోవడం, కోప్పడటం నేను ఇప్పటి వరకు చూడలేదు. వారి సమాధానాలు నాకు జ్ఞానంతో కూడిన గుణపాఠాలుగా, సృజనాత్మకతతో కూడిన ఆలోచనలు కలిగించేవి.

కేవలం వారి నిత్య పూజ, ధ్యాన సమయాలల్లో మాత్రమే నాకు సమయం ఇచ్చేవారు కాదు. అందరికీ నా ప్రశ్నలు, నా పరిశీలన ఆచార్య గారి యొక్క ప్రబోధనలు, వారి గుణగణాలు చాలా ఉపయోగపడతాయి అని నమ్ముతున్నాను.

"ఆప్ బఢో దేశ్ కో బఢావో" మీ అభివృద్ధే దేశాభివృద్ధి శిక్షణలో మీకు తెలిసినవి కొన్ని ఉండవచ్చును. కానీ ఎంత లోతుగా తెలుసుకున్నట్లైతే అంత అధికమైన లాభం పొందవచ్చును.

**చిరునవ్వు**



లీడ్ ఇండియా శిక్షణలో చిరునవ్వు ద్వారా కోపాన్ని, మానసిక సమస్యలను, ఆందోళనను అధిగమించవచ్చునని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాము. శక్తి, సానుకూలత సాధించవచ్చును అని నేర్చుకుంటాము. ఇవన్నీ నేను ఆచార్యగారి సాన్నిహిత్యంలో ప్రత్యక్షంగా

గమనించి, నా జీవితంతో అన్వయించుకొని, అభివృద్ధి చెంది ఆనందంతో ఉన్నాను.

తల్లి యశోద తనయుడు శ్రీకృష్ణుడి నోటిలో విశ్వం చూసినట్లు, నేను ఆచార్యగారి చిరునవ్వులో విశ్వమంతా మాయ "బ్రహ్మ సత్యం జగత్ మిథ్య" అని ఈ విశ్వాన్ని చూసి నవ్వుకునే జ్ఞానం పొందాను.

**అయస్కాంతంలా ఆకర్షించే వారి దర్శనం**

చిరునవ్వులు చిందించే వారి నగుమోము, ప్రేమ, ఆశీస్సులతో కనిపించే వారి చూపులను పరిశీలించాను. వారి ద్వారా జరుగుతున్న పరిస్థితులను, మనుషులను, వారిలోని మార్పులను గమనించాను.

కొన్ని సందర్భాలలో కొంతమంది వారిని పరోక్షంగా విమర్శించేవారు. బయట వాదించేవారు. ఎంత కోపోద్రిక్తులైనా వారి దగ్గరకు రాగానే, వారిని చూడగానే చల్లబడి పోయేవారు. వారి ఎదుట ఏమీ మాట్లాడలేక పోయేవారు. వారు చెప్పిన దానికి ఒప్పుకుని తిరిగి వెళ్ళిపోయేవారు. కార్యాలయాలలో లంచం అడిగే వాళ్ళు సైతం ఆచార్యగారి పనుల గురించి తెలిసి లంచం అడగకపోవడమే కాకుండా, వారి ఆశీస్సులు ఉంటే చాలు అని అనేవారు. వారిలో ఉన్న చరిష్మా అలాంటిది.

**సుదర్శనం :** నేను కళాశాలకు వెళ్ళినా, నా ముఖ్యమైన పనులకు వెళ్ళినా, ఆచార్యగారిని సందర్శించి, సంభాషించి, ఆశీర్వాదములు పొందే వాడిని. వారే సుదర్శనం. 'సు' అనగా మంచి, 'సుదర్శనం' అనగా శుభ దర్శనం. ప్రతి రోజూ ఎంతో మంది వారిని చూసి పలకరించి ఆనందించి వెళ్ళిపోయేవారు.

**వారిని ఆచార్య అని ఎందుకు అంటారు?**



మొట్ట మొదటి రోజుల్లో నేను వారి గురించి విమర్శనాత్మకంగా ఆలోచించే వాడిని. నలుగురు పిల్లలు ఉండి, ఉ ద్యోగం చేసుకుంటూ, సాయంకాలం చదువులతో సతమతమౌతూ, ఇంకా బాలభారతి, లీడ్ యూత్ శిబిరాలు నిర్వహిస్తూ, నిత్య పూజలు, నిశ్శబ్ద సాధన, ధ్యానము ఇన్ని ఈ మనిషికి అవసరమా అని అనుకునేవాణ్ణి. నాలో నేనే ప్రశ్నించుకునే వాణ్ణి. కాని నాకు ఆశ్చర్యం కలిగించిన విషయాలు ఎన్నో! వీటన్నీటిలో వారు “సత్యమేవ జయతే” లా హరిశ్చంద్రుని గురించి, గాంధీజీ గురించి, విలువల గురించి చెప్పేవారు. నేను వారిలో సత్యం మరియు ధర్మం గమనించాను. భారతీయ సంస్కృతికి విలువలను పెంపొందించుటకు తమ ఆచరణనే ప్రచారంగా ఆచరిస్తూ, ఆచార్యగా మూర్తీభవించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు సుదర్శన్ మాత్రమే. కాని మనందరికి ఆయన ఆచార్యగారు.

**సత్యం నా జీవిత అనుభవం**

ఆచార్యగారి సత్య వాక్ పరిపాలన నా జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసింది. మరియు సత్యవంతంగా మార్చింది. నా సత్య జీవన విధానమే కాకుండా, చాలా మంది జీవితాలను సత్య మార్గంలో ప్రయాణించేలా మార్చివేసింది.

నాకు తెలిసిన ఒక కుటుంబంలో భార్యాభర్తలు తగువులాడుకుని

విడిపోవాలని నిర్ణయించుకున్నారు. వారిద్దరి వాదనలను నాకు వినిపించారు. నేను భార్య మాటలు విని, ఆమె పక్షము వహించి, భర్త నుండి విడిపొమ్మని సలహా ఇచ్చాను. దాంతో భర్త మనసు వికలమైపోయింది.

తరువాతి రోజు ఈ విషయాన్ని నేను ఆచార్యగారితో చర్చించాను. వారు వెంటనే **"జోష్ మే హోష్ ఖోనా నహీ"**

అనగా ఉద్వేగంలో వివేకం కోల్పోకూడదు. నీవు సత్యంగా మాట్లాడినప్పటికీ ఇతరుల మనసు హింసించకూడదు. భార్యాభర్తలను విడదీయకూడదు అని చెప్పారు. ప్రతి ఒక్కరం యుక్త వయసులో సహజంగా ఉద్వేగానికి లోనౌతాము. మనకి అన్నీ తెలుసుననుకుంటాము. మన నిర్ణయమే సరియైనదనుకుని చైతన్యంతో ముందుకు వెళ్తాము. ఈ పరిస్థితుల్లో నిగ్రహం, వివేకం చాలా ముఖ్యం అని గ్రహించలేము. ఒక కుటుంబాన్ని కలపడం చాల కష్టం... కానీ విడదీయడం చాలా సుళువు అనే సత్యాన్ని చెప్పి ఆచార్య గారు నాకు కనువిప్పు కలిగించారు.

**సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్, న బ్రూయాత్ సత్యం అప్రియం**

సత్యం బ్రూయాత్ అనగా సత్యమే పలకవలెను. ప్రియం బ్రూయాత్ అనగా ప్రియంగా పలకవలెను. కాని ఎట్టి పరిస్థతుల్లోనూ సత్యం పలికినప్పటికీ ఎవరి మనసునూ నొప్పించరాదు. క్లిష్టమైన పరిస్థితుల్లో మాట్లాడవలసి వస్తే, ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండవచ్చును. ఇతరుల మనసుని కష్టపెట్టరాదని ఆచార్యగారు నేను చేసిన పొరపాటుని సరిదిద్దారు. వెంటనే నేను చేసిన పొరపాటుకు భర్తతో క్షమాపణ కోరాను. ఆ భార్యాభర్తలతో మాట్లాడి, నా శక్తియుక్తులతో సమస్యను పరిష్కరించి

వారిద్దర్నీ కలపగలిగాను. వారిద్దరూ ఆనందంతో సంతానం కని, సంతోషంగా సంసారం చేయుచున్నారు. వారు కూడా ఆచార్యగారికి అనుయాయులై, నేటికీ వారిని తలచుకుంటూనే ఉంటారు. అప్పటి నుండి సత్యం నా నిజ జీవితంలో భాగమైపోయింది. నా జీవకణముల గుణములను (డి.ఎన్.ఎ) మార్చివేసింది. సత్యమే నా ప్రవృత్తిగా నన్ను మార్చివేసింది.

నేను ఒక మార్కెటింగ్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నప్పుడు నాతోటి వారు ఎన్నో అసత్యాలు పలికి వ్యాపార లక్ష్యాలు సాధించేవారు. కాని నేను మాత్రం ఆ వృత్తిలో కూడా సత్యప్రవృత్తితో నిలచి ఆనందం పొందేవాడిని. ఈ విషయం ఇప్పటికీ నాకు గర్వకారణం. ఆచార్య గారి నిజ జీవితంలో సత్యం, ధర్మం అనే విలువలకై ప్రాణాలను సైతం తెగించి, వారి ఉద్యోగ బాధ్యతలను నిర్వహించిన సంఘటనలు పాఠకులకు ఉత్తేజాన్నీ, ప్రేరణనీ కల్గిస్తాయి. మీ జీవితాలలో కూడా ఈ విలువలు నిలచిపోతాయి.

**ధర్మనిరతి**



ఆచార్యగారి జీవనంలో ధర్మం ప్రధానంగా కనిపిస్తుంది. ధర్మం వారిని నడిపించే నావ. వారి జీవితానికి ధర్మం చుక్కాని వంటిది. ఆలోచన, మాట, పనిలో ధర్మమే వారికి దిక్సూచి. వారు సనాతన ధర్మంలో ప్రబోధించిన "ధర్మార్థ కామమోక్షాణాం" అన్న సిద్ధాంతం, వారి వృత్తి, కుటుంబ, సామాజిక, ఆధ్యాత్మిక కోణాలలో ప్రతిబింబిస్తుంది.

"రామా నీ దయ" అనే వారి నిత్య స్మరణంలో "రామో విగ్రహవాన్

ధర్మః" అన్న రాముని జీవన ధర్మాలు ఆచార్యగారి జీవితంలో చూశాను.

ఇట్టి విలువలు వారి సంతానంలో, వారితో కలసి పని చేసిన వారిలో, ఒయాసిస్ స్కూల్, లీడ్ ఇండియా వ్యవహారాలలో మీరు పరిశీలించవచ్చును.

**ఆచార్య ధర్మప్రవృత్తికి  నా అనుభవంలోని కొన్ని సంఘటనలు**

**1వ సంఘటన :** 2001లో నేను భారతదేశం తిరిగి వద్దామని, ఇక్కడి పరిస్థితులు పరిశీలించి, తుది నిర్ణయం తీసుకుందామని, కొన్ని రోజులు సెలవులో వచ్చాను. ఆచార్యగారికి ఈ విషయాన్ని తెలిపాను. వారి నుండి నేను నేర్చుకున్న విషయాలు

చెప్పి పొగిడాను. బాలభారతి మరియు లీడ్ ఇండియా విషయాలలో వారికి నేను అండగా ఉంటానని ఆశ పెట్టాను. ఎన్ని చెప్పినా నేను వారిని ఒప్పించలేక పోయాను. వారి అనుమతి పొందలేకపోయాను. ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా ఇండియా తిరిగి రావడం వలన కుటుంబం ఇబ్బంది పడుతుంది. ఏ పనీ చేయకుండా ఉండి సంపాదనను ఖర్చుపెడుతూ, నాకు తోడుగా ఉండటం అధర్మం అని నన్ను అమెరికాకు తిరిగి పంపించి వేశారు.

**2వ సంఘటన :** ఒక రోజు ఆచార్యగారు నాకు మైసూర్‌పాక్ స్వీట్ ఇచ్చారు. నేను తినకుండా మాట్లాడుతూ ఆ ప్లేట్ ప్రక్కకు పెట్టాను. వారు అది గమనించి "ఒక మనిషి నీ వద్దకు వచ్చినప్పుడు అతనిని ఎక్కువ సేపు వేచి ఉంచడం ఎంత  సరియైనది కాదో, అలాగే ఒక పదార్థం నీ ముందరకు  వచ్చినప్పుడు తినకుండా, వేచి ఉంచడం కూడా అంతే సరియైనది కాదు. వెంటనే తినాలి" అన్నారు. నేను తిని ఆ ప్లేట్

ప్రక్కకు పెట్టాను. ఆచార్య గారు ఆ ప్లేట్‌ను గమనించి మొత్తం తినమన్నారు. నేను మొత్తం తిన్నాను కదా అని అనుకున్నాను. కాని ఆ ప్లేట్‌ని గమనిస్తే కొద్దిపాటి మిఠాయి మిగిలిపోయింది. ఈ సమాజంలో కొంత పదార్థం వదిలిపెట్టడం అనేది ఒక ఫ్యాషన్. కాని నేను వారు తినమన్నందుకు తినేసి "ఆ మాత్రం ముక్కను వదిలి పెట్టడంలో తప్పేంటి?" అని అడిగాను.

ఆచార్యగారు చెప్పారు "కోటి తిప్పలు కూటి కొరకే " మనమందరం కష్టపడేది ఈ ఆహారం (అన్నం) కొరకే కదా. అన్నం "పరబ్రహ్మ స్వరూపం" అన్ని ప్రాణులు జీవించాలని ప్రకృతి అందిస్తున్న ప్రసాదం. కాబట్టి ఏ మాత్రం వదలకుండా తినాలి. తినేముందు ఆ పదార్థం పెట్టిన వారికీ, వండిన వారికీ, వడ్డించిన వారికీ, కష్టపడి శ్రమించి కొని తెచ్చిన వారికీ, ఆ పదార్థం పండించిన రైతులకూ, భూమికీ, సూర్యుడికీ, గాలికీ, నీరుకీ, ప్రకృతికీ, పరమాత్మకూ.

**బ్రహ్మార్పణం బ్రహ్మహవిః**
**బ్రహ్మాగ్నౌ గ్రహ్మణాహుతమ్।**
**బ్రహ్మైవతేన గన్తవ్యం**
**బ్రహ్మ కర్మ సమాధినా॥**

అని ప్రార్థన చేసి తినడం పద్ధతి అని వివరించారు. "మనం ఏ వస్తువునైనా తీసుకున్నప్పుడు, ముందు కృతజ్ఞతలు చెప్పడం సమాజ మర్యాద కదా! ఈ విధంగా భోజనం చేసే ముందు అందరికీ ధన్యవాదాలు చెప్పి, ప్రార్థన చేసి ప్రశాంతంగా తినడం సనాతన భారతీయ సాంప్రదాయం" అని తెలిపారు. అప్పటి నుండి నాతో సహా నా కుటుంబం మరియు అమెరికాలో ఉంటున్న నా మిత్రులు అందరం ఈ పద్ధతిని

ఆచరిస్తున్నాము.

**3వ సంఘటన :** ఒక రోజు నేను ఆచార్యగారితో మాట్లాడుతున్నప్పుడు మా చెల్లెలు వచ్చి "నేను ఒక విందుకి వెళ్తున్నాను. ఫుడ్ కొట్టి వస్తాను" అని అన్నది. వెంటనే ఆచార్యగారు "ఫుడ్ కొట్టడం కాదు తల్లీ! తినడం అనాలి. ఆ తిండి పైననే నీవు జీవిస్తున్నావని గమనించు. నీవు వెళ్ళి భోంచేసి, గౌరంవంగా వారికి ధన్యవాదాలు చెప్పిరా" అని ప్రేమగా తెలిపినారు. ఆయన మాటలతో కూడా మనుషులను మార్చగలరని ఆనాడు నాకు అర్థమయింది.

**సహనానికి ఒక పరీక్ష**

నేను 18 సంవత్సరాల యుక్త వయసులో ఇంజనీరింగ్ కళాశాల ప్రభావంతో

ఆధునిక భావజాలంతో ప్రతిదీ విమర్శించి, నెగెటివ్‌గా ప్రశ్నించి, పెద్దలను అనేక అరుదైన అడగరాని ప్రశ్నలు, అడగరాని సమయాలలో అనేకసార్లు అడిగి వారి సహనాన్ని పరీక్షించాను. ఆచార్యగారు ఎప్పుడూ వారి ఓపికతో వారే గెలిచేవారు. చిరునవ్వుతో ప్రతిదానికీ సమాధానం చెప్పేవారు.

**ఆ ప్రశ్నలను గమనించండి !**

మనిషి ఎందుకు శాకాహారమే భుజించాలి? ఎందుకు ఒక మతస్తులు ఒక్క భార్యతోనే జీవితం అంటారు? మరొక మతస్తులు అనేక మంది భార్యలతో జీవితం అంటారు? ఇంకొందరు భార్యాభర్తలెందుకు అంటారు? అసలు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు ఎందుకు ఉంటాయి? మతాల మధ్యన ఘర్షణలు ఎందుకు వస్తున్నాయి? సముద్రం నీలంగా ఎందుకు ఉంది? రాముడు, కృష్ణుడు కూడా నీలంగా ఎందుకు

ఉంటారు? అన్నటువంటి మౌలిక ప్రశ్నల దగ్గర నుండి కనురెప్పలు ఎందుకు కొట్టుకోవాలి? అనే అర్థం లేని,కారణం లేని ప్రశ్నలు ఎన్నో అడిగే వాణ్ణి. ఆచార్యగారు అడిగిన ప్రతి ప్రశ్నకూ చిరునవ్వుతో శాస్త్రోక్తంగా, పురాణాలు, వేదాలు, ఉపనిషత్తుల ఆధారంగా, తత్వవిచారణతో, గణాంకాలతో, చరిత్ర సంఘటనలతో, మంచి చెడ్డలతో అన్వయిస్తూ వినసొంపుగా చెప్పేవారు.

ఒక విషయాన్ని అర్థం చేయించడంలో వారికి వారే సాటి అని నా ప్రగాఢనమ్మకం. ఈవిధంగా ధైర్యం, కరుణ, క్రమశిక్షణ ఇత్యాది శ్రీరామ చంద్రుని షోడశ గుణ సంపదను దాదాపు ఆచార్యగారి ఆచరణలో చూశాను. పరీక్షించాను, పరిశోధించాను. ఈ విధంగా నేను వారికి ప్రియశిష్యుడనై నాను. కాని వారు నాకు ఒక ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్‌గా నా గుండెల్లో గూడు కట్టుకున్నారు. నేను ఎప్పుడూ వారి గురించీ, వారు నిర్వహించే లీడ్ ఇండియా ఉద్యమం గురించీ, ఏమి చేయగలనా అని ఆలోచిస్తుంటాను.

**ఆచార్యగారి దృశ్యశక్తి నా జీవితంలోకి ప్రవేశించింది.**

నేను ఆచార్యగారికి సన్నిహితుడనై వారిలో శక్తియుక్తులను గ్రహించాను. వారి పెదవులపై చిరునవ్వు చిందిస్తూ ఉండి, కళ్ళలోకి కళ్ళు కలుపుతూ ఆశీర్వదించేవారు... దృశ్య శక్తిని ప్రసారం చేసేవారు. అది నాలో ఒక వినూత్న అనుభూతిని కలిగించేది.

ఒక రోజు తెల్లవారు జామున బ్రహ్మ ముహూర్త సమయంలో నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో నేను ధ్యానానికి ప్రేరణ కలిగించే "క్యాసెట్" కొనడానికి సికింద్రాబాద్‌లోని "సంగీత సాగర్" షాప్ లోకి

ప్రవేశిస్తూ, ఎందుకో వెనక్కి తిరిగి చూశాను. ఎదురుగా మా గురుదేవులు ఆచార్యగారు చిరునవ్వుతో తదేకంగా నాకళ్ళలోకి కళ్ళు పెట్టి చూసి ఏదో శక్తిని ప్రసరింపచేశారు. ఒక్కసారిగా ఆ తీవ్రతని నేను తట్టుకోలేక పోయాను. ఆ దివ్య ప్రేరణతో వెన్నుపూసలో గగుర్పాటు కలిగించే శక్తి ప్రేరణ కలిగింది. నాలోని షట్చక్రాలు శక్తిపుంజాలుగా మారాయి. 72వేల నరాలు నాలో ఉత్తేజాన్ని కలిగించాయి. అది నన్ను శక్తిగా మార్చిన దివ్య ప్రేరణ. నా భార్య నా కదలికలను కాళ్ళు చేతులు బిగుసుకుపోవడం గమనించి నన్ను తట్టి లేపింది. నేను వెంటనే మేల్కొన్నాను. ఆనాటి నుండి ఈనాటి వరకు వారి దృశ్యశక్తి నన్ను మేల్కొల్పుతూనే వుంది.

భగవాన్ రమణ మహర్షి మౌనంగా నవ్వుతూ సమ్యక్‌దృష్టి ప్రసారం చేసి తమ భక్తుల ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం వారి సమస్యలను పరిష్కరించడం గమనించాను. అవే అనుభూతులు ఆచార్యగారి ద్వారా పొందాను.

వారు పుల్లా రెడ్డి విద్యాసంస్థల్లో పని చేస్తున్నప్పుడు వారి దృశ్యసాధన ద్వారా మరణం నుండి ఏవిధంగా తప్పించుకున్నారనే ఉదంతాలు ఈ పుస్తకంలో చదివి మీరుకూడా నాలాగే ఈ సనాతన దృశ్యసాధన శక్తిని పొంది శక్తివంతులౌతారని ఆశిస్తున్నాను.

**వారి మాటే నా బాట**

తల్లిదండ్రులు చిన్న పిల్లవాణ్ణి వేలు పట్టుకుని ఒక చోటు నుండి మరోచోటుకి జాగ్రత్తగా తీసుకువెళ్ళినట్లు, ఆచార్యగారి ఆశీస్సులు, వాక్‌శక్తి నా జీవితంలో జరుగుతున్న ప్రతి సంఘటనలోకీ తీసుకు వెళుతున్నాయి.

వారి ప్రతి వాక్కు నాలో గొప్ప మార్పుకి నాంది. నా చదువు, అమెరికా ప్రయాణం, నా వివాహం, నా సంతానం, నా గృహ నిర్మాణం, విషయాలు ఏవైనా వారు ముందుగానే అన్న మాటలన్నీ జరుగుతుంటాయి. వారు నాకు గురువులే కాదు, దైవం అని చెప్పడంలో నాకు ఎలాంటి సందేహం లేదు.

**1వ సంఘటన:** ఆచార్యగారి కుమారుడిలాగా నేను కూడా అమెరికా వెళ్ళాలని మా అమ్మ, నాన్న పట్టుపట్టారు. వీసా కొరకు అమెరికా కాన్సులేట్‌కి తీసుకు వెళ్ళారు. కాన్సులేట్‌లో వీసా నిరాకరించబడింది. బాధతో వాళ్ళు నన్ను ఆచార్యగారి దగ్గరకు తీసుకు వచ్చారు. ఆచార్యగారు ఏమీ మాట్లాడకుండా సూటిగా నా వంక చూస్తూ "మళ్ళీ వెళ్ళు, ఈ సారి వీసా తప్పకుండా వస్తుంద"ని అన్నారు. వారు అన్నట్లుగానే అమెరికా కాన్సులేట్ వారు నన్ను ఏమీ ప్రశ్నించకుండా వీసా ఇచ్చారు. ఆ సంఘటన మమ్మల్ని అందరినీ ఆశ్చర్యంలోనూ, ఆనందంలోనూ ముంచెత్తింది. ఇదంతా వారి వాక్‌శక్తి అన్నారు మా అమ్మానాన్న. అప్పటి నుండి వారు కూడా ఆచార్యగారి శిష్యగణంలో చేరిపోయారు.

నేను వీసా తీసుకుని ఆచార్య గారి దగ్గరకు వెళ్ళాను. ఆ సమయంలో వారు విద్యార్థులతో లీడ్ ఇండియా శిక్షణలో ఉన్నారు. వారికి వీసా ఇచ్చి, పాద నమస్కారాలు చేశాను. వారు తట్టి పైకి లేపి "మన రమాకాంత్ మన లీడ్ ఇండియా వివేకానందుడు" అని పరిచయం చేశారు.

ఆ విధంగా నేను 1996లో అమెరికాకు వచ్చాను. ఆనాటి నుండి నేనువిభిన్నమైనటు వంటి సంస్కృతులతో, విభిన్నమైనటువంటి బృందాలతో, కంపెనీ మేనేజర్లతో, సామాజిక, ఆధ్యాత్మిక సాధకులతో, ఆర్ట్ ఆఫ్ లివింగ్

వారితో, హనుమాన్ దేవస్థానం వారితో ఆచార్యగారి గురించి, నా అనుభవాలను పంచుకుంటుంటాను. వారు ఆచార్యగారి గురించి అడిగిన ప్రశ్నలకు జవాబులు చెబుతుంటాను. ఆచార్యగారు మనందరితో కలసిపోతూ సామాన్యుడిగా కనిపించినా, అసాధారణమైన దివ్యశక్తి సంపన్నుడు. ఆయన వేసుకునే దుస్తులు కాషాయం రంగులో లేకున్నా, పవిత్రమైన తెల్ల దుస్తుల్లో కనిపించే శాంతి కపోతం. కర్మ, భక్తి, జ్ఞాన ప్రదాత అని గ్రహించాను.




**2వ సంఘటన:** 2014 సంవత్సరాలలో ఒక రోజు తెల్లవారు జామున ఆచార్యగారు కలలో కనిపించారు. ఆయన మా సద్గురువులు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి దత్తగురు పరంపరలో ఉన్నవారిగా గొప్ప హోమం చేయుచున్నారు. అందులోని జ్వాలలు పసుపు కుంకుమలతో ఆకాశాన్ని అంటుతున్నాయి. వేదఘోష మారుమ్రోగుతుంది. నెయ్యి, సుగంధ ద్రవ్యాల వాసనలతో ఆవరణం ఘుమఘుమలాడుతుంది. అక్కడ అణువణువులో దివ్యత్వం ఆవరించుకుంది. ఆచార్యులవారి ముఖం ప్రకాశవంతంగా, కాంతి పుంజంలా మెరుస్తుంది. వారు నన్ను ప్రేమగా తమ దగ్గరకు పిలిచి ఆశీర్వదిస్తూ ప్రసాదాన్ని అందించారు. “నీకు ఒక గొప్ప ఋషి కుమారుడు జన్మించ బోతున్నాడు” అని అన్నారు. ఆ తరువాతి నెలలో నా భార్య గర్భం దాల్చింది. కుమారుడికి జన్మనిచ్చింది. శ్రీ శరణ దత్త అని పేరు పెట్టాము. ఈ విధంగా ఈనాటికీ సద్గురు ఆచార్యగారు, సద్గురు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిగారు మా

ఇంటా వెంటా ఉంటూ ఆనంద అనుభూతులను అందిస్తూ మమ్మల్ని నడిపిస్తున్నారు.

పల్లవి: ఓ గురుదేవ రావా మము ఏలుకోవా..!
ఆనాటి నుండి ఈ నాటి వరకు



తల్లిదండ్రుల కన్న గురువు గొప్ప అంటూ...
దైవానికన్నా గురువు గొప్ప అంటూ..!
"ఓ గురుదేవ రావా"

1చరణం: నీ వున్న కొండ నేను ఎక్కలేను ...
ఎక్కించు శక్తి మాకివ్వు తండ్రీ....

2.చరణం: పాదాలు నీవి కన్నీళ్ళు మావి ....
కడిగేను తండ్రి పూజింతుమయ్యా..
"ఓ గురుదేవ రావా"

3.చరణం: మా చిత్రమందు మీ చిత్రం ఉంచి..
హృదయంలోకి దిగిరా తండ్రీ....
"ఓ గురుదేవ రావా"

ఈ పాట మా గురువు ఆచార్యగారు ఎప్పుడూ వారి గురువుగారిని తలచుకొని కంటతడి పెట్టి మరీ తన్మయత్వం చెందే భజన. ఈ భజన నన్ను ఎప్పుడూ తన్మయత్వానికి గురిచేస్తుంది.

ఒకనాడు ఆచార్యగారితో యోగాచార్య సీతారామయ్యగారు "సుదర్శన్! నీ సామాజిక సేవలు, ఉపన్యాసాలు అందరికీ ప్రేరణ కలిగిస్తాయి. నీవు యోగ సాధన చేసినచో, ఇంకా ఎక్కువ కాలం సేవ చేయవచ్చు" అని అంటూ ఆనంద బాష్పాలతో బుజ్జగించిన సందర్భం

ఆచార్యగారి మనసులో శాశ్వత ముద్ర వేసుకుంది. అందుకే ఆచార్యగారు ప్రతిరోజూ ఎట్టి పరిస్థితులలోనైనా సూర్య నమస్కారాలు, ధ్యానం చేస్తుంటారు. "వారి సాధనే నాకు యోగ విద్యా ప్రేరణ. వారు నా యందు చూపే కరుణ నా తల్లిదండ్రులను సైతం మరిపిస్తుంది. నన్ను అమెరికా పంపించుట కొరకు వారి మిత్రులు జ్యోతిషరత్న డా. నూకల సోమేశ్వరరావు గారి దగ్గరికి పంపారు. నాకు హనుమాన్ చాలీసా సుందరకాండ, సాయి సత్ చరిత్ర ఇత్యాది పారాయణాలను ప్రబోధించేవారు.

మేము మా తల్లిదండ్రులకన్నా, దైవం కన్నా, ఆచార్యగారి ఆశీస్సులు పొందేవాళ్ళం. ఆయన చెప్పినట్లు నడచుకునే వాళ్ళం. ఆచార్య గారు నలుగురి కొరకు నడిచే ఒక పవిత్ర ఆత్మ. ఆ ఆత్మ మనతో తీయగా మాట్లాడుతుంది. కలసి పనిచేస్తుంది. ఒక్క చూపుతో మనసుల్ని, మనుషులని మార్చే ఆధ్యాత్మిక గురువౌతుంది.

గోపికలు కృష్ణుని చెంత తుమ్మెదల్లా చుట్టు ముట్టినట్లు, ఎక్కడ ఆచార్యగారు ఉంటే అక్కడ పిల్లలందరూ చుట్టు ముడతారు. ఆ పిల్లలకు తెలియకుండా ఆచార్యగారు వారికి ఏ విధంగా చూపులతో ఆశీస్సులు అందిస్తుండేవారో నేను గమనిస్తుండేవాడ్ని."

**మందిర నిర్మాణం - జీవితానికి ఒక గొప్ప మలుపు**



జీవితంలో ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ విధంగానైనా, ఏ మందిర నిర్మాణంలోనైనా, అవకాశం దొరికినచో సేవా దీక్షాదక్షతలతో పని

చేయమన్నారు. అది ఏడుతరాల వెనుక వారికీ, ఏడుతరాల ముందు వారికి బంధ విముక్తి కల్గిస్తుందని చెప్పారు.

నేను అమెరికా వెళ్ళగానే డల్లాస్ హనుమాన్ దేవస్థానం శంకుస్థాపన ప్రారంభం అయ్యింది. అప్పటి నుండి ఇప్పటి వరకు ఉడతాభక్తిగా నా వంతు బాధ్యతలను, సేవలను మనస్ఫూర్తిగా అందిస్తుంటాను. ఈ రోజు ఆ దేవస్థానం "కార్యసిద్ధి హనుమాన్ దేవస్థానం"గా సంపూర్ణ రామపరివారంతో అమెరికాలోనే ఓ సనాతన అగ్రహారంగా ప్రఖ్యాతి చెందింది. అక్కడకు ప్రపంచవ్యాప్తంగా భక్తులు వస్తుంటారు. అందులో మా బోధ గురువులు కృష్ణయ్యగారితో దగ్గరి సంబంధాలు ఏర్పడటం, నేను ఒక యోగా గురువుగా గుర్తింపు పొందడం - ఇవన్నీ ఆచార్యగారి ఆశీస్సులు అని నమ్ముతాను.

**లక్ష్మీ ప్రసన్నం - కరుణా కటాక్షం**

2012లో అమెరికా వచ్చినప్పుడు ఆచార్యగారు మా ఇంటికి వచ్చారు. వారి జీవితం గురించి చెబుతూ వారి తల్లిదండ్రులకు వారు దేవుని వరపుత్రునిగా ఏ విధంగా జన్మించారో విశదీకరించారు.

ఆ సమయంలో వారు "మీ ఇంటిలో మీ బాబు శ్రీశరణ్‌కు తోడుగా తోబుట్టువు రాబోతుంది. లక్ష్మీ ప్రసన్నం జరగబోతుంది. మీరు ఒక కొత్త ఇల్లు కొన్నుకుంటారు" అని ఆశీర్వదించారు. ఆచార్యగారు చెప్పినట్లుగానే ఒక నెలలోపు నా భార్య గర్భం ధరించి, అమ్మవారి స్వరూపంతో నా కూతురు జయలక్ష్మి జన్మించింది. ఆచార్యగారు అన్నట్లుగానే మేము అమెరికాలో అందమైన భవనాన్ని కట్టుకోగలిగాము. ఈ విధంగా వారి మాట మమ్మల్ని గమ్యానికి చేర్చే బాట.

**గీతా ప్రబోధం**



ఆచార్యగారు మా శ్రీశరణ్‌కు భగవద్గీత నుండి రోజుకి ఒక శ్లోకం నేర్పించే ఉపాధ్యాయుడిని చూడమన్నారు. మీ కుమారుడు సంపూర్ణ భగవద్గీత నేర్చుకుని గీతాచార్యుడు అవుతాడు అని అన్నారు. నేను అప్పుడు గీత బోధించే ఉపాధ్యాయుడు అమెరికాలో ఎక్కడ దొరుకుతారు? మాకు అది ఎలా సాధ్యం అవుతుంది? అని అనుకున్నాను. సద్గురు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారు, శ్రీకాంత్ అనే ఉపాధ్యాయుడి ద్వారా పిల్లలకు భగవద్గీత నేర్పించే ఒక ప్రణాళికను ప్రవేశ పెట్టారు. దాని ద్వారా మా బాబు ఒక సంవత్సరంలో సంపూర్ణ భగవద్గీతలోని 701 శ్లోకాలనూ నేర్చుకున్నాడు.

2016లో గీతా జయంతి పర్వదినాన పిల్లలనందరినీ పరిశీలించి సన్మానించుటకు దేవస్థానం వారు అమెరికాలో ఉన్న ఆచార్యగారిని ప్రేమపూర్వకంగా ఆహ్వానించడం మాకు ఆశ్చర్యం కలిగించింది.

**రాతలు మార్చే గీత**

ఆచార్యగారి ద్వారా మా బాబుకు 'గీతాచార్య'గా సన్మానం చేయించారు. ఆ సమయంలో ఆచార్యగారిని సద్గురు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి లీడ్ ఇండియా మిషన్ 2020 విజయం తథ్యం" అని ఆశీర్వదించారు. ఇది ఒక అనిర్వచనీయమైన, ఆనందకరమైన సంఘటన. ఆచార్యగారు నన్ను కూడా భగవద్గీత నేర్చుకోమన్నారు. ఈ వయసులో కంఠస్థం చేయడం ఏవిధంగా సాధ్యం అవుతుంది? సంస్కృతం

రాని నాకు గీత నేర్చుకోవడం ఎలా సాధ్యం? అని అనుకున్నాను. వారి ఆశీస్సులు, స్వామిజీగారి ఆశీస్సులతో ఇప్పటికే దాదాపు 8 అధ్యాయాలు నేర్చుకున్నాను.

ఇప్పుడు నాకు మిగతా 10 అధ్యాయాలు త్వరలోనే నేర్చుకుంటాననే నమ్మకం కలిగింది. ఈ విధంగా ఏది అసాధ్యం అనుకుంటే వారి ఆశీస్సులతో అన్నీ సాధ్యం అవుతున్నాయి. ఇప్పుడు మాద్వారా భవిష్యత్‌లో గీతా ప్రబోధనలు ప్రపంచానికి అందించే అవకాశాలు వస్తాయి. "ప్రపంచంలో గీతా ప్రబోధనలు లీడ్ ఇండియా ఉద్యమంలా నడపవలసిన అవకాశాలు అందిపుచ్చుకోవాలి" అని అంటున్నారు ఆచార్యగారు.

ఈ విధంగా ఆచార్యగారి ద్వారా నాలో, నా కుటుంబ సభ్యుల్లో, నా మిత్రులు, వారి కుటుంబాలలో అనేక మార్పులు ఏర్పడ్డాయి.

1. మా ఆలోచనలు, మాట, పని తీరు మారిపోయింది.
2. మేమంతా మాంసాహారం మానివేసి శాకాహారులుగా మారిపోయాము.
3. అనవసరంగా మాట్లాడటం, తిరగడం మానేశాము.
4. భగవంతుని మీద నమ్మకం పెరిగింది. శ్రద్ధతో ప్రార్థనలు, ధ్యానం చేయడం అలవాటయింది.
5. తల్లిదండ్రులపై ప్రేమ, కుటుంబం పట్ల, దేశం పట్ల బాధ్యత పెరిగింది.

ఈ విధంగా ఆచార్యగారి జ్ఞానం, శక్తి, అనుభవాల లోతులను వారి అనుభవాలతో తెలుసుకోవడం అందరికీ అవసరం. వారి జీవితం ఒక అపురూపమైన, అద్భుతమైన, అరుదైన పుస్తకం .

మేము వారి దగ్గర అనేక సందర్భాలలో విన్నవాటిని గుర్తు చేసుకుని, అనేక విషయాల గురించి ప్రశ్నించి, మీ అందరి అభివృద్ధికి ఇవి వుపయోగ పడతాయనే నమ్మకంతో ఈ పుస్తకరూపంలో తీసుకు వచ్చాం. ఇది తప్పకుండా మీ పిల్లలకు, మీ కుటుంబాలకు, విద్యాలయాలకు, అందరి జీవితాలకు స్ఫూర్తినిస్తుందని నమ్ముతున్నాను. సంపూర్ణ జీవనాభివృద్ధికి పునాదులు వేస్తుంది. ఇదే  ఆచార్యగారి ఆకాంక్ష.

నేను, నా అమెరికాలోని మిత్రులు రవి కృష్ణ. ఎం.అట్లాంటా, బిందు లాస్‌వేగాస్, మిత్రులందరూ ఆచార్యగారి ద్వారా పొందిన అద్భుత అనుభూతులని తెలుపుతూ ఆచార్యగారి ఆత్మకథని సంకలనం చేయడానికి శ్రీనివాస్ కొత్తూరు  ఫిలడెల్ఫియాకు ఈ బాధ్యతలను అప్పగించారు. ఆయన సంకలనం చేశారు.

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః ॥

మీ
రమాకాంత్ మిద్దెల

## కొత్తూరు శ్రీనివాస్



మా మిత్రులు శ్రీ రమాకాంత్ మిద్దెల రవికృష్ణ, అమెరికాలో ఉంటున్న బాలభారతి, లీడ్ ఇండియా మిత్రబృందం మాకు ఇచ్చిన బాధ్యత ఆచార్యగారి జీవిత విశేషాలు, విలువలు ఒక పుస్తక రూపంలో సంకలనం చేయడం భగవంతుడు ఇచ్చిన భాగ్యంగా భావిస్తున్నాను.

ఆచార్యగారు మా నాన్నగారు ఒకే ఆఫీస్‌లో సన్నిహితులుగా పనిచేసేవారు. గత నాలుగు దశాబ్దాల నుండి నేను వారిని ఎరుగుదును. ప్రత్యక్షంగా, పరోక్షంగా నాకు వారు గురువు, మార్గదర్శి, మంచి ఆత్మీయ మిత్రులు. నా వయస్సు వారి అనుభవం అంత లేదు. వారికున్న అసంఖ్యాకమైనటువంటి శిష్య బృందంలో నేను ఏ విధంగానూ సరిపోను. అయినా, ఎప్పుడూ నేను ఎన్ని విషయాలు అడిగినా విసుగు చెందకుండా విని, అమృతం లాంటి తిరుగులేని విషయాలను వివరిస్తారు. వారి మాటలు ఇప్పటికీ నన్ను, నా కుటుంబాన్ని ప్రభావితం చేస్తుంటాయి. మా మిత్రులతో పాటు నా జీవితంలోని కొన్ని అనుభవాలను పంచుకుంటూ ఆచార్యగారి జీవితంలోని లోతును గ్రహిస్తారని ఆశిస్తున్నాను.

అవి శ్రీరామనవమి రోజులు. నేను ఆర్.టి.సి మేనేజర్ శిక్షణలో వున్నాను. అపుడే నాకు యన్ఎండిసి, ఒఎన్‌జిసి, డిఎఇ సంస్థలలో ఇంకా పెద్ద ఉద్యోగ అవకాశాలు వచ్చిన రోజులు. కానీ ఆ అవకాశాలను అందిపుచ్చుకొనుటకు నా ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఆర్‌టిసి సంస్థలో వున్నాయి. ఆర్.టి.సి రీజినల్ మేనేజర్ శ్రీ రామోహన్‌రావుగారు ఆచార్యగారికి

స్నేహితులు అని తెలిసి వారి ద్వారా సర్టిఫికెట్స్ పొందుటకు మా నాన్నగారు, నేను ఆచార్యగారి వద్దకు వెళ్ళాము. అప్పుడే ఆయనకు కాలికి బలమైన గాయంతో బాధపడుతున్నారు. మా బాధలు విని, మా కోరిక మన్నించి గాయం అయిన కాలుతో కుంటుతూ, ఉన్న పళంగా మా వెంట వచ్చేశారు. మేము గౌలిగూడ సెంట్రల్ బస్సు స్టేషన్ చేరుకున్నాం. రాత్రి 10 గంటలు అయింది. లగ్జరీ బస్సు ఎక్కుదాం అంటే ఫుల్ రష్‌గా వుంది. వద్దు మనం అర్డినరీ బస్సులో పోదాం అన్నారు. మమ్మల్ని ఒప్పించారు. తామే ముందుకు వెళ్లి కూర్చున్నారు. 8 గంటలు ఆ బస్సులోనే బాధను భరించారు. ఆ రోజు రాత్రి ఆ లగ్జరీ బస్సును దొంగలు దోచుకున్నారు. అప్పుడు లగ్జరీ బస్సును వద్దని ఎందుకు అన్నారో అర్థం అయ్యింది. మేము బస్సు దిగగానే వారి మిత్రుల ద్వారా నాకు నా సర్టిఫికెట్స్ ఇప్పించారు. వారు చేసిన మేలును మరచిపోలేము. కాలు విరిగినా కూడా లెక్కచేయక వెంటనే సహాయం చేసిన ఆచార్యలాంటి వ్యక్తిత్వం అరుదైనది.

అది 1999వ సంవత్సరం. అమెరికా వచ్చుటకు నాకు వీసా లభించినది. ఆచార్యగారి మిత్రుడు శ్రీ భాస్కర్‌నాయుడు గారు వీసా కొరకు ముహూర్తం పెట్టినారు. అంటే నూరు శాతం వచ్చేస్తుంది. అటువంటి వారి దగ్గరకు ఆచార్యగారు నన్ను పంపించారు. వారు పెట్టిన ముహూర్తానికి నేను వీసా కోసం వెళ్ళాను. నాతోపాటుగా రావలసిందిగా ఆచార్యగారిని కోరాను, దీనికి ఆయన అవసరం లేదు వెళ్ళు పని అయిపోతుందని అని అన్నారు. అన్నట్లుగానే నన్ను ఏమీ ప్రశ్నించకుండా నాకు వీసా ఇచ్చేసారు. నేను తిరిగి ఆచార్య గారిని కలిశాను. అప్పుడు

ఆచార్యగారు "నేను నీ కొరకు ప్రార్థించాను, ఆ భగవంతుడే పని చేసాడు, సంతోషంతో అమెరికా వెళ్లు అన్నీ మంచే జరుగుతాయి" అని చెప్పడం జరిగింది. ఆ మాటలు ఇప్పటికీ నా అంతరాత్మలో వినబడుతూనే ఉ ంటాయి.

ఆచార్యగారితో పాటు మా నాన్న శ్రీ సత్తయ్యగారు బాలభారతి శిక్షణా సమితి కోశాధికారిగా సేవలు చేసేవారు. ఒకరోజు బాలభారతి శిబిరంకు వెళ్ళాను. అక్కడ డా|| అరుణ్ కుమార్ ఆచార్యగారు కమాండో గ్రూప్‌తో చర్చిస్తున్నారు. విషయం ఏమిటనగా "మీకు తెలిసిన నాయకుల గురించి, వారి గొప్పతనం గురించి మాట్లాడండి'' అందులో విద్యార్థులందరూ, విశ్వ విజేతలందరి గురించి వివరిస్తుంటే వాటి ఆధారంగా డా|| అరుణ్ కుమార్ ఆచార్యగారు విశ్లేషణ జరిపారు. గొప్పవారి జీవిత విలువలను, ఈ విద్యార్థుల గురించి రూపొందించిన విధానం నేను మరువలేని ఘట్టం. ఆ విద్యార్థులలో చాలామంది మాతోబాటు వాషింగ్‌టన్ డి.సి.లో శ్రీలేఖ, వెన్నెల డెట్రాయిట్‌లో ధీరజ్ రెడ్డి, డల్లాస్ విశ్వనాథ్‌లు అలా ఎందరో అమెరికా, లండన్, ఆస్ట్రేలియా– అనేక దేశాలలో. విశ్వ విజేతలుగా గొప్పగా జీవిస్తూ ఉన్నారు. ఈ పుస్తక సంకలనం చేస్తుంటే ఇన్ని సంవత్సరాల తరువాత కూడా నాలో స్ఫూర్తి నిండుతోంది. చదివేవారి జీవితాలను ఇది విశ్వవిజేతలుగా మార్చేస్తుందని మా నమ్మకం.

**రవి మారాడాకు అనుభవాలు :**

నా పేరు రవి మారాడాకు. నేను అమెరికాలోని అట్లాంటాలో నా భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాను. నేను అమెరికా వచ్చి యం.ఎస్., యం.బి.ఎ. చదివాను. టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు.




1999 వ సంవత్సరంలో లీడ్ యూత్ క్యాంపులో పాల్గొన్నాను. ఆ తరువాత బాల భారతి శిక్షణ శిబిరాలలో సేవ చేశాను. మా ఆత్మీయ మిత్రులు రమాకాంత్ మిద్దెల గారి వలన ఆచార్యగారికి సన్నిహితులయ్యాము.

ఆచార్యగారు 20 గంటలు పనిచేసినా కూడా అదే (చెదరని) చిరునవ్వుతో అలుపెరగని శక్తి యుక్తులతో, తేజస్సు స్ఫూర్తి నన్ను ఆశ్చర్యపరుస్తుంటాయి. ఆచార్య గారికి పాద నమస్కారం చేసి వారి ఆశీర్వాదం పొందుతున్నపుడు దివ్య అనుభూతితో, దీర్ఘ నిశబ్దంలోకి వెళ్ళిపోతాను. శక్తి ప్రసారణ అనుభూతి పొందుతాను. ఇటువంటి దివ్య అనుభూతి నేను ఎంతో మంది స్వాములను కలిసినా కూడా పొందలేదు.

ఆచార్య గారి ఆత్మజ్ఞానం ప్రబోధనలు ఎన్నిసార్లు విన్నా, బాలభారతి శిబిరంలో అయినా, లీడ్ యూత్ క్యాంపులో అయినా ఇంటి దగ్గర చర్చిలో అయినా అంతరాత్మ ప్రబోధనగా వస్తుంది. ఆ ఆత్మజ్ఞానమే మమ్ములను నిరంతరం నడిపిస్తుంది. ఇది నా నిత్య అనుభూతి. నేను మాంసాహారం తినకుండా ఉండలేకపోయేవాడిని. కానీ ఆచార్యగారు ప్రబోధించిన లాజిక్ నన్ను ఆలోచన చేయించింది. మనిషి శాకాహారా, మాంసాహారా మీరే తెల్చుకోండి అనేవారు. మాంసాహారం జంతువుల పళ్ళ వరసలు పులి, సింహము యొక్క గోర్లు చూడండి. శాకాహార జంతువుల పళ్ళవరసలు, గోళ్ళు గమనించండి. మనిషి పళ్ళవరసలు గోర్లు దేనికి దగ్గరగా ఉంటాయి? దానికి తోడు శాకాహారం త్వరగా

జీర్ణం అవుతుంది. మాంసాహారం వలన జీర్ణం కావటానికి ఎక్కువల కాలం పడుతుంది. శరీరం మత్తుగా మారిపోతుంది. చురుకుదనం తగ్గి సోమరితనం పెరుగుతుంది. "యథా మనం తథా మనహ". ఏ రకమైన ఆహారం తీసుకుంటే మనసు అలా ఏర్పడుతుంది. ఈ విధంగా వారు చెప్పిన ప్రబోధనలు నన్ను మార్చి వేశాయి. తరువాత మా కుటుంబాన్ని మార్చి వేశాయి.

**జీవితానికి ఒక లక్ష్యం :**

మనం పుట్టినది, గొప్ప పనులు చేయడానికి కానీ మామూలుగా కుటుంబం కొరకు కాదని అర్థం అయ్యింది. వారు లీడ్ ఇండియా ద్వారా యూత్‌ని మార్చి, దేశాన్ని మార్చే లక్ష్యం, నా లక్ష్యంగా మారింది. నేను అమెరికాలో ఉన్నా, ఆచార్యగారు చెప్పిన లీడ్ ఇండియా పేద విద్యార్థులకు సేవచేస్తూ ఉంటాను. వారిలో వారి నుండి గ్రహించిన విలువలు సత్యము, ధైర్యం, పట్టుదలతో పనిచేయడం, చేపట్టిన పనిని చేయకుండా వదిలిపెట్టడం ఇత్యాది నా వృత్తి జీవితాన్ని కూడా ప్రభావితం చేశాయి. అంతేకాకుండా చేసే పని చేయడమే గాని దాని ఫలితం ఆశించకుండా చేయగలిగింది. పూర్తిగా దీనికి తోడు నిత్యం యోగా, మెడిటేషన్, సాత్విక ఆహారం, గౌరవం, క్రమశిక్షణ ఇత్యాది నన్ను నడిపిస్తున్న విలువలు, నేను మారి నా తమ్ముడు రాధాకృష్ణ, నా భార్యని లీడ్ ఇండియా క్యాంపుకు పంపాను. మా కుటుంబంలోనే కాకుండా, మా సన్నిహితులలో సైతం చాలా మార్పులు వచ్చాయి. ఇవి కొనసాగిస్తూ మేము అందరం ఆచార్యగారికి తోడై లీడ్ ఇండియా కార్యక్రమానికి ఉడతాభక్తిగా, సైనికులుగా పని చేస్తాము. ఆచార్యగారి ద్వారా మారిన మేము అందరం వారి జీవిత చరిత్ర చదివే

వారందరికీ అదే విధంగా మా అందరిలాగా ప్రభావితులైన శ్రీ శ్రీనివాస్ కొత్తూరు గారికీ ఈ సంకలన బాధ్యతలను అప్ప చెప్పాము. ఇది ఒక యోగి ఆత్మ కథ లాగ ఆచార్యగారి ఆత్మ ప్రేరణను అందరికీ ఒక లక్ష్యాన్ని ఇచ్చి, విజేతలుగా నిలుపుతాయని నమ్ముతూ ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నాము.

**రాధాకృష్ణ (ఆర్.కె)**

నా పేరు రాధాకృష్ణ, గత కొన్ని సంవత్సరాలుగా అట్లాంటాలో నివసిస్తున్నాను. నేను అమెరికా రాక ముందు కాలేజీలలో చదువుకునే రోజుల్లో పనీ పాటా లేక పిచ్చాపాటీ కబుర్లతో జీవితానికి ఒక లక్ష్యం లేకుండా తిరుగుబోతుగా ఉండే వాడిని. మా అన్న రవికృష్ణ ఆచార్యగారు "ఆఖరిసారిగా లీడ్ యూత్ క్యాంపు నిర్వహిస్తున్నారు ఈ అవకాశం జారవిడుచుకుంటే నువ్వు జీవితంలో చాలా కోల్పోతావు అని బలవంత పెట్టి పంపించారు.

మొట్టమొదటి సారిగా శిబిరంలో ఆచార్యగారిని చూడటం, ఆయన మాటలు వినడం, ఒక ఆయస్కాంతంలాగా వారి ప్రశాంత చిరునవ్వు నన్ను ఆకర్షించింది. వారు చెప్పిన ప్రతి మాట నా గుండెల్లో గూడు కట్టుకుంది. ఆ శిబిరంలో చెప్పిన అంశాలు చాలా చక్కనైన పూలదండలా అమర్చారు. ప్రత్యేకించి యువత కోరకు అల్లిన దండ అది. ఆ శిబిరం ద్వారా యోగా, మెడిటేషన్‌తో పాటు ఆరోగ్యానికి మనస్సుకూ, సమాజానికీ సంబంధించిన అంశాలు నన్ను ఆకట్టుకున్నవి. అప్పటి నుండి సమయం-పనిని జోడించి, ప్రణాళికా బద్ధంగా జీవించడం అలవాటు అయిపోయింది. అదే ఇప్పుడు అమెరికాలో జీవించుటకు ఒక ఆధారం


అయింది. ఆచార్యగారు నాకు చేసిన మేలు జన్మలో మరచిపోలేను. వ్రాతలో ఇంతకంటే ఎక్కువగా రాయలేను. సముద్రంలోతు ఎవరు తెలుసుకోగలరు. ఈ పుస్తకం మీరు చదివితే ఆచార్య గారి లోతు కొంత వరకైనా తెలుసుకోగలరు. వాటిని మీరు ఆచరించి ఆనందం పొందగలరు.

**బిందు అనుభవాలు :**



నా పేరు బిందు మిద్దెల. నేను గత 13 సంవత్సరాల నుండి అమెరికాలో లాస్ వేగాస్‌లో నివసిస్తున్నాను. నేను ఇంజినీరింగ్ చదువుతున్న రోజుల నుండి ఆచార్యగారి బాలభారతి శిక్షణ ద్వారా జీవిత విలువలు, నైపుణ్యాలను నేర్చుకున్నాను. ఆచార్యగారు చెప్పే కర్మము, ధర్మము, సిద్ధాంతాలను ఈ రోజుకి కూడా పాటిస్తున్నాను. నాకు ఎదురయ్యే సమస్యలను పరిష్కారం చేసుకుంటూ, ఒక గృహిణిగా, ఒక ఉద్యోగినిగా నా ధర్మార్థాన్ని నిర్వహిస్తూ సమాజం సేవకు యన్ఎస్ఎఫ్ అనే స్వచ్ఛంద సంస్థని స్థాపించి విరాళాలు సేకరించి ఇండియాలోని పేద పిల్లలకు సహాయం చేస్తూ, అమెరికాలో ఉన్న పిల్లలు పోటీతత్వంలో అభివృద్ధి చెందుటకు అనేక పోటీలు నిర్వహిస్తూ వుంటాను. ఈ కార్యక్రమాలు అన్నీ నాకు ఆనందాన్నీ, అవధులు లేని శక్తిని ఇస్తుంటాయి. ఆచార్య గారి గురించి చెప్తూ భవిష్యత్తులో కూడా నా జీవితం ఉన్నంత వరకు ఆచార్యగారి జీవితంలో అందరికీ ఉపయోగపడే అంశాలను క్రోడీకరించి ఈ పుస్తకం ప్రచురణ అవడం ఆనందంగా ఉంది. చదివే వారందరికీ కూడ ఇది ఉపయోగపడుతుందని నమ్ముతూ ప్రచురిస్తున్నాము.

# 8. ప్రకృతిలో మనిషి ఎంతో ప్రత్యేకం!




ప్రతి ఒక్కరి జీవితం, ఆలోచనలు, కోరికలు, పనులు, ప్రవృత్తులు, పరిస్థితులు, వారి చుట్టూ ఉండే మనుషులు, వారి ఆకారాలు, జీవన గమనం అన్నీ ప్రత్యేకమే.

ఈ జీవితాన్ని ఎవరు ఏ విధంగా అర్థం చేసుకుంటే, ఆ విధంగా జీవిస్తుంటారు.

ఏదీ మనతో బాటు తెచ్చింది లేదు. ఆఖరికి ఏదీ తీసుకుపోయేది లేదు. ఉన్నన్ని రోజులు జీర్ణించుకున్నంత పట్టెడు అన్నం తప్ప ఏమీ తినలేము, ఏమీ త్రాగలేము. వయసుని బట్టి ప్రకృతికి అందరూ తలవంచవలసిందే. అందరినీ నడిపించేవి ఒకే రకమైన ప్రకృతి ధర్మాలు.

మీ జీవనాన్ని కూడా ఒక ఆత్మకథలా వ్రాయవచ్చు. సినిమా తీయవచ్చు. అసలు జీవితం అంతరార్థం కూడా తమ కొరకు తాము జీవించడం కాదు. "పరోపకారార్థం ఇదం శరీరం" మనం ఈ శరీరం ధరించింది, జీవిస్తుంది కేవలం మన కొరకు, మన భార్య బిడ్డలు, మన కుటుంబం కొరకు మాత్రమే కాదు. మన కుటుంబం అనేక కుటుంబాలపైన, సమాజంపైన, దేశంపైన, ప్రపంచం పైన, ప్రకృతిపైన ఆధారపడి జీవిస్తుంది.

**ఈ ప్రకృతిలోకి ఎలా వస్తాము? ఎలా పోతాము?**

ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువు, ప్రతి ప్రాణి, ప్రకృతిలో నీరు,

భూమి, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలతో మాత్రమే నిర్మాణం అయింది.

ఈ శరీరంలో నుండి ప్రాణం వెళ్ళిపోయేటప్పుడు ఆఖరి శ్వాస గాలిలో కలసిపోతుంది. నవరంధ్రాలలో (కళ్ళు, ముక్కు, చెవులు, నోరు, మలమూత్ర ద్వారాల్లో) ఏ రంధ్రం ద్వారా ప్రాణం వెళ్ళి పోతుందో అక్కడ కొద్దిగా రక్తము, నీరు చిమ్మి నీటిలో కలసిపోతాయి. శరీరంలోని ఉష్ణం ఉష్ణోగ్రతతో కలసిపోతుంది. ఎముకలు కాల్చినా, పూడ్చినా భూమిలో కలసిపోతాయి. మిగతావి ఆకాశంలో కలసిపోతాయి.

పద్యం : చంచలంబగు జగతిలోన శాశ్వతంబొకటేదిరా ..
కన్ను మిన్ను కలిసేలోపల కలిమిలేములు మారురా..
రాజు రౌతు అనెడి భేదము బ్రతికిఉండే వరకురా
చచ్చిపోయి పోయేటప్పుడు వెంటరారు ఎవరురా..
"చంచలంబగు"

మంత్రులైనా, మాంత్రికులైనా, పండితులైనా, పామరులైనా, ధనికులైనా, పేదలైనా, ఏ మతం వారైనా, ఏ కులం వారైనా, కుక్కయినా, నక్కయినా, ఏనుగైనా, ఎలుకైనా అన్ని జీవితాలు పుట్టుట, జీవించుట, చచ్చుట అన్నీ వాటి వాటి ప్రకృతి ధర్మాల అనుసారంగా జీవించవలసిందే. కాని ఒక్క మనిషి మాత్రం తన మనసులోని కోరికలు, ప్రవృత్తులను బట్టి ప్రకృతి ధర్మాలకు అతీతంగా జీవిస్తుంటాడు.

**ఎలా జీవిస్తాం? భవిష్యత్తు నిర్మాణం ఎలా చేసుకుంటాం?**

ప్రతి ఆలోచన కర్మకు కారణమౌతుంది. ప్రతి మాట అవతలి వారి మనసుపై ప్రభావం చూపిస్తుంది. ప్రతి చేత మంచికో, చెడుకో దారి

తీస్తుంది. కళ్ళు తెరిస్తే ఆలోచనలు కోరికలై మాయలు చేస్తాయి. ఏ చర్య తీసుకున్నా ఋణగ్రస్తులను చేస్తుంది. కాబట్టి ఏమి చేసినా ధర్మంతో, జ్ఞానంతో చేయవలసిందే. నిన్నటి దానిపై నేడు, నేటి దానిపై రేపు కాలం గడుస్తుంటుంది. అలాగే గత జన్మ నుండి ఈ జన్మ, ఈ జన్మ నుండి మరో జన్మ మనం చేసుకుంటున్న చేతలను (కర్మ) బట్టి జరుగుతుంటాయి. అందుకే స్వామీ వివేకానందుడు "మీ కర్మ కు మీరే బాధ్యులు"అని చెప్పారు. ఇప్పుడు మానవులమైన మనం చనిపోయిన తరువాత 99% మళ్ళీ మానవులుగా జన్మించడం లేదని మన పురాణాలు చెబుతున్నాయి. మనం ఏ కోరికలతో జీవితాన్ని వదిలేస్తామో, ఆ కోరికలు నెరవేర్చే ప్రాణులుగా పుడతాము. వీటన్నిటికీ భగవంతుడు కేవలం సాక్షీభూతుడు. ఇక ఆచార్యగారి జీవితానికి వద్దాం.

ఆచార్యగారు చేస్తున్న నిరంతర పరిశోధనా ఫలితాలతో, శరీరం, మనసు, బుద్ధి, కారణజన్మ, ఆత్మ ఆంతర్యం మరియు అనేక ఇతర విషయాలపై లోతుగా అధ్యయనం చేశారు. వారి జీవితం మొత్తం వీటిని లోతుగా ప్రశ్నిస్తూ, పరిశీలిస్తూ, గ్రహిస్తూ, ధర్మం, జ్ఞానం, సముపార్జిస్తూ, ధర్మపరంగా యువతయే ఒక ప్రాణంగా, దేశమే ఒక ఊపిరిగా జీవిస్తున్నారు. మరి వారి ఆత్మకథ వ్రాసేది ఎవరు?

శ్లోకం: పలికెడిది భాగవతమట



పలికించు విభుండు రామభద్రుండట
నే పలికిన భవహరమగునట
పలికెద వేరొండు గాథ పలుకగనేల..?

అన్నట్లు ఇది వ్రాసేవాడు, వ్రాయించేవాడు, చదివించేవాడు –

అంతా ఆ ఆత్మారాముడే. ఆత్మారాముని ప్రవచనాల సముదాయమే ఈ సుదర్శనం.

ఈ జీవితం గురించి చదివిన వాళ్ళందరి జీవితాలూ ఉద్ధరించబడునుగాక!!

హరి ఓం తత్ సత్...

# 9. అపురూపం ఆచార్య జీవితం



## జన్మ ఒక గొప్ప వరం

వ్యక్తి జీవితానికి తల్లిదండ్రులు ఇచ్చే ఒక గొప్ప వరమే జన్మ. ఇక జీవితానికి మొదటి పునాది జ్ఞానం. వేసే మొదటి మెట్టు కుటుంబం. అక్కడి నుండి జీవితానికి ఎన్ని మెట్లు వేసుకుని ఎవరు ఎంత ఎత్తుకి ఎదుగుతారో అనేది ఆయా వ్యక్తులపై ఆధారపడి ఉంటుంది. కాని వ్యక్తి ఎదుగుదలపై కుటుంబం యొక్క ఎదుగుదల కూడా ఆధారపడుతుంది.

ఆచార్యగారి తాతగారి పేరు శ్రీ నల్లబోయిన వెంకయ్యగారు. కాని ఆయన సమాజంలో బట్టల వెంకయ్యగా గుర్తింపు పొందారు. బట్టల వ్యాపారం చేసే వారు. కనుక అందుకే ఆయనని "బట్టల వెంకయ్య" అనే వారు. ఆయన వ్యాపారం కొరకే చూడకుండా, కొనే వారి స్థితిగతులు గ్రహించి, వ్యాపారవేత్తగానే కాక ఒక మానవతావాదిగా మన్ననలు పొందారు. కాబట్టి అసలు ఇంటిపేరు మారిపోయి, ఆయనని బట్టల వెంకయ్య అని పిలిచేవారు.

ఆచార్యగారి నాన్న శ్రీ సత్తయ్య గారు కూడా బట్టల సత్తయ్యగా గుర్తింపు పొందారు. తండ్రినిమించిన తనయుడిగా తండ్రి మార్గంలోనే

నడిచారు. ఆయన ఎప్పుడూ సాధుసత్పురుషుల సాంగత్యంలో తిరిగేవారు. దాంతో తండ్రి పెట్టిన దుకాణం కాస్తా మూతబడి పోయింది. కొద్దిరోజుల్లో వారి తల్లిదండ్రులు చనిపోయినారు. ఉన్న ఒక్క చెల్లెలు పెంటమ్మగారిని వారి అమ్మమ్మగారి చెల్లెలు రంగమ్మగారు చేరదీసి శ్రీసిరిమిల్లా నారాయణగారితో వివాహం చేశారు. ఇక వారి నాన్న గారికి ఏ బాధ్యతలు లేక, అడిగేవారు, పట్టించుకునే వారు లేక, దేశద్రిమ్మరై ఎప్పుడూ భజనలు చేస్తూ సత్సంగాలలో తిరిగేవారు .

ఆయన ప్రతిరోజు ఏదో ఒకటి తిని ఎక్కడో ఒక చోట పడుకునేవారు. రంగవ్వగారు ఆయనను ఇంటికి తీసుకు వెళ్ళి, నలుగురినీ పిలిచి, ఈ విధంగా నడుచుకోవడం మంచిది కాదని నచ్చ చెప్పి తన దగ్గర ఉంచుకుంది.

ఆరోజుల్లో వారి బంధువు శ్రీ ముత్యాల వాసుదేవయ్య గారు నిజాం ప్రభుత్వంలో దివాన్‌గా పని చేసేవారు. వారు గొప్ప శ్రీమంతులు. వారు ఆచార్యగారి నాన్నగారిని ఇల్లరికం తెచ్చుకుని తమ ఏకైక పుత్రిక రంగనాయకమ్మగారితో వివాహం చేశారు. వారిద్దరినీ బోయీలు పల్లకిలో తీసుకెళ్ళేవారు. వారు అంతులేని భోగ భాగ్యాలతో చిలుకాగోరింకల్లా జీవించారు. కాని రెండు సంవత్సరాలలో రంగనాయకమ్మగారు వ్యాధిగ్రస్థులై మరణించారు. ఆ తరువాత ఆచార్యగారి నాన్నగారిని అత్తగారు వదిలేశారు. ఈ పరిస్థితుల్లో వారి నాన్నగారు సాధుసత్పురుషుల సాంగత్యం వైపు నడిచారు. మళ్ళీ రంగవ్వగారు, అత్త పెంటమ్మ గారు మరియు ఇతర బంధువులు వారి నాన్నగారిని తీసుకువచ్చి నచ్చచెప్పి, ఆచార్యగారి అమ్మగారు లక్ష్మీనర్సమ్మగారితో వివాహం చేశారు.

దీంతో వారు బట్టల దుకాణంలో ఉద్యోగానికి చేరారు. కుటుంబంలో ఉన్నా కూడా సాధుసత్పురుషులతో సహవాసం విడువలేదు. అప్పుడప్పుడు ఉద్యోగం మానేసి సాధువులతో పాటు వెళ్ళిపోయేవారు. వారిని ఇంటికి కూడా తీసుకుని వచ్చేవారు. చాలీచాలని జీతంతో ఆచార్యగారి అమ్మగారు వారందరికీ వంటావార్పు చేసి పెట్టేవారు. అమ్మమ్మ లక్ష్మమ్మ గారు, మేనమామలు కుడుముల బాలయ్య గారు, నరసింహంగారు ఆర్థికంగా అన్నిటికీ అమ్మగారి వెంట వుండి ఆదుకునేవారు. కాలం గడుస్తున్న కొలది అన్నీ సర్దుకుపోయినా, వారికి సంతానం లేదని బాధపడుతుండేవారు.

ఆచార్యగారి అమ్మ గారికి అప్పటికే 35 సంవత్సరాల వయసు వచ్చింది. ఇంకా సంతానం కలగలేదనే బాధ కుటుంబంలోని ప్రతి ఒక్కరిలోనూ కలిగింది. ఇక సంతానం కలగదనే నమ్మకంతో వారి నాన్నగారిని మరొక వివాహం కొరకు ఒప్పించారు. వారి తల్లిగారి బంధుగణంలో బంధువుల అమ్మాయి రాములమ్మగారితో వివాహం జరిపించారు. ఈసారి కూడా రెండు సంవత్సరాలు గడవకమునుపే ఆమె కూడా అనారోగ్యంతో అకస్మాత్తుగా తనువు చాలించారు.

**జన్మజన్మలకూ ఒక కారణం**



ప్రతి వారి పుట్టుక వెనకాల వారి తల్లి, తండ్రి, తాత, అవ్వ, ఆత్మీయుల ఆవేదన, ఆర్తితో కూడిన వారి శ్రమ, వారి పూజాఫలాలు రహస్యంగా దాగి ఉంటాయి. మరొక ప్రక్క ఆ బిడ్డ ద్వారా వారి కుటుంబానికి రాబోయే తరాలను అందించడం సమాజంలో తనదైన

పాత్రపోషించడం, ఈ సృష్టి నిర్వహణలో భాగం పంచుకోవడం జరుగుతుంది.

ఆచార్యగారి అమ్మ లక్ష్మీనర్సమ్మగారు, నాన్న సత్తయ్యగారు భగవంతుడి పై గట్టి నమ్మకం ఉంచి, సంతానం కొరకు ఆవేదనతో, ఆర్తితో భగవంతుడికి పరిపరి విధాలుగా ప్రార్థనలు చేసేవారు. వారు తిరగని గుడిలేదు, చేయని వ్రతం లేదు. ఎవరు ఎక్కడ ఏమి చెప్తే అక్కడ ఆ విధంగా చేసేవారు. ఆచార్యగారి అమ్మగారు తడి బట్టలతో 41 రోజులు "ఆంజనేయ స్వామి వ్రత దీక్ష" చేశారు.


ఆరుట్ల ఆంజనేయ స్వామికీ, బుగ్గల రామయ్య తండ్రికీ, కుల దైవం కృష్ణమూర్తికీ, ఇలవేల్పు యాదగిరి లక్ష్మీనర్సింహస్వామికీ, కేదార్‌నాథ్, బద్రీనాథ్, కాశీ విశ్వనాథ్, పూరీ జగన్నాథ్, మాతా వైష్ణోదేవి ఇలా ఎందరో దేవుళ్ళకు నిరంతరంగా ప్రార్థన చేయడమే వారి జీవితంగా మారిపోయింది. తనని నమ్ముకున్న భక్తులని భగవంతుడు ఆలస్యంగానైనా అనుగ్రహిస్తాడు.

"భగవాన్‌కే పాస్ దేర్ హై మగర్ అంధేర్ నహీ" అనేది వారి నమ్మకం.

భగవంతుడు ఏ విధంగా కరుణిస్తాడు? మనలాగా కనపడతాడా? మనలాగా మాట్లాడతాడా? ఏ విధంగా కనిపిస్తాడు-కటాక్షిస్తాడు? అనేది భక్తులు అర్థం చేసుకోవాలి.

**సాధురూపంలో ఇచ్చిన వరం**

ఒక రోజు ఆచార్యగారి నాన్న గారు ఉద్యోగానికి సైకిల్ పై బయలు దేరారు. చార్మినార్ దగ్గర ఒక సాధువు ఆయనను ఆపి "ఓ మహరాజ్!




నేను మీ ఇంటికి వస్తాను. నన్ను తీసుకువెళ్ళు" అని అన్నారు. అప్పుడు ఆచార్యగారి నాన్నగారు ఆశ్చర్య పడ్డారు, ఆనందపడ్డారు. "రండి స్వామీజీ... రండి" అని ఒక రిక్షాలో ఇంటికి తీసుకువెళ్ళినారు. వారు నివసించే శాలిబండ ప్రాంతం ఎత్తుగా ఉన్న ప్రదేశం కాబట్టి రిక్షా ముందుకు పోలేక స్వామిజీ దిగి నడవసాగారు. అలా వారు ముందుకు సాగుతుంటే వారి వెనుక ఇద్దరు, ముగ్గురు, ఐదుగురు, పదిమంది అలా పిల్లలు గుంపుగా వారి వెనుకే నడవడం మొదలుపెట్టారు. వారు ఇల్లు చేరుకోగానే, స్వామిజీ వెనక్కి తిరిగి "మీరందరూ ఇక వెళ్ళిపోవచ్చు" అని ఆదేశించారు. ఆ గుంపుల పిల్లలు ఏకకాలంలో అదృశ్యమయ్యారు.

ఆచార్యగారి నాన్నగారు స్వామీజీని ఇంటిలోకి తీసుకెళ్ళి, పూజగదిలో కూర్చోబెట్టి, పాద పూజ చేసి, పాలు వేడి చేసి ఇచ్చారు. వారి సేవలకు ఆనందించినస్వామీజీ "మీరు చాలా నమ్మకంతో సేవ చేశారు, నేను చాలా సంతోషించాను" అని, కళ్ళు మూసుకుని ప్రార్థించి, "దోసిలి పట్టండి" అని అన్నారు. "ఇదిగో! ఒక పండు ఇస్తున్నాను. ఇది భార్యాభర్తలు తినండి. ఒక సంవత్సరం లోపల భరత వంశం కీర్తి దశ దిశల చాటే గొప్ప కుమారుడిని కంటారు" అని పలికి ఆ పండు ఇచ్చి, ఆశీర్వదించి వెళ్ళిపోయారు.

**స్వప్నరూపంలో ఇచ్చిన వరం :**

అదే రోజు రాత్రి ఆచార్యగారి తల్లి గారు, తమ తల్లిగారి కుటుంబంతో



కలసి యాదగిరి గుట్టలో లక్ష్మీనర్సింహ స్వామికి పల్లకీ సేవలు చేసి, గర్భగుడి ముందర నిద్రపోయారు. తెల్లవారు జామున 3 గంటలకు లక్ష్మీనరసింహ స్వామి కలలో కనపడి

"నీవు చాలా సేవలు చేశావు. నీ వంశాన్ని తరింపజేసే ఒక పుత్రరత్నాన్ని సంతోషంతో ఇస్తున్నాను. నీ జన్మ ధన్యమయ్యింది" అని దీవించి అదృశ్యమయ్యారు. తెల్లవారిన తరువాత ఆచార్యగారి అమ్మనాన్నలు తమ అనుభవాలను పంచుకుని అనందంతో గగుర్పాటు పొందారు. అంతా ఆ లక్ష్మీనర్సింహస్వామి కటాక్షం అని ప్రార్థించి ఆ ఫలాన్ని భక్షించారు. సరిగ్గా సంవత్సరంలోనే 28 డిసెంబర్ 1949న వారికి ఆచార్యగారు జన్మించారు.

**బిడ్డ పుట్టిన సంబరాలు - మరువలేని మురిపాలు**



బిడ్డ పుట్టిన వెంటనే తల్లి, తండ్రికి తోడుగా, అండగా, అమ్మమ్మ గారు, అత్తగారు, ఇతర ఆత్మీయ బంధుమిత్రులు సంబరాలు చేసుకుంటారు... సహాయం పడుతుంటారు. మరువలేని మధురఘట్టాలుగా మళ్ళీ మళ్ళీ తలచుకుంటారు.


అమ్మ నాన్నల ఆరాటం, సంతానం లేని పరితాపం గమనిస్తున్న బంధువులందరూ ఏక కాలంలో ఆచార్యగారి అమ్మానాన్నల దగ్గరకు చేరుకున్నారు. గొప్పగా సంబరాలు జరుపుకున్నారు. ఆచార్యగారు జన్మించిన రాత్రి వారి వీధిలో వారి తండ్రిగారు చెప్పించిన 41వ

హరికథ నడుస్తుంది. భక్తులందరూ భగవన్నామ స్మరణలో తాదాత్మ్యం చెందారు. సామూహికంగా భగవంతుడికి ధన్యవాదాలు తెలిపారు.

వారి అమ్మమ్మగారు, పెద్దమ్మ గారు, మేనత్త గారు అందరూ ఒక వైపు అండగా నిలిచారు. ఆచార్యగారి అమ్మ నాన్న ఉంటున్న ఆ చిన్నపాటి వాడలో ఆ అర్ధరాత్రి అందరూ గుమిగూడి వారివారికి తోచిన తీపి మిఠాయిలు పంచుకున్నారు. సంతోషంతో కేరింతలు కొట్టారు, పాటలు పాడారు. ఆనందంగా భగవంతుడిని అనేక రకాలుగా ప్రార్థించారు. శిశువును పోషించుటకు తమ తమ సలహాలు, సహకారాలు అందించడం ఆనవాయితీ. ఊయలలోని శిశువు మోములో చిరునవ్వులు, కళ్ళచూపుల మెళకువలు చూసిన అందరూ "చిన్ని కృష్ణయ్య! మా వాడకి వచ్చాడయ్యా!!" అని పాటలు పాడుకున్నారు. ఆ పసికందు నడిచి, నడయాడే వరకు ఎక్కడ తింటున్నాడు? ఎక్కడ తిరుగుతున్నాడు? ఎక్కడ ఉంటున్నాడు? అనేది ఎవరికీ తెలిసేది కాదు.

అందరూ ఒక కుటుంబంలా "ఈ చిన్ని కృష్ణ నావాడంటే నావాడం"టూ పోటీపడుతూ లాలించి, పాలించేవారు. అందులో శ్రీ జయశంకర్ పూజారిగారు రోజూ ఆచార్యగారిని హనుమంతుడి గుడికి తీసుకెళ్ళి సింధూరం పెట్టే వారు. భజనలు చేయించేవారు. కుంటి బాలమ్మ ఆచార్యగారికీ, వారి తల్లిగారికీ కావలసిన ఆహార విషయాలన్నీ చూసుకునేవారు. స్నానపానీయాలు సమకూర్చేవారు. ఇంట్లో అన్ని జాగ్రత్తలు తీసుకునేవారు. బడికి పంపించే వరకు ఈమె బ్రతికి ఉన్నన్నాళ్ళు ఎనలేని సేవ చేశారు. వారు మరువలేని మాతృమూర్తి .

**నామము - జీవితంలో దాని ప్రభావం**



ఒక బిడ్డ పుట్టిన జన్మ నక్షత్రాన్ని బట్టి, ఏ పేరుతో భవిష్యత్తు బాగుంటుందోనని, జన్మ నక్షత్రాలతో కూడిన అక్షరాలతో పేరు పెట్టాలని, అందమైన పేర్ల జాబితాను తయారు చేస్తారు. బంధుమిత్రులను కూడా సంప్రదిస్తారు. తల్లి వైపువారు, తండ్రి వైపు వారు ఏ పేరు కలిగిన దైవాన్ని ఆరాధిస్తారో, ఏ పేరుతో వారి పెద్దలు గొప్పగా ఎదిగారో, ఏ పేరుతో ఏ రకమైనటువంటి ప్రభావం కలిగిందో అని అనుభవాలను పంచుకుంటారు. అందంతో ముడిపెట్టి అందమైన పేరు అందరూ కలసి ఎంచుకుంటారు. భారతీయ సంస్కృతిలో ఏ పేరు పెట్టినా వాళ్ళు వాళ్ళ పూర్వీకులు ఆరాధించుకుని సముపార్జించుకున్న దైవబలం ఆ పేరు వెనకాల ఉన్న దైవశక్తిని ప్రేరేపిస్తుంది. ఇవన్నీ కూడా ఆ బిడ్డకు శక్తిని సమకూరుస్తాయి. బంగారు భవిష్యత్తుకి బాటలు వేస్తాయి.

ఉదా: శ్రీనివాసుడు అని పేరు పెట్టుకున్నప్పుడు ఆ కుటుంబంలో ఉన్న వారందరూ ఏడుకొండలవాడిని ప్రార్థించి సముపార్జించుకున్న బలం ఆ బిడ్డకు వస్తుంది. కృష్ణయ్య అని పెట్టుకున్న పేరు ఆ కుటుంబంలోని వారు ఏ శ్రీ కృష్ణుణ్ణి ఆరాధించారో, ఆ బలం అంతా "కృష్ణయ్య" కు చేకూరుతుంది. ఆచార్యగారికి "సుదర్శన్" నామం వారి తండ్రిగారు చేసుకున్న పూజలు, ప్రత్యేకించి ఈ రోజుకూ వారి కుటుంబం, పాఠశాలలో జరుగుచున్న శ్రీ కృష్ణాష్టమికి ప్రత్యేక వేడుకలు, గీతా జయంతీ, గీతా పోటీలు, గీతా జ్ఞాన యజ్ఞములు ప్రతిదీ వారికి శక్తిని సమకూరుస్తుంటాయి.

వాటికి తోడుగా, ఆచార్యగారు ప్రతిరోజూ చేసుకుంటున్న శ్రీ సుదర్శన మహామంత్ర జపం ఆయనకు అనంతమైన దైవశక్తిని ఇస్తున్న  స్వీయ అనుభవం. వాస్తవంగా వారి తాత ముత్యాల వాసుదేవయ్య గారు, ఆచార్యగారు పుట్టక పుట్టక పుట్టిన సంతానం కాబట్టి  జగతికి సేవ చేస్తూ తరించాలని “జగత్ దాసు” అని పేరు పెట్టారు. వారి ఆశీస్సులతో ఆచార్య గారిచే ఈనాడు లీడ్ ఇండియా ఉద్యమం ద్వారా భగవంతుడు జగత్ సేవ చేయించుకుంటున్నాడు.

**జ్యోతిషం ఎంత వరకు నిజం అవుతుంది?**

భారతీయ శాస్త్రాలలో జ్యోతిష శాస్త్రం కూడా ఒకటి. మన పూర్వీకులు నేర్పినట్లుగా, వ్యక్తి  జీవన విధానంలో పంచాంగ శాస్త్రం కూడా  ముఖ్యమైన పాత్ర పోషించేది.  కాలంలో జరుగుతున్న  తిథి, వార, నక్షత్రాలు, మాసాలు, సంవత్సరాలు, ఆయనాలు వీటిన్నిటినీ బట్టి, జన్మనక్షత్రాలనుబట్టి,  చేయవలసిన పనులను బట్టి  ముహుర్తాలు నిర్ణయిస్తుంటాము. ఈ లెక్కలు వేసే జ్యోతిష్కుణ్ణి బట్టి కూడా ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

ఆచార్యగారి తండ్రిగారు గొప్పగా చదవకపోయినా మంచి చదువరి. సాధుసత్పురుషుల సహవాసంలో జ్యోతిషం  కూడా  నేర్చుకున్నారు. వారి మిత్రులైన జ్యోతిష్కులు ఆచార్యగారు  గొప్పగా చదువుతారనీ, నలుగురి  మన్ననలను పొందుతారనీ, చక్కగా వృద్ధిలోకి వస్తారనీ, తమకి తాముగా వారి వారి ధోరణిలో వివరాలను ఇచ్చారు. ఆచార్యగారి తండ్రిగారు వాటినన్నిటినీ విశ్లేషించి, వారితో చర్చించి, ఆచార్యగారి జాతకాన్ని సవివరంగా వ్రాశారు. దాదాపు వారు వ్రాసినట్లుగానే వారి జీవితంలో

సంఘటనలు జరిగినాయి. ఆచార్య గారు కొన్ని ముఖ్యమైన శుభకార్యాలను తండ్రి పెట్టిన ముహుర్తాల ఆధారంగా చేసే వారు. అంతేకాకుండా, ఆచార్య గారి 50 సంవత్సరాల వయసు వరకు జాతకం వ్రాశారు. ఆ తరువాత వారు ఒక గురువుగా మారతారని వ్రాసి ఆపేశారు. ఈ విషయాలు సరిగ్గా అలాగే జరిగాయి. ఆచార్యగారు తమ 50వ ఏట 1999లో మానవతావిలువలు (హ్యూమెన్ వ్యాల్యూస్) లో పి.ఎచ్.డి అందుకున్నారు. మానవతావిలువలపై ఈ పరిశోధన దేశంలోనే మొదటిది. తండ్రిగారు వ్రాసినట్లుగా ఇది వారి జీవితానికి ఒక గొప్ప మలుపుని ఇచ్చింది. అక్కడ నుండి ఆచార్య గారు వేసవిలో చేసే బాలభారతి కార్యక్రమాలు, లీడ్ ఇండియా కార్యక్రమాలుగా దేశవ్యాప్తంగా విస్తరించి "ఆచార్యగా" ప్రసిద్ధి చెందారు. మరిన్ని వివరాలు ముందు ముందు మనమే తెలుసుకుందాం.

**ప్రమాదం నుండి ఎలా తప్పించబడతాము**

తాత ముత్యాల వాసుదేవయ్య గారు స్వర్గస్థులైన పిదప దశదిన సంస్కారానికి ఆచార్యగారు వారి తల్లిదండ్రులతో కలిసి మూసీనది పరీవాహక ప్రాంతంలోని స్మశాన వాటికకు చేరుకున్నారు. ఆచార్య గారి తండ్రి గారు శాస్త్రోక్తంగా అస్తికలను మూసీ నదిలో కలుపుతున్న వేళ. బంధువులు గుంపులు గుంపులుగా కూర్చుని పలు విషయాలు చర్చించుకుంటున్నారు. బాలుడైన ఆచార్యగారిని తల్లిగారు ఎత్తుకుని ఒక బావికి ఆనుకుని మాట్లాడుతూ కూర్చున్నారు. ఆమెకు తెలియకుండా ఆచార్య గారు ఆమె భుజాలపైకి ఎక్కి, చేదబావి మధ్యలో ఉన్న గిలకను అందుకుని, నవ్వుతూ అటూ ఇటూ ఊగుతున్నారు. ఆ సమయంలో

ఆచార్యగారు బావి గిలకను వదిలినచో నేరుగా బావిలోనికి పడే ప్రమాదం ఉంది. అక్కడ ఉన్నవాళ్ళందరూ ఆ దృశ్యాన్ని చూసి భయాక్రాంతులై, ఏ విధంగా రక్షించాలి అని ఆలోచించారు. ఆ సమయంలో ఒక అజ్ఞాత వ్యక్తి చప్పుడు చేయకుండా అమాంతం ఆచార్యగారిని వెనుక నుండి పట్టుకుని వారి తల్లిగారికి అందించారు. వారి తల్లిగారికి ప్రాణం తిరిగి వచ్చినట్లు అనిపించింది.

"అమ్మా! పిల్లవాడికి ఆ భగవంతుడే జలగండం తొలగించాడు" అని అక్కడ ఉన్నవాళ్ళందరూ అన్నారు.

**సహాయం తీసుకున్నవారు నేరం చేయగలరా?**

ఆచార్యగారి తండ్రిగారు తమ దగ్గరి బంధువుల్లో ఒక కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించి, వివాహాలు చేసి తండ్రిలేని కొరతను తీర్చారు. ఆచార్యగారు పుట్టిన తరువాత ఆ కుటుంబ సభ్యులిద్దరూ ఈర్ష్యతో ఒకరోజు ఆచార్యగారిని ఎత్తుకు పోయారు. మూత్రం రాకుండా ఒక కరెంటు తీగని చుట్టి ఇంటిలో దింపి వెళ్ళిపోయారు. కొంత సేపటికి మూత్రం రాక కడుపు ఉబ్బి, శరీరం నల్లబడుతుండడం గమనించిన ఇంట్లోవారు ఆ కరెంటు తీగని తీసే ప్రయత్నం చేశారు. కాని ఎవరూ ఏమీ చేయలేక అందరూ ఆందోళన చెందసాగారు. వాడంతా కలసి "ఏమి చేయాలి? ఎలా చేయాలి?" అని తర్కించుకున్నారు. వెంటనే పూజారి శ్రీజయశంకర్‌గారు ఆచార్యగారిని ఎత్తుకుని డా॥వి.ఎన్. వాగ్రే, ఎఫ్. ఆర్.సి.ఎస్ (లండన్)గారి వద్దకు తీసుకువెళ్ళారు. "వైద్యో నారాయణో హరిః" అన్నట్లు ఆయన జాగ్రత్తగా ఆ వైర్‌ని కత్తిరించి ప్రమాదం నుండి బ్రతికించారు.

ఈ విధంగా ఆచార్యగారి జీవితంలో ప్రతి ప్రమాదం నుండి, ఎన్నో భయంకరమైన ప్రాణాపాయాల నుండి భగవంతుడు ఏ విధంగా కాపాడాడో ముందు ముందు ఇంకొన్ని చిత్ర విచిత్ర విషయాలు చదువుతాము.

**జీవితానికి బాల్య దశలో పడే పునాదులు**

బాలలు ఏ విధమైన కుటుంబ వాతావరణంలో పెరుగుతారో, వాళ్ళ భావి జీవితం ఆ విధంగానే మారుతుంది. ఎక్కడ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు భక్తి తత్పరతతో సాంప్రదాయబద్ధంగా ఉంటారో, వారి పిల్లలు భక్తి తత్పరులై సజ్జనులవుతారు. ఎవరైతే ప్రేమ పూర్వక వాతావరణంలో ఉంటారో, పరస్పరం ఏ మర్యాదలతో సహజీవనం చేస్తారో, పిల్లలు పెద్ద అయ్యాక ఆ మర్యాదలు కొనసాగిస్తారు. ప్రేమ పూర్వకంగా జీవిస్తారు. ఏ తల్లిదండ్రులు పిల్లల ముందు విమర్శించుకుంటారో, అమర్యాదగా ప్రవర్తిస్తారో, ఆ ఇంటి పిల్లలు విమర్శకులౌతారు. పోరాటం బాట పడతారు. ఏ పిల్లలను తల్లిదండ్రులు గారాబంగా, వాళ్ళు ఏమీ కష్టపడకుండా అన్ని వారికి సమకూరుస్తారో, వాళ్ళు పెద్ద అయిన తరువాత వారి పని వారు చేసుకోలేక ఇతరులపై ఆధారపడుతారు. అసమర్థులుగా మారడానికి అవకాశం ఉంటుంది. ఏ పిల్లలైతే చిన్ననాటి నుండి ప్రొద్దున్నే నిద్రలేచి కష్టించి పని చేసుకుంటారో, వారు జీవితంలో ఏ పోటీనైనా ఎదుర్కొని విజయం సాధించగల్గుతారు.

ఆచార్యగారి తండ్రిగారు ఆచార్యగారిని తెల్లవారు జామున నిద్రలేపేవారు. రాత్రి నానబెట్టిన బాదం పలుకులను సాన పీటపైన పాలుగా నూరి ఇచ్చేవారు. శాలిబండ నుండి లాల్ దర్వాజ వరకు 1.5 కి.మీ రన్నింగ్ చేయించేవారు. అక్కడ శ్రీ హనుమంతరావు అనే హిందీ

పండిట్‌గారి దగ్గర భగవద్గీత నేర్పించడానికి పంపేవారు. ఇద్దరూ మళ్ళీ పరుగెత్తుతూ ఇంటికి వచ్చే వారు. పాలు, గ్రుడ్లు త్రాగే వారు.

ఆచార్యగారి తండ్రిగారు అఖిల భారత యాదవ సంఘ సభ్యులుగా నిరంతరం సేవ చేసేవారు. 126 మంది వధూవరులకు వివాహం జరిపించారు. ప్రతి శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆచార్యగారితో గీతా శ్లోకాలు చదివించేవారు. ఉపన్యాసాలు ఇప్పించేవారు. తరువాత ఆచార్యగారు గీతా యజ్ఞములలో పాల్గొనేవారు. చిన్మయ యువ కేంద్రానికి అధ్యక్షులుగా పనిచేశారు. చిన్మయానంద స్వామీజీకి అత్యంత ప్రీతిపాత్రులైనారు. వారి జీవితంలో గీత సత్యాన్వేషణగా మారింది.

**పరిశీలనాతత్వం పరిశోధనకు దారి తీస్తుంది**



ఆచార్యగారు ప్రతి ఆదివారం తమ తల్లిగారి దగ్గర అణాపైసలు అడిగి తీసుకుని, చిన్న సైకిల్ అద్దెకు తీసుకుని శాలిబండ నుండి ఈది బజార్ వరకు సుమారు 4-5 కి.మీ సైకిల్‌పై తమ మేనత్త సిరిమెల్లా పెంటమ్మగారి దగ్గరకు వెళ్ళే వారు. ఆమె ఆచార్యగారికి ప్రత్యేక వంటకాలు చేసి ప్రేమతో తినిపించి, కావలసినవన్నీ ఇప్పించి పంపించేవారు. ఇలా ప్రతి ఆదివారం సాగే ఈ ప్రయాణంలో వచ్చేటప్పుడు, పోయేటప్పుడు కొత్తదారులు అన్వేషించాలి అని ఒక కుతూహలం కలిగి, ఆచార్యగారు ఒక దాని తరువాత ఒకటి పాతబస్తీలో ఉన్న వీథులన్నీ తిరిగారు. మరి కొద్ది రోజుల్లోనే క్రొత్తపట్నంలోని వాడలనన్నిటినీ కూడా తిరిగి చూశారు. ఈ క్రొత్త

వీధులను అన్వేషించే కుతూహలం వలన జీవితంలో ప్రతిదాన్నీ పరిశీలించే తత్వం అలవడింది.

**మొదటి సంపాదనే ఒక మైలు రాయి**

మొట్టమొదటి సారి చేసే ఉద్యోగం, వచ్చిన సంపాదన, వివాహం, ప్రయాణం ఇలా అన్నీ జీవితంలో మధురస్మృతులుగా మిగిలిపోతాయి. ఆచార్యగారు హైదరాబాద్ పాత పట్టణంలో ప్రముఖమైన వెంకట్రావ్ మెమోరియల్ హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నప్పుడు ఒక రోజు వారి పాఠశాల నెలవారీ రుసుం కట్టే విషయంలో వారి తల్లిదండ్రులు వాదించుకున్నారు. ఆ దృశ్యం హృదయాన్ని కదిలించింది. వారు మళ్ళీ ఆవిధంగా తగువులాడకుండా ఉండాలంటే ఏమి చేయాలని ఆచార్యగారు ఆలోచించారు. వెంటనే వారుండే వాడలో హనుమంతు అనే 3వ తరగతి అబ్బాయికి ట్యూషన్ చెప్పడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. మరుసటి నెల నుండి వారి పాఠశాల రుసుం వారే కట్టుకున్నారు. అప్పటి నుండి మొదలుపెట్టిన ట్యూషన్స్ దాదాపు 25 సంవత్సరాల పాటు తాము ఎం.బి.ఎ చదువుతూ బి.కాం విద్యార్థులకు ట్యూషన్స్ చెప్పారు. దీనితో బోధించే ప్రవృత్తి వారిలో దాగిన అధ్యాపకుడిని వెలికి తీసింది.

**పరిస్థితులు నేర్పే ధైర్య సాహసాలు**

ఆచార్యగారు ఏ కష్టాన్నైనా ఎదుర్కొనే ధైర్య సాహసాలను పెంపొందించు కోవడానికీ, ఆత్మ రక్షణకూ కృష్ణ పహిల్వాన్ దగ్గర కర్రసాము, కత్తి సాము నేర్చుకున్నారు. అవి వారి జీవితంలో గొప్ప ధైర్యాన్ని అలవర్చాయి. నిజ జీవితంలో ఎన్నో కఠిన సందర్భాలను ఎదుర్కోవడానికి ఉపయోగపడ్డాయి. వారి ఇంటికి ప్రక్కవారి ఇంటి మధ్యన

మెయిన్ రోడ్డును ఆనుకుని 29 గజముల ప్రభుత్వ స్థలాన్ని వారి తండ్రి గారు ప్రభుత్వం నుండి కొన్నారు. ఆ స్థలంలో ఇల్లు కట్టడానికి అనుమతి తీసుకుని కడుతుంటే, ప్రక్కవారు ఈ స్థలం ఒక మతస్తులకు చెందినదని, ఆ మతస్తుల ద్వారా ప్రతిసారీ సమస్య సృష్టిస్తుండేవారు. ఈ సమస్యను బాల ఆచార్యగారు గమనిస్తూ దాదాపు 10 సంవత్సరాలు భరిస్తూ వచ్చారు. ఉద్యోగం రాగానే ఆచార్యగారు ఈ సమస్యను ఒక సవాలుగా తీసుకుని, ప్రభుత్వ అనుమతి తీసుకుని, మిత్రుల సహాయంతో రాష్ట్ర పోలీస్ ఉన్నత అధికారులకి ఆ విషయం ముందే వివరించి, సహాయం సిద్ధం చేసుకున్నారు. దానికి తోడుగా వారి స్నేహితుల బృందంతో ఈ సమస్యని శాశ్వతంగా పరిష్కరించడానికి తయారై నిర్మాణం ప్రారంభించారు. యథాతథంగా ప్రక్క ఇంటివారు గోల చేయడం ప్రారంభించారు. స్థానిక ఎం.ఎల్.ఎ. మరియు ఎం.పి.లు 40-50 మందితో వచ్చి నిర్మాణాన్ని ఆపడానికి ప్రయత్నం చేశారు. స్థానిక పోలీసులు కూడా నిర్మాణం ఆపాలని ఆదేశించారు. ఆచార్యగారు ససేమిరా ఆపనని తేల్చి చెప్పి, అనుమతి పత్రాలని చూపించారు. పథకం ప్రకారం రాష్ట్ర ఉన్నత పోలీస్ అధికారుల చేత స్థానిక పోలీసులకు చెప్పించారు. దాంతో వారు ఆచార్యగారి రక్షణ కొరకు ఒక పటాలం పోలీసులను నిర్మాణం పూర్తి అయ్యే వరకు అక్కడే ఉంచారు. అప్పటి నుండి ఆచార్యగారికి ఆ ప్రాంతంలో ఒక గుర్తింపు వచ్చింది.

**భయం పెనుభూతం - దాని తొలగించే ధైర్యం**

లెక్కలంటే ఆచార్యగారికి తెగని భయం. ఎప్పుడూ రెండంకెల కంటే ఎక్కువ మార్కులు వచ్చేవి కావు. లెక్కల తరగతి రాగానే భయంతో

బల్లల క్రింద దాక్కునే వారు. 7వ తరగతిలో ఉత్తీర్ణులై, 8వ తరగతిలోకి అడుగు పెట్టగానే లెక్కల మాస్టర్ శ్రీ బి.వి.రమణారావుగారు పరిస్థితి మొత్తం గమనించారు. బడి తరువాత ప్రతిరోజూ తమతో పాటు ఆచార్యగారిని తన ఇంటికి తీసుకెళ్ళేవారు. ఇంటికి వెళ్ళగానే వారి భార్య మంచి అల్పాహారం ఇచ్చేవారు. ఆ తరువాత మాస్టర్‌గారు తమ ప్రక్కన కూర్చోబెట్టుకుని కూడికలు, గుణకారాలు, భాగహారాలు నేర్పించి ఆచార్యగారిలో ఉన్న భయాన్ని తొలిగించారు. బాగా అభ్యాసం చేయించి, ఆసక్తినీ, అద్భుతమైన పిపాసనూ పెంచారు. ఆ తరువాత ఆచార్యగారు నూటికి నూరు మార్కులు తెచ్చుకోవడం ఆనవాయితీగా మారింది. ఆచార్యగారు నాలుగు అంకెలలో ఉండే సంఖ్యలను ఏకకాలంలో కూడే అద్భుత ప్రతిభ పెరుగుటకు కారకులై. జీవితంలో మరచిపోలేని ఉపాధ్యాయులు అయ్యారు.

**ఆశ నిరాశ అయిన ఆలోచన పని చేయదు.**


ఆచార్యగారు 1965లో హైయర్ సెకండరీ(హెచ్ఎస్‌సి)లో తమతో పాటు చదివే 12 మంది మిత్రులకు ట్యూషన్స్ చెప్పారు. మరునాడు లెక్కల పరీక్షకు సిద్ధం అవుతుండగా రాత్రి 12 గంటలకు ఒక మిత్రుడు పేపర్ అందించి "నగరంలో రేపటి లెక్కల పేపర్ లీక్ అయ్యింది. ఇదిగో ఇదే. ఈ పేపరే వస్తుంది" అని పేపర్ ఇచ్చి వెళ్ళాడు. ఇక అన్నీ మానేసి ఆచార్యగారు ఆ పేపరును వారందరి చేత సాధన చేయించారు. ఈలోపు రాత్రి 2 గంటల సమయంలో మరో మిత్రుడు మరో పేపర్ లీక్ అయ్యిందని ఆ పేపరే వస్తుందని ఇచ్చి వెళ్ళాడు. కథ మళ్ళీ మొదటికి వచ్చింది. ఇక ఆ పేపర్‌ని పట్టుకుని, ఉదయం 7

గంటల వరకు కుస్తీ పట్టారు. తయారై ఉదయం 9 గంటలకు పరీక్ష హాలుకి వెళ్ళారు. ప్రశ్నపత్రం చదివే సరికి అంత పరిశ్రమ చేసిన పేపర్లలో నుండి ఏ ఒక్కటీ రాలేదు.

అన్ని ప్రశ్నలూ క్రొత్తవి. ఏ ప్రశ్న అర్థంకాక, ఆలోచన పని చేయక, భయం కమ్ముకుని వళ్ళంతా చమటలు పట్టాయి. నిస్సహాయ స్థితిలో బల్లపైనే ఒరిగిపోయారు. సమయం గడిచిపోతోంది. ఇంతలో వారి హిందీ ఉపాధ్యాయులు శ్రీ పి. సుబ్బారావు గారు పర్యవేక్షణకై వచ్చారు. ఆచార్యగారిని తట్టి లేపారు. ఆచార్యగారు వారికి పరిస్థితి అంతా వివరించారు. అప్పుడు ఆయన "ఆబ్జెక్టివ్ టైప్‌లో సహాయం చేస్తాను. ధైర్యం తెచ్చుకుని మళ్ళీ ఒక్కసారి చదువు, చేయగలిగినంతా చెయ్యి"మని ధైర్యాన్ని ఇచ్చారు. ఆచార్యగారు మెల్లగా లేచి ఒక్కొక్క ప్రశ్నను తిరిగి చదివి అర్థం చేసుకున్నారు. ఆపైన లెక్కలు చేయడం మొదలు పెట్టారు. సమయం అయిపోయే సరికి చేయవలసిన ఆరు ప్రశ్నలకే కాకుండా మొత్తం 9 ప్రశ్నలకు జవాబులు వ్రాశారు. ప్రశ్నపత్రంలో ఉన్న తప్పులను ప్రత్యేకంగా గుర్తించారు. వారి దగ్గర చదివిన 12 మంది విద్యార్థులలో 10 మంది ఉత్తీర్ణులు అయినారు. ఆనాటి ఆచార్యగారికి తెలిసిన నీతి విజయాన్ని సాధించడానికీ, గమ్యాన్ని చేరడానికీ కష్టమైనా సరే, సత్యమైన మార్గమే సరైన మార్గం అని.

**పట్టుదలతో పరిశ్రమిస్తే అసాధ్యం ఏదీ లేదు**

నిరంతర అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో ఆచార్యగారు తమ సహ విద్యార్థులలో ఉన్నత శ్రేణికి చెందినవారితో స్నేహం చేసే వారు. వారి కుటుంబ సభ్యునిగా మారే వారు. కానీ, వారు ఇంగ్లీష్‌లో మాట్లాడుతుంటే




మాట్లాడలేక, కొన్నిసార్లు పది మందిలో చులకన భావానికి లోనయ్యేవారు. దాంతో ఎలాగైనా పట్టుబట్టి 'ఇంగ్లీష్ నేర్చుకోవాలి' అని సంకల్పం చేసుకున్నారు.

1965లో హెచ్.ఎస్.సి. పబ్లిక్ పరీక్ష వ్రాయగానే వేసవి సెలవులలో మే, జూన్ రెండు నెలలు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు భోజన విరామం తప్ప భారత్ గుణవర్ధక సంస్థ, శాలిబండ గ్రంథాలయానికి వెళ్ళే వారు. రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన " గీతాంజలి " అనే పుస్తకానికి నోబుల్ బహుమతి ఎలా వచ్చింది అని ఆలోచించి, దానినే చదవాలి అని ప్రారంభించారు. అందులోని ఉన్నతమైన ఆంగ్ల పదాల భావం సరిగ్గా అర్థమయ్యేది కాదు. అక్కడే డిక్షనరి (నిఘంటువు) తీసుకుని తెలియని ప్రతి పదానికీ స్పెల్లింగ్ నేర్చుకుంటూ, వ్రాసుకుంటూ అర్థం చేసుకునేవారు. రాత్రి ఇంటికి వచ్చి ప్రతి పదాన్నీ ఉపయోగించి ఐదు వాక్యాలను వ్రాసేవారు. ఈ విధంగా ఠాగూర్ వ్రాసిన పోస్టాఫీస్, రెక్, గార్డెనర్ ఇత్యాది పుస్తకాలు చదివి, ఠాగూర్ ప్రబోధించినట్లు "వేర్ ద మైండ్ ఈస్ విత్ అవుట్ ఫియర్ అండ్ ది హెడ్ ఈస్ హెల్డ్ హై" అంటే ఎక్కడ మనసులో నుండి భయం తొలగిపోతుందో, అక్కడ తల గర్వంగా ఎత్తుకుని తిరగగలుగుతాం" అనే సిద్ధాంతం జీర్ణించుకున్నారు. అదిగో! అదే ఆచార్య గారి జీవితాన్ని అద్భుతంగా నడిపిస్తున్న అసలు రహస్యం.

**గ్రామాల నుండి నేర్చుకున్న పాఠాలు**


ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో వారి అమ్మమ్మ గారి గ్రామం కొంగర రావిర్యాలకు వెళ్లడం ఆచార్యగారి అలవాటుగా మారింది. ప్రొద్దున లేవగానే వారి బావ మరిది సత్తయ్యగారితో ఆవులు కాయడానికి చెట్లు గుట్టలతో నిండిన అడవులకి వెళ్ళేవారు. వాళ్ళందరికీ ఆచార్యగారు ఒక చెప్పలేని ఆకర్షణ.

ఒక రోజు ఆచార్యగారికి మిట్టమధ్యాహ్నం దాహం వేసింది. ఆ గుట్ట చుట్టు ప్రక్కల ఎక్కడా నీళ్ళు కనిపించలేదు. ఒక చోట నాచుతో కూడిన నీళ్ళ చెలమ ఒకటి కనిపించింది. "ఆ నీళ్ళే త్రాగాలి. మరో మార్గం లేదు" అని వారి బావమరిది అన్నారు. "అవి అనారోగ్యంతో జబ్బులు కలిగిస్తాయి. నేను త్రాగను" అన్నారు ఆచార్యగారు. రెండు గంటలు ఆగారు. కానీ మరే మార్గమూ కనిపించలేదు. వారి బావమరిది ఎంతగానో బ్రతిమిలాడారు. "ఏమీ కాదు, నేను చేసినట్లు చెయ్యి" అన్నారు సత్తయ్య గారు. భుజం మీద ఉన్న తుండుగుడ్డ తీసి ఆ నీళ్ళపైన వేసి నోటితో నీళ్ళను పీల్చి త్రాగారు. ఆచార్యగారు చాలా సేపు ఆలోచన చేశారు. ప్రతిఘటించారు. కానీ తప్పనిసరై అలాగే చేశారు. ఈ విధంగా ఆచార్యగారు పశు కాపరులతోపాటు నీళ్ళు త్రాగారు.

ఆ క్రమంలో గ్రామీణ వాతావరణాన్ని బాగా అర్థం చేసుకున్నారు ఆచార్య గారు. వ్యవసాయం కూడా చేశారు. బావిలో నీళ్ళు త్రాగే బొక్కెనలు లాగారు. నాగళ్ళతో భూమిని దున్ని, విత్తనాలు వేశారు. పంటకు నీటిని పంపించే సాగు నేర్చుకున్నారు. పంట పండించిన తరువాత కోతలు కోయడం, ధాన్యం వేరుచేసి, ఆ ధాన్యాన్ని బస్తాలలో నింపి,

మిల్లుకు పంపించి అక్కడ వాటిని బియ్యం చేసే పద్ధతి నేర్చుకున్నారు. కూరగాయలు కోసి, రైతుబజారుల్లో అమ్మే పద్ధతంతా కూడా ఒక మరువలేని విజ్ఞాన గని. ఇదంతా ఆచార్యగారు తమ సతీమణి పద్మావతితో కలసి 10సంవత్సరాలు "లీడ్ ఇండియా భారతరత్నాస్ స్కూల్" పెట్టక ముందు ఆ స్థలంలో కొద్ది పాటి వ్యవసాయం చేయడానికి ఉపయోగపడింది. కూలీల ఇక్కట్లు, రైతుల బాధలు స్వయంగా చూశారు. కాబట్టి వారి స్థితిగతులు అర్థం చేసుకుని వారికి చేయగలిగింది సర్వం చేయడం వారి లక్ష్యం.

**సాంగత్య ప్రభావం**




"ఆచార్యాత్ పాదమాదత్తే
పాదం శిష్యః స్వమేధయా
సబ్రహ్మచారిభ్యః పాదం
పాదం కాలక్రమేణ చ"

అన్న వేద వాక్కుని బట్టి జ్ఞానం పొందడానికి 4 రకాలుంటాయి.

1. ఆచార్యాత్ పాదమాదత్తే అంటే ఆచార్యుల (ఉపాధ్యాయుల) ద్వారా 25% జ్ఞానం వస్తుంది.
2. పాదం శిష్యః స్వమేధయా అంటే సొంతంగా ఆలోచన చేయడం ద్వారా 25% జ్ఞానం వస్తుంది.
3. సబ్రహ్మచారిభ్యః పాదం అంటే (సమకాలికులతో) స్నేహితుల సహవాసంతో, తోటి వారి ప్రభావంతో 25% జ్ఞానం వస్తుంది.
4. పాదం కాలక్రమేణ అంటే కాలం - పరిస్థితులు ద్వారా 25% జ్ఞానం వస్తుంది.

ఈ విధంగా స్నేహితులు, సమకాలికుల ప్రభావం మనుషులను మారుస్తుంది. వారి అలవాట్లనీ, ప్రవృత్తులనీ, గుణగణాలనీ మారుస్తుంది.

ఆచార్యగారు వేసవి సెలవుల్లో తమ అమ్మమ్మగారి గ్రామానికి వెళ్ళినప్పుడు అక్కడ పశువుల కాపరులందరు చుట్టలు, బీడీలు త్రాగేవారు. ఒకరి ఎంగిలి ఒకరు పంచుకునే వారు. వాటితో అనేక ప్రయోగాలు చేసేవారు. వారు ఆచార్యగారినీ బలవంత పెట్టారు. సరదాగా 'ఇది ఎలా ఉంటుందో చూద్దాం' అని ఆచార్యగారు బీడీలు త్రాగారు. ఆ విధంగా వాళ్ళతో ఉన్నన్నాళ్ళు రోజుకు రెండు మూడుసార్లు త్రాగేవారు. ఆచార్యగారు హైదరాబాద్ వచ్చిన తరువాత ఆ అలవాటు ప్రకారం ఒకరోజు మరుగుదొడ్లో కూర్చుని త్రాగారు. దానికి పై కప్పు సగమే ఉండటంతో వరండాలో కూర్చున్న వారి నాన్నగారు ఆ పొగను గమనించారు. ఆచార్యగారు బయటకు వచ్చిన తరువాత వారి తండ్రిగారు "సిగరెట్ త్రాగావా?" అని అడిగారు. ఆచార్యగారు "త్రాగలేదు" అని అబద్ధం చెప్పారు. రెండు మూడుసార్లు అడిగినా అదే సమాధానం చెప్పారు. వారి నాన్నగారు మరుగుదొడ్లోకి వెళ్ళి, అక్కడ పారవేసిన సిగరెట్ ముక్కను చూశారు. దగ్గరకు పిలిచి హా! అని గాలి ఊదమన్నారు.

ఆచార్యగారు గాలి ఊది, మళ్ళీ అదే సమాధానం చెప్పారు. కోపం వచ్చిన తండ్రిగారు తలుపులు బిగించి, బెల్టు తీసుకుని నిజం చెప్పే వరకూ ఆచార్యగారిని కొట్టారు. జీవితంలో ఇంకెన్నడూ అబద్ధమాడవద్దని వారిని దండించిన ఆ ఏకైక సంఘటన ఆచార్యగారి జీవితాన్ని మార్చివేసింది. సత్యవాక్కు వారి జీవితంలో శాశ్వతంగా నాటుకుపోయింది. మనిషి మనసు ఆకర్షణకు లోనైన తరువాత,

అనుభవించాలి అని అనిపిస్తుంది. ఒకసారి అనుభవించిన తరువాత తిరిగి తిరిగి అనుభవించడం వల్ల ఆ అనుభవం అలవాటుగానూ, క్రమేణా వ్యసనంగానూ మారుతుంది.

అటువంటి వ్యసనాలను మనిషి గ్రహించి, నిగ్రహించుకుని, వాటిని విడిచి పెట్టగలిగినట్లైతే బాగుపడతాడు. అలా వాటిని విడిచిపెట్టకపోతే అవి మనిషిపై స్వారీ చేసి మనిషిని పతనం చేస్తాయి. మద్యపానం, ధూమపానం, వ్యభిచారం, జూదం ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఈనాడు పిల్లలు మొబైల్ ద్వారా, ఇంటర్‌నెట్ ద్వారా, పబ్బుల ద్వారా ఇలా అలవాటు చేసుకుంటున్న అనేక రకాలైన వ్యసనాలు శారీరకంగా, మానసికంగా తెలియకుండానే భవిష్యత్తుని పతనం చేస్తున్నాయి.

జాగ్రత్త! తస్మాత్ జాగ్రత్త!!

**స్నేహంతో అలవాట్లు ఎక్కడికి దారి తీస్తాయి?**

ఆచార్యగారు ఒక పేద కుటుంబంలో పుట్టి కష్టాలను గమనిస్తూ అభివృద్ధి చెంది వాటిని అధిగమించాలనే లక్ష్యంతో తన కంటే ఉన్నత శ్రేణికి చెందిన వాళ్ళు ధనికులు, ప్రసిద్ధిగాంచిన వారితో స్నేహం చేసే వారు.

ఆచార్యగారి మిత్రుడొకరు చాల ధనికుడు. ఆరోజుల్లో రోజువారీ ఖర్చులకని వాళ్ళ నాన్నగారు రోజుకు రూ. 100/- ఇచ్చేవారు. అవి తీసుకుని మనసుకి నచ్చిన హోటల్లో మనసుకి నచ్చిన తిళ్ళు తినేవారు. సినిమాలు చూసేవారు. గుర్రపు పందేలకి వెళ్ళే వారు. జూదం ఆడేవారు. మద్యం త్రాగేవారు. కాని వ్యభిచారానికి మాత్రం దూరంగా ఉండేవారు. వీటన్నిటికీ ఆ మిత్రుడికి ఆచార్యగారే కార్యదర్శి, కోశాధికారి, నమ్మిన

బంటు. మిత్రుడు ఏమి చెబితే, అది చేసే వారు. సాయంకాలం లెక్కలు అప్పచెప్పేవారు. ఈ విధంగా ఆచార్యగారు జీవితంలో 3 సంవత్సరాల పాటు ప్రపంచంలో ఉన్న భోగభాగ్యాలెన్నో రుచి చూశారు .

ఒకరోజు ఆచార్యగారి ఇంట్లో ఎవ్వరూ లేరు. ఇక ఆ ఇద్దరు మిత్రులు గొర్రె మాంసం, పంది మాంసం, కోడి మాంసం, చేపలు, రొయ్యలు, పకోడి, కారా, బీరు, బ్రాంది, విస్కీ ఆశ కొద్దీ అన్నీ తెచ్చుకుని మధ్యాహ్నానికి ఇల్లు చేరుకున్నారు. ఒక ప్రక్క వండుతున్నారు, తింటున్నారు, మరో ప్రక్క త్రాగుతున్నారు. కాక్ టైల్ ప్రయోగం రూపంలో బీరు బ్రాంది విస్కీ కలిపి త్రాగారు .

కొద్ది సమయం తరవాత మత్తు ముంచుకొచ్చింది. అయినా త్రాగుతూనే ఉన్నారు. తింటూనే ఉన్నారు. స్టౌ పైన ఉడికేవి ఉడుకుతూనే ఉన్నాయి. చివరకు ఇద్దరూ స్పృహ తప్పి పడిపోయారు. అర్ధరాత్రి వేళ ఆచార్యగారికి మెళకువ వచ్చింది. ఇంకా తలుపులు తెరిచే ఉన్నాయి. స్నేహితుడు కనిపించలేదు. ఆచార్యగారు అటూ ఇటూ చూసి మళ్ళీ పడుకున్నారు. తెల్లవారి ఉదయం 9 గంటలకు ఆచార్యగారి తల్లిగారు ఊరి నుండి వచ్చారు. "ఏమిటీ పరిస్థితి, ఏమిటి ఇవన్నీ?" అని ఆచార్యగారిని నిలదీశారు.

ఆచార్యగారు ఉన్నది ఉన్నట్లుగా సత్యం చెప్పారు. వారి అమ్మ తమపై ఒట్టు వేయించుకుని, "మళ్ళీ త్రాగుడు జోలికి వెళ్ళవద్దు, ఇది మనుషులను పతనం చేస్తుంది" అని ఆచార్యగారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆనాటి నుండి ఆచార్యగారు ఆ దుర్వ్యసనాలన్నిటికీ స్వస్తి చెప్పారు. కాని వారి స్నేహితుడు మాత్రం ఎంత చెప్పినా మద్యపానం

మానేయలేదు. పెండ్లి అయినా, పిల్లలు పుట్టినా,ఆ అలవాటు పెరుగుతూ పోయిందే కానీ తరగలేదు.

కుటుంబ సభ్యుల దగ్గర, మిత్రుల దగ్గర డబ్బులు అప్పు తీసుకుని మరీ త్రాగేవాడు. తోటి వారు అందరూ గ్రహించి మానేసినా కూడా, అతను భిక్షమడిగి మరీ త్రాగేవాడు. ఒక్కొక్కసారి త్రాగి రోడ్లపైన పడిపోయేవారు. ఆ విధంగా ఒకసారి తిరుపతిలో పడిపోయిన విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. ఆయన్ని ఇంటికి తీసుకొచ్చి ఆచార్యగారిని పిలిచారు. "మీ చిన్ననాటి స్నేహితుడిని మీరు ఎలాగైనా ఈ దుర్వ్యసనాల బారి నుండి దూరం చేయండి!" అని అభ్యర్థించారు. ఆ స్థితిలో ఉన్న మిత్రుడికి ఆచార్యగారు అన్ని విధాలా నచ్చ చెప్పి "శ్రీరామ రక్ష" మంత్రోపదేశం చేసి, 21 రోజుల దీక్ష ఇచ్చారు. భగవంతుడి దయవలన అప్పటి నుండి ఆ మిత్రుడు దుర్వ్యసనాలు అన్నిటినీ శాశ్వతంగా వదిలేశాడు. కుటుంబాన్ని చక్కగా అభివృద్ధి చేశాడు. వారందరూ ఇప్పుడు ఆనందంగా ఉన్నారు. ఈ విధంగా ఎంతో మందికి "శ్రీరామ రక్ష" మంత్రోపదేశం ఇచ్చి వారి కష్టాలను కడతేర్చారు ఆచార్యగారు.

**పరిస్థితే ధైర్యాన్నీ, నైపుణ్యాన్నీ పెంచుతుంది**

ఏ సమస్యకైనా కాలమే పరిష్కారం చెబుతుంది. అలాగని కృషి చేయకుండా కూర్చుంటే ఏమీ సాధించలేము. చేస్తేనే సమర్థత వస్తుంది, ధైర్యం పెరుగుతుంది. చేసేటప్పుడు ఒకే పద్ధతిలో చేయకుండా భిన్నంగా ఆలోచన చేసి, భిన్నంగా చేస్తే గొప్ప గొప్ప ఫలితాలు వస్తాయి. ఆ అనుభవం అభివృద్ధికి దారి తీస్తుంది. నగరంలో ఆచార్యగారి మిత్రులందరూ డబ్బులు కట్టి స్విమ్మింగ్‌పూల్స్‌కి పోయి నెలల కొద్దీ ఈత

నేర్చుకునేవారు. ఆచార్యగారి దగ్గర డబ్బులు లేవు కానీ, ఎలాగైనా నేర్చుకోవాలనే కోరిక ఉండేది.

ఎండాకాలం సెలవుల్లో ఆచార్యగారు ఊరికి వెళ్ళినప్పుడు, ఒకరోజు బావి గట్టుపై నిల్చున్నారు. వెనుక నుండి వారి అన్న మల్లన్న గారు వచ్చి ఆచార్యగారిని బావిలోకి త్రోసేశారు. ఆ వెనుకే ఆయన కూడా దూకారు. ఆచార్యగారికి ఈత రాక కొట్టుమిట్టాడుతూ ప్రాణభయంతో మునుగుతూ, తేలుతూ ఈదుతున్నంతసేపూ చూశారు. ఆశ కొద్దీ ఆ తరువాత నడుం పట్టుకుని ఒడ్డుకు తీసుకెళ్ళి కాళ్ళు చేతులు ఇలా ఆడించమని చూపించారు. నడుముకు నీటిలో మునగని ఒక 'తాటిబోదు' ను కట్టి తాను తోడుగా ఉంటూ ఆచార్యగారిని ఈదమన్నారు. పైకి తీసుకెళ్ళి మళ్ళీ దూకించారు. ఈ విధంగా చేసి నాలుగురోజుల్లోనే ఆచార్యగారికి ఈత నేర్పించారు. ఈ ధైర్యంతో జూ పార్కు దగ్గర ఉన్న మీర్ ఆలం ట్యాంక్ ఈత పోటీలో విజేతగా నిలిచారు. ఈ విధంగా 50 అడుగుల ఎత్తు నుండి అవలీలగా దూకే ధైర్యం వచ్చింది. కానీ వారి మిత్రులు స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకున్నారు. వారు ఈదుతారే కానీ ఎత్తు నుంచి దూకే ధైర్యం లేదు. ఈ ఈత ద్వారా ఆచార్యగారు అనేక జీవిత పాఠాలు నేర్చుకున్నారు. వారి దగ్గర పని చేసే వారికి "ఈ పని రాదు" అంటే బావిలోకి త్రోసివేసినట్లు పనిలో త్రోసివేస్తారు. ఈత నేర్చినట్లు వారు పని నేర్చుకుంటారు. ఇది వారి మేనేజ్‌మెంట్‌లో ఒక గొప్ప టెక్నిక్‌గా వాడతారు.

**ఆటలు ఉద్యోగాలు ఇస్తాయా?**



జీవితంలో ఎవరు ఏయే రంగాలలో రాణిస్తారో! ఎవరెవరు ఎటువంటి ప్రయాణాలు, వ్యాపారాలు, క్రీడలు, సాహస కృత్యాలు చేస్తారో! చేసే పనులను బట్టి వారి వారి వ్యక్తిత్వాలు అంతగా వికసిస్తాయి."ధైర్యే సాహసే లక్ష్మీ" అన్నట్లు వాటన్నింటినీ శాశ్వతంగా తలచుకునేంతగా మధుర స్మృతులుగా మిగిలిపోతాయి అవి. 1967లో ఆచార్యగారు కొంతమంది మిత్రులతో "ప్రిన్స్ క్రికెట్ క్లబ్" ను స్థాపించారు. క్రికెట్టే జీవితం అన్నట్లు బాగా సాధన చేసి పోటీలకు వెళ్ళే వారు.

ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ పోటీలలో వారు సిటీ కళాశాల తరపున ఆడుతూ టీం క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు జట్టుని రక్షించడానికి ఓపెనింగ్ బ్యాట్స్‌మ్యాన్‌గా వెళ్ళి, నాట్ అవుట్ బ్యాట్స్‌మ్యాన్‌గా తిరిగి వచ్చారు. 106 బంతులలో 36 పరుగులు చేశారు. అయినా ఆనాడు వారి జట్టు ఒడిపోయింది. అయితే ఆచార్యగారు జీవితంలో గెలిచారు. ఎందుకంటే ఈ క్రికెట్ ద్వారా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆడిట్ అండ్ ఎకౌంట్స్ (పి అండ్ టి) డిపార్టుమెంటులో ఉద్యోగం లభించింది ఆయనకి.

**మనసుంటే మార్గం**

1968లో హైద్రాబాద్ ఎల్.బి స్టేడియంలో భారత్ మరియు న్యూజీల్యాండ్ మధ్య జరిగే ఆట చూద్దామని ఆచార్యగారు కొందరు

మిత్రులతో కలసి వెళ్ళారు. కాని టికెట్లు లభించలేదు. ఎలాగైనా తప్పక చూడాలని ప్రతి ప్రవేశద్వారం చుట్టూ తిరుగుతూ అవకాశం కొరకు ప్రయత్నించారు. ముఖ్య ప్రవేశ ద్వారం వద్ద వేగంగా రెండు కార్లు దూసుకు వచ్చాయి. కార్లు ఆగగానే సెక్యూరిటీ సిబ్బంది హడావిడిగా ద్వారాలన్నీ తెరిచేశారు. అదే అదనుగా సాహసంతో ఆచార్యగారు వారి మధ్య కలసిపోయి లోపలికి ప్రవేశించారు. వాళ్ళతో పాటే వెళ్ళారు. వాళ్ళతో పాటే కూర్చున్నారు. వాళ్ళంతా హైదారాబాద్ అసోసియేషన్ సభ్యులని తర్వాత తెలుసుకున్నారు. వాళ్ళు ఏమి తింటే అదే తిన్నారు. వాళ్ళు ఎలా తింటే అలాగే తినడం నేర్చుకున్నారు. వాళ్ళందరూ సాయంకాలం వెళ్ళిపోయిన తరువాత డ్రెస్సింగ్ రూంలో ఉన్న నవాబ్ పటోడి, ఎం.ఎల్ జయసింహా, కార్సన్ ఘావ్రీ, ఏక్‌నాథ్ సోల్కర్ వంటి ప్రముఖులతో కలిశారు. వాళ్ళ ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నారు. ఆనాటి ఆ సాహసకృత్యం వారి జీవితంలో ఈనాటికీ అవిస్మరణీయమే!!!


**శిక్షణ శిబిరాలే - మార్పు ఆలయాలు.**

ఆచార్యగారు ఉన్నత పాఠశాలలో చదువుతు న్నప్పుడు వారం రోజుల పాటు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణపొందారు. అడవిలో ఉండటానికి గుడిసెలు వేసుకోవాలి, ఎవరి తిండిని వారే తయారు చేసుకోవాలి. ఎవరి పనులు వారే చేసుకోవాలి. ఈ శిబిరంలో "ట్రెజర్ హంట్ " అనే ఆటలో రహస్యంగా దాచిన సొమ్మును అనేక ఆధారాల ద్వారా కనిపెట్టడం నేర్పారు. ఇంకా అనేక రకాలైన సాహస కృత్యాలు చేయించారు. వీటి ద్వారా క్రొత్త

వారితో స్నేహం చేయడం, తోటి వారిని అర్థం చేసుకుని సర్దుకుపోవడం బాగా నేర్చుకున్నారు. ఈ రోజుకి కూడా ఆచార్యగారు ఎక్కడ ఉన్నా సరే, అందరితో సర్దుకుపోయేతత్వాన్ని ఆనాటి భారత్ స్కౌట్స్ శిబిరం అందించింది.

ఆ రెసిడెన్సియల్ క్యాంప్స్, చిన్మయ ఆధ్యాత్మిక శిబిరాలు ఆచార్యగారిని ఎంతగానో ప్రేరేపించినాయి. అక్కడ స్వామీ చిన్మయానందతో పాటు డా. వి కేసరి హనుమాన్ గారు, యోగాచార్య డా. సీతారామయ్య గారు, డా. సత్యమూర్తిగారు, డా. ఆనంద ప్రభుగారి వంటి గురువుల సాన్నిధ్యంతో ఆధ్యాత్మిక బీజాలు బలోపేతం అయ్యాయి. గొప్ప అనుభవాలెన్నింటినో ఇచ్చాయి. ఆ తరువాతి కాలంలో బాలభారతి శిక్షణ శిబిరాలకి పునాది వేశాయి.

**గాంధీజీ పది సూత్రాల పట్టిక - మార్పులకు నాంది**




1. నేనే మార్పు చెందాలి.
2. నేను ఏ ఆలోచన చేస్తానో, అదే అవుతాను.
3. ఎక్కడ ప్రేమ ఉంటుందో, అక్కడ ఆనందం వుంటుంది.
4. నేర్చుకునేటప్పుడు "నేను ఎల్లకాలం జీవిస్తాను" అని నేర్చుకో
5. నీ ఆరోగ్యమే నీకు నిజమైన సంపద.
6. కొంత హాస్యం కూడా తోడుగా ఉంచుకో
7. నీ జీవితమే ఒక సందేశం.
8. నీ చర్యలే నీ ప్రాముఖ్యతలు.
9. మనల్ని మనం మార్చుకోగలగడమే మన గొప్పతనం

10. ఎప్పుడూ నీవు ఎదుటివారి స్థితిలో ఉండి నడుచుకో

వీటన్నింటికి తోడుగా గాంధీజీ లోని సత్యం, అహింసలతో పాటు క్రమశిక్షణ కూడా ఆచార్యగారిని ఎంతో ఆకర్షించింది. జాతీయ ఉద్యమంలో తీరిక లేకుండా తిరుగుతూ, రాత్రి 2-3 గంటలైనా ఆనాడు లభించిన విరాళాల లెక్కలు వ్రాసిన తర్వాతనే పడుకునే వారు. ఈ పద్ధతి బాలభారతిలోనూ, లీడ్ ఇండియా ఉద్యమంలోనూ ఇప్పటికీ కొనసాగుతుంది.

**ఉద్యమాల నాయకత్వమే జీవిత నాయకత్వం**



ఏ ఉద్యమంలోనైనా ఎవరు ఎంత లోతుగా పాల్గొంటే అంత ఎత్తుకి ఎదుగుతారు.

ఉద్యమ నాయకత్వం నలుగురితో కలసి పోరాడే పటిమను పెంచుతుంది. వాగ్ధాటిని ఇస్తుంది. ధైర్యాన్ని మేల్కొలుపుతుంది. ఆ విధంగా జీవితానికి నాయకులుగా నడిపిస్తుంది. అది 1969వ సంవత్సరం. అప్పుడు ఆచార్యగారి వయసు 19 సంవత్సరాలు. "బద్రుక కళాశాల"లో బి.కాం. మొదటి సంవత్సరం చదువుతున్నారు. అప్పటికే హిందీ భూషణ్ చదవడంవలన హిందీ రెండవ భాషగా తీసుకున్నారు. కళాశాలలో హిందీ సంఘానికి అధ్యక్షుడయ్యారు. అప్పుడే ప్రత్యేక రాష్ట్ర తెలంగాణా ఉద్యమం ప్రారంభమయింది. ఆచార్యగారు చురుకుగా పాల్గొనడంతో ఉస్మానియా యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యునిగా చేర్చుకున్నారు. ఆచార్యగారు ఉపన్యాసాలు ఇస్తూ, పాటలు వ్రాస్తూ, పాటలు పాడుతూ ఉండేవారు. దానికి తోడుగా వారు ఉద్వేగభరితంగా ప్రసంగించేవారు.

ఆచార్యగారు మాట్లాడుతున్నప్పుడు విద్యార్థులు రక్తంతో ప్రతిజ్ఞ చేసేవారు. రక్తంతోనే వ్రాసేవారు. కంటతడి పెట్టేవారు. అప్పటి తెలంగాణ ప్రజాసమితి (టి.పి.ఎస్) ఉద్యమ నాయకులు డా. మర్రి చెన్నా రెడ్డిగారు, శ్రీ మదన్ మోహన్‌గారు, డా॥ మల్లికార్జున్ గారు, శ్రీ శ్రీధర్ రెడ్డిగారు మొదలగు వారితో ప్రత్యేక సమావేశాలలో పాల్గొనేవారు ఆచార్య. వారు సమావేశాలు నిర్వహించడం, ర్యాలీలు నిర్వహించడం, లాఠీ చార్జ్, ఫైరింగ్, టియర్ గ్యాస్‌ని ఎదుర్కోవడం ఇవన్నీ మామూలే. ఒకరోజు గవర్నర్‌గారి బంగళా దగ్గర జరిగిన కాల్పుల్లో ఆచార్యగారి ప్రక్కన ఉన్న ఒకరు పోలీస్ కాల్పులకు బలయ్యారు. ఆచార్యగారిని భగవంతుడే రక్షించాడు. నిజానికి ఆనాటి తెలంగాణ ఉద్యమం అనుభవం, ఈనాటి లీడ్ ఇండియా ఉద్యమానికి చాలా దోహద పడింది.

**చెరసాల ఒక మందిరమే**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆచార్యగారినీ, వారి బృందాన్నీ రెండు నెలలు చంచల్‌గూడా చెరసాలలో ఉంచారు. ఆ చెరసాలలో కరడు కట్టిన ఖైదీలతో, అమాయకులను చంపిన ముద్దాయిలతో, రౌడీ షీటర్లతో, ఆచార్యగారినీ, వారి బృందాన్నీ ఉంచారు. వాళ్ళకూ ఆచార్యగారి బృందానికీ చెరసాలలో ఘర్షణలు జరిగేవి. హోం మంత్రికీ, డి.ఐ.జి లకీ ఫిర్యాదు చేయడం వలన ఆచార్యగారి బృందానికి రాజకీయ ఖైదీలుగా ప్రత్యేకమైన సదుపాయాలు ఏర్పరిచారు. ఈలోపు మహా శివరాత్రి పర్వదినం వచ్చింది. ఆచార్యగారి బృందం "భోజనం చేయం. పండ్లు, పాలు సమకూర్చాల"ని చెరసాల అధికారులకు నివేదించారు. వారు కావలసినవన్నీ ఆచార్యగారి బృందానికి సమకూర్చారు. ఈలోపు ప్రతి

విద్యార్థి తల్లిదండ్రులు, పలు ప్రాంతాల ప్రజలు, నాయకులు, విద్యార్థి సంఘాలు తెచ్చిన పండ్లు గుట్టలుగా ఏర్పడ్డాయి.

రాష్ట్ర నాయకులందరూ ఆచార్యగారి బృందంతో పాటు చెరసాలలో పండగ చేసుకున్నారు. భజనలతో, ధ్యానంతో ఆ పరమశివుని సన్నిధి అనుభూతితో చెరసాలే ఒక కైలాసంగా అనిపించింది.

**వివేకానందుడు కోరిన వంద మంది శిష్యుల్లో నేనూ ఒకడిని**



"నాలాంటి వారిని ఒక 100 మందిని ఇస్తే, నేను ప్రపంచాన్ని మార్చగలుగుతాను" అన్న స్వామీ వివేకానందుడి మాట ఆచార్యగారిని బాగా ఆకర్షించింది. తామూ ఆ వంద మందిలో ఒకరు కావాలనే ఆకాంక్షను ప్రేరేపించింది. ఆచార్యగారు "వివేకవర్ధిని ఎక్సెల్సియర్ హైస్కూల్"లో 10వ తరగతి చదువుతున్నప్పుడు, వక్తృత్వ పోటీలో రెండవ బహుమతిగా " స్వామీ వివేకానంద జీవిత చరిత్ర" అనే పుస్తకాన్ని ఇచ్చారు. ఆసాంతం చదివాక, స్వామీజీ జీవితంలోని ప్రతి సంఘటన వారికి ఒక పాఠంగా మారింది. వారి ఏకాగ్రత, ధైర్యం, శ్రద్ధ, పట్టుదల, దేశభక్తి, దైవభక్తి ఆచార్యగారి గుండెల్లో గూడు కట్టుకున్నాయి. దానికి తోడు వారి నాన్న గారు ఇచ్చిన "వివేకానందుడి అమృతవాక్కులు" అనే పుస్తకం కూడా మరింత స్ఫూర్తినిచ్చింది. రామకృష్ణ మఠంలో సభ్యుడిగా చేరి స్వామీ రంగనాథానందగారి ఉపన్యాసాలు వినడం, భజనలు చేయడం, వారి కణకణంలో స్వామీజీ నిలచిపోయేలా చేశాయి.

వివేకానందుడు కోరిన వంద మంది శిష్యుల్లో తానూ ఒకరుగా ఆయన బ్రతికి లేకున్నా ఏకలవ్యుడిలా కఠోర సాధన చేసి, "వారే నేను! నేనే వారుగా" అనిపించేలా రూపాంతరం చెందారు. ఆచార్యగారు మాట్లాడుతూ ఉన్నా వచ్చే మాటలన్నీ వివేకానందుడి స్ఫూర్తి వ్యాక్యాలే! అదే స్ఫూర్తితో, అదే ఉద్వేగంతో, ఈ రోజు లీడ్ ఇండియా శిక్షణ పొందిన ప్రతి యువత మొదట్లో మాట్లాడలేని వారు, దాదాపుగా మైకాసురులుగా మారడం వివేకానందుని స్ఫూర్తితో కొనసాగడమే అవుతుంది. పడుకుంటున్న పులి పిల్లలను తట్టిలేపి, మీరు మేక పిల్లలు కాదు; పులి పిల్లలు అని "సర్వశక్తులు మీలో కలవు. సంశయించక ముందుకు నడవండి" "మీరు తలచుకుంటే ఏదైనా చేయగలరు, ఎన్నైనా చేయగలరు. ఏదీ అసాధ్యం కాదు" "గొప్ప లక్ష్యం పెట్టుకో! సాధించే వరకు విశ్రమించకు" అన్న స్వామీ వివేకానందుడి మాటలు లీడ్ ఇండియన్స్ మాటలుగా, ప్రతిధ్వనిస్తూ, ఈ రోజు పల్లెపల్లెలో లక్షలాది విద్యార్థులందరు వివేకానందులై జనజాగృతిని సాకారం చేస్తున్నారు. రామకృష్ణ పరమహంస, శారదామాతల ఆశీస్సులు పొందుతున్నారు. స్వామీ వివేకానందుడు పాటించిన బ్రహ్మచర్యం. ఒక్క ఆచార్యగారిని ఆకర్షించడమేకాక, లీడ్ ఇండియాలో మణికుమార్, నరోత్తం, నరేష్ వంటి ఇంకా ఎంతో మంది ట్రైనర్‌లు పాఠశాలలకూ, కళాశాలలకూ వెళ్ళి లీడ్ ఇండియా ఉద్యమంలో ఒక ముఖ్యమైన భాగంగా బ్రహ్మచర్యం గురించి స్వానుభవాలతో, సొంత అనుభవంతో ఆచరణతో ప్రచారం చేస్తున్నారు.

**బ్రహ్మచర్యం - తేజస్సుకు మూలం**

ప్రతి నిత్యం మనం తినే ఆహారం రక్తంగా మారుతుంది. రక్తం

మాంసంగా మారుతుంది. మాంసం కండరాలుగా, నరాలుగా, ఎముకలుగా, ఎముకలలోని గుజ్జుగా, తరువాత వీర్యకణాలుగా లేదా అండంగా, తరువాత ఓజస్సుగా, చివరకు మనిషి తేజస్సుగా మారుతుంది. ఎవరు ఎంత వరకు సనాతన భారతీయ చాతుర్వర్ణాశ్రమ పద్ధతిలో, బ్రహ్మచర్యాన్ని పాటిస్తారో, అనగా నేటి అధునాతన జీవితంలో విలువలతో కూడిన ఒక గొప్ప వాడిని అవ్వాలి అనే లక్ష్యం పెట్టుకుని లక్ష్యం నెరవేరేవరకు శ్రమిస్తారో, వారు ఖచ్చితంగా అభివృద్ధిని సాధించి తీరుతారు.

**స్వచ్ఛమైన మనసు:-** పవిత్రమైన ఆలోచనలు, సానుకూలమైన ఆలోచనలు చేయడం.

**స్వచ్ఛమైన మాట:-** ప్రేమతో, సత్యంతో మాట్లాడటం.



**స్వచ్ఛమైన పనులు :-** నలుగురికీ ఉపకరించే పనులు చేయడం, ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండటం, స్త్రీలను గౌరవించడం ముఖ్యం. లక్ష్యం నెరవేరే వరకు ఆ లక్ష్య సాధన దిశగా తాను చేయవలసిన పనులు మాత్రమే చేస్తూ లక్ష్యం సాధించి, తమ కాళ్ళపై తాము నిలవడం. తాము నచ్చిన వరుడు లేక వధువుతో పెళ్ళాడి చక్కటి యోగ్యమైన సంతానం పొందడానికి నిమిత్తమాత్రంగా సంభోగించడం. మిగతా సమయాలలో ఆదర్శమైన భారతీయ జీవన విధానం ప్రకారం గృహస్థు ఆశ్రమం, వానప్రస్థాశ్రమం, సన్యాస ఆశ్రమం పద్ధతిలో జీవించి అమోఘమైన ఫలితాలు పొందవచ్చును. దీని వలన ఏకాగ్రత, అమోఘమైన మానసిక శక్తులు, వాక్ శక్తి, దృశ్య శక్తి, గ్రహణశక్తి, జ్ఞాపక శక్తి,

సృజనాత్మక శక్తి ఇవి అన్నీ అందరికీ అనుభవంలోకి వస్తాయి. ఇంకా ఎక్కువగా సాధన చేస్తే అన్ని దివ్య శక్తులు అదనంగా వస్తాయి. ఈ విషయంలో మీరు ముందు ముందు ఆచార్యగారి అనుభవాలు చదువుతారు.

**శరీర దారుఢ్యం దృఢమైన మనసుకు ఆధారం**

స్వామీ వివేకానందుడి స్ఫూర్తితో "యువత ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్రతుల్యమైన కఠోరమైన మనసు నిర్మించుకోవాలి" అన్న వాక్కులను తీసుకుని ఆచార్యగారు 4 సంవత్సరాలు నిరంతరమైన వ్యాయామం చేసి "ఐరన్ మ్యాన్ అఫ్ వివేక వర్ధిని" బిరుదు పొందారు. ఆలోచనలను నిగ్రహించుకుని, లక్ష్య సిద్ధి కోసమే జీవించే కఠోరమైన మనసును నిర్మించుకున్నారు. వారితో పాటు కళాశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రేరేపించారు. వారు అదే విధంగా బ్రహ్మచర్య దీక్షతో జీవించి ఆదర్శంగా ఉండేవారు.

రామాయణంలో రాముడు, సీతమ్మవారి ఆభరణాలను గుర్తుపట్టమని లక్ష్మణుడి ముందు ఉంచగా, "అమ్మవారు పాదాలకు ధరించే పట్టీలు తప్ప, నేను ఏమీ గుర్తించలేను అన్నా! ఎందుకు అనగా వారి పాదాలే తప్ప, నేను వారిని చూసేవాడిని కాదు" అని లక్ష్మణుడు చెప్పిన ఈ సంఘటన ఆచార్యగారిని ఎంతగానో ప్రభావితం చేసింది. అదే లక్షణంగా మారింది.


అమ్మ వారి జాడ వెతకడానికి హనుమంతుడు, రావణాసురుడి అంతఃపురంలోకి

అర్ధరాత్రివేళ ప్రవేశించి అందగత్తెలైన ఆడపిల్లలు ఆదమరిచి నిద్రిస్తున్నా, వారిని ఒక్కొక్కరినీ పరిశీలించి చూసినా, ఏ మాత్రం

చలించకుండా, కేవలం అమ్మవారి జాడనే లక్ష్యంగా చేసుకుని వెతికిన బ్రహ్మచారి హనుమంతుడే ఆచార్యగారి ఆరాధ్యదైవం.

ఆచార్యగారు చిన్మయ యువకేంద్రానికి నాయకుడిగా పనిచేశారు. రామకృష్ణ మఠం బాధ్యత వహించి, పనులు పంచుకుని, ఆనాటి శ్రీరంగనాథానందస్వామి గారి దగ్గర నుండి ఈనాటి శ్రీ బోధమయానంద స్వామి వరకు వివేకానందుడి శిష్యులుగా నడుచుకుంటున్నారు. మచ్చుతునకలుగా కొన్ని ఆసక్తి కరమైన సంఘటనలు ఆప్త మిత్రులుగా పంచుకుందాం.

**బ్రహ్మచర్యానికి భంగపాటు ఎదురైతే?**



ఆచార్యగారి ఇంట్లో ఒక దంపతులు అద్దెకు ఉండేవారు. వారికీ వీరికీ కలిపి నీళ్ళ కొరకు ఒక్క కుళాయి ఉండేది. భర్త (35) ఒక ఉపాధ్యాయుడు. ఆయన కూడా

ట్యూషన్స్ చెప్పేవారు. కొన్నిసార్లు ట్యూషన్స్‌లో ఆచార్యగారు వారు ఒకరికి ఒకరు సహాయం చేసుకునే వాళ్ళు. వారి భార్య (24) ఆచార్యగారిని బాగా గమనిస్తూండేది. మాటల్లో ద్వందార్థాలతో వారిని చూస్తూ రెచ్చగొడుతూండేది.

ఆచార్యగారు ఒక రోజు సాయంకాలం ఆ ఉపాధ్యాయుని కొరకు వారి ఇంటికి వెళ్ళారు. "సార్ ఉన్నారా?" అని అడిగారు. ఆమె "లేరు, కూర్చోండి, వస్తారు" అన్నారు. లోనికి వెళ్ళి అల్పాహారం తీసుకువచ్చి ఇచ్చారు. ఆచార్యగారు తింటున్నారు. అప్పుడు ఆమె "నీవు చాలా మంచి

వాడివి. మంచి పనులు చేస్తుంటావు. నీవు అంటే నాకు చాలా ఇష్టం" అంటూ ఉన్మాదంతో దగ్గరకు రాబోయింది. వెంటనే ఆచార్యగారు గద్దించి, ఆమెని వారించి, అక్కడ నుండి వెళ్ళిపోయారు. ఆచార్యగారు ఈ విషయాన్ని వెంటనే తమ అమ్మగారితో చెప్పారు. ఆ తరువాత ఒక నెల రోజుల్లోనే వాళ్ళచేత ఇల్లు ఖాళీ చేయించారు. ఆమెలో ఇటువంటి భావన ఉందని ఆచార్యగారు ఊహించలేదు. ఈ విధమైన సంఘటనలు వారి జీవితంలో రెండు సార్లు జరిగినాయి. అయినప్పటికీ వారి దృఢసంకల్పం ఆ బ్రహ్మచర్య వ్రతాన్ని భగ్నం కానివ్వలేదు.

**సన్యాసం నుండి గృహస్థ ఆశ్రమానికి నడిపించిన దైవం**

భగవంతుడు సర్వాంతర్యామి కాబట్టి మనం మాట్లాడే ప్రతి మాట వింటుంటాడు. అవసరాన్ని బట్టి, ఆర్తిని బట్టి, ఏదో రీతిగా బదులిస్తాడు. అన్నీ చూస్తూ నిశ్శబ్దంగా ఉంటాడు. ఐతే, మనం కేవలం ప్రాపంచిక విషయాలలో లిప్తమై ఉండకుండా భగవంతుణ్ణి ఆర్తితో కొలవగలిగితే తప్పకుండా అండగా నిలుస్తాడు.

పల్లవి: కృష్ణ గోవింద గోపాల గాతే ఛలో
మన్‌కో విషయ్‌సే హటాతే చలో
"కృష్ణ గోవింద"



స్వామీ చిన్మయానంద గారి ప్రేరణతో ఆచార్యగారికి 18 సంవత్సరాల వయసులో

ఒక సంవత్సర కాలం పాటు "భగవద్గీత వారి భవిష్యత్‌కు ఏ విధంగా మార్గదర్శనం చేస్తుంది" అని ఆచార్యగారు వారి మిత్రుడు శ్రీ పాండురంగాచారి గారితో తదేక దీక్షతో, లెక్కలు, సైన్స్ చదివినట్లుగా,

ప్రతి శ్లోకం, ప్రతిపదార్థ తాత్పర్యాలు, విశ్లేషణలు, వ్యాఖ్యానాలు చదివి అర్థం చేసుకుని చర్చించుకుంటూ, తుమ్మెదల్లా గీతా మకరందాన్ని అంది పుచ్చుకున్నారు. అమ్మ నాన్న ఆచార్యగారిని పెళ్ళి చేసుకోమని పోరు పెట్టేవారు. కాని ఈ గీత చదివిన తరువాత పెళ్ళి చేసుకున్నచో, పిల్లలు–సంసారం అనే సముద్రంలో కొట్టుకుపోతాము.కాబట్టి పెళ్ళి చేసుకోకుండా హిమాలయాలకు వెళ్ళి సద్గురువులను అన్వేషించి సన్యాసం తీసుకుని, సాధన చేసి, మోక్షం పొందాలని నిర్ణయించుకున్నారు. అందుకే అమ్మానాన్నలకు చెప్పకుండా బట్టలన్నీ పెట్టెలో పెట్టుకుని మరుసటి రోజు ఉదయం 6. గంటలకి హైద్రాబాద్ స్టేషన్‌లో జమ్మూ–తావి ఎక్స్‌ప్రెస్ ఎక్కి వెళ్ళిపోవడానికి అంతా సిద్ధం చేసుకున్నారు .

ఆ రోజు సాయంకాలం మొఘల్‌పురా పార్కులో కూర్చుని "అమ్మనాన్నలు ఎన్నో ప్రార్థనలు చేసిన తరువాత ఎంతో కాలానికి పుట్టాను. వారికి చెప్పకుండా అకస్మాత్తుగా ఇలా వెళ్ళిపోవడం ధర్మమా? వాళ్ళు నన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కంటున్నారు. మరి నేను వారికి చెప్పకుండా రహస్యంగా వెళ్ళిపోతే వాళ్ళు ఏమైపోతారు? వాళ్ళను బాధ పెట్టిన పాపం నాకు చుట్టుకోదా? నేను చేసేది ధర్మమేనా?" అని అనేక ప్రశ్నలు ఆచార్యగారిని ఉక్కిరిబిక్కిరి చేయసాగాయి. కిం కర్తవ్యం అనుకుంటూ మిత్రుడితో సుదీర్ఘంగా చర్చించసాగారు. ఈలోపు ఒక పెద్ద మనిషి వచ్చి వారి మధ్యన కూర్చున్నారు. వారు దివ్యమంగళ స్వరూపంతో ఉన్నారు. తెల్లటి జుట్టు, మెరిసే వస్త్రాలు, బంగారు చాయ, గంభీరమైన కళ్ళు, నుదుటిపై పెద్ద నామం, చిరునవ్వు చిందిస్తూ వారి ప్రశ్నలకు

సమాధానం చెప్తూ వారిద్దరినీ మంత్రముగ్ధుల్ని చేశారు.

**గృహస్థ ఆశ్రమం - మోక్షానికి సులభ మార్గం**



వారి మధ్య కూర్చున్న ఆ దివ్యమంగళ స్వరూపుడు పలికిన పలుకులు అమృతవచనాలు. మనిషి మోక్షం పొందటానికీ, తన కోరికలను అన్నిటినీ తీర్చుకుని, ఏ కోరిక లేక "భగవంతుడు ఒక్కడే సత్యం! ఈ జగత్తు అంతా మాయ" అని గ్రహించి, భార్యా బిడ్డలు, గృహము, వాహనాలు, చదువు, ఉద్యోగాలు, డబ్బు అంతా మాయే.

ఏదీ మనవెంట రాదు. ఈ జన్మ మనం చేసిన గత జన్మల పాపపుణ్యముల ఫలం. కనుక ఈ జన్మలో వాటినన్నిటినీ కడిగివేసుకోవాలి. ఈ జన్మలో తల్లిదండ్రులు, గురువులు, సమాజము, దేశము, ప్రకృతి, వీటన్నిటి నుండి మనం పొందే దానికంటే ఎక్కువ ఇచ్చి ఋణశేషం లేకుండా నడుచుకోవాలి. మనలో దాగిన ప్రవృత్తులను గ్రహించి, నివృత్తి చేసుకోవాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు మనిషికి అంతశ్శత్రువులు. వ్యక్తికి తెలియకుండా ఎప్పుడు ఏ కామప్రేరణ చెలరేగుతుందో ఎప్పుడు ఏ విషయంలో కోపం వచ్చి, శాంతిని భంగం చేస్తుందో తెలియదు. ఇవన్నీ ఎన్నో జన్మల నుండి వస్తున్న అంతర్గత శత్రువులు. వీటిని జయించడానికే వివాహము, భార్యా పిల్లలు. వీరిని ఎట్టి పరిస్థితిలోనూ వదిలేయలేము. సంసార జీవనంలో సహజంగా వీటిని జయించడం జీవనధర్మం. కాబట్టి సన్యాస ఆశ్రమం కన్నా గృహస్థ

ఆశ్రమం ద్వారానే సులభంగా మోక్షం పొందవచ్చును. తల్లిదండ్రులకూ, సమాజానికీ సేవ చేయవచ్చును. అదే మీ ధర్మం" అని చెప్పి, ఎలా వచ్చారో అలాగే అదృశ్యం అయ్యారు. ఆచార్యగారు తేరుకుని "ఎవరు ఈయన? ఎక్కడ నుండి వచ్చారు?" అని అటూ ఇటూ పరుగెత్తి వెతికారు, కానీ ఆయన ఎక్కడా కనిపించలేదు. ఆయన "సాక్షాత్ శ్రీ కృష్ణపరమాత్ముడే కటాక్షించి ధర్మమార్గాన్ని వివరించారు" అని ఈ రోజుకూ ఆ సంఘటన తలచుకుని వారు గగుర్పాటు పొందుతుంటారు. ఆ తర్వాత ఆయన చెప్పిన ప్రతిమాట ఆచార్యగారి అనుభవంలోకి వచ్చింది.

**నిజ జీవితంలో వానప్రస్థం, సన్యాసం ఎలా?**

ఒకసారి వారి జీవితాన్ని వెనక్కి తిరిగి చూస్తే, భగవంతుడు వారిని అనునిత్యం కంటికి రెప్పలా కాపాడిన సందర్భాలు ఎన్నో. ఏ రోగం రొష్టూ లేకుండా వైద్యశాలలు, మందులు తెలియకుండా తమ అమ్మానాన్నలకు మనస్ఫూర్తిగా సేవచేసి, నిరంతర భగవన్నామస్మరణతో, సత్యంగా, ధర్మంగా, నిప్పులా ఆచార్యగారు జీవించారు. ఆచార్యగారు డబ్బుకు తలొగ్గకుండా తమ నలుగురు పిల్లలకూ ఉన్నత విద్యలు అందించగలిగారు. పిల్లలు వారి కాళ్ళపై వాళ్ళు నిలబడి అగ్రగాములై, అమెరికాలో భారతీయ విలువలతో జీవిస్తున్నారు. వనవాసి రామాలయం జీర్ణోద్ధరణ అయినా, ఆనాటి బాలభారతి అయినా, ఈనాటి లీడ్ ఇండియా ఉద్యమం అయినా డబ్బు తాకకుండా ఇన్ని పనులు చేయించడం ముమ్మాటికీ భగవంతుడి అనుగ్రహమే! భగవంతుడు ఆచార్యగారిచేత డా॥ అబ్దుల్ కలాంగారి వంటి భారతరత్నాలతో కలసి 12 సంవత్సరాల పాటు పని చేయించారు. పద్మభూషణ్ శ్రీ వరప్రసాద్ గారు, పద్మవిభూషణ్

అగర్వాల్ పద్మశ్రీ డా॥ కాకర్ల సుబ్బారావుగారు, పద్మశ్రీ పల్లేరామారావు, జస్టిస్ భాస్కరరావుగారు, జస్టిస్ చంద్రకుమార్‌గారు , జస్టిస్ ఈశ్వరయ్యగారు వంటి జడ్జీలు, శ్రీ జి. పుల్లారెడ్డిగారు, డా॥ జె.సి. మహంతి, ఐ.వి. సుబ్బారావుగారు, డా.కె.వి రమణాచార్యగారు, శ్రీమతి దమయంతిగారు, డా॥ మన్మోహన్ సింగ్ ,శ్రీ ముద్దాడ రవిగారు, బుర్రా వేంకటేశంగార్ల లాంటి ఎందరో ఐ.ఎ.ఎస్‌లు, శ్రీ దుర్గాప్రసాద్, మహేష్ భగవత్ గారి లాంటి ఐ.పి.ఎస్ లు, డా॥ పార్ధసారధిరెడ్డిగారు, శ్రీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిగారు, శ్రీ డి.జె రమేష్‌గారి లాంటి పారిశ్రామిక వేత్తలు, ప్రొ. రామకృష్ణయ్య, ప్రొ. సత్యనారాయణ, ప్రొ. కన్నన్‌లాంటి వైస్ ఛాన్సలర్లు, శ్రీ చుక్కా రామయ్య, శ్రీ జి పుల్లారెడ్డిగార్ల లాంటి విద్యావేత్తలు ఎందరెందరో లీడ్ ఇండియా ఉద్యమానికి నాయకులౌతున్నారు. రాష్ట్రంలో టీచర్లు, హెడ్‌మాస్టర్లతో పాటు, 10 లక్షల మంది లీడ్ ఇండియన్స్‌గా మారి, లీడ్ ఇండియా ఆచార్యులుగా చిరపరిచయం జరిగింది. ఈ రోజు 20 కోట్ల మందిని మార్చే మిషన్ 2020 నడిపిస్తున్నారు. ఆచార్యగారు సన్యాసం తీసుకుని కాషాయం ధరించక, తెల్లదుస్తులతోనే సర్వం సన్యసించి, తామరాకుమీది నీటి బొట్టులా ప్రకృతి మాయ ఏదీ అంటకుండా, పరమాత్మ ధ్యానంలో గడిచే జీవితం తరువాత, పరమాత్మలో ఎలా కలసిపోవాలి అనే దిశగా భగవంతుడు నడిపిస్తున్నాడు. ఆయన నమ్మిన భగవంతుడు ఆనాటి ఆ కృష్ణపరమాత్మ... ఈనాటి ఆత్మజ్ఞాన ప్రదాత.

**జీవితాలలో సుఖ - దు:ఖాలు ఎలా?**

చాలా మంది మంచి జరిగితే మన అదృష్టం, చెడు జరిగితే మన దురదృష్టం అంటుంటారు. మనం ఇప్పుడు అన్నీ మంచి చేసినా కొన్నిసార్లు

చెడు జరుగుతుంది. చెడు చేసే వాళ్ళకు మంచి జరుగుతుంది. చెడ్డ వాళ్ళకే మంచి కాలం, కలికాలం అంటారు. అసలు ఇవి ఎలా జరుగుతాయి? అనే ఇలాంటి పరిశోధనే ఆచార్యగారి జీవిత సాధనగా మారింది.

ఆచార్యగారు ఒక్కడే కుమారుడు అవడం వల్ల వారి అమ్మానాన్నలకు వారు ముద్దుల బిడ్డ, గారాలపట్టి. ఆచార్యగారికి వారు బాగా మాంసాహారం పెట్టేవారు. గ్రుడ్లు తినిపించేవాళ్ళు. చాలా ప్రేమగా చూసుకునేవారు. ఆచార్యగారు కొద్దిగా ఎదిగిన తరువాత, గాంధీజీ పుస్తకాలు చదివిన తరువాత, "పశువులను చంపడం మాత్రమే హింస కాదు; మనిషి మనసును నొప్పించడం కూడా హింసే" అనే లోతైన సత్యాన్ని తెలుసుకున్నారు. ఇది వారి మనసును మార్చివేసింది. షిరిడి సాయి జీవిత చరిత్రలో కూడా "మనం తినే తిండిలో, వంట చేయడంలో, గాలి పీల్చడంలో, నడవడంలో, ఇల్లు ఊడ్చడంలో ఎన్నో జీవులు చావడం వలన పంచసూనలు అనగా 5 రకాల పాపాలను చేస్తున్నాం" అని అంటారు. మరి ఇవన్నీ చేయకుండా ఎలా జీవించేది? దీనికి మార్గం ఏమిటి? అని ఆచార్యగారు లోతుగా అధ్యయనం చేశారు. భగవద్గీత ద్వారా మనం ఏ రకమైన హింసలు చేస్తే ఆ రకమైన కర్మలు మనకు కలుగుతాయి అని తెలుసుకున్నారు.

ఒక కోడి తల నరికినప్పుడు ఎంతగా కొట్టుకుని తనువు చాలిస్తుంది? చనిపోయే ముందు అది ప్రాణభయంతో కణకణమూ కంపించి అల్లాడిపోతుంది. కాబట్టి "యథాః అన్నం తథా మనః" అనగా ఏ రకమైన ఆహారం భుజించినచో అదే రకమైన మనసు ఏర్పడుతుంది అనేది వాస్తవం.

అదే విధంగా సైన్సులో 'న్యూటన్స్ సిద్ధాంతాలు చదువుకున్నాము. "ప్రతి చర్యకు సమానమైన, వ్యతిరేకమైన ప్రతి చర్య జరుగుతుంది" అని చదువుకున్నాము. కాబట్టి పశుహింస వలన, పరహింస వలన, మనకే కాదు, మన పిల్లలకు కూడా ఏదో రకంగా జరిగే హింసే మనకు వచ్చే కష్టాలు. మంచి చేసుకోవడం వలన వచ్చే సుఖాలు. ఇదే మన కర్మకు కారణం. ఈ విధంగా మన తలరాత మనమే వ్రాసుకుంటాము." ఇది అర్థం అయిన తరువాత ఆచార్యగారు మాంసాహారం మానేశారు. వారు చెప్పకుండానే వారి భార్య గారు కూడా మానేశారు. ఇక వారి పిల్లలకు అది తెలియనే తెలియదు. వారి పిల్లల నుండి వాళ్ళ భర్తలు, పిల్లలు అందరూ శాకాహారులుగా మారిపోయారు.

వారంతా అమెరికాలో ఉంటున్నా, శాకాహారులుగానే ఉంటున్నారు. సజ్జన సాంగత్యంతో వారంతా సద్బ్రాహ్మణులుగా జీవిస్తున్నారు. ప్రతిరోజూ శాస్త్రజ్ఞులు ఎన్నెన్నో కొత్త విషయాలు కనిపెడుతున్నా, మనిషి లాంటి మరమనిషి (రోబోస్) సైతం కనిపెట్టినా, చంద్రమండలంలో అడుగు పెట్టినా, మన కర్మకు కారణం ఏమిటి ? భార్య తన భర్తనే ఎలా వివాహం చేసుకుంటుంది? తరువాత ఫలానా పిల్లలే ఎలా కలుగుతారు? పిల్లలు పెద్దవారైన తరువాత ఏ చదువులు ఎలా లభిస్తాయి?

'రేపటి రోజుకి రూపం లేదు' అనే దానికి సమాధానం ఏమిటి? వీటన్నిటికీ సైన్స్ దగ్గర సమాధానాలు లేవు. కాని మన సనాతన భారతీయ కర్మ సిద్ధాంతం ఢంకా మ్రోగించి ప్రపంచానికి చాటి అందించింది.


**ఋణానుబంధ రూపేణ పశుపత్నీ సుతాలయ**

**ఋణక్షయే క్షయాయాంతి తత్ర పరివేదనా**

మన జీవితంలో చోటుచేసుకునే ప్రతి సంబంధం, భార్యాభర్తలు, మనం నివసించే ఇల్లు, వాకిలి ఆఖరికి మనం ఇంట్లో పెంచుకునే కుక్క , పిల్లి దేనితోనైనా మన సంబంధాలు ఎలా ఏర్పడతాయి? అసలు ఈ సంబంధాలు ఎంతవరకు నిలుస్తాయి? పరిశోధించండి. కర్మ సిద్ధాంతం అర్థం చేసుకుని, మనం దుష్కర్మలు చేయకుండా, ఎప్పుడూ సుకర్మలు చేయడమే మన అసలైన జీవనం. సిసలైన జీవన విధానం.

ఆచార్యగారు జి .పుల్లారెడ్డిగారి విద్యా సంస్థలలో పని చేస్తున్నప్పుడు, వారి అల్లుడు శ్రీపి.సుబ్బారెడ్డి గారి దగ్గర ఉన్న " డాబర్ మ్యాన్" జాతి కుక్క 6 పిల్లలను కన్నది. వాటిల్లో ఒకటి కావాలని సుబ్బారెడ్డి గారిని అడిగారు ఆచార్య గారు. "మీకు కావల్సింది తీసుకోండి" అన్నారు వారు. ఆచార్య గారు ఆ కుక్క పిల్లలను గమనించి ఏ కుక్క పిల్లను తీసుకోవాలో నిర్ణయించుకోలేక పోయారు. ఎందుకంటే, అవి అన్నీ ఒకే రంగుతో, ఒకే విధమైన గుర్తులతో, ఒకే సైజులో – అన్నీ ఒకేలాగా ఉన్నాయి. చివరికి "రామా ! నీ దయ " అంటూ ఒక కుక్క పిల్లను తీసుకున్నారు.

వారి భార్య ఆ కుక్క పిల్ల కొరకు ప్రత్యేకంగా మాంసం తెప్పించి ఇంట్లో వండి పెట్టేది. కానీ అది తినేదికాదు. ఒక వేళ తిన్నా విరోచనాలతో ఇబ్బంది పడిపోయేది. నిజానికి పాలు, బ్రెడ్ ఇచ్చినప్పుడు అది ఆరోగ్యంగా ఉండేది. ఈ విధంగా వారందరితో పాటు, అది శాకాహారిగానే పెరిగింది. ఈ కుక్క పిల్లతోపాటే పుట్టిన వేరే కుక్క పిల్లలు వాటిని పెంచుకున్న వారి దగ్గర మాంసాహారులుగా పెరిగాయి. ఇక ఆచార్యగారి ఇంట్లో పెరుగుతున్న డాబర్మ్యాన్కి "టోనీ" అని ముద్దు పేరు పెట్టుకున్నారు.



అందరూ బయటకు వెళ్ళిపోయాక ఒంటరిగా ఉ ండే వారి భార్య పద్మావతిగారికి ఈ టోనీనే తోడుగా ఉండేది. మరో ప్రక్క భగవద్గీత ఇంకో తోడు.

ఆమె పూజా మందిరంలో కూర్చుని భగవద్గీత చదివినా, ధ్యానం చేసినా టోనీ ధ్యాన మందిరం ముందే కూర్చుని రెండు కాళ్ళూ ముందుకు చాచుకుని, వాటిపైన తల పెట్టుకుని, కళ్ళు మూసుకుని అది కూడా ధ్యానంలో నిమగ్నమై పోయేది. ఈ విధంగా, అది బ్రతికినన్నాళ్ళు శాకాహారం తింటూ, ధ్యానం చేస్తూ, తన కర్మవిధిని జీవితాంతం నిర్వహించింది. అలాగే పిల్లలకు వివాహం చేయదలచినప్పుడు ఎందరితోనో పెళ్ళి చూపులు జరుగుతాయి. ఎవరితో ఎవరికి వివాహబంధం వ్రాసి ఉందో, అటువంటివాళ్ళు ఒకరిని ఒకరు చూసుకున్నప్పుడు, ఆ చూపుల్తోనే పరస్పరం ఆకర్షితులౌతారు. పెద్దలు అవునన్నా, కాదన్నా, ఎన్ని కారణాలు చూపించినా, ముందుకు వెళ్తారు. వివాహం చేసుకుంటారు. ఆ తరువాత కలిగే సంతానం వలన మంచి చెడులు అనుభవిస్తారు. అంటే ఆ వివాహనిర్ణయానికి కారణం "బుద్ధిః కర్మానుసారిణి! అంటే... ఆ నిర్ణయం బుద్ధి ఎలా తీసుకుంటుంది అంటే, వివాహం తరువాత సంతానం, వారితో బాటు సంసారంలో జరగవలసిన కర్మ ఆధారంగా బుద్ధి పెండ్లి చేసుకోమని పెండ్లిచూపుల సమయంలోనే ప్రేరణ కలిగిస్తుంది.

**వివాహం - కర్మ బంధం**



ఆచార్యగారు వేసవి సెలవుల్లో తమ మేనమామగారి ఇంటికి వెళ్ళేవారు. అక్కడ వారికి 8 మంది మరదళ్ళు ఉండేవారు. అందరూ వారితో ప్రేమగా, చలాకీగా, సరదాగా ఉండేవాళ్ళు. కానీ పద్మావతిగారు మాత్రం మొదటి నుండే వారికి దూరంగా ఉండేవారు. భయం భయంగా ఉండేవారు. ఏ ఆలోచనలూ లేని ఆ రోజుల్లో కూడా ఆమె అందరికీ భిన్నంగా ఉండేవారు. అందుకే ఆచార్యగారు కూడా సహజంగానే శ్రద్ధ చూపేవారు కాదు. ఐతే, ఆమెది సిగ్గో, భయమో ఏదో సరిగ్గా అర్థంకానటువంటి స్థితి మాత్రం వారి మనసులో మిగిలి ఉండేది. రాను రాను ఆచార్యగారి అమ్మ ఆ అమ్మాయినే కోడలుగా చేసుకోవాలని తీర్మానించుకున్నారు. వారి అన్నదమ్ములతోనూ, వారి కుటుంబ సభ్యులతోనూ చర్చలు జరిగాయి. వాళ్ళందరూ ఆచార్యగారి నాన్నగారితో చర్చించారు. కానీ వారి నాన్నగారు ఒప్పుకోలేదు. "నాకు ఒక్కడే కొడుకు. ఈ అమ్మాయి చదువుకోలేదు. మాకు పనికి రాదు. నేను నా కుమారుడికి సహాయంగా ఉండేలా బాగా చదివిన అమ్మాయిని పట్టణ ప్రాంతం నుండి పెద్ద కుటుంబం నుండి ఎన్నుకుంటాను. ఈ పల్లె పిల్లలు నాకు అక్కర్లేదు" అని చెప్పారు. ఇక వారి అమ్మ తన మాట వినమనీ, వారి నాన్న తన మాటే వినమనీ ఎవరికివాళ్ళు ఒత్తిడి చేయసాగారు. 9వ తరగతి నుండే ఆ పోరు ప్రారంభమయింది.

ఆ దశలో ఆచార్యగారు ఈ క్రింది పద్యం వ్రాసుకున్నారు:

పోదోయి... ఈ పోరు పోదోయి...
పొద్దున్నే లేవగనే ఈ పోరు పోదోయి ॥పోదోయి॥
అమ్మ అనును అవ్వగారి పిల్ల అని
నాన్న అనును అవతలి వారి పిల్ల అని ॥పోదోయి॥
అమ్మ చూపును రక్త సంబంధం.
నాన్న చూపును అవతలి వారి బలగం.. ॥పోదోయి॥
కూర్చున్నాను గోడపై పిల్లి వలే ....
ఇటు చూడ అమ్మ ... అటు చూడ నాన్న॥పోదోయి॥
ఇటు చూడ అమ్మ గారి సంబంధం
అటు చూడ బంధువర్గం. ॥పోదోయి॥

సరే... ఆచార్యగారు చదువుల్లో బాగా రాణించసాగారు. మంచి నడవడిక కలిగిన వాడిగా, మంచి పేరు తెచ్చుకున్నారు. వారి నాన్న గారి పేదరికం చూసి, వారి అవసరాలకు అప్పులు ఇచ్చిన, అనేకులు తమ తమ పిల్లల్ని ఇవ్వాలని పోటీ పడ్డారు. ఉద్యోగం వచ్చే వరకు పెళ్ళి చేసుకోనని ఆచార్యగారు వారందరితో గట్టిగా చెప్పారు.

ఆచార్యగారు కోరుకున్నట్లుగానే 1969 ఆగష్టులో " గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, పి.ఎన్.టి ఎకౌంట్స్" లో స్థిరమైన గుమాస్తా ఉద్యోగం లభించింది. ఉద్యోగం వచ్చిన వెంటనే వారి నాన్న గారు ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో, ఒక సివిల్ సర్జన్ గారి కూతురితో సంబంధం కుదిర్చారు. బుధవారం నాడు నిశ్చితార్థం అని నిశ్చయించు కున్నారు. అంతకు ముందు శనివారం రాత్రి ఆచార్యగారి మేనమామలు, ఆ గ్రామ సర్పంచి, 10 మంది పెద్దలు ఇంటికి వచ్చారు. అందరూ కలసి

రాత్రంతా మేనమామగారి అమ్మాయి పద్మావతిగారిని పెళ్ళి చేసుకోవాలని బలవంతపెట్టారు. కానీ ఆచార్యగారి తండ్రిగారు ఎట్టి పరిస్థితిలోనూ చేసుకోమని భీష్మించుకు కూర్చున్నారు. చివరకు వాళ్ళు "నీ ఇష్టం ఏమిటో చెప్పు" అని ఆచార్యగారిని అడిగారు. ఆచార్యగారు "మా అమ్మానాన్నల నిర్ణయమే నా నిర్ణయం" అని బయట పడ్డారు. వారి మేనమామలు మరియు బావమరుదులు "నీవు పరాయి అమ్మాయిని ఎలా చేసుకుంటావో చూస్తాం" అని బెదిరింపులకి దిగారు. ఈలోపుగా ఆచార్యగారి మామగారి రెండవ కూతురు అకస్మాత్తుగా చనిపోయిన మరణవార్త తెలియ వచ్చింది.

రెండు కార్లలో హుటాహుటిన అందరూ వారి అత్తవారింటికి వెళ్ళారు. అక్కడి వాతావరణం ఎంతో దీనంగా, దుఃఖంతో నిండిపోయి ఉంది. మధ్యాహ్నానికి అంత్యక్రియలు పూర్తి అయినాయి. అందరూ తిరుగు ప్రయాణానికి సిద్ధమౌతున్నారు. ఈలోపు వారి మామగారు వచ్చి అకస్మాత్తుగా ఆచార్యగారి కాళ్ళపై పడి చిన్న పిల్లవాడిలా బోరుబోరుమని విలపించారు. అందరూ ఆశ్చర్యంతో వారి చుట్టూ చేరారు.

తరువాత వారి అమ్మ, నాన్న ఏడవడం, బావమరుదులు ఏడవడం, అక్కడి ప్రజలు ఏడవడంతో ఆచార్యగారికీ దుఃఖం ఆగలేదు. వర్ణించలేని దీన స్థితి అది. మేనమామగారు మరింత బోరుబోరున ఏడుస్తూ "నాకు మిగిలింది ఒక్క అమ్మాయే. ఆ అమ్మాయిని చేసుకుంటానని నాకు మాట ఇవ్వు" అని గట్టిగా కాళ్ళు పట్టుకున్నారు. దాంతో, చుట్టూ ఉన్నవారు కూడా ఆచార్యగారిని మాట ఇవ్వమని బలవంత పెట్టారు. వారు తమ నాన్నగారి వైపు చూస్తూ ఏమీ మాట్లాడలేకపోయారు. కొంత సమయం

తరువాత ఆచార్యగారి గుండె కరిగిపోయింది. మామను పైకి లేపుతూ "సరే నేను మీ అమ్మాయినే పెండ్లి చేసుకుంటాను... మీరు లేవండి" అని మాట ఇచ్చారు. ఆ తరువాత అందరూ కార్లో కూర్చున్నారు.

ఆచార్యగారు 'తమ నాన్నగారు ఏమంటారో? వారిని ఎలా ఒప్పించాలో?' అని పరిపరి విధాల ఆలోచన చేశారు. కొద్దిసేపటికి ధైర్యం తెచ్చుకుని "నాన్నా! మామయ్య మన కుటుంబానికి చాలా కాలం నుండి సహాయం చేస్తూ వస్తున్నారు. పైగా, చాలా మంచివారు. అలాంటి పరిస్థితుల్లో ఆయన అలా దీనంగా అడిగేసరికి, కాదనలేక పోయాను. నేను మీ వైపు చూశాను. కాని మీరు మౌనంగా ఉ ండిపోయారు. వాళ్ళందరినీ బాధపెట్టి మనం సాధించేది ఏముంది? చెప్పండి. మీ ఆశీర్వాదం ఉంటే మీకు కొరతలేకుండా మీరనుకున్నట్లు గొప్పగా ఎదుగుతాను. నాకూ, పద్మావతికీ పెండ్లి జరిపించండి. మీరు వెళ్ళి, ఈ పరిస్థితి అంతా వివరించి, ఆ డాక్టరుగారి అమ్మాయితో నా నిశ్చితార్థం ఆపించండి" అని తండ్రిగారితో చెప్పి, ఒప్పించారు.

వారి అమ్మ "నీది మంచి నిర్ణయం నాన్నా ! మామగారు మనకి చాలా సహాయం చేశారు. పద్మావతి కూడా చాలా మంచి అమ్మాయి. నలుగురికీ మీరు ఆదర్శ దంపతులౌతారు" అని ఆచార్యగారు తీసుకున్న నిర్ణయాన్ని కొనియాడారు. వారి నాన్న వారిద్దరినీ ఇంటి వద్ద దింపివేశాక, నేరుగా డాక్టరు గారి ఇంటికి వెళ్ళి అతి కష్టం మీద నిశ్చితార్థం ఆపించారు. అయినా వాళ్ళు వదలకుండా ఆచార్య నాన్న గారిని కొంత ఇబ్బంది పెట్టారు.

ఈ విధంగా "పద్మావతీ సుదర్శన్‌ల వివాహం" ఏడుజన్మల

అనుబంధం అయ్యింది. ఫిబ్రవరి 18,1971 నాడు వారి కళ్యాణం ముక్కోటి దేవతల దీవెనలతో కన్నుల పండువగా జరిగింది.

**సంకల్పబలంతో సత్సంతాన మార్గం**

1970 నుండి ప్రభుత్వాలన్నీ పౌరులు కుటుంబ నియంత్రణ చేయించుకోవాలని ముమ్మరంగా ప్రచారం చేశాయి. అప్పుడే పెళ్ళి అయిన ఆచార్యగారు 'సనాతన భారతీయులు ఏ విధంగా సంతానాన్ని కనేవారు? ఈ కుటుంబ నియంత్రణ ఎక్కడి నుండి వచ్చింది? దీనికి భారతీయ విధానం ఏమిటి? మన వేదవిజ్ఞానం, పురాణాలు ఏమి చెబుతున్నాయి?' అని పరిశోధించడం మొదలు పెట్టారు.

నాడు దశరథ మహారాజు ముగ్గురు భార్యలను చేసుకున్నప్పటికీ, చాలా కాలం సంతానం కలగక బాధ పడ్డారు. వశిష్ఠుల వారు చెప్పిన "పుత్రకామేష్టి యాగం" చేసిన తరువాతనే, ముగ్గురు భార్యలకు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు జన్మించారు. అప్పటి రామాయణ కాలం మొదలుకుని సద్గురు సాయినాథుని కాలం వరకు కావలసిన సంతానాన్ని పొందిన ఉదంతాలను పరిశీలించడం మొదలు పెట్టారు.

'అష్టావక్రుడు, శుకమహర్షి, అభిమన్యుడు తల్లి గర్భంలోనే ఏ విధంగా విద్యను అభ్యసించారు?' అని వేదాలు, పురాణాలు, చరిత్ర మొదలు అధునాతన కామ శాస్త్రాలన్నీ పరిశోధించారు.

ఒకరోజు దినపత్రికలో హరిద్వార్ నుండి వచ్చిన స్వరూపానంద్ బాబాజీ అనేక సిద్ధులు పొందినవారనీ, వారు పాతపట్నం అలియాబాద్‌లో నీటిపై యోగాసనాలు చేస్తారనీ చదివి, ఆచార్యగారు తమ మిత్రులతో పాటు అక్కడికి వెళ్ళి, వారి ప్రదర్శనలు చూశారు. తరువాత వారితో

మాట్లాడిన దరిమిలా ఆకర్షితులై, వారితో అనేక విషయాల గురించి దీర్ఘంగా చర్చించారు. "కొన్ని సిద్ధులు మీకు ఉపయోగపడతాయి. నేను మీకు బోధించగలను" అని అన్నారు. బాబా ఆచార్యగారు మరికొంత మంది మిత్రులతో కలసి రామమందిరంలో వారికి విడిది ఏర్పాటు చేశారు. వారి ద్వారా ఉన్నతమైన యోగా శిక్షణ పొందారు. భార్యాభర్తల జన్మ నక్షత్రాలను బట్టి, ఋతుకాలాన్ని బట్టి, ఇష్టదైవాన్ని పూజించి, పున్నమి వెన్నెలలో ఆవు పిడకలతో పాలు కాసి, చంద్రునికి నైవేద్యం ఇచ్చి, సంతానలక్ష్మిని ప్రార్థించి, తమకు కావలసిన సద్గుణ సంపద, అందమైన ఆకారం, రంగుతో కూడిన వాంఛిత సంతానాన్ని సంకల్పించాలనీ, గాలిని దీర్ఘంగా పీల్చి కుంభించి, మూలబంధంతో మనసుని నిగ్రహించుకుని, ఖేచరీ ముద్ర వేసి చేయవలసిన సాధన విషయాల గురించీ వారం రోజుల పాటు ఆచార్యుల వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు బాబా. ఆచార్యగారు అన్నీ చేశారు కాని ఖేచరీ ముద్ర వేయలేకపోయారు.

ఇది మరుగున పడిపోయిన ఒక మహావిద్య. గృహస్థులు బ్రహ్మచర్యాన్ని పాటించడానికి శ్రేయస్కరమైన ధర్మ మార్గం. ఈ విద్య ఆచార్యగారి జీవితంలో శక్తి ప్రచోదకంగా మారింది. ఆ విధంగా ఆచార్యగారు ఈ విద్యని 8 సంవత్సరాలపాటు పరిశోధించారు. "సిద్ధ సమాధి యోగా అకాడమి " వ్యవస్థాపకులు శ్రీ ఋషి ప్రభాకర్ గురుజీ, శ్రీ రవి గురుజీతో కలసి ఆచార్యగారు చేసిన పరిశోధనలను జోడించి, తల్లి గర్భంలో ఉన్నప్పుడు సత్సంతానానికి విద్యాబోధన అందే విధానం ప్రీనేటల్ ఎడ్యుకేషన్ పై పరిశోధించారు. ఇప్పటికీ అది ఎంతో గొప్పగా,

ఒక అపురూప కానుకగా ఎదిగింది.

**అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చు**

1969లో పి.ఎన్.టి ఎకౌంట్స్‌లో ఆచార్యగారు చిన్న గుమాస్తా (ఎల్.డి.సి)గా ప్రభుత్వ ఉద్యోగం పొందారు. కొద్ది రోజులలోనే ఆ సంస్థలో ఆఫీసర్‌గా ఉన్నత పదవి ఎలా పొందడం అని పరిశోధించడం ప్రారంభించారు. చార్టర్డ్ ఎకౌంటెంట్స్ (సి.ఎ), కాస్టు ఎకౌంటెంట్స్ (ఐ.సి.డబ్లూ.ఎ.ఐ)తో సమానమైన పరీక్ష సబార్డినేట్ ఎకౌంట్స్ సర్వీస్ (ఎస్. ఎ.ఎస్) అనే పరీక్షలో ఉత్తీర్ణులైతే గుమాస్తా నుండి ఎకౌంట్స్ ఆఫీసర్ అవవచ్చునని తెలుసుకున్నారు. అది జాతీయ స్థాయిలో జరిగే పోటీ పరీక్ష. దేశం మొత్తం మీద ఎన్ని ఖాళీలు ఉంటే, అంతమందినే మెరిట్ ర్యాంక్ ద్వారా ఎంపిక చేస్తారు. కనుక ఉత్తీర్ణత కేవలం 5% లోపుగానే ఉంటుంది. ఇది ఇంటర్మీడియట్ , ఫైనల్ రెండు విభాగాలుగా జరుగుతుంది. ఆచార్యగారు ఆ పరీక్ష వ్రాయాలని నిర్ణయించుకున్నారు. కాని దానికి కనీసం 3 సంవత్సరాలు పనిచేసిన తరువాతనే అర్హత వస్తుందని తెలిసింది. తనకు ఇచ్చిన పని తాను చేసుకుంటూ, అధికారులను ఇంకా క్రొత్త పని ఇవ్వమని అడిగేవారు. ఆ పనిని తీసుకుని పనిచేసి వారందరి మన్ననలు పొందేవారు. 3 సంవత్సరాలు పూర్తికాగానే దరఖాస్తు చేసుకున్నారు. కాని ఎంత చెప్పినా పై అధికారి ఆ దరఖాస్తును పరీక్షా విభాగానికి పంపలేదు. అప్పుడు ఆచార్యగారు ఉద్యోగ సంఘనాయకుల ద్వారా వత్తిడి తెస్తే, ఆ అధికారి "నేను 15 సంవత్సరాల తరువాత కానీ ఈ పరీక్ష వ్రాయలేదు. ఈ పరీక్ష వ్రాయడానికి కేవలం

6 సార్లు మాత్రమే అనుమతి ఇస్తారు. ఇతను 3 సంవత్సరాలకే పరీక్ష వ్రాస్తే తరువాత అవకాశం ఉండదు అని పంపలేదు" అని అన్నారు. అప్పుడు ఆచార్యగారు "ఫరవాలేదు. పంపండి" అని దరఖాస్తు చేయించుకున్నారు. అప్పటికే ఆచార్యగారి ఇద్దరు పిల్లలు పెద్దవారైనారు. తల్లి, తండ్రి, భార్యాపిల్లలను వదలేసి శ్రీ కె. ప్రకాశ్‌బాబుగారితో కలసి బయట గది తీసుకుని, 3 నెలలు సూర్యోదయం సూర్యాస్తమయం చూడకుండా కఠోర తపస్సు చేసి పరీక్ష వ్రాశారు.

ఆచార్యగారు ఆ పరీక్షలో అన్ని సబ్జెక్టులలో ఉత్తీర్ణులు అయినారు కాని ఆ పరీక్షల్లో కావలసినన్ని మొత్తం మార్కులు రాక ఉత్తీర్ణత పొందలేక పోయినారు. మరో సంవత్సరం అదే విధంగా 3 నెలలు సెలవు తీసుకుని, ఒక గది తీసుకుని, మళ్ళీ బాగా కష్టపడి పరీక్ష వ్రాశారు. ఈసారి ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా ఇంటర్మీడియట్, ఫైనల్ పరీక్ష కూడా 3 నెలలు సెలవు పెట్టుకుని కుటుంబాన్ని వదిలి, కష్టపడి వ్రాశారు.

మొత్తం మార్కులు రాక ఉత్తీర్ణత సాధించలేకపోయినారు. రెండవసారి అదే విధంగా కష్టపడి చదివి వ్రాసి, ఎస్.ఎ.ఎస్ 1977 బ్యాచ్‌లో ఉత్తీర్ణులు అయినారు. ఉత్తీర్ణులు అయిన తరువాత పదోన్నతికి ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీలు లేవు. ఖాళీలు వచ్చే వరకు ఆగితే ఆల్ ఇండియా లెవెల్లో ఎకౌంట్స్ ఆఫీసర్ సీనియారిటీలో వెనుకపడవలసి వస్తుంది. అమ్మానాన్నను ఎలాగో ఒప్పించి అందరినీ వదిలేసి మధ్యప్రదేశ్ వెళ్ళారు. దాంతో ఆచార్యగారి తండ్రి గారు వారి గురించి చింతించి రోగగ్రస్తులైనారు. ఆ విషయం తెలిసిన ఆచార్య గారు తండ్రిపైన ఉన్న

మమకారంతో ఏ విధంగానైనా హైదరాబాద్ రావాలని కృషి చేశారు. అదృష్టవశాత్తు ఐ.డి.పి. ఎల్, హైద్రాబాద్‌లో ఎకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాలు పడినాయి. దానికి ఆచార్యగారు దరఖాస్తు పెట్టుకున్నారు.

ఇంటర్వ్యూ కమిటీలో తాను ఇది వరకు పనిచేసి మన్ననలు పొందిన శ్రీ ఎస్. బాలసుబ్రమణ్యన్ (ఐ.ఎ అండ్ ఎ.ఎస్) గారు ఉన్నారు. వారు బోర్డు సభ్యులకు ఆచార్య గారి పనితనం గురించీ, అంకితభావం గురించీ చెప్పారు. వారంతా ఆచార్యగారిని ఎంపిక చేయడమే కాక, 4 అడ్వాన్స్ ఇంక్రిమెంట్స్ సైతం ఇచ్చి, హైదరాబాద్‌లో ఉద్యోగం ఇచ్చారు. ఎప్పుడైనా, ఎక్కడైనా, మనం పడిన కష్టానికి ఏనాటికైనా ఫలితం లభిస్తుంది.

**ధర్మం దిశనే మార్చేస్తుంది**

ఐ.డి.పి.ఎల్ లో సాఫీగా పని సాగుతూ సీనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది, ఎకౌంట్స్ డిపార్టుమెంట్‌లో ఐ.డి.పి.ఎల్ కు ఆర్థికపరమైన మంచి సేవలు చేసే అవకాశం వచ్చింది. కానీ ఉత్పత్తి, వ్యాపారము తగ్గి, కంపెనీ మూసివేసే స్థితి వచ్చింది. మరణించిన శవాన్ని నక్కలు పీక్కుతిన్నట్లుగా పైనుండి క్రింది వరకు

అందరూ పీక్కుతినే అవినీతిపరులకు ఆచార్యగారు ఒక కొరకరాని కొయ్యగా మారారు. దొంగ మందుల బిల్లులు (ఫాల్స్ మెడికల్ బిల్స్) దర్యాప్తు చేసి, నివేదిక పంపవలసినదిగా ఢిల్లీ కేంద్ర కార్యాలయం నుండి ఆచార్యగారికి రహస్య ఆదేశాలు అందాయి. ఈ దర్యాప్తు జరపడానికి అందరితో పాటు 5 గంటలకు ఇంటికి వెళ్ళి భోంచేసి, తిరిగి 7 గంటలకు కార్యాలయానికి వచ్చి, తెల్లవారు జామున 2-3 గంటల

వరకు ఎవరికీ తెలియకుండా రహస్యంగా పని చేసి, రూ. 16 లక్షల అవినీతి నివేదికను కేంద్ర కార్యాలయానికి అందించారు ఆచార్యగారు. ఈ రహస్య విచారణ ఆచార్యగారు చేశారని తెలుసుకున్నవారు దారిలో వారిపై  రౌడీల చేత దాడి చేయించారు.

అయినా ఆచార్యగారు తమ వృత్తి నిర్వహణని ధర్మబద్ధంగా, నిర్భయంగా చేస్తూ వచ్చారు. కొన్నాళ్ళకు కంపెనీ ఉత్పత్తి పూర్తిగా మూలపడడంతో అందరు ఉద్యోగులూ పనికి రావడం మానేసి ఎల్.ఐ.సి, చిట్‌ఫండ్స్ తదితర పార్టుటైం ఉద్యోగాలు ఎవరికి తోచినవి వారు చేసుకోవలసిన దుస్థితి దాపురించింది. ఆచార్యగారికి " రోజూ రావడం, ఖాళీగా కూర్చోవడం, నెల జీతం మాత్రం సక్రమంగా తీసుకోవడం అనే పరిస్థితితో ఒక విధమైన బాధ ప్రారంభమయ్యింది. ఇటు ప్రభుత్వ ఉ ద్యోగం వదులుకోలేరు. మరో ప్రక్క పిల్లలు ఉన్నత విద్యలకు, వివాహాలకు వచ్చారు. డబ్బు అవసరం. కానీ " నేను తీసుకునే డబ్బు, పని చేయకుండా తీసుకోవడం వల్ల ప్రభుత్వానికీ, ప్రజలకూ ఋణగ్రస్తుడ్ని అవుతున్నాను" అనే ఆవేదన ఆచార్యగారిని అణువణువునా ఆవేదనకు గురి చేసింది. ఆ ఉద్యోగంలో అలాగే కొనసాగితే కంపెనీ ఫైనాన్స్ డైరెక్టర్ వరకు ఎదిగే అవకాశాలు ఉండినవి. కానీ  దాని కంటే ధర్మమార్గమే శ్రేష్టమని నిర్ణయించుకున్నారు ఆచార్యగారు.  ఆ దశలో కంపెనీకి వి.ఆర్.యస్ పెట్టి పదవీ విరమణ చేశారు. "మూడు  నెలలలో సొంతంగా  పాఠశాల పెట్టి, వచ్చిన ఆదాయంతో కుటుంబ బాధ్యతలను తీర్చుకుందాం"  అని దీక్షబూనారు. వ్యక్తిగతంగా కష్టమైనా, ఇబ్బందయినా,  కుటుంబ పరంగా

ఇబ్బందయినా, ఆచార్యగారికి తన ధర్మాన్ని నిర్వర్తించిన తృప్తి మిగిలింది. తర్వాత కలాంగారితో కలిపి, జీవితానికో గొప్ప దిశనిచ్చింది.

**ఉద్యోగమా? భాగస్వామ్యమా? లేక సొంత వ్యాపారమా?**




25 ఏళ్ళు పాటు చేసిన ప్రభుత్వ ఉద్యోగాల నుండి విడుదలై, సొంతంగా పాఠశాల పెట్టుకుని, ఇక మీదట నలుగురికీ ఉద్యోగాలు ఇవ్వాలనే సంకల్పం నింపుకుని, పాఠశాల కొరకు అద్దె భవనాలను వెతకసాగారు. ఈ విషయం తెలిసిన శ్రీ జి. పుల్లారెడ్డిగారు ఆచార్యగారిని పిలిపించారు. “మా పాఠశాలను నడుపుట కొరకు నీవంటి వారి కోసమే వెతుకుతున్నాను. నీకు కావలసిన వేతనం నేను ఇస్తాను రండి” అని అడిగారు. అప్పుడు ఆచార్యగారు “నేను ఉద్యోగిగా చేరను... భాగస్వామిగా అయితే చేరతాను” అన్నారు. అప్పుడు శ్రీ జి. పుల్లారెడ్డిగారు “భాగస్వామి ద్వారా నేను చాలా నష్టపోయాను, ఇక మీదట భాగస్వామ్యం చేయనని నిర్ణయించుకున్నాను” అని అన్నారు. అప్పుడు ఆచార్యగారు “25 సంవత్సరాలు ఉద్యోగం చేశాను. అందుకే ఇక మీదట ఉద్యోగం చేయనని నిర్ణయించుకున్నాను” అని అన్నారు. ఈ విధంగా ఇద్దరూ ఒక ఒప్పందానికి రాలేకపోయారు. అయినా శ్రీ జి. పుల్లారెడ్డిగారు పట్టుదలగా కారు పంపించి, ఆచార్యగారిని అల్పాహారానికి ఇంటికి పిలిచి “ఏదైనా ఒక మాట చెప్పు. నీకు ఏమి కావాలో తీసుకో” అని పట్టుదలతో రెండు నెలలు మంతనాలు సాగించారు. చివరకు ఆచార్యగారు కార్ల్ మార్క్స్ సిద్ధాంతం ప్రకారం “చేయగలిగినంత పని చేయాలి. అవసరం ఉన్నంత

డబ్బు తీసుకోవాలి” అనే పద్ధతి ప్రకారం “మీ విద్యాలయాలు నా విద్యాలయాలుగా భావిస్తాను. కష్టపడతాను. అభివృద్ధి చేస్తాను. నాకు కావలసిన పారితోషికం తీసుకుని, మిగిలినది మీకు ధర్మబద్ధంగా లెక్కలతో అప్పగిస్తాను. విద్యాలయాల నిర్వహణలో పూర్తి స్వాతంత్ర్యం, అధికారం ఇవ్వాలి. మాపై నమ్మకం ఉంచాలి” అని ఆచార్యగారు చెప్పిన ప్రతిమాటకు శ్రీ పుల్లారెడ్డిగారు ఒప్పుకున్నారు.

ఆచార్యగారు 1993 నుండి 1999 వరకు జి. పుల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్, కరస్పాండెంటుగానూ, జి. పుల్లారెడ్డి ట్రస్టు అడ్మినిస్ట్రేటర్‌గానూ బాధ్యతలు చేపట్టారు. అలా బాధ్యతలు చేపట్టినప్పుడు జి. పుల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో అప్పటికి కేవలం 76 మంది విద్యార్థులు ఉండేవారు. ఆ సంఖ్యను 5 సంవత్సరాలలో 1800 వరకు పెంచారు. అదనంగా జి. పుల్లారెడ్డి ఫార్మసీ కళాశాల, జి. పుల్లారెడ్డి డిగ్రీ మరియు పి.జి కళాశాలలు, జి. నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాలల స్థాపనకు, ఎదుగుదలకు కారకులయ్యారు. 25 సంవత్సరాల పాటు ఎకౌంట్స్ విభాగంలో పనిచేసిన ఆచార్యుల వారు 5 సంవత్సరాలలో ఒక విద్యావేత్తగా ఎదిగి పిహెచ్.డి.సాధించి జీవితానికి ఓ కొత్త మలుపుని ఇచ్చింది.

**అభిరుచి జీవన దశను మారుస్తుంది.**



గురుతుల్యులు శ్రీ సాయిగంగా మహాదేవ్ గురూజీ అనుయాయులైన శ్రీ పసనూరి శ్రీనివాస్ రవిశంకర్ మొట్టమొదటిసారి ఈ- కామర్సులో బిజినెస్ హైటెక్ సిటిలో “ మహాదేవ్.కాం” ప్రారంభించారు. వారికి ఆచార్యగారు అత్యంత

ప్రీతిపాత్రులు. తాము లేని సమయంలో ఆచార్యగారి ఆధ్వర్యంలో పని చేయాలని బోధించి వెళ్ళారు. అందుకు వారు ఆచార్యగారిని ఆ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సి.ఓ.ఓ) గా నెలకు లక్షా యాభై వేల గౌరవవేతనంతో 1999లో భాగస్వామిగా చేర్చుకున్నారు. ఆ సమయంలో ఆచార్యగారు సాఫ్ట్‌వేర్ ప్రపంచంలోని భోగభాగ్యాలన్నీ చూశారు. కాని అవి వారికి తృప్తిని ఇవ్వలేదు. అది తమకు తగదని తెలిసివారు బయటకు వచ్చారు.

కొంతకాలంగా సాగుతున్న మానవ విలువల గురించిన వారి పరిశోధన భారతీయ సనాతన సంస్కృతిపై ఆధారపడి ఉంది. దీనిని అమెరికా, ఐరోపా సంస్కృతులతో పోల్చి పరిశోధించమని యూనిసెఫ్ వారు రెండు సంవత్సరాల ప్రాజెక్టు ఇచ్చారు. ఆ విషయం చెప్పడానికి ఆచార్యగారు శ్రీ జి.పుల్లారెడ్డిగారి దగ్గరకు వెళ్ళారు.

ఆ సమయంలో ఒయాసిస్ స్కూల్ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి, మూసివేసే దశకు వచ్చింది. అప్పుడు ఆయన ఆచార్యగారిని శ్రీ జి.పుల్లారెడ్డి విద్యాసంస్థలు అభివృద్ధి చేసినట్లుగా, అదే ఒప్పందంతో ఒయాసిస్ స్కూల్‌ను అభివృద్ధి చేయమని అడిగారు. వారి మాట కాదనలేక 2001లో "ఒయాసిస్ స్కూల్" ప్రిన్సిపాల్ మరియు కరస్పాండెంటుగా బాధ్యతలు చేపట్టారు. ఆ బాధ్యతలతో వారు అమెరికా వెళ్ళలేక పోయారు. ఈలోపు 2003లో రాష్ట్రపతి డా.అబ్దుల్ కలాం గారితో పరిచయం ఏర్పడటంతో లీడ్ ఇండియా 2020 ఫౌండేషన్ స్థాపించి, ఒయాసిస్ స్కూల్‌కు రాజీనామా చేశారు.




కాని శ్రీ జి.పుల్లారెడ్డిగారు ఒప్పుకోలేదు. దాంతో లీడ్ ఇండియా 2020 "మీ అభివృద్ధే దేశాభివృద్ధి" శిక్షణ కార్యక్రమాలకు ఒయాసిస్ స్కూల్‌ని కేంద్రంగా చేసుకుని, రాష్ట్రవ్యాప్తంగా శిక్షణలు ఇస్తూ, మరో ప్రక్క ఒయాసిస్ స్కూల్‌ను 112 మంది నుండి 1800 మంది విద్యార్థుల సంఖ్య వరకు అభివృద్ధి చేసి, శంషాబాద్‌లో మరొక శాఖ పెట్టి అక్కడ 1100 మంది విద్యార్థుల వరకు అభివృద్ధి చేయడం జరిగింది.

2013లో లీడ్ ఇండియా 2020 ఉద్యమానికి తోడుగా, లీడ్ ఇండియా భారత రత్నాస్ చైన్ అఫ్ స్కూల్స్ ప్రారంభం చేసి, ఒయాసిస్ స్కూల్ నుండి డిసెంబర్ 2015న పదవీ విరమణ చేశారు. 2001 నుండి 2015 వరకు అటు ఒయాసిస్ స్కూల్స్ అభివృద్ధి, ఇటు లీడ్ ఇండియా ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి ప్రయాణంలో వారి జీవితానికి ఒక గొప్ప గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఎంతో తృప్తిని సైతం ఇచ్చాయి. ఇది కేవలం దైవ అనుగ్రహం!

**ప్రాణం కన్న - ధర్మం మిన్న**

జి.పుల్లారెడ్డి ట్రస్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా (ఎ.ఒ)గా పనిచేస్తూ విద్యాలయాలకు ప్రిన్సిపాల్ మరియు కరస్పాండెంట్‌గా బహువిధాల బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్భంలో జి. పుల్లారెడ్డి విద్యాసంస్థలకి

చెందిన 5 ఎకరాల భూమి మెహిదీపట్నంలో రెండు పార్టీల మధ్య తగాదాలలో ఉండేది. అందుకు సంబంధించిన అనేక సంఘటనలని ఎదుర్కొన్నారు.

**1వ సంఘటన:** ఒక ఆదివారం రోజు, ఒక పార్టీ ఇంట్లో లేని సమయంలో తన బలగాన్ని పెట్టి తగాదాలో ఉన్న భూమి ఫెన్సింగ్ తీయించారు శ్రీ జి.పుల్లారెడ్డిగారు. తరువాత ఆచార్యగారి గదిలో కూర్చుని మాట్లాడుకుంటు న్నారు. అప్పుడు కేవలం ఒక వాచ్‌మెన్, ఒక ఆయా మాత్రమే వారి వద్ద ఉన్నారు. వారిద్దరూ పరుగెత్తుతూ వచ్చి ఫెన్సింగ్ తీసేసిన పార్టీవారు కర్రలు, పలుగులు, ఇతర మారణాయుధాలతో "పుల్లారెడ్డి ఎక్కడ? ఎ.ఒ. ఎక్కడ? చంపేస్తాం!" అని పరుగెత్తుకొస్తున్నారు సార్" అని అన్నారు.

జి. పుల్లారెడ్డిగారు "మేము వెళ్ళిపోయాము, మేము ఎవ్వరం లేము" అని చెప్పండి అని వాళ్ళను పంపించి వేశారు. తలుపులు వేసి, లైట్లు ఆర్పివేసి, "మీరు ధైర్యంగా ఉండండి" అని పుల్లారెడ్డిగారికి ధైర్యం చెప్పి, ఆచార్యగారు లేచి వెనుకవైపు నుండి తలుపులు బిగించి గట్టిగా పట్టుకున్నారు. వాళ్ళు అవతలి వైపు నుండి కర్రలతో బాదారు. 'లేరు' అనుకుని కొద్ది సమయానికి వెళ్ళిపోయారు. తరువాత మెల్లగా ఆయా, వాచ్‌మెన్‌లు వచ్చారు. డ్రైవర్‌కి ఫోన్ చేసి కళాశాల వెనుక వైపుకి కారు తెప్పించుకుని, మెల్లమెల్లగా ఇద్దరూ చీకటిలో బయటపడ్డారు. ఆచార్యగారి సమయస్ఫూర్తి, ధైర్యం, భగవంతుడిపై నమ్మకం వారిని కాపాడాయి.

**2వ సంఘటన:** మరొక తగాదాలో కోర్టులో ఎప్పుడు కేసు వాయిదా ఉన్నా, ఎప్పుడు పోలీస్ వాళ్ళు దర్యాప్తుకు వచ్చినా, ఆచార్యగారు తగిన

పత్రాలు చూపించి మాట్లాడే వారు. "వాళ్ళు రాకుండా ఎప్పుడూ నీవే ఎందుకు వస్తావ"నీ, రావద్దనీ బెదిరించేవాళ్ళు. అయినా ఆచార్యగారే వెళ్ళేవారు. తరువాత వాళ్ళు ఆచార్యగారి భార్యా పిల్లలకు ఫోన్ చేసి, "మీ నాన్న ఆఫీస్‌కి వస్తే చంపేస్తామ"ని బెదిరించేవాళ్ళు. అయినా ఆచార్యగారి భార్యా పిల్లలు ఎంత ఆపినా, "ఏమీ కాదు, మీరు ఏమీ భయపడవద్దు, మనకు దేవుడు ఉన్నాడు" అని తెగించి మొండిగా వెళ్ళేవారు. ఒకరోజు ఆ పార్టీ యజమాని ఆచార్యగారి దగ్గరకు వచ్చాడు. మేము భూమి లావాదేవీలు చేస్తాము. మాకు అడ్డు వచ్చిన వారిని చంపడానికి మా వద్ద కిరాయి హంతకులు ఉంటారు. హతమార్చి వాళ్ళు చెరసాలకి వెళ్తే వాళ్ళ కుటుంబాలను మేము పోషిస్తాము. మీకు ఎంత డబ్బు కావాలో చెప్పు ఇస్తాము. మొండికేసి వచ్చావంటే మా వాళ్ళు ఇక్కడికిక్కడే నిన్ను చంపేస్తారు" అని బెదిరించారు. ఆచార్యగారు మొండిగా "నా చావు ఏ రోజు ఏ విధంగా వ్రాసి ఉంటే ఆరోజు, ఆ విధంగా వస్తుంది. ఇది దేవుడు వ్రాసిన రాత. దానిని మనుషులు మార్చలేరు. న్యాయమైన మా హక్కు కొరకు పోరాడటమే నా ఉద్యోగ ధర్మం" అని నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. "నీవు మూర్ఖుడివి. నీకు కాలం మూడింది. ఆఖరుసారి చెప్తున్నాం. నా మాట విను. నీ పిల్లలు అనాథలు అవుతారు" అని హెచ్చరించి వెళ్ళిపోయారు.

కొద్ది రోజులైన తరువాత ఒక రోజు సాయంత్రం 6 గంటలకు అందరూ వెళ్ళిపోయినా ఆచార్యగారు తమ గదిలో తమ పని తాము చేసుకుంటున్నారు. నలుగురు గూండాలు, బారెడు మీసాలు, గడ్డాలు, కర్కశమైన ముఖం, ఎర్రబారిన కళ్ళు, విభిన్నమైన వేషధారణతో వచ్చారు.

ఇద్దరు బయట గేటు దగ్గర నిలబడ్డారు. ఇద్దరు ఆచార్యగారి వైపుకు వస్తూ, ఒకడు తలుపు దగ్గర నిలబడ్డాడు. మరొకడు అరుస్తూ వారి వైపు వస్తూ కత్తి తీశాడు. “అరే! అచ్ఛా బోలే తో సున్తే నహీం ఆజ్ తేరే కో మార్ డాలేంగే” (నీవు మంచిగా చెప్తే వినవురా...ఈరోజు నిన్ను చంపేస్తాము) అంటూ ముందుకు దూసుకొచ్చాడు. ఆచార్యగారు భగవంతుడికి సమర్పణ అయిపోయి, వారి కళ్ళలోకి దృష్టిని ప్రసరింప చేస్తూ, “భయ్యా ఏక్ మినిట్ మేరా ఏక్ బాత్ సునో, మేరే పాస్ హథియార్ నహీ... ఏక్ బార్ సున్... ఫిర్ జో కర్నాహై కరో... సునో సునో సునో ప్లీజ్ ప్లీజ్” (సోదరా ఒక్క నిముషం వినండి. నా దగ్గర ఏ ఆయుధం లేదు. నేను చెప్పేది మీరు వినండి. తరువాత మీరు ఏమి చేయాలనుకుంటారో చేయండి.) అని వాళ్ళను చూస్తూ అన్నారు. తలుపు దగ్గర ఉన్నవాడు “అరే ఠహరో ఓ కుఛ్ బక్రాహై (వాడేదో వాగుతున్నాడు విను) అన్నాడు. ఆచార్యగారు “భయ్యా ఆప్ భీ ఆవో.. జరా బైఠో ఏక్ బార్ సునో ఏక్ బార్ సునో మెహర్‌బానీ కరో ఖుదా ఆప్‌కో అచ్ఛా కరేగా” (కొంచెం మీరు కూడా ఇలా రండి. వచ్చి కూర్చోండి, దయచేసి రండి. భగవంతుడు మీకు మేలు చేస్తాడు. రండి. కూర్చోండి. ఒక్కమాట వినండి) అని అన్నారు. దేవుని దయవల్ల సానుకూలంగా స్పందించి, వాళ్ళంతా వచ్చి కూర్చున్నారు. వాళ్ళకు పాపం, పుణ్యం, కర్మఫలం, చంపడం వల్ల వాళ్ళ పిల్లలకు వాటిల్లే కష్టాల గురించి చెబుతూ అంతరాత్మను ప్రబోధిస్తూ వారి కళ్ళలోకి చూస్తూ దృశ్యశక్తిని ప్రేరేపిస్తూ వారి మనసు మార్చే ధర్మప్రబోధం చేశారు. కొద్ది సమయం తరువాత వాళ్ళు “సాబ్ ఆజ్ ఆప్ కో మార్‌కే గల్తీ కా కాం హో జాతా

థా.. మాఫ్ కర్నా" (ఈ రోజు మిమ్మల్ని చంపి, మహా పాపం చేసేవాళ్ళము. మమ్మల్ని క్షమించండి) అని అన్నారు.

**గీతా శ్లోకం:** అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే తేషాం నిత్యాభియుక్తానాం యోగ క్షేమం వహామ్యహమ్

**అర్థం :** "నన్నే నిరంతరం అనన్య భక్తితో చింతన చేస్తూ నిష్కామ భావంతో ఎవరైతే సేవించుకుంటూ ఉంటారో, వారి యోగ క్షేమాలను నేనే చూసుకుంటూ ఉంటాను. అని భగవంతునికి సమర్పణం చేసుకుని, సంపూర్ణ సాధనాశక్తితో, ఆత్మశక్తిని జాగృతం చేసి దృశ్యశక్తిగా, వాక్శక్తిగా మార్చి, సంపూర్ణంగా భగవంతుడికి సమర్పణ అయిపోయినప్పుడు ఆ భగవంతుడు ఏవిధంగా రక్షిస్తాడో అనుభవించిన ఘడియలను ఈ రోజు తలచుకుంటుంటే గగుర్పాటు కలుగుతుంది అంటారు ఆచార్యగారు.

శ్రీరామ రక్ష సర్వజగత్ రక్ష.

**గాంధీజీని బాపూజీ అని ఎందుకు అంటాం?**

గాంధీజీ గొప్ప న్యాయవాది. మన దేశ స్వాతంత్ర్య సేనాని. వారి విజయాలన్నిటకీ మూలం వారు సాధించుకున్న ఆత్మ శక్తి. స్వాతంత్ర్య సంగ్రామం జరుపుతున్న సమయంలో, ఏ కష్టం వచ్చినా భగవద్గీతను తెరిచి చూసేవారు. ఆ తెరిచినటువంటి పేజీలో ఆ సమస్యకు పరిష్కారం దొరికేది. భగవద్గీతని మనం స్నానం చేసి, మడి, ఆచారాలతో మందిరంలోనే చదవాలనుకుంటాం. కానీ గాంధీజీ గీతాతత్వాన్ని ఎరిగిన వారు కాబట్టి.

**న శరీర మలత్యాగాత్ నరో భవతి నిర్మలః**
**మానసేతి మలోత్యక్తాత్ తతో భవతి నిర్మలః"**

"బాహ్య శరీరాన్ని సబ్బులు, షాంపూల సాయంతో శుభ్రం చేసుకుని మనుషులందరూ నిర్మలమైనామని భావిస్తారు. నిజానికి బాహ్య శరీరాన్ని నడిపించే మనసు, దాని లోపలి మాలిన్యాలను శుభ్రం చేయడం వల్లనే నిజమైన నిర్మలత్వం లభించేది" అని సమయం లేనప్పుడు స్నానాల గదిలో కూర్చుని, భగవద్గీత చదివేవారు. రెండవ అధ్యాయంలోని స్థిత ప్రజ్ఞ లక్షణాలను రోజూ చదివేవారు. స్థిత ప్రజ్ఞునిగా జీవిస్తూ నాయకత్వం వహించే వారు.

**రఘుపతి రాఘవ రాజారాం పతితపావన సీతారాం**

**ఈశ్వర్ ఆల్లా తేరే నాం సబ్‌కో సన్మతి దే భగవాన్**

అని రామనామం స్మరిస్తూ ఉండేవారు. రామ్ రహీం అని హిందూ, ముస్లిం, సిక్కు క్రైస్తవులందరినీ ప్రేమతో చూసుకునేవారు. అందుకే అందరూ ఆయన్ని "బాపూజీ" అని పిలిచేవారు. చివరకు చనిపోయే ముందు కూడా "హే.. రాం" అంటూ తనువు చాలించి మనుషులందరూ ఏరకంగా తనువు చాలించాలో చూపించిన మహాత్ముడు. అంతటి మహాత్ముని సిద్ధాంతాలే ఆచార్యగారి జీవితాన్ని నడిపించాయి. వారి జీవితంతో గాంధీజీని ముడి పెట్టుకోవాలనే ప్రగాఢమైన కోరిక కలిగింది. ఆచార్యగారికి వివాహం అయి, సంతానం కలిగిన తరువాత వారి పిల్లలందరికీ "బాపు" అని నేర్పించారు ఆచార్యగారు. వారు తమ తండ్రిని "నాన్నా" అని పిలిచినా, ఆచార్యగారి పిల్లలు మాత్రం ఆచార్యగారిని "బాపూ" అని పిలుస్తారు. వారి మనుమరాలు కూడా "బాపూ" అని పిలుస్తుంది. ఈ బాపూ సంప్రదాయాన్ని అందరి కుటుంబాల్లో కూడా కొనసాగిస్తే మన పిల్లలందరూ మహాత్ములౌతారు. ఎంత బావుంటుందో! ఆలోచించండి.

## దీక్ష జీవితాన్ని ఎలా మారుస్తుంది?

బాల్యంలో జరిగే కొన్ని సంఘటనలు ఎవరికైనా భవిష్యత్తులో గొప్ప గొప్ప మలుపులనిస్తాయి. ఆచార్యగారు ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నప్పుడు మార్గమధ్యంలో "వనవాసి రామాలయం" ఉండేది. ప్రతిరోజూ అక్కడ ఆగి ఆ ఆలయం వైపుగా చూస్తూ "ఓ రామా! ఎందుకు నీ దేవాలయం ఒక్క శ్రీరామనవమి రోజు కళ్యాణానికి మాత్రమే తెరుస్తారు? నీకు రోజూ పూజలు ఎందుకు చేయరు?" అని చాలా దీనంగా, బాధతో భగవంతుణ్ణి ప్రశ్నించేవారు. కొన్నిసార్లు ఏడ్చేవారు. కళాశాలలో చదువుతున్న రోజుల్లో ఆచార్యగారు తమ మిత్రులతో కలసి, ఆ దేవాలయం అధ్యక్షుణ్ణి కలసి "మీరు నా రామునికి ప్రతిరోజూ పూజలు ఎందుకు చేయడం లేదు?" అని ప్రశ్నించారు. "వాటి తాళం చేతులు ఇవ్వండి. మేము పూజలు చేస్తాం" అని కూడా అన్నారు. కానీ అతను "మీరు ఏమైనా ఆర్.ఎస్.ఎస్ వాళ్ళా? మీకు ఈ విషయాలు తెలియవు... వెళ్ళిపోండి..! అని దురుసుగా మాట్లాడారు. ఆచార్యగారు ఇంటికి వచ్చి తమ నాన్నగారికి ఈ విషయం చెప్పారు. అందుకు వారి నాన్నగారు " నీవు కుర్రవాడివి. అక్కడ అంతా రాజకీయాల కంపు. వాళ్ళ జోలికి నీవు వెళ్ళకపోవడమే మంచిది" అని చెప్పారు. కాని ఆచార్యగారు అటువైపుగా వెళ్ళినప్పుడల్లా, ఆ ఆలయం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, "నేను నా రాముని కోసం ఏమీ చేయలేనా..!" అని బాధపడేవారు. ఈ విధంగా వయసు పెరిగే కొద్దీ వారిలో ఈ బాధ కూడా పెరుగుతూ వచ్చింది.

ఆ దేవాలయంలో త్రాగుడు, జూదము, పనికిరాని పదార్థాలు పడవేయడం పరిపాటి అయింది. ఒక రోజు ఆ దేవాలయంలో తప్పతాగిన

కొందరు దుండగులు ఒక బాలికపై అత్యాచారం చేయడానికి ప్రయత్నం చేశారు. ఆ సంఘటనతో ఆ ప్రాంతంలో ఉన్నవారంతా ఒక్కసారిగా భగ్గుమని ఆ దేవాలయం ధర్మకర్తలందరినీ నిలదీశారు. వెంటనే ఒక అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, పెద్దవాళ్ళందరినీ తొలగించివేసి, యువకులకి అధికారం ఇచ్చారు. కొంతమంది పెద్దవాళ్ళు సలహా మండలిగా ఏర్పడ్డారు. వారంతా ఒక కమిటీ వేసి, ఆచార్యగారికి ఏకగ్రీవంగా ముఖ్య కార్యదర్శి బాధ్యతలు ఇచ్చారు. ఆ విధంగా ఆచార్యగారిని శ్రీ రాముడు తన సేవలకు తనే ఆహ్వానించుకున్నాడు అని మనం గ్రహించాలి.

అది 1985వ సంవత్సరం. ఆచార్యగారు ఆ దేవాలయ అభివృద్ధి గురించి, రాత్రింబగళ్ళూ ఆలోచన చేయడం, అందరినీ సంప్రదించడం, అన్ని రామాలయాలూ తిరగడం, ఎంతోమంది స్వామీజీల వద్ద సలహాలు, ఆశీస్సులు తీసుకోవడం ప్రారంభించారు.

ఐ.డి.పి.ఎల్ రామాలయానికి తంజావుర్ నుండి 101 సంవత్సరాల మహత్తు కలిగిన " శ్రీ శ్రీ శ్రీ రామానందేంద్ర సరస్వతీస్వామిగళ్ " వస్తున్నారని తెలిసి, ఆచార్యగారు వారిని దర్శించడానికి వెళ్ళారు.

వారి జనరల్ మేనేజర్ శ్రీ నాగరాజ్‌గారు, ఆచార్యగారిని స్వామివారికి పరిచయం చేసి, వనవాసి రామాలయం గురించి తెలిపారు. స్వామీజీ ఆచార్యగారి నుండి జరిగిన అన్ని విషయాలు వివరంగా తెలుసుకున్నారు. "ఈ వనవాసి రామాలయం చాలా గొప్ప చరిత్రాత్మకమైన పురాతన మందిరం. నీవు దీని జీర్ణోద్ధరణకు పూనుకున్నావు. నీవు తరించెదవు.

నేను నీకు దీక్ష ఇస్తాను. చెప్పినట్లు చేసెదవా...?" అని ఆచార్యగారి కళ్ళల్లోకి చూస్తూ అడిగారు.

ఆచార్య గారు తన్మయత్వంతో "నేను దీక్షకు సిద్ధమే స్వామీ" అని మాట ఇచ్చారు. మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు శ్రీ గణపతి, శ్రీరామ మంత్ర దీక్ష ఇచ్చారు. ఆ దీక్షతో ప్రతి రోజు, అయ్యప్ప స్వామి దీక్ష మాదిరిగా ఉదయం 4 గంటలకే చన్నీటి స్నానం చేసి, దైవారాధన చేసి, దీక్షా జపం పూర్తి చేస్తూ స్వామికి నైవేద్యం సమర్పించి, అదే సేవించి, దేవాలయ కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీగా మారిపోయింది.

వనవాసి రామాలయం దినదిన ప్రవర్ధమానంగా అద్భుత మార్పులని సంతరించుకుంది. భక్తులు శ్రద్ధతో పని చేయడం, ప్రణాళికాబద్ధంగా పనులు ముందుకు సాగడం మొదలు పెట్టాయి. చిన్నజీయర్ స్వామీజీ ఆ ఆలయాన్ని సందర్శించి "బాలవికాస్" కార్యక్రమాలను ప్రారంభించారు. అప్పుడు వారికి విరాళంగా వచ్చిన రూ.97.50 పైసలు ఆచార్యగారికి దేవాలయ అభివృద్ధికి మొట్టమొదటి విరాళంగా ఇచ్చారు.

**ఈనాటి హైదరాబాద్ రామాయణ కాలంనాటి కుంజవనం.**

శ్రీశ్రీశ్రీ విద్యానంద భారతీ శంకరాచార్య స్వామీజీ వేదోక్తంగా భిన్నమైన విగ్రహములకు గోవు తోకను దారంతో కట్టి వాటి చేత విగ్రహములను తీశారు. వాటిని కృష్ణానదిలో శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. అక్కడ త్రవ్వకాలలో దొరికిన పంచలోహాలతో కూడిన యంత్రంలో దేవాలయం యొక్క వివరాలు ఈ క్రింది విధంగా వ్రాసి ఉన్నాయి.

**స్థల పురాణం** 500 సంవత్సరాల క్రితం విగ్రహాలు స్థాపించబడ్డాయనీ, దీని పేరు "వనవాసి రామాలయం" అనీ హైద్రాబాద్ "రామ్ బకస్ బండా" అను ఈ స్థలమున శ్రీరామచంద్రుడు లక్ష్మణ సమేతుడై ఒక రోజు నివసించినందుకు దీని పేరు వనవాసి రామాలయం అని వ్రాయబడి ఉంది. శ్రీరామచంద్రుడు లక్ష్మణసమేతుడై పంచవటి నుండి రామేశ్వరం వెళుతున్న మార్గంలో "కుంజవనం" అని రామాయణంలో చదువుతాము. ఈ వనవాసి దేవాలయంతో పాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టు దగ్గర ఉన్న అమ్మపల్లి గ్రామంలో శ్రీ సీతారామస్వామీ దేవాలయం స్థల పురాణంలో కూడా కుంజవనం అని తెలపబడింది. **కాబట్టి రామాయణం కాలం నాటి కుంజవనమే ఈ నాటి హైదరాబాద్**

భూమిపై నుండి 5-6 అడుగుల లోతుకు దిగిపోయిన దేవాలయాన్నీ, అన్ని విగ్రహాలనీ, దేవాలయ నిర్మాణాలన్నీ తీసివేసి ఒక ప్రక్కకు పెట్టి, పూజలు ప్రారంభించ బడ్డాయి.

**శ్రీరామకార్యం - హనుమంతుని నిర్వహణ**



యత్ర యత్ర రఘునాథ కీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాంజలిం
బాష్ప వారి పరిపూర్ణ లోచనం
మారుతిం నమత రాక్షసాంతకం

ఎక్కడెక్కడ శ్రీరామచంద్రుడి కీర్తనలతో కార్యం జరుగుతుందో, అక్కడ హనుమంతుడు భక్తితో తలవంచి నమస్కరిస్తూ ఆ కార్యం నిర్వహిస్తాడు. సఫలం చేస్తాడు - అని భక్తుల ప్రగాఢ నమ్మకం. కాబట్టి వనవాసి

రామాలయం నిర్మాణం కూడా ఆ స్వామివారే కావిస్తారని ఆచార్యగారి ప్రగాఢ విశ్వాసం. అందుకే మొదట హనుమంతుడినే మేల్కొల్పవలసినది అని తలంచి, దేవాలయ స్థలంలో 24గంటలు అఖండ "హనుమాన్ చాలీసా" ఏకాహం జపం చేయాలని సంకల్పించారు. ఆచార్యగారు వారి బృందం చాలా మందిని, చాలా దేవాలయాలలో భజనలను చేసే వారిని ఆహ్వానించారు. వారంతా ఒక గంట, రెండు గంటల కొరకు వచ్చి వెళ్తాము కానీ 24 గంటల కొరకు రావడం కుదరదని చెప్పేశారు. "ఎవరైనా హనుమాన్ చాలీసా 11 సార్లు కానీ, 108 సార్లు కానీ పారాయణం చేస్తారు. మీరేంటి 24 గంటలు పెట్టుకున్నారు?" అని ఎగతాళి చేశారు. వారి మాటలు, ప్రవర్తనలు ఆచార్యగారి మనసుని ఏ మాత్రం కదిలించలేక పోయాయి. ఆయనకు తెలిసింది ఒకే ఒక్క మంత్రం "రామా! నీ దయ"!!. ఆయన నమ్ముకున్నది ఒకే ఒక్కరిని, సాక్షాత్తూ ఆ శ్రీరామచంద్రుణ్ణి. మనసులో ఆ శ్రీరాముణ్ణి నిలుపుకుని "రామా! నీ దయ!!" అని తన ధర్మపత్నితో, దేవాలయం కమిటీ వాళ్ళతో కలసి పూజ చేసి, హనుమాన్ చాలీసా ప్రారంభించారు.

ఆచార్యగారు ధ్యాన నిమగ్నులై ఆ హనుమంతులవారికే ఈ కార్యక్రమాన్ని అప్పచెప్పి "ఇది ఎలా చేస్తావో! అంతా నీదే భారం" అని భక్తితో "హనుమాన్ చాలీసా" భజిస్తూ కూర్చున్నారు. కళ్ళు మూసుకుని హనుమాన్ చాలీసా చదువుతున్నారు ఆచార్యగారు. ఆయన ఆంతరంగ ప్రపంచంలో... భజన సంకీర్తనలకు పరవశిస్తూ హనుమంతుడు వారి మనసులో నిండుగా ఒక గొప్ప కాంతి కేంద్రంలో దర్శనమిస్తూ... నృత్యం చేస్తూ... కనిపిస్తున్నాడు. రాత్రంతా ఎక్కడి నుండి వచ్చారో

భక్తులు, వనవాసి దేవాలయ ప్రాంగణం అంతా ఎందరెందరో భక్తులతో క్రిక్కిరిసిపోయింది. హనుమాన్ చాలీసా దిక్కులు పిక్కటిల్లేలా మారుమ్రోగసాగింది. 24 గంటల హనుమాన్ చాలీసా మహా అద్భుతంగా జరిగింది. తెల్లవారిన తరువాత కూడా పట్టలేనంత జనం వచ్చారు.

సాయంకాలం వరకు కనీ వినీ ఎరగని రీతిలో ఈ కార్యక్రమం జరిగింది. అదే

ఆ దేవాలయ పునర్నిర్మాణానికి గట్టి బీజం వేసింది. కార్యక్రమం పూర్తైన తరువాత ఆచార్యగారి ధర్మపత్ని పద్మావతిగారు హారతి ఇచ్చి, ఆచార్యగారితో కలసి దేవాలయం బయటకు వస్తున్నారు. ఒక పిచ్చి బాలుడు నృత్యం చేస్తూ ఒక పళ్ళెంలో సింధూరం

ఉంచుకుని అందరికీ బొట్లు పెడుతున్నాడు. ఇంటికి వెళ్తూ పద్మావతిగారు ఆచార్యగారితో మనం లోపలికి వెళ్ళేప్పుడు కూడా ఆ బాలుడు అక్కడే ఉన్నాడు. హనుమాన్ చాలీసా 24 గంటలు పారాయణం చేసి ఉంటాడు అని చెప్పారు. కానీ దేవాలయ పునర్నిర్మాణమే తదేక లక్ష్యంగా ఉన్న ఆచార్యగారు ఆమె మాటలను అంతగా పట్టించుకోలేదు

.


ఇంటికి వెళ్ళి ఆనాటి దీక్షా విరమణ పూజలో కూర్చుండి పోయారు ఆచార్యగారు. అంతలో దేవాలయం దగ్గర కనబడ్డ బాలుడు వచ్చి, పద్మావతిగారికి బొట్టు పెట్టి సింధూరం పాత్రను ఇచ్చి “శ్రీరామ జయం, శ్రీరామ జయం” అంటు చేయి చూపిస్తూ ఆశీర్వదించి “మీరు హనుమంతుణ్ణి నమ్ముకోండి. అంతటా దిగ్విజయం చేకూరుతుంది” అని వెళ్ళిపోబోయాడు. అప్పుడు పద్మావతిగారు “భోజనం చేసి వెళ్ళండి”

అని అనగానే వరండాలో కూర్చుని త్వరత్వరగా భోజనం చేసి వెళ్ళిపోయాడు. ఆచార్యగారు పూజ ముగించుకుని భోజనానికి కూర్చోగానే "మీరు పూజలో ఉన్నప్పుడు, దేవాలయం దగ్గర కనిపించిన బాలుడు మన ఇంటికి వచ్చాడు. నేను భోజనం పెట్టాను. భోజనం చేసి వెళ్ళిపోయాడు. ఆ పిల్లవాణ్ణి చూస్తే విచిత్రంగా అనిపించింది. ఒళ్ళంతా గగుర్పాటు కలిగింది. అంతేకాదు... అన్నం తినే విధానం, ఆ చూపుల్లోని దైవత్వం , హనుమత్ స్వరూపంలాగా ఉంది" అన్నారు. ఆచార్యగారు మనసులో 'హనుమంతుడే ఆ రూపంలో వచ్చి ఈ కార్యం దిగ్విజయం చేసి ఉంటాడు' అని నమస్కరించుకుని పరుగెత్తి వెళ్ళి అటూ ఇటూ వెతికారు. కాని ఎక్కడా ఆ బాలుడు కనబడలేదు.

మరుసటి రోజు ఆచార్యగారు, స్కూటర్ పై హనుమాన్ చాలీసా ఉచ్చరిస్తూ హైదరాబాద్ రైల్వే స్టేషన్ నుండి వస్తున్నారు. వారి కాళ్ళ మధ్యలో ఉన్న బ్రీఫ్ కేస్ క్రింద పడిపోయింది. వారు బండిని ప్రక్కన ఆపి, దిగేలోపుగానే ఒక పిచ్చి పిల్లవాడు తను చదువుతున్న హనుమాన్ చాలీసా పంక్తినే చదువుతూ ప్రేమగా చూస్తూ, చిరునవ్వుతో ఆ బ్రీఫ్ కేస్ వారికి అందించి, వీపు నిమిరాడు. ఆచార్యగారు అతడి కళ్ళల్లోకి చూశారు. 'నిన్న కనిపించిన హనుమంతుడే ఇతను అయి ఉండవచ్చును కదా !' అని వారి మనసులో ఒక మెరుపులా అనిపించింది. క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే దిగి వారి పాదాలను పట్టుకున్నారు ఆచార్య. పట్టుకున్నవారు పట్టుకున్నట్లే ఉన్నారు కానీ ఆ పిల్లవాడు అదృశ్యం అయిపోయాడు. ఆచార్యగారికి ఆ పిల్లవాడే హనుమంతుడని రూఢి అయ్యింది. ఆ అనుభూతి వర్ణనాతీతం. అప్పుడు హనుమాన్ చాలీసా

ఏకాహం దిగ్విజయం చేసింది. ఈ దేవాలయ నిర్మాణం కూడా హనుమంతులవారే వారే పూర్తి చేస్తారనే నమ్మకం కుదిరింది. ఈ సంఘటన తరువాత వారి సతీమణికి ఆ హనుమంతుడిపై అపారమైన నమ్మకమూ, ఎనలేని భక్తీ ఏర్పడ్డాయి. నిరంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేసేవారు. ఇంట్లో ఏ సమస్య వచ్చినా, ఏ ఆపద వచ్చినా, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసేవారు. ఆ ప్రత్యక్షదైవం హనుమంతుని యొక్క కరుణాకటాక్షమే అప్పటి నుండి ఇప్పటి వరకు ఆచార్యగారినీ వారి కుటుంబాన్నీ నడిపిస్తుంది. ఇప్పటికీ ప్రతి పౌర్ణమినాడు 108 సార్లు హనుమాన్ చాలీసా పఠించడం, అమెరికాలో ఉన్నా సరే వారి పరిపాటిగా స్థిరమైపోయింది. ఇది ఒక అనిర్వచనీయమైన అద్భుత హనుమత్ లీల. నేటి యుగం మనిషి జీవితంలోనూ చోటుచేసుకున్న నాటి యుగపు ఆధ్యాత్మిక హేల.

**దివ్యశక్తి ప్రసారం**



భగవంతుడిపై పరిపూర్ణ విశ్వాసం, భక్తి ప్రపత్తి, ఆర్తి కలిగి ఎవరైతే ఆరాధిస్తారో, వారిని ఆ స్వామి అనుగ్రహిస్తాడు. ఎన్నో విధాలుగా ఆదుకుంటాడు. భగవంతుడు సంతుష్టుడైనప్పుడు భక్తులను పరీక్షించడానికి కోరిన ప్రతి కోరికను నెరవేరుస్తాడు. వద్దంటే ఎన్నో సిద్ధులను ఇస్తాడు. మధ్యమధ్యలో తెలియకుండా మాయలో ముంచేస్తాడు.

దేవాలయ నిర్మాణం పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. విగ్రహాల కొరకు ఆర్డర్ ఇవ్వబడింది. విగ్రహ ప్రతిష్ఠాపన కోసం, ముహూర్తాల

కొరకు పండితులను అడుగుతున్నారు. ఆచార్యగారు శ్రీరామనామ దీక్ష ద్వారా ఊహాతీతమైన అనిర్వచనీయమైన భక్తి కుప్పలు తెప్పలుగా అంతరాత్మ లోతుల్లో నుండి తొలుచుకుని వస్తూ కళ్ళు మూసినా, తెరిచినా కేవలం ఒక దివ్యమైన కాంతిలో తాదాత్మ్య స్థితిలో జీవించడం ప్రారంభమయింది. శరీరంపై ధ్యాస పోయింది. నుదుటి భాగం అంతా మహా శూన్యమై, ఒక కాంతి పుంజం ఆయనను నడిపించసాగింది. ఉన్నట్లుండి తెలియకుండా ఎక్కడికో వెళ్ళి పోయేవారు.

ఆచార్యగారు ఒకరోజు నేరుగా అడ్వకేట్ శ్రీ చెన్నకేశవులు గారి ఇంటికి వెళ్ళారు. ముందుగానే ఎవరో చెప్పినట్లుగా వారు ఎదురువచ్చి, లోపలకి ఆహ్వానించి మర్యాదగా కూర్చోబెట్టారు. ఆచార్యగారు రామాలయం నిర్మాణానికి సంబంధించిన, వివరాలు వారి ముందుంచారు. ఆయన వినయంతో "స్వామీ మీకు కావలసినంత వ్రాసుకొమ్మని" ఖాళీ చెక్కు ఇచ్చారు. ఇటువంటి సంఘటనే సికింద్రాబాద్ కార్ఖానాలో జరిగింది.

ఆచార్యగారు తమను తాము మరచిపోయి, పూర్తిగా దైవత్వంలో మునిగిపోయాక తాము వెళ్ళవలసిన చోటు మాత్రమే కనిపిస్తుండేది. వారి వెనుక కమిటీ సభ్యులు రావడం జరుగుతుండేది. ఒక రోజు లారెన్స్ కంపెనీ అధినేత శ్రీ సాగి కృష్ణంరాజుగారి ఇంటికి చేరుకున్నారు. వారిని ఆహ్వానించి, పూజ గదిలోకి తీసుకొచ్చి, 1 లక్ష రూపాయల విరాళం ఇచ్చి నమస్కారం చేసి పంపించారు.

ఆచార్యగారు దైవంతో దీనంగా "నాకు ఎందుకు ఇటువంటి లీలలు అందిస్తున్నావు? నాకు ఇవన్నీ అవసరం లేదు కదా!. నాకు కావలసింది

నీవు ఒక్కడివే" అని బిగ్గరగా అరిచేవారు, ఏడ్చేవారు. తమలో తాము మాట్లాడుకుని నవ్వేవారు. అప్పట్లో ఆచార్యగారి పరిస్థితి చూసిన వాళ్ళందరూ వారికి పిచ్చి పట్టిందేమోనని భయపడ్డారు. వారికి దీక్ష ఇచ్చిన గురువుగారికి ఆయన పరిస్థితిని విన్నవించుకున్నారు. ఆయన సహృదయంతో తమ మఠం నుండి శ్రీ రాంభావ్ స్వామీజీని తంజావూర్ నుండిపంపించారు. శ్రీ రాంభావ్ స్వామీజీ కొన్ని రోజులు ఆచార్యగారితో పాటు ఉండి, వారిని గమనించారు. వారి ఇంట్లో వారం రోజులు వుచ్ఛిష్ఠ మహా గణపతి హోమం చేశారు.

ఆచార్యగారు నిరంతరం వారితో "ఇవన్నీ అవసరంలేదు, తీసివేయండి ఈ సిద్ధులన్నీ మాయ... నాకు అవసరంలేదు తీసివేయండి" అని ప్రార్థించారు. అతి కొద్దిరోజుల్లోనే వారు చేసిన యజ్ఞఫలంగా ఆచార్యగారిలోని సిద్ధులన్నీ కూడా అదృశ్యమై యథార్థమైన భక్తి నిలకడగా నిలచిపోయింది. సామాన్య స్థితి ఏర్పడింది. "రామా! నీ దయ" వారి ఊతపదంగా, ఊపిరైపోయి, జీవితాన్ని నడిపించే రాముడి కటాక్ష మంత్రంగా నిలిచిపోయింది.

**విగ్రహ ప్రతిష్ఠ - ఆత్మ ప్రతిష్ఠ**



అప్పటికే దేవాలయం బాగా ప్రసిద్ధిచెందింది. చిన్మయ మిషన్ స్వామీ చిన్మయానంద, వ్యాసాశ్రమ పీఠాధిపతి స్వామీ విద్యానందగిరి, శుకబ్రహ్మ ఆశ్రమ పీఠాధిపతి విద్యా ప్రకాశానందగిరి, మహారాష్ట్ర నుండి, హరిద్వార్ నుండి ఎంతో మంది ప్రముఖ

స్వామీజీలు ఆ దేవాలయాన్ని దర్శించారు. 18.02.1989వ తేది విగ్రహ ప్రతిష్ఠాపన ముహూర్తంగా పండితులు నిర్ణయించారు. దేవాలయ కమిటీ వారి వద్ద కేవలం రూ. 22 వేలు మాత్రమే మిగిలాయి. దేవాలయ కమిటీ వారు ఆచార్యగారిని "మీరు ఒక ప్లాన్ పద్ధతి ప్రకారం వెళ్ళరు, ఎక్కడెక్కడికో వెళ్తారు, ఎవరినెవరినో తెస్తారు, అకస్మాత్తుగా పెద్ద పెద్ద కార్యక్రమాలు మాపై రుద్దుతారు" అని అన్నారు.

"సరే ! మీరు ఒక పద్ధతి, ప్రణాళిక ప్రకారం చేయండి" అని ఆచార్యగారు ఇంట్లో కూర్చుని బాధపడుతూ ఆ భారాన్ని భగవంతుడికే అప్పగించారు. "నీ ప్రతిష్ఠ... నీవే ఎలా చేసుకుంటావో... నీ ఇష్టం " అని ప్రార్థనలో లీనమయ్యేవారు.

ఈ విషయం తెలిసి "ప్రతిష్ఠాపన ఖర్చు అంతా నేను పెడతాను, ఆచార్యగారిని ఎవరూ బాధించకండి" అని శ్రీ చెన్నకేశవరావు ముందుకు వచ్చారు. శ్రీ పొటేల్ పరమేశ్వర్ యాదవ్, డా॥ వెంటేశ్వరరావు, లక్ష్మీనారాయణ్, శ్రీనివాస్, శివమాదాసరాబు, కుటుంబాలు ఎంతో మంది భక్తులు వారికి తోడయ్యారు. కమిటీ వారు ఆచార్యగారిని క్షమించమని అడిగి, తిరిగి మందిరానికి తీసుకువెళ్ళారు. ఆ తరువాత 'ఎక్కడ నుండి ఎవరు ఇస్తున్నారు' అని తెలియకుండా సహాయం ప్రవాహంలా రావడం ప్రారంభమయ్యింది. ప్రకాశం జిల్లా కారంచేడు నుండి శ్రీరాంగారు, శ్రీరామభక్త సమాజం తరపున 60 మందిని తీసుకుని వచ్చారు. 11 రోజులు నిత్య అన్న సంతర్పణ జరిగింది. మరో ప్రక్క 11 రోజుల పాటు నిరంతర "హరే రామ హరే కృష్ణ" భజన జరిగింది. సాయంకాలం రామలీలలు జరిగాయి. ప్రతిష్ఠాపన ముహూర్తానికి వేదఘోషతో,

రామనామ సంకీర్తనలతో, ప్రతిష్ఠాపన కనీవినీ ఎరుగని రీతిలో జరిగింది. భద్రాద్రి రామాలయం నుండి ఉత్సవ విగ్రహాలు, రాజస్థాన్ నుండి దత్తాత్రేయులవారు, శిరిడి సాయీశ్వరులు లాంటి ఎన్నో దేవాలయాల నుండీ, మఠాధిపతుల నుండీ కానుకల వర్షం కురిసింది. రామనామంతో అందరిలోనూ ఆధ్యాత్మిక అమృతధారలు కురిశాయి.

ఒక ప్రక్క డబ్బులేదు, మరో ప్రక్క ఇంత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం జరుగుతుంది. ఆచార్యగారు ఆ రాముణ్ణే తలచుకుంటూ ఒక ప్రక్కన కూర్చుని "రామా! నీ దయ!!, అపారం, అనూహ్యం, అనిర్వచనీయం అని పరిపరి విధాలుగా, ఆర్తితో హృదయంలో ఉ ప్పొంగుతున్న నవ్వుతో ఏడుస్తూ, చూస్తూ, కళ్ళు మూసుకుంటూ ధ్యాన స్థితిలోకి వెళ్ళిపోసాగారు. దేవాలయ ప్రతిష్ఠ జరిగింది, ప్రసాద వితరణ ప్రారంభమయింది. ఎక్కడ ఏమి జరిగినా కూర్చున్న చోటునుండి లేచే పరిస్థితి సైతం లేకుండా ధ్యాన నిమగ్నులయ్యారు. అందరూ తదేకంగా రామనామ స్మరణ చేస్తూ ఆక్కడ దేవాలయానికి వెళ్ళి నమస్కారం చేస్తూ, ఇటు ఆచార్యగారికీ నమస్కారం చేయసాగారు. దేవాలయ ప్రతిష్ఠాపన ఆచార్యగారి హృదయ ప్రతిష్ఠాపనలాగా జరిగింది. స్వామీజీ అనుగ్రహం, దీక్షాఫలితం, నిరంతరంగా జరిపిన ఆ శ్రీరామనామ స్మరణ, అప్రయత్నంగా ఈ రోజుకూ శ్వాసతో కలసిపోయి, హృదయంలో మిళితం అయిపోయి వారిలో రామనామ స్మరణం తనకి తానుగా జరుగుతుంటుంది. భౌతికంగా వారి చుట్టూ జరుగుతున్న భౌతిక పరిస్థితుల నుండి, ఆత్మారాముని దిశగా వారిని నడిపించడానికి "రామా! నీ దయ!!" ఊతపదంగా నిరంతరం దానంతట అదే వచ్చేస్తుంది. భౌతికంగా వారిని రక్షిస్తుంది. ఆచార్యగారి

చుట్టూ ఉంటున్న లీడ్ ఇండియన్స్ ఎంతో మందిని ఇది అలముకున్నది. "లీడ్ ఇండియా" అనే వారందరినీ రక్షించే కవచం " రామా! నీ దయ!!".

ఆ " కోదండరాముని" నుండి "అంతా రామ మయం,ఈ జగమంతా రామమయం" అనే స్థితిలోకి నడిపిస్తుంది. " రామ్, రహీం, సిక్కు, ఈసాయి. సబ్‌కా మాలిక్ ఏక్ హై" అనే తత్వంలో జీవించడం! అదే స్థితి, అదే గతి, అదే ఆచరణ, అదే ప్రచారం.

**సమాజ సేవలో నిందలు తప్పవు**

కలికాలం కాబట్టి సత్యం అసత్యంగా. అసత్యం సత్యంగా సమర్థించ బడుతుంది. అసత్యమే ప్రబలంగా, సత్యమని నలుగురి సమర్ధన పొందుతుంది. కాని చివరకు "సత్యమేవ జయతే" సత్యమే జయిస్తుంది. సమాజ సేవలో ఎవరు గడపదాటి సమాజం కొరకు పని చేస్తారో, వాళ్ళు ఏదో ఒక సమయంలో నిందలపాలౌతారు. కానీ మనం చేసేది ఎంత సత్యంగా చేస్తున్నామో మనకి ఆత్మసాక్షిగా తెలిస్తే చాలు. నలుగురు వేసే నిందల గురించి బాధపడనక్కర్లేదు.

వనవాసి రామాలయం నిర్మాణం విషయంలోనూ, ఒయాసిస్ స్కూల్ విషయం లోనూ, లీడ్ ఇండియా విషయంలోనూ, ఆచార్యగారి జీవితంలో కూడా అలాగే జరిగాయి. ఆచార్యగారి జీవితమంతా కుటుంబమైనా, ఉద్యోగమైనా, సమాజ సేవ అయినా ప్రతి విషయంలో ధర్మాన్ని ఆపాదించి, ఆ పరమాత్మను నమ్ముకుని జీవితం ముగిసిన తరవాత ఎవరైనా చిత్రగుప్తుడి దగ్గర తాను చేసిన ధర్మాధర్మాలు నిర్ధారించ బడతాయి కదా! అనే నిశ్చయంతో నిర్మలంగా ఉండేవారు.

వనవాసి రామాలయం పూర్తి అయిన తరవాత ఆచార్యగారు పిల్లల చదువుల కొరకు శాలిబండలోని ఇల్లు అమ్మి, బోయినపల్లిలో ఇల్లు కట్టుకున్నారు. ఆ తరువాత దేవాలయ పాత ధర్మకర్తలు కొంతమంది నిర్మాణంలో, వారు డబ్బు దోచుకుని ఇల్లు కట్టుకుని వెళ్ళిపోయారని నిందించారు. మరో బృందం వారితో ఆచార్యగారిని నిందించడం తప్పు "ఆచార్య అగ్ని లాంటివారు, ఆయన ఉన్నప్పుడు మీరు ఎందుకు అడగలేదు " అని రెండు బృందాలు తగువులాడుకునాయి. ఒక దశలో రక్తం వచ్చేలా కొట్టుకుని, పోలీస్ స్టేషన్‌కి వెళ్ళారు కూడా. పోలీస్‌వాళ్ళు ఆచార్యగారికి కబురు చేశారు. ఆచార్యగారు "మీరు ఎవరిపైనా చర్యలు తీసుకోవద్దు. నేను అందరితో మాట్లాడి సర్దుబాటు చేస్తాను" అని చెప్పారు. వనవాసి రామాలయ పునర్నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన వారందరూ అట్టి విరాళాలు ఆచార్యగారు కానీ, కమిటీ సభ్యులు ఎవరైనా కానీ, వాటిని స్వార్థానికి వాడుకున్నట్లు ఏవిధమైన ఋజువులు ఉంటే సమావేశానికి రాగలనని చాటింపు వేయించారు. కరపత్రాలు పంచారు."దేవాలయం డబ్బు స్వార్థానికి వాడుకున్నట్లు ఎవరైనా ఆరోపణ చేస్తే, దేవాలయంలో శ్రీరాముని సాక్షిగా గంగాజలం తులసితో ప్రతిజ్ఞ చేయాలి. ఆచార్యగారు కూడా ప్రమాణం చేస్తారు. డబ్బు తీసుకున్నట్లైతే ఏడు తరాలవాళ్ళు నశిస్తారు లేదా నిందలు ఋజువు చేయలేక అపనిందలు వేసినవాళ్ళు నాశనం అవుతారు'. అని బహిరంగ లేఖ రాసి కరపత్రాలు అందరికీ పంచిపెట్టారు. ఆ రోజు దేవాలయానికి దాదాపు 300 మంది వచ్చారు. నిందలు మోపినవాళ్ళు ఎవ్వరూ రాలేదు. వచ్చిన వారంతా చర్చించి "ఆచార్యగారు చేసిన సేవలు ఎవ్వరూ చేయలేనివనీ, అలాంటి ఆయనను

నిందించడం చాలా పొరపాట”నీ తీర్మానం చేశారు. సంతకాలు చేసి పోలీస్ స్టేషన్‌కి పంపించారు. కొన్ని రోజుల తరువాత నిందించిన వాళ్ళు ఒక్కరూ ఆ ప్రదేశంలో మిగలలేదు. అనారోగ్యం పాలయినవారు కొందరు, ఉద్యోగాలు పోయి రోడ్డున పడ్డవారు కొందరు. ఇలా అనేక నష్టాలతో బాధపడినవారిని చూసి, ఆచార్యగారు “భగవంతుడా! వారి తప్పులను క్షమించి సౌఖ్యాన్ని కలిగించమ”ని ప్రార్థించారు. ఆచార్యగారి పిల్లలందరూ గొప్ప చదువులు చదివి, గొప్పవారిగా సుఖసంతోషాలతో ఆనందంగా ఉన్నారు. ఆచార్యగారిని ఆ దేవుడు సాక్షాత్తూ భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారితో కలసి లీడ్ ఇండియా ఉద్యమం ద్వారా దేశానికి సేవ చేసే అసమాన భాగ్యాన్ని ప్రసాదించారు.

**తనువు చాలించే ముందు మోక్షం**



పుట్టినవాళ్ళు మరణించక తప్పదు. కాని చనిపోతూ మోక్షం పొందే మార్గం ఏమిటి? దీని కొరకే అన్ని మతములు, ఆరాధనలు, సాధనలు! మనం భారతంలో భీష్ముడిని చూశాము. అర్జునుడు కొట్టిన బాణాలతో అంపశయ్యపై పడుకుని కృష్ణుణ్ణి చూస్తూ “విష్ణు సహస్రనామం” చదువుతూ, ఆ విష్ణువులోనే ఐక్యమైపోయి మోక్షం పొందిన సంఘటన మనకు తెలుసు. ఇదే అసలైన ఆధ్యాత్మిక విద్య. అలాగే పరమహంస యోగానంద, పోతులూరి వీరబ్రహ్మంగారు, ముమ్మిడివరం బాలయోగి, పూజ్య రాఘవేంద్ర స్వామి సమాధి ద్వారా మోక్షం పొందిన ఉదాహరణలు మనందరికీ ఒక గొప్ప కను విప్పు. సర్వమానవాళికీ అవి స్పష్టమైన సాధనా మార్గాలు.

1965లో హెచ్.ఎస్.సి. పరీక్ష రుసుం అడగడానికి ఆచార్యగారు తమ నాన్నగారి దగ్గరకు వెళ్ళారు. ఆ సమయంలో వారు కొనుగోలుదారులకు బట్టలు చూపిస్తున్నారు. ఆచార్యగారు వారి స్థానంలో కూర్చున్నారు. వీపుకు ఏదో తగులుతుంది. దిండు తీసి చూస్తే అది వారి నాన్నగారి "డైరీ". ఇదేమిటని ఆ డైరీని తెరవగానే ఓ పేజీలో "31 మే 1985 శుక్రవారం ఏకాదశి సంధ్యా సమయం జీవిత సమాధి పరిసమాప్తి ముహూర్తం " అని వ్రాసి ఉంది. నాన్నగారు వ్రాసుకున్నది చూసి ఆచార్యగారి గుండె ఆగిపోయినంత పని అయ్యింది. "నాన్నగారూ! ఇలా ఎందుకు వ్రాసుకున్నారు?" అని తమ నాన్నగారిని ప్రశ్నించారు. "నీవు పిల్లవాడివి. ఇతరుల డైరీలు చూడకూడదు" అని ఆయన వారి వీపుపై నెమ్మదిగా తట్టి "ఇటువంటి ప్రశ్నలు అడగరాదు" అని గద్దించి చెప్పారు. ఆ రోజు నుండి ఆ తేదీ ఆచార్యగారిని వెంటాడింది. మింగలేరు కక్కలేరు. ఎంతోమంది జ్యోతిష్కులను, స్వాములను "దీని అర్థం ఏమిటి? ఎలా సాధ్యం? ఏమి చేయాలి?" అని అడిగే వారు. కానీ ఏ ఒక్కరూ వారికి సరైన సమాధానం చెప్పలేక పోయారు. వారి ఆవేదన తీరలేదు. 1985 జనవరిలో కొత్త సంవత్సరం రాగానే నాన్నగారు "నేను షిరిడి వెళ్ళి రావాలి. తీసుకువెళ్ళు" అని ఆచార్యగారిని అడిగారు. వారు వెంటనే షిరిడి సాయినాథ్‌తో పాటు గంగాపూర్ దత్తాత్రేయ క్షేత్రము, స్వామీ, బీదర్ జలనరసింహ స్వామి - అవన్నీ చూపించారు. దాని తరువాత తండ్రిగారి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది.

ఆచార్యగారి పిల్లలను దగ్గరకు తీసుకుని ఆయన ఎల్లప్పుడూ ఎంతో సంబరపడే వాళ్ళు. కాని ఉన్నట్లుండి వాళ్ళని దగ్గరకు తీసుకోవడం

మానేశారు. ప్రతిరోజూ సాయంకాలం ఆచార్యగారు ఆఫీసునుండి వచ్చేవరకు తలుపు దగ్గర కూర్చుండి, వారితో కబుర్లు చెప్పడం కూడా మానేశారు. తమ సాధనను లోతుగా పెంచుకుంటూ ఆహారం తగ్గించారు. కాలక్రమేణా ఆహారం పూర్తిగా మానేశారు.

చివరకు పాలు, పండ్లరసం కూడా మానేశారు. దాంతో బాగా చిక్కిపోయారు. ఎంతచెప్పినా స్పందించేవారు కాదు. అలా అలా శరీరధ్యాస రానురాను తగ్గిపోయింది. అంతకు మునుపు ఆచార్యగారు చిన్ననాటి నుండి చూసిన వారి నాన్నను చూసి ఆశ్చర్యపడి పోయారు. ఆచార్య గారి తండ్రి తెల్లవారుజామున 3 గంటలకు లేచి వర్షాకాలం, చలికాలంలో కూడా చన్నీళ్ళతో స్నానం చేసి ఉదయం 4-6 గంటల వరకు పూజలు చేసి, రామనామ కీర్తనలు గట్టిగా పాడేవారు. వాడ వాడంతా వారి అరుదైన కీర్తనలు వినేవారు. "ఈ రోజుల్లో అవి ఎక్కడా వినలేమ"ని అనేవారు. తాము పడుకునే పడక ఎదురుగా ఒక చిన్న రామమందిరం కట్టుకున్నారు. అందులో సీతారామ- లక్ష్మణ- హనుమంతుల మట్టి విగ్రహాలను పెట్టుకున్నారు. ప్రతి సంవత్సరం వాటిని ఊరేగింపుగా వనవాసి రామాలయానికి తీసుకెళ్ళి కళ్యాణం చేయించి బాజా భజంత్రీలతో ఊరేగింపుగా తీసుకొచ్చేవారు.

తర్వాత తర్వాత చేతకాక మంచం మీద నుండి లేవలేని పరిస్థితి ఏర్పడింది. ఆచార్యగారు మార్చి నుండి 3 నెలలు సెలవు పెట్టి తమ తండ్రిగారికి సేవచేస్తూ ఉండేవారు. తెల్లవారు జామున వేడి నీటితో శరీరం అంతా స్పాంజ్ బాత్‌లా తడి బట్టతో తుడిచేవారు. టేప్ రికార్డర్ ద్వారా రామ భజనలు వినిపించే వారు. ఆ భజనలతో పాటు తామూ

భజించేవారు. 31మేతో ముగిసేలా 41 రోజులు గురుచరిత్ర పారాయణం ప్రారంభించారు. ఆచార్యగారు ఆయనకు సేవ చేస్తూ ఆయన్ని వదలకుండా ప్రక్కనే పడుకునేవారు. 30 మే 1985 రాత్రి తెల్లవారుజామున 3 గంటలకు ఆచార్యగారి కలలో వారి నాన్నగారి దగ్గరనుండి ఒక జ్యోతి వెళ్ళిపోయి, ఆ రామునిలో కలసి పోయినట్లుగా, శరీరం మంటల్లో తగలబడుతున్నట్లుగా దృశ్యాలు కనబడ్డాయి. ఆచార్య దిగ్గున లేచారు. అదే సమయంలో వారి నాన్న గారు కూడ లేచి వారిని లేపడానికి ప్రయత్నిస్తున్నారు. శరీరం తాకి చూస్తే పూర్తిగా చల్లబడిపోయింది. అప్పటికే వారి మిత్రుడు డా॥ శరాబు అనంతంను వెంటనే పిలిపించారు. వారు వచ్చారు. ఎంత ప్రయత్నించినా వారికి నాడి దొరక లేదు. ఆముదంతో కాళ్ళూ చేతులూ బాగా మర్ధన చేశారు. మెల్లమెల్లగా సూర్యోదయం అయ్యే కొద్దీ మళ్ళీ మామూలు స్థితికి వచ్చారు. మధ్యాహ్నం గురుచరిత్ర పారాయణం పూర్తి అయింది, బ్రాహ్మణ సమారాధన, అన్నశాంతి చేశారు. మామూలు స్థితికి వచ్చారు.

ఆ సాయంకాలం 4 గంటలకి బాలభారతి శిబిరం ముగింపు సమావేశానికి మంత్రిగారు వస్తున్నారు. ఆచార్యగారిని రావలసిందిగా డా॥ అరుణ్‌కుమార్ ఆచార్యగారు అడిగారు. అప్పుడు ఆచార్యగారు తమ నాన్న గారిని “బాగున్నారా? నేను శిబిరానికి వెళ్ళిరానా?” అని అడిగారు. ఆయన “వద్దు వద్దు” అని సైగ చేసి దగ్గరగా పిలుచుకుని, శరీరమంతా తడుముతూ తమ హృదయానికి హత్తుకుని నిండుగా ఆశీర్వదించారు.

ఆ క్షణం వారు ఆచార్యగారిలో మమేకమైనట్లు ఓ అపురూపమైన అనుభూతి కలిగింది. ఆచార్యగారు వారి అమ్మగారిని అడిగి, "డా॥ అరుణ్‌కుమార్ ఆచార్యకు ఫోన్ చేసి వస్తాను" అని ప్రక్క ఇంటి వారి దగ్గరకు వెళ్ళారు. అంతలోనే వారి అమ్మగారు ఆచార్యగారిని రమ్మని కేక వేశారు. వారు వచ్చేసరికి వారి నాన్న గారు "రామ్ రామ్" అని అనలేక అంటూ ఆయాసపడిపోతున్నారు. ఆచార్యగారు వెంటనే తండ్రిగారిని చేతుల్లోకి తీసుకుని "రామా రామా రామా రామా" అంటూ బిగ్గరగా నివేదించారు. వారి అమ్మ గారు, పిల్లలు వారితో కలిసి "రామ్ రామ్" అంటూ రామునికి నివేదించారు. అంతలో వారి అమ్మగారు ఉదయం 7 గుళ్ళ నుండి తెచ్చిన తీర్థం వారి పిల్లలందరి చేత పోయించి, ఆచార్యగారిని కూడా పోయమని చెప్పింది. వారు అది పోసేలోపుగా "ఇది ఘూన్‌గాపూర్ తీర్థం. ఇది కూడా పోయండి" అని చెబుతూ ఒక చేయి తీర్థం అందించింది." ఆచార్యగారు ఆ తీర్థం తీసుకుని పోయగానే వారి నాన్నగారు "రామా రామా "అంటూ ఆచార్యగారి ఒడిలో ఒరిగిపోయారు. ఘూన్‌గాపూర్ తీర్థం అని చెప్పి ఇచ్చింది ఎవరో ఈ రోజుకీ అర్థం కాలేదు. కేవలం వారి కుటుంబ సభ్యులు, మేనత్తలు మాత్రమే అక్కడ ఉన్నారు. ఆ విధంగా ఆయన సాధన చేసుకుని సంపూర్ణంగా రామునిలో నిలచిపోయారని ఆచార్యగారి నమ్మకం. తమ నాన్నగారి జీవితంలో చూసిన ప్రత్యక్షంగా భక్తి, జ్ఞాన, వైరాగ్య సాధన పరాకాష్ఠ. ఆచార్యగారిని ఈ రోజుకూ నడిపిస్తున్న జ్ఞాన గుళికలు.

**మాతృవందనం**

ప్రపంచంలో ఏదైనా దొరుకుతుందేమో కానీ స్వచ్ఛమైన, నిస్వార్థమైన, పవిత్రమైన తల్లి ప్రేమ ఎక్కడా దొరకదు. భగవంతుడిలో ఉన్న సర్వసద్గుణ సారాన్ని అందరూ అమ్మలో చూడవచ్చు. అందుకే అమ్మ అంటే కంటికి కనిపించే దైవం. ఆచార్య గారిని కూడా వారి అమ్మ అమితమైన ప్రేమతో బుగ్గలు గిల్లుతూ, అన్ని విషయాలు పంచుకుంటూ ఆత్మీయంగా ఒక ప్రాణ స్నేహితునిగా చూసేవారు.

ఆచార్య గారి అమ్మమ్మ లక్ష్మమ్మ, తాత మల్లయ్య. లక్ష్మీ నరసింహస్వామి ద్వారా పొందిన వర పుత్రిక వారి అమ్మ గారు. అందుకే లక్ష్మీనర్సమ్మ అని పేరు పెట్టారు. అందరికంటే చిన్నదైనా, అందమైన గారాల ముద్దు బిడ్డ. చిన్న నాటి నుండి ఆ ఇంటికి రాణిగా జీవించారు. ఆమెకు ఏ చిన్న కష్టం వచ్చినా అందరూ ఆదుకునేవారు. పెళ్ళి అయిన తరువాత కూడా అలాగే ఆదుకుంటూ వచ్చారు. ఆమెకు సంతానం లేదని అందరూ లక్ష్మీ నరసింహస్వామికి పూజలు చేసేవారు. ఆ స్వామి వరప్రసాదంగా ఆ చిన్న రాణికి 35వ ఏట కలిగిన వరపుత్రుడే మన ఆచార్యగారు. వారిని చూసుకుని ఆ తల్లి ఎంతో మురిసిపోయేది. ఆమె కళ్ళన్నీ ఎప్పుడూ ఆచార్యగారి పైనే ఉండేవి. ఆచార్యగారికి తల్లి విలువ తెలిసిన నాటి నుండి, ఉదయం లేవగానే మరియు రాత్రి నిద్రించే ముందు “మాతృ దేవో భవ” అని ఆ తల్లి ఆశీర్వాదం తీసుకునేవారు. ముఖ్యంగా 1982లో బాలభారతి శిబిరంలో “మాతృ దేవో భవ” గురించి చెప్పిన నాటి నుండి వారు తల్లిదండ్రులకు పాదపూజలు చేయిస్తున్నారు. అది రాను రాను “మాతృవందనం” అనే కార్యక్రమంగా మారింది. ఆ తరువాతి

కాలంలో అది అందరూ పాదపూజ చేసే "లీడ్ ఇండియాలో మదర్ సెషన్"గా మారింది. ఆచార్య మాతృవందనం వీడియో చూస్తే ఈ విషయం మరింతగా హత్తుకుంటుంది. ఆచార్యగారు ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే సమయం వరకు మధ్యలో ఏ మంచి జరిగినా, రోజుకు అనేకసార్లు అమ్మ దీవెనలు తీసుకునే వారు. ఆమె చాలా సంతోషిస్తూ "నీవు చాలా గొప్పవాడివి అవుతావురా నాన్నా" అంటుండేది. ఈ రోజు వారికి ఏవి ఉన్నా, అవన్నీ అమ్మానాన్నల దీవెనల వల్లనే అంటుంటారు ఆచార్య. వనవాసి రామాలయం దగ్గర ఉన్న ఇల్లు వారి అమ్మ గారి పేరుపైనే ఉండేది. ఆమె పెళ్ళి అయినప్పటి నుండి దాదాపు 60 సంవత్సరాలుగా ఉన్న ఆ ఇల్లు ఆచార్యగారి కోరిక మేరకు పాత పట్టణం నుండి కొత్త పట్టణం వెళ్ళడానికైనా ఏ రకమైన పేచీలు పెట్టక ఆచార్య గారు, ఆయన పిల్లల సంతోషం కొరకు తన జీవితాన్నే త్యాగం చేసిన త్యాగమూర్తి వారి మాతృమూర్తి.

**నిరక్షరాస్య కవి హృదయం**



ఆమె చదువురాని ఒక నిరక్షరాస్యురాలు. బాధతో భక్తితో, ఆర్తితోభగవంతుడిని వేడుకునేది. మనవడు అమెరికా వెళ్ళిపోయి, చేతిలో డబ్బులన్నీ ఖర్చు అయిపోయి, చాలా కష్టాలను ఎదుర్కొంటున్నాడు అని తెలిసినప్పుడు, భక్తితో భగవంతుణ్ణి ఈ విధంగా ప్రార్థించింది.

పల్లవి:ఓ రామయ్య రావయ్య

మా చిన్ని సీనయ్య కష్టాలను తీర్చవయ్య....

1 చరణం : కానరాని దేశాలకు వెళ్ళాడు

కళ్ళముందు లేకుండా ఉన్నాడు

సర్వాంతర్యామివి నీవయ్య

సీనయ్యను సల్లగా చూడయ్య ॥ఓ రామయ్య॥

2 చరణం : ఏడు సంద్రాలను దాటి వెళ్ళాడు

ఇతర దేశాలలో ఉన్నాడు

నీ నామం మరువని వాడయ్య

నీ దాసుడ్ని కాపాడు రామయ్య. .॥ఓ రామయ్య॥

3 చరణం: అమ్మవు అయ్యవు దైవం నీవు

అందరికీ ఇలవేల్పువు నీవు ...

అమ్మగ ఆకలి తీర్చవయ్య

అయ్యగ ధైర్యము నీవయ్య ॥ఓ రామయ్య॥

86 ఏళ్ళ వయసు వచ్చి ఆమె బలహీనపడినా, ఆతృతతో రోజూ ఆచార్యగారితో విన్న వించే విషయం “ఏమిరా! డబ్బు మీద ఆపేక్ష లేదు. నలుగురు బంధువులతో కలవవు. పెండ్లి, పేరంటాలకు వెళ్ళవు. ముగ్గురు ఆడ పిల్లలకు చదువులు పూర్తి కావలసి వచ్చినవి. పెళ్ళిళ్ళు ఎలా చేయాలనే ఆలోచన, ఆవేదన లేదు. ఎప్పుడూ దేశం, సేవ” అని ప్రతిరోజూ ఆచార్యగారిని ప్రశ్నించేది. దాంతో ఆచార్య గారు ఆవేదనతో “ఓరి భగవంతుడా! మా అమ్మ జీవితం చరమ దశకు చేరుకుంది.

అయినా నీ పట్ల భక్తి భావన కలగజేయవు ఏమిటి? 'నేను, నా భార్యా పిల్లలు వెంట రాము' అనే సత్యం తెలపవా ఆమెకి? ఈ పెళ్ళిళ్ళు, సంసారం పట్ల వైరాగ్యం కలగ చేయవా?" అని భగవంతుణ్ణి ప్రార్థించేవారు. చివరకు 41 రోజుల సుందరకాండ పారాయణం ప్రారంభించారు. ఏ రోజూ రామాయణం చదవని మనిషి భగవంతుడి దయతో రామాయణం అంతా కూడా ఆశు కవిత్వంతో చెప్పింది.

రామా నీ దయ ! రామా నీ దయ!

**తీర్చుకోలేనిది అమ్మ ఋణం**

ఎన్ని పూజలు చేసినా, ఎన్ని శాస్త్రాలు చదివినా, అమ్మ ఋణం తీర్చుకోగలమా? గాంధీజీ, శివాజీ అంతటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన తల్లులు ఎంతో మంది. తల్లి చూపిన ప్రేమకు, అమ్మ చేసిన త్యాగాలకు వెల కట్టలేము. అంతే కాదు మన చర్మంతో చెప్పులు కుట్టించి ఇచ్చినా తల్లి ఋణం తీర్చుకోలేము. తమ తల్లికి ఆధ్యాత్మిక భక్తి భావం, తృప్తి, ఆనందం కలగడానికి ఆచార్యగారు అనేక తీర్థయాత్రలకు పంపించారు. పెద్ద జీయర్ స్వామిజీ దగ్గర ఉపదేశం ఇప్పించారు. అదే చివరి వరకు ఆమె చేసుకున్న సాధన. ఆచార్యగారు తండ్రికి చేసిన సేవల లాగానే తల్లికి కూడా ఆఖరి రోజులలో పూర్తిగా సెలవు పెట్టి, అన్ని సేవలూ తామే చేయాలని నిష్ఠగా చేసేవారు. చివరకు వారి భార్య స్నానం చేయిస్తున్న సమయంలో కూడా, "చిన్నప్పుడు అమ్మ నాకు స్నానం చేయించింది, అలాగే ఇప్పుడు నేను చేయిస్తాను," అని తాము స్నానం చేయించి తృప్తి పొందేవారు. తల్లి ఆశీస్సులు పొందేవారు. ఇవే తమ జీవితాన్ని నడిపిస్తున్న నావలు అంటారు ఆచార్య

ఇప్పటికీ.ఇప్పటికి తలసుకుని జీవితాన్ని నడిపిస్తున్నది అమ్మనే అంటారు. వారి ఋణం ఎన్నటికి తీర్చుకోలేము అంటారు. వినండి! https://www.youtube.com/watch?v=L0rR52CKC8I&t=1s

**జీవుల కర్మ కాలంలో ఎలా కలసి పోతుంది?**



పుట్టినాము కాబట్టి ప్రతి ఒక్కరం చావడం తథ్యం. కాని చావు అనగానే భయం కలుగుతుంది. అది కేవలం జీవితంతో ఉన్న అనుబంధం. ఆ బంధాన్ని



తెలుసుకుని, తెంపుకుని, తనువు ఎలా చాలించాలి అన్నదే సాధన.



శరీరం శిథిలం అయిపోతుంది. అవయవాలు అరిగి కరిగి అనేక బాధలకు గురిచేస్తాయి. మనసునీ, జ్ఞానేంద్రియాలనీ నిగ్రహించుకుని ఈ శరీర బాధలనుండి తప్పించుకుని, అంతరాత్మతో తాదాత్మ్యం చెంది ఈ తనువు చాలించడమే సాధన. ఇదే మోక్షం. ఇదే సకల శాస్త్రాల సారం.

నాన్నగారు చేసిన ఈ సాధనను గమనించిన అమ్మ, తను కూడా చివరకు అలాగే ఆచార్యగారి చేతుల్లో తనువు చాలించాలని కోరుకున్నారు. భగవంతుని దయ వలన చివరి నిమిషంలో, ఆచార్యగారి ఒడిలో ఆచార్యగారితో పాటు రామ నామ స్మరణ చేస్తూనే తనువు చాలించారు.


ఆచార్య గారి ధర్మపత్ని శ్రీమతి పద్మావతిగారు లీడ్ ఇండియా భారత్ రత్నాస్ స్కూల్ నిర్మాణం చేయించే బాధ్యత తన మీద వేసుకుని రాత్రింబవళ్ళు కష్టపడి 2013 జూలై 3వ తేదీ నాడు నిర్మాణం చేయిస్తూనే ఆచార్యగారి చేతుల మీద వారిని దీనంగా చూస్తూ వారితో పాటు రామ

నామ స్మరణ చేస్తూ తనువు చాలించిన కర్మయోగిని... ధన్యజీవి.

శ్రీ మతి పద్మావతిగారికి అన్ని వేళల్లో అండగా ఉండి. ఆమెతో



పాటు ధ్యానం చేసే "టోని" (వారి ఇంటి కుక్క డాబర్ మ్యాన్) అనారోగ్యంతో ఉండగా ఆచార్యగారు తమ చేతుల మీద



ఎత్తుకుని డాక్టర్‌గారి దగ్గర టేబుల్ మీద పడుకోబెట్టక మునుపే, ఆచార్యగారి వంక దీనంగా చూస్తూ రామమంత్రం చెప్పకపోయినా, పెద్ద శబ్దం చేస్తూ ఆచార్యగారినే దీనంగా చూస్తూ, దీర్ఘశ్వాస వదిలి తనువు చాలించింది. బహుశా ఆచార్యతో పాటు "రామా! నీ దయ!" అని వుంటుంది.


# 10. శక్తిగా వ్యక్తి ఎదుగుదల

## ఒక్క మొదటి అడుగు వేలాది మైళ్ళ ప్రయాణానికి నాంది !

ప్రతి మనిషి జీవితంలో ఏదో సాధించాలనుకుంటాడు. ఏది సాధించాలన్నా ఒక లక్ష్యం ఉండాలి. లేకుంటే మనసులో అలల్లా వచ్చే ఆలోచనలన్నీ వ్యర్థం అవుతాయి. ఐతే, లక్ష్యసాధనకు వచ్చే బలమైన ఆలోచనే మొదటి అడుగు. అడుగులు వేస్తూ ప్రయాణించే సమయంలో అనేక అడ్డంకులు, అవరోధాలు, ఆకర్షణలు, నిర్దేశించుకున్న గమ్యం నుండి మనిషి ప్రయాణాన్ని ఆపుతుంటాయి, దారిని మళ్ళిస్తుంటాయి. అనుకోని చిత్ర విచిత్రాలు జరగడం జీవితంలో సదా సహజమే. ఏది ఏమైనా, 'లక్ష్యం చేరుకునే వరకు ఆగేది లేదు' అని గమ్యం చేరుకునే వారే ధీరులు. అదే విజన్! అదే విజయం!!

1982 లో ఆచార్యగారు ప్రారంభించిన బాలభారతి ప్రయాణం వారి మొదటి అడుగు. ప్రజల అధ్యక్షుడు డా. ఎ.పి. జె అబ్దుల్ కలాం విజన్ 2020 తో కలిపి, దేశానికి ఈ రోజు కలాంగారు భౌతికంగా లేకపోయినా లీడ్ ఇండియా మిషన్ 2020గా, 20 కోట్ల విద్యార్థులకు శిక్షణ ఇచ్చే దిశగా, ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆగకుండా, అలుపుసొలుపూ లేకుండా సాగిస్తున్న ప్రయాణం. ఒక్కొక్కటి ఒక్కొక్క మరపురాని మైలురాయిగా, ఈ మరపురాని ప్రయాణ గాథ మీ మదిని పులకింపజేస్తుంది... మీ జీవితానికి అవసరమైన ఆలోచన కలిగిస్తుంది. మీరే చదవండి!

## జీవితంలో స్థిరపడిన తరువాత ఏమి చేయాలి?



చదువు, ఉద్యోగం, వివాహం, సంతానం అన్ని విధాలా స్థిరపడిన తరువాత ఎవరైనా "ఇక నా పిల్లల అభివృద్ధే నా జీవిత లక్ష్యం" అని జీవిస్తారు. కానీ జీవిత వృత్తాంతంలో మొదటి 25-30 సంవత్సరాలు చదువుకు, వివాహం కొరకు పోటీ ప్రపంచంలో గుర్రంలాగా పరుగెత్తుతాము. మిగతా 25-60 సంవత్సరాల వరకు కుటుంబం కోసం గాడిద చాకిరీ చేస్తాము. ఇక మిగిలి పోయిన బ్రతుకంతా ఆ కుటుంబానికి కుక్కలా పడి ఉంటాం. పట్టుకోవడానికైనా, మందూ మాకూకైనా, పలకరించే మాటకైనా, సొంత మనుషులకు సమయం ఉండదు. అందుకే ఇవాళ వృద్ధాశ్రమాలు పెరిగి పోతున్నాయి. అవునో కాదో మీరే పరిశీలించండి.

వీటన్నింటినీ పరిశీలించిన ఆచార్యగారు చదువు, ఉద్యోగం, వివాహం, సంతానం, సంసారం వంటి వాటిల్లో స్థిరపడ్డారు. తరువాత "నేను ఏమి చేయాలి" అని ఆలోచించడం మొదలుపెట్టారు. "నేను ఏది చేసినా, స్థిరమైన ఆలోచనతో వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం సమస్యలను తీర్చే మార్గంలో సాధన చేస్తూ సేవ చేయాలి. నేను అభివృద్ధి అవుతూ దేశాభివద్ధికి కృషి చేయాలి అని ఆలోచన చేశారు. దాదాపు ఒక సంవత్సరం పాటు తండ్రితో, గురువులతో, పెద్దలతో, అనేక మంది మిత్రులతో ఈ విషయాలు చర్చించారు. చివరకు "బాలలు భగవత్ స్వరూపులు" అనే యథార్థాన్ని గ్రహించి, వారి ద్వారా సనాతన భారతీయ

సంస్కృతీ సంస్కారాలను విద్యా విలువలతో జోడించాలని యోగా మిత్రులు ప్రొ॥జి.వెంకటరెడ్డి, శ్రీ వి.గుర్నాథం మరియు తదితరులు గురుతుల్యులు శ్రీ బద్రి సుదర్శన్, డా॥ కేసరి హనుమాన్, యోగాచార్య, డా॥ ఎ. సీతారామయ్య, డా॥ టి.వి నారాయణ తదితరుల సలహా సహకారాలతో 'బాలభారతి శిక్షణ సమితి' అనే ఒక లాభాపేక్షలేని సంస్థను 1982లో స్థాపించారు. దీని ద్వారా విద్యార్థులకు విలువలను నేర్పిస్తారు. విద్యార్థులే ఏ రోజుకైనా భారతదేశాన్ని విశ్వ గురువుగా మారుస్తారు అనేది నమ్మకం. ఇదే నమ్మకం కలిగిన శ్రీ వెంకటరెడ్డిగారి మిత్రుడు ప్రొ॥ వై అరుణ్ కుమార్ 1985 నుండి ఇప్పటి వరకు ఆచార్యగారికి కుడిభుజమై ఈ మహాయజ్ఞానికి గొప్ప అండగా ఉండి నడిపిస్తున్నారు.

**ఆదిలోనే బాలభారతికి - అవాంతరాలు**

ఆచార్య గారు, ప్రొ॥ వెంకట రెడ్డిగారు, శ్రీ గుర్నాథంగారు మరియు ఇతర మిత్రుల కుమారులు 22 మంది విద్యార్థులతో బాల భారతి మొదటి శిక్షణ శిబిరం గురుకుల ఆశ్రమ పద్ధతిలో 21 రోజుల పాటు చిన్మయ ఆశ్రమం, షాద్‌నగర్‌లో ప్రారంభమయింది.

**దొంగల దోపిడి:**

ఆచార్యగారు కార్యాలయం పని ముగించుకుని శిబిరానికి కావలసిన కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసి, సైకిల్‌పై 52 కి.మీ దూరంలో ఉన్న షాద్ నగర్‌కు ప్రయాణమైనారు. తిమ్మాపూర్ దాటిన తరువాత చెట్ల పొదలలో నుండి వచ్చి నలుగురు దొంగలు చుట్టు ముట్టి, "నీ దగ్గర ఉన్న డబ్బు ఇవ్వమ"ని అడిగారు. "నేను పిల్లల శిబిరం నిర్వహించడానికి

గాను వెళ్తున్నాను. దానికి సంబంధించి కేవలం రూ. 150/ ఉన్నాయి. మీకు కావాలంటే తీసుకోండి. కానీ అది మంచిది కాదు" అని చెప్పారు. వాళ్ళు ఆచార్యగారి జేబులన్నీ చూశారు. వారికి 150 రూపాయిలు మాత్రమే దొరికాయి. అప్పుడు వారితో ఆచార్యగారు "శిబిరం దగ్గరలోనే ఉంది. మీరు నాతో పాటు రండి. నలుగురం కలిసి వెళదాం. పిల్లల కోసం మేము చేయగలిగింది చేయడం చూడండి. రండి మీరు కూడా సాయం చేస్తే చాలా బాగుంటుంది. చేయండి" అని వారితో ప్రేమగా మాట్లాడారు.

వాళ్ళు కొంత దూరం ఆచార్యగారితో పాటు నడుస్తూ శిబిరం గురించి ఎన్నో విషయాలు ఆసక్తిగా తెలుసుకున్నారు. ఊరు దగ్గరకు రావడంతో వాళ్ళు తిరిగి వెళ్ళిపోయారు.

ఒక చోట దెబ్బ తగిలినప్పుడు, దానిపైననే మళ్ళీ మళ్ళీ దెబ్బలు తగులుతుంటాయి. అలాగే ఆచార్య గారు దొంగలనుండి తప్పించుకుని సైకిల్‌పై ఎక్కి కొంత దూరం వెళ్ళగానే సైకిల్ పంక్చర్ అయ్యింది. అంతే! ఈసురోమంటూ ఈడ్చుకుంటూ ఆకలి బాధతో 4.కి.మీ నడుచుకుంటూ అర్ధరాత్రి 12 గంటలకు ఆశ్రమం చేరుకున్నారు.

## తన ప్రాణం కన్న పిల్లల ప్రాణం మిన్న



ఆచార్యగారు కాస్త తిన్న తరువాత మిగిలిన బృందం నిర్వాహకులతో కలసి తెల్లవారి జరగబోయే కార్యక్రమాల గూర్చి ఇంకా చేయవలసిన ఇతర పనుల గురించీ చర్చించుకుంటున్నారు. అంతలో పిల్లలు

పడుకున్న గదిలోకి ఒక పెద్ద  పాము వెళ్ళడం ఒకరు చూసి వచ్చి చెప్పారు. వారంతా లేచి గది లోపలికి చూస్తే ఆ పాము చాప ప్రక్కన గోడకూ, ఒక పిల్లవానికీ మధ్యలో ఉన్నది. నలుగురూ నాలుగు కర్రలు తీసుకుని నాలుగు వైపులా నిల్చున్నారు. ఆచార్య గారు, వెంకట రెడ్డి గారు లోపలికి వెళ్ళారు. వెంకట రెడ్డి చాలా ధైర్యవంతులు. బాలభారతి శిక్షణ శిబిరాలన్నిటినీ క్రమశిక్షణతో  నడిపిన కార్యదీక్షా దురంధరుడు. కన్ను మూసి తెరిచే లోపుగా వారు పాము తోకను పట్టి బయటకు దూకి నేలపై కొట్టి చంపారు. ఒక్కసారిగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్నానాలు చేసి సామూహిక ప్రార్థనలు చేశారు.

"ఓ భగవంతుడా! ఈ శిబిరాలు మేము నిర్వహించలేము. ఈ దొంగల బెడద, పాముల ప్రమాదాల గురించి తల్లిదండ్రులకు చెప్పలేము. మోయలేని బాధ్యతలను  తీసుకోలేము. మేము నిండుగా సమర్పణ అయిపోతున్నాం. మాకు ఏమీ తెలియదు అంతా నీవే నిర్వహించుకోవాలి" అని ప్రార్థించారు.

ఈ ప్రార్థనలు లీడ్  ఇండియా శిబిరాలలో ఇప్పటికీ పాటిస్తున్నారు. ఎక్కడా ఏ ప్రమాదం లేకుండా, పదుల సంఖ్యలో జరిగిన 1982 నుండి ఈ రోజు వేల సంఖ్యలలో  జరుగుతున్న 2005 వరకు బాలభారతి శిబిరాలు, లీడ్ ఇండియా శిక్షణ కార్యక్రమాలలో ఎక్కడా ఏ ప్రమాదం జరగకుండా భగవంతుడే రక్షిస్తున్నాడు. రామా! నీ దయ!!

## నిస్వార్థ సేవయే నిజమైన పరిష్కారం



వ్యక్తి, కుటుంబం, వ్యవస్థ, దేశంలో ఏ రకమైన, ఎటువంటి జటిలమైన, సమస్యలనైనా, నిజమైన, నిస్వార్థమైన సేవయే పరిష్కరిస్తుంది. మనం కేవలం దీనిని నమ్మి నడుం బిగించి నడిస్తే, ఏ సమస్య అయినా పాదాల క్రింద నలిగిపోవలసిందే! విజయం సాధించవలసిందే, భగవంతుని అనుగ్రహం అటువంటిది. 1988లో బాలభారతి శిక్షణ శిబిరం ముగింపు సభకు తిరుమల తిరుపతి దేవస్థానం (టి.టి.డి) ఛైర్మన్ శ్రీ డి. సీతారామయ్య, సభ్యులు శ్రీ ఐ.ఎల్.ఎన్ శాస్త్రి గార్లను పిలిచాము. పిల్లల్లో వచ్చిన మార్పులు వారిని ఎంతో ఆకర్షించాయి. వారు వెంటనే ఇటువంటి శిబిరాలు టి.టి.డి వారి బాలమందిరం అనాథ బాలల కొరకు తిరుపతిలో 5 రోజుల పాటు నిర్వహించ మన్నారు. శ్రీ జి. పుల్లా రెడ్డిగారు "ఈ శిబిరం నిర్వహణకు వెళ్ళే 15 మందికి రవాణా ఖర్చులు నేను భరిస్తాను, మీరు వెళ్ళండి. ఇది భవిష్యత్‌కి మంచి బాట వేస్తుంది" అని అన్నారు. దాంతో ఆచార్యగారి బృందం తిరుపతి చేరుకుంది.

## తిరుమల తిరుపతి దేవస్థానం- బాలభారతి అనుభవాలు

ఆచార్యగారి బృందానికి పద్మావతి గెస్టు హౌస్‌లో ఎ.సి గదులు ఇచ్చి, పంచభక్ష్యపరమాన్నాలు పెట్టారు. అన్నిటికీ మించి, స్వామి వారి

ప్రత్యేక దర్శనాలు, ప్రత్యేక ప్రసాదాలు, వారు కావలసిన చోట్లకి తిరగడానికి రెండు కార్లు ఇచ్చారు. కానీ ఇవి ఏవీ వారిని ఆకర్షించలేదు. ఎందుకనగా శిబిరం నిర్వహించదలిచిన బాల మందిరం పిల్లలు, వారు ధరించిన గుడ్డలు చిరిగిపోయి, ఉండే వసతి ఉండలేని స్థితిగా, మల మూత్రశాలలు ఈగలు, దోమల పెంటలతో నిండి ఉన్నాయి. చాలా మంది పిల్లలు గజ్జితో, జబ్బులతో బాధపడుతున్నారు. రాత్రి మిగిలిన పదార్థాలు వారికి ఫలహారాలుగా ఇస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కబెట్టవలసిందిగా ఆచార్యగారు అధికారులని అడిగారు. కానీ వారి నుండి ఎలాంటి స్పందన లేదు .

రెండవ రోజు అందరూ గెస్టు హౌస్, భోజన సదుపాయాలు వదిలి పిల్లలతో ఉండటం ప్రారంభించారు. పిల్లలకు స్నానాలు చేయించి, చిరిగిపోయిన బట్టలు కుట్టి తలలు దువ్వి, ఆచార్యగారు, వారి బృందం ఏది తింటే అదే వారికీ పెట్టి, వాళ్ళూ వీళ్ళూ కలసి వసతి గదులను శుభ్రం చేశారు. మలమూత్రశాలలు శుభ్రం చేయడానికి చీపుర్లు, డెటాల్, ఫినాయిల్, సబ్బులు, పిల్లలకు మంచి బట్టలు, పడుకోవడానికి దుప్పట్లు అధికారులను అడిగారు. “మీరు ఇవ్వకపోతే మేము బజారులోకి వెళ్ళి, భిక్షం ఎత్తి పిల్లలకు సమకూరుస్తాం” అని హెచ్చరించారు. ఈ లోపు మీడియా వాళ్ళు, పై అధికారులు స్పందించారు. దాంతో వారడిగినవన్నీ ఇచ్చారు.

బాలభారతి బృందం ఓ తల్లిలా అందరినీ దగ్గరకి తీసుకుని, వారికి కావలసినవన్నీ ఇవ్వడంతో వారిలో దాగిన భయం, అణగారిపోయిన స్తబ్ధత ఒక్కసారిగా మాయమయ్యాయి. అందరూ చక్కగా భజనలు చెప్పడం,

యోగాసనాలు చేయడం, 15 రోజుల శిబిరంలో జీవితానికి ఒక లక్ష్యం పెట్టుకుని, మేధాశక్తిని మేల్కొలిపి, "మాకు తల్లిదండ్రులు లేకున్నా మీరే మాకు తల్లిదండ్రులు. ఆ ఏడుకొండల వెంకటేశ్వరుడే మా అందరికీ అండ" అనే నమ్మకానికి వచ్చారు. వారి పనులు వారే చేసుకుంటూ, బాల మందిరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆచార్యగారికి మాట ఇచ్చారు. చివరి రోజున ముగింపు సభలో దేవస్థానం బోర్డు సభ్యులందరి ముందు 100 మంది పిల్లలు తమ తమ శైలిలో సంగీత, నృత్య ప్రదర్శనలతో, వారి జీవితాలలో వచ్చిన మార్పులను ప్రత్యక్షంగా ప్రదర్శించి అందరినీ ఒక్కసారిగా ఏడిపించారు.

ఆచార్యగారి బృందం తిరిగి వస్తుంటే, వెళ్ళకూడదని బస్సులకు పడుకున్నారు. వారి ప్రేమ ఈ రోజుకూ జీవితంలో ఒక గొప్ప తృప్తిని ఇచ్చే సంఘటన అంటారు బాలభారతి బృంద సభ్యులు.

## తిరుమల తిరుపతి దేవస్థానం ఆతిథ్యం ఎలా ఉంటుంది?

దేవుడు కళ్ళు లేని వారికి చూపునిస్తాడు. కుంటివాణ్ణి నడిపిస్తాడు. దేవుడి కరుణతో చేయలేనిది ఏమిటి..? కేవలం మనకు ఆయనపై నమ్మకం ఉండాలి. అంతే. దేవుడి కరుణా కటాక్షం వల్లనే లీడ్ ఇండియా శిక్షణ ద్వారా పుట్టు గ్రుడ్డి అయిన శ్రీ బొల్లా శ్రీకాంత్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎంఐటి, బోస్టన్, యుఎస్ఎ విశ్వవిద్యాలయంలో చదువుకోగలిగారు. కాలు తెగిపోయినా ఆసియా బ్లేడ్ రన్నర్ అయిన శ్రీ పవన్ కుమార్ ఎదుగుటకు ప్రత్యక్షంగా తీర్చిదిద్దే భాగ్యం భగవంతుడు ఇచ్చాడు.

తిరుమల తిరుపతి దేవస్థానానిది ప్రపంచంలోనే ఒక ప్రత్యేక స్థానం. ఇక వారికి ఆచార్యవారి బృందం ప్రత్యేక అతిథులు. బోర్డువారు అందరు కలిసి వేద మంత్రాలతో, స్వామివారి పట్టు వస్త్రాలతో సన్మానాలు చేశారు. స్వామి వారి ప్రత్యేక దర్శనంతో వారందరికీ తృప్తినిచ్చారు. తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. పండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు ఇచ్చారు. స్వామివారి వస్త్రాలు, ఆభరణాల భాండాగారం, అద్దాల మేడ, లడ్డుల తయారీ కర్మాగారం, స్వామివారు కొండపై దిగిన శ్రీవారి పాదాల దర్శనం, పాప వినాశనం, అన్ని దేవాలయాల సముదాయం అన్నిచోట్లకీ ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్ళి ప్రత్యేక దర్శనాలు ఇప్పించారు.

బాలభారతి బృందం, వారి కుటుంబ సభ్యులందరి జీవితాలలో ఎవరికి ఎప్పుడు ఏ ఆపద వచ్చినా నేను ఆదుకుంటానన్న ఆ స్వామివారి ఆనాటి అభయహస్తం ఈనాటికీ అండదండలు అందిస్తూనే ఉంది.

## ఒక మంచి పని మరెన్నో మంచి పనులకు మూలం

ప్రపంచంలో కొంతమంది చెడ్డవారు చేసే చెడు పనుల ప్రభావం చాలా మంది మంచి వారు చేసే మంచి పనులను కమ్మివేస్తుంది. కాబట్టి మంచి పనుల ప్రభావాన్ని మనం ఎంత విస్తరిస్తే అంత మంచి జరుగుతుంది. అదే మన కర్తవ్యం.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు బాల మందిరం అనాథ బాలలకు 15 రోజుల బాలభారతి శిక్షణ శిబిరం ఇవ్వమని, తరువాతి సంవత్సరం కూడా ఆదేశాలు జారీ చేశారు. మొదటి సంవత్సరం కన్నా రెండవ సంవత్సరం అధికారులు చక్కనైన ఏర్పాట్లు చేశారు. పిల్లలు ఇంకా ప్రతిభలు చాటారు. మీడియా దానిని రాష్ట్రమంతా చక్కగా ప్రచారం

చేసింది. సప్తగిరి టి.వి, సప్తగిరి పత్రికలో ప్రముఖంగా ప్రశంసించారు. మళ్ళీ 3వ సంవత్సరం కూడా ముందుగానే ఆహ్వానించారు. కానీ ఆచార్యగారి బృందం ఆ పిల్లలను హైద్రాబాద్ పంపించవలసిందిగా కోరారు. "దాని ద్వారా వాళ్ళ బయట ప్రపంచాన్ని చూస్తారు" అని తిరుమల తిరుపతి దేవస్థానం వారికి తెలిపారు.

దానికి వారు అంగీకరించి అలాగే పిల్లలను పంపించారు. ఒయాసిస్ స్కూల్, హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చి వారికి హైదరాబాద్ నగరం అంతా చూపించి పంపించారు. ఆ పిల్లలందరు వృద్ధిలోకి వచ్చారు. చాలా మంది టి.టి.డి దేవస్థానంలో ఉద్యోగాలు సంపాదించారు. కొంత మంది చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. కొంత మంది సంగీత, నృత్య కళాకారులైనారు. "జీవితంలో మీ మేలు మేము మరిచిపోలేమ"ని చెప్తుంటారు వారు. మనం చేసింది అత్యల్పం, కానీ భగవంతుడు వారికి సమకూర్చింది అనంతం. ఇది సేవ ద్వారా వచ్చే మేవా (పాలకోవా)

పిల్లలలో కలిగిన మార్పుని చూసి ఆచార్యగారికి హిందూధర్మ సంరక్షణ సమితి డైరెక్టర్‌గా ఒక సంవత్సరం అవకాశం ఇచ్చారు. ఈ శిబిరాలకి తిరుమల తిరుపతి దేవస్థానం వారి ద్వారా ఇంకా చాలా పటిష్టంగా ఆధ్యాత్మిక విషయాలను చేర్చి, రాష్ట్రమంతా టి.టి.డి వేసవి శిబిరాలకు నాంది పలికారు. అవి ఈ రోజుకీ ప్రతి సంవత్సరం వేల మంది బాలలకి వేద సంస్కారాన్ని అందిస్తున్నాయి. ఇది అంతా ఆ స్వామి దయ.

**శ్రీ భగవాన్ సత్యసాయీశ్వరుల లీలలు**



1994లో రావిర్యాలలో జరిగిన లీడ్ యూత్ క్యాంప్ ముగింపు సభకు శ్రీ అరుణాచార్యగారి గురువులు, బ్రహ్మజ్ఞాని శ్రీ సాయి గంగా మహదేవ్‌గారిని (శ్రీ భగవాన్ సత్యసాయీశ్వరుల మరో రూపం) ఆహ్వానించారు. వారు "లీడ్" అన్న పదానికి ఇలా నిర్వచనం చెప్పారు. **LEAD** అనగా ఒక అర్థం

| | | |
|---|---|---|
| **L** | **= LEADERSHIP** | (నాయకత్వం) |
| **E** | **= EXCELLENCE** | (నైపుణ్యం) |
| **A** | **= AWARENESS** | (జాగృతి) |
| **D** | **= DEVELOPMENT** | (అభివృద్ధి) |

మరో అర్థం **LEAD - Loss( L) of Evil (E) Awareness(A) of Divinity (D)**

(చెడుని పోగొట్టుకొని, దైవత్వాన్ని పెంపొందించుకో)

**బ్రహ్మజ్ఞాని భవిష్యవాణి :**

బాలభారతి శిబిరానికి హాజరై, భవిష్యత్తులో ఈ బాలభారతి దేశ సమస్యలకు పరిష్కారం ఇస్తుంది అని చెప్పారు. ఆచార్యగారి ఆలోచనలు దేశానికి ఒక భవిష్యత్తుని ఇస్తుంది అని, అందరూ



ఆచార్యగారిని సమర్థించాలనీ చెప్పారు. ఆచార్యగారి ఉద్యమంలో నిస్వార్థంగా సేవ చేసే వారందరూ ముక్తులౌతారనీ వారందరికీ మరొక జన్మ ఉండదు అనీ ప్రకటించారు. బాలభారతి నిర్వహించే ముఖ్యులైన ఆచార్య గారు కూడా డా. వెంకట రెడ్డిగారు, సోదరుడు కమాండర్ రాజేశ్వర్, శ్రీమతి ప్రవీణలు, డా. అరుణ్‌కుమార్ గారు లాగా డాక్టర్లు అవుతారని భవిష్యవాణి వినిపించారు. వారు ఇప్పుడు భౌతికంగా మనతో లేకపోయినా, వారి అదేశానుసారం వారి భక్తగణం డా. సత్యసాయి శ్రీలక్ష్మి, సత్యసాయి భూలక్ష్మి, డా. రవి శంకర్, శ్రీ శ్రీనివాస్, శ్రీ గంగా రాధాకిషన్ ప్రత్యేకించి శ్రీ యజ్ఞభట్లవారి కుటుంబం డా. సత్యనారాయణగారు, శ్రీమతి సావిత్రిగార్ల సంతానం, డా.అరుణ్‌కుమార్ గారి ధర్మపత్ని డా. వసుధ అహర్నిశలూ వంటావార్పు దగ్గర నుండి వసతి, వాహనాలు, శిక్షణ ఇత్యాది ఏవీ లేవనకుండా, ఆనాటి నుండి ఈనాటి వరకు సమకూరుస్తూనే ఉన్నారు. వారి భవిష్యవాణి ప్రకారం ఆచార్యగారిని ప్రజల అధ్యక్షుడు డా. ఎ.పి.జె అబ్దుల్ కలాంగారితో కలిపి బాలభారతిని లీడ్ ఇండియా 2020 జాతీయ ఉద్యమంగా మార్చి, వ్యక్తి సమస్యలే దేశ సమస్యలుగా, మీ అభివృద్ధే దేశాభివృద్ధిగా, యువశక్తే దేశశక్తిగా చేయడానికి అంతర్లీనంగా వారి ద్వారా పలికిన బాబా ఆశీస్సులు.

**భగవాన్ సత్యసాయి ఆశీస్సులు ఎలా పని చేశాయి?**

భగవంతుడు కనిపించడు. కానీ అన్నింటా తానే అయి ఉండి నడిపిస్తుంటాడు. అలాగే భగవంతుని ఆశీస్సులు కూడా కంటికి కనిపించకుండా మనిషి మస్తిష్కానికి అర్థం కాకుండా లోక కళ్యాణార్థం మంచిని చేస్తుంటాయి. అలాగే, వారి అవతార స్వరూపులైన భగవాన్ సత్య సాయీశ్వరుల ఆశీస్సులు ఆచార్యగారు చేసే బాలభారతి స్వరూపాన్ని లీడ్ ఇండియా విశ్వరూపంగా మార్చేసింది. ఆచార్యగారు బ్రహ్మశ్రీ సాయిగంగా మహాదేవ్‌గారి పిలుపు మేరకు బాలభారతి వారందరినీ శ్రీ భగవాన్ సత్యసాయీశ్వరుల ఆశీస్సుల కొరకు పుట్టపర్తికి తీసుకు వెళ్ళారు. ఆచార్య గారు ఒక్కరు తప్ప అందరూ సిద్ధమైనారు. అప్పుడు "ఆయన రాకపోతే మేము ఎవ్వరమూ వెళ్ళం" అని అందరూ అన్నారు. అందుకు తప్పనిసరై ఆచార్యగారు కూడా వెళ్ళారు. ఆచార్య గారు రామ భక్తులు.

"అంతా రామమయం, జగమంతా రామమయం" అని నమ్ముతారు. భగవాన్ సత్యసాయీశ్వరులని కూడా గౌరవిస్తారు. కానీ "సత్యసాయీశ్వరులు లీలలు చేసి భక్తులను ఆకర్షించే దానికన్న, ఆత్మ జ్ఞానం చెప్పి ఆకర్షిస్తే బాగుండు" అని అనుకునే వారు. పుట్టపర్తి వెళ్ళిన తరువాత బాబాగారిని దర్శనం చేసుకోవచ్చును, కాని సంభాషణ వినడానికి వీలు అవదు. కారణం వారు మౌనవ్రతంలో ఉన్నారని తెలిపారు. తెల్లవారు జామున అందరూ దర్శనానికి వెళ్ళే సరికి బాబాగారు ఆత్మ జ్ఞానం గురించి ప్రబోధాలు ప్రారంభించారు. అందరికీ ఆశ్చర్యం కల్గింది. మానవ విలువల గురించి ప్రతిరోజూ ఉదయం మరియు సాయంకాలం ఒక వారం రోజులు ప్రబోధించారు. తరువాత అందరినీ ఆశీర్వదిస్తూ, ఆచార్యగారికి ప్రతిరోజూ ఉదయం సాయంకాలం పాద నమస్కారాలు

ఇచ్చేవారు. ఆఖరి రోజు ఆచార్యగారు "స్వామీ మిమ్మల్ని నేను తప్పుగా అర్థం చేసుకున్నాను. క్షమించండి. ఇక నా శేష జీవితమంతా మీరు ప్రబోధించిన మానవ విలువలకే పరిపూర్ణంగా అంకితం. నన్ను పరిపూర్ణంగా ఆశీర్వదించండి " అని పాదనమస్కారాలు చేశారు. ఆచార్యగారి జీవితానికి అదే ఒక గొప్ప మలుపు.

## మానవ కృషి- దైవబలం పరస్పర సంబంధం



సాధ్యాసాధ్యాలు మనిషి మనసుని బట్టి నమ్మిన దైవం పట్ల భక్తిని బట్టి జరుగుతుంటాయి. "నేను సాధించగలను" అని నమ్మి, తాను చేసే దానికి తన మానసిక శక్తికి ఆధారం దైవశక్తి అని నమ్మితే అనంత శక్తి సంపన్నులై అసాధ్యాలని సుసాధ్యం చేసుకుంటారు.

"షట్ భాగంతు మనుష్యాణాం సప్తమం దైవ చింతనం"

అనగా మనిషి చేసేది అంతా ఆరు వంతులైనట్లైతే, అది సాధించి పెట్టే ఏడవ వంతు దైవానుగ్రహం వలన మాత్రమే. లేదంటే, ఏ కారణం చేతనైనా ఆ కార్యం సాధ్యం కాకపోవచ్చు. 1995 లో బాలభారతి ముగింపు సమావేశానికి ఉస్మానియా యూనివర్సిటీ అప్పటి వైస్ ఛాన్సలర్ ప్రొ. రామకృష్ణయ్య, డీన్-కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొ. మల్లాది శ్రీరామమూర్తి గారిని ఆహ్వానించారు. వారు పిల్లల్లో వచ్చిన మార్పులను చూసి ఆశ్చర్యపోయారు. "శిక్షణ ద్వారా విద్యార్థులలో విలువలు నాటుకుంటున్నాయి. మేము ఎన్ని కోట్లు ఖర్చుపెట్టి ఎన్ని సెమినార్లు చేసినా, ఎన్ని శిక్షణలు ఇచ్చినా ఈ విధంగా మానవ విలువలు

నాటుకోవడం లేదు. ఈ వినూత్న ప్రయత్నాన్ని మీరు మా పరిశోధనా విభాగానికి ఇవ్వండి. మీకు పి.హెచ్.డి వస్తుంది" అని అన్నారు. యూనివర్సిటీలో ప్రత్యేక అనుమతిని ఇచ్చి, బాలభారతిలో జరుగుతున్న ప్రక్రియలనూ వాటి ప్రభావాలనూ విశ్లేషించి పి.హెచ్.డి థీసిస్ సమర్పించవలసిందిగా అనుమతినిచ్చారు. దీనికి ప్రొ. మల్లాది శ్రీరామమూర్తి గారే గైడ్‌గా ఉండి డా. అరుణాచార్య ద్వారా "విద్యార్థులలో మానవ విలువలను పెంపొందించు మార్గం" అనే శీర్షికతో పి.హెచ్.డి పరిశోధనా పత్రాన్ని తయారు చేశారు. నిజానికి మానవ విలువల పరిశోధనపై లభ్యంగా ఉన్న సాహిత్యమే తక్కువ. అక్కడక్కడ కొందరు చేసినా అవి శాస్త్రీయ నిరూపణకు నిలిచే స్థాయి కలిగినవి కావు.

**మానవ విలువల లోపం - మానవ హక్కుల రూపం**

ప్రపంచంలో ప్రతి ప్రాణిని సంరక్షించడానికి పెంపుడు జంతువుల పరిరక్షణకు, వన్య మృగాల రక్షణకు కూడా అనేక చట్టాలు, అనేక హక్కులు ఉన్నాయి. ఆ ప్రాణులన్నీ ప్రకృతి ధర్మాలను బట్టి జీవిస్తుంటాయి. ప్రాణులన్నిటిలోనూ ఉత్కృష్టమైన ప్రాణి మానవుడు. ఈ మానవుడు తన తెలివితేటలు ప్రకృతి ధర్మాలకు అతీతంగా వాడి తన స్వార్థం కోసం ప్రకృతికి కీడు వాటిల్ల చేస్తుంటాడు. "అడుసు త్రొక్కనేల కాలు కడుగనేల" అన్నట్లు మానవ హక్కులను హరించడం – శిక్షలు వేయడం అలా చేసే దానికి శిక్షలు ఉన్నా వాటికి అందకుండా ఇష్టానుసారం ప్రవర్తిస్తుంటాడు. అలా చేయకుండా ఆపడానికి ఏకైక మార్గం అతనిలో మానవ విలువలు పెంపొందించడమే. ఇక ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కులను రక్షించడానికి (హ్యూమన్ రైట్స్) చట్టాలు ఎన్నో ఉన్నాయి.

మరెన్నో ప్రణాళికలు ఉన్నాయి. కోట్ల కొద్ది ధనం ఉంది. అన్నీ ఉన్నా, ప్రపంచమంతటా మానవ హక్కుల పరిరక్షణ విషయంలో నిరంతర సమరం సాగుతూనే ఉంది. బాల కార్మికులు పెరుగుతూనే ఉన్నారు. స్త్రీలపై అత్యాచారాలు, ఉగ్రవాదుల దారుణహోమాలు ఇలా రకరకాల దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. వీటన్నిటినీ ఆపడానికి కేవలం మానవ విలువలను మనుషులలో చక్కగా పెంపొందించడం ఒక్కటే మార్గం. కానీ మానవ విలువలను పెంపొందించడానికి చట్టాలు లేవు. నిర్దిష్టమైన ప్రణాళికలూ లేవు. కనీసం భావితరం విద్యార్థుల్లో విలువలు పెంపొందించడానికైనా మిగిలిన విషయాలలో లాగా దేశమంతా ఒకే నిర్దిష్టమైన సిలబస్, బోధనా పద్ధతి, విలువలు రూపొందించే విధివిధానాలు ఏమీ లేవు. ఇవి ఉపాధ్యాయుల ఇష్టానుసారం గాలిలో వదిలి పెట్టబడ్డాయి. ఇలాంటి నగ్న సత్యాలని గ్రహించిన ఆచార్యగారు బాలభారతి, లీడ్ ఇండియా ద్వారా మానవ విలువలపై పరిశోధనలు ప్రారంభించారు.

ఇక ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధన కొరకు మానవ విలువలపై సాహిత్యాన్నీ, పరిశోధనలనీ విశ్లేషించారు. బాలభారతి ద్వారా

" రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్య పరాక్రమః
రాజా సర్వస్య లోకస్య దేవానాం మఘువావివ"

అని రామునిలో ప్రకాశించిన సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస, కరుణ ఇత్యాది షోడశ గుణములను పిల్లల్లో పెంపొందించే మార్గాన్ని ప్రవేశపెట్టారు. ఒక్కొక్క గుణం సనాతన భారతీయ గురుకుల

విధానంలో, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, చరిత్రల్లో ఆయా గుణాలు పెంపొందించడానికి ఉన్న సాహిత్యాన్నీ, సంఘటనలనూ సేకరించి, అటు పెద్దలతోనూ, ఇటు విద్యార్థులతోనూ, ఉపాధ్యాయులతోనూ చర్చలు, సెమినార్లు, ప్రశ్నపత్రాలు, అధునాతనమై పరిశోధనా విధానాలన్నిటినీ క్రోడీకరించారు. చివరకు "విలువలు బోధించబడవు, అవి గ్రహించబడును" అని నిరూపించారు. "VALUES ARE NOT TAUGHT, VALUES ARE CAUGHT" ఈ సిద్ధాంతం ప్రకారం బాలభారతి శిబిరంలో ఎన్నో ప్రయోగాలు చేశారు. ప్రతి ఒక్కరూ విద్యార్థులలో ఏయే విలువలు పెంపొందించాలని అనుకుంటారో, వాటిపై ఆచార్యగారితో సహా "మనం అందరం" చేయడం ఒక్కటే మార్గం. మనం చేస్తున్నది వారు చూసి గ్రహించి, సహజంగా ఆసక్తి కలిగి ప్రశ్నించినప్పుడే, ప్రశ్నకు తగినంత మాత్రమే జవాబు చెప్పాలి. తమకి కలిగిన సహజమైన ఆసక్తితో వారు స్పందించి, వారంతట వారు సత్యంగా ఉన్న, క్రమశిక్షణతో ఉన్న సందర్భాలను గుర్తించి, వాటిని మళ్ళీ మళ్ళీ చేసేలా అనేక స్థాయిల్లో ప్రశంసించాలి. వీటి ద్వారా సహజంగా వారి అంతరంగాలలో విలువలు పెంపొందుతాయి."

వీటన్నిటినీ చేయించడానికి ఆచార్యగారికి ధ్యాన మార్గంలో ఒక చక్కనైన విధానం స్ఫురించింది. అనేక శిబిరాలలో దానిని పరిశీలన చేసిన ప్రొ. అరుణ్ కుమార్ ఆచార్య శాస్త్రీయ పద్ధతిలో ఉస్మానియా యూనివర్సిటీకి పిహెచ్.డి పరిశోధనా గ్రంథాన్ని సమర్పించడానికి సహకరించారు. ప్రొ. మల్లాది శ్రీరామమూర్తిగారు మార్గదర్శనం అందించారు. ఇది బాబావారు ఇచ్చిన ప్రసాదం కాబట్టి డా. అరుణ్‌కుమార్ గారితో కలిసి ఆచార్యగారు మొట్టమొదట బాబాకు సమర్పణ

ఇచ్చి, ఆ తరువాత యూనివర్సిటీకి సమర్పించారు. బాబావారు దానిని గ్రహించి ఆచార్యగారికి పాద నమస్కారాలు ఇచ్చి, "ఇది అంతర్జాతీయంగా మానవులను మారుస్తుంది. నీవు దీనికి అంకితమైపో. నేను నీలో ఉండి నడిపిస్తాను" అని ఆశీర్వదించారు. బాబావారి ఆనాటి ఆశీస్సులే ఇప్పటికీ నడిపిస్తున్నాయని ఆచార్యగారి గట్టి నమ్మకం.

# 11. కలసిన చేతులు - కదిలిన అడుగులు





డా॥ యజ్ఞంభట్ల అరుణ్ కుమార్ ఆచార్య రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేసి, జీవితమే ఒక పరిశోధనగా మార్చుకుని, భౌతిక, సామాజిక, ఆధ్యాత్మిక సాధనల్లో జీవిస్తున్నారు. మిత్రులతో కలిసి హైద్రాబాద్ నుండి ఐ.ఐ.టి రామయ్యలాగ ఎక్కువ మంది విద్యార్థులను ఐ.ఐ.టి కి పంపించాలని హైద్రాబాద్ ట్యుటోరియల్స్‌లో శిక్షణలు ఇచ్చేవారు. వారి చిత్తశుద్ధి కఠోర పరిశ్రమతో, మొదటి సంవత్సరంలోనే 50% మంది విద్యార్థులకు ఐ.ఐ.టిలలో ప్రవేశం లభించింది. దాంతో వారి ప్రాముఖ్యం పెరిగి, వద్దంటే డబ్బు వచ్చి కూర్చుంది. జీవితంలో కావలసినంత డబ్బు సంపాదించుకునే అవకాశం వచ్చింది. అదే సమయంలో డా॥ వెంకటరెడ్డి గారు మిత్రుడు డా॥ అరుణ్ కుమార్‌గారిని 1985 బాలభారతి శిబిరాలు పరిశీలించడానికి రమ్మన్నారు.

ఆచార్యగారితో అదే మొదటి పరిచయం. విద్యార్థులలో వచ్చిన మార్పులు గమనించి, “మేము ఐ.ఐ.టి శిక్షణలలో చేసే దాని కన్నా, ఇలాంటి విలువలతోనే విద్యార్థులను సిద్ధం చేయడం చాలా గొప్ప విషయం” అని అన్నారు. ఆనాటి నుండి హైదరాబాద్ ట్యుటోరియల్స్ వదిలేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఆచార్యగారికి కుడి భుజమై, ఆచార్య ధర్మసూక్ష్మములను విశ్లేషించి, మార్గదర్శనం చేసే ప్రాణ స్నేహితులైనారు. బాలభారతి మొదలు ఈ రోజు లీడ్ ఇండియా మిషన్

2020 వరకు అన్ని సందర్భాలలో, ఆపదల్లో సత్యం, ధర్మములకు ఆచార్యగారికి సాక్షి అయి, ఆచార్యగారి పిల్లలందరకూ మార్గదర్శి అయి, మెంటర్రై, చెప్పినవన్నీ ఆచరిస్తూ, ఆచార్యగారు డా॥ అరుణాచార్యగా లక్షల మంది లీడ్ ఇండియా విద్యార్థులు, ట్రైనర్స్, ఉపాధ్యాయులను ఆచార్యులుగా మారుస్తున్న డా॥ అరుణ్‌కుమార్ ఆచార్య అందరికీ ఆదర్శం.

బాలభారతి నుండి లీడ్ ఇండియా శిక్షణ పరిశోధనల్లో "మీ అభివృద్ధే దేశాభివృద్ధి" పాఠ్యాంశములను తయారు చేయడంలో, శిక్షణ శిబిరములు నిర్వహించడంలో, పరిశోధనలు కొనసాగించడంలో డా॥ అరుణాచార్య పాత్ర అనిర్వచనీయమైనది.

## ప్రకృతిలోలాగ బాలభారతి మార్పులు

మార్పు ప్రకృతి నియమం. పరమాత్ముని అనుగ్రహం. తెలుగు రాష్ట్రాలైనా, హిందీ రాష్ట్రాలైనా, విద్యార్థులైనా, ఉపాధ్యాయులైనా, ఆనాటి బాలభారతి నుండి ఈనాటి లీడ్ ఇండియా వరకు అదే విధంగా మార్పులు వస్తున్నాయి. అది ఒక పవిత్రమైన వేదిక. కులాలకు, మతాలకు అతీతం. ప్రేమ, సత్యం, ధర్మం, దైవత్వం, భక్తి, బాధ్యత, భయం, ధైర్యం, త్యాగం, స్పష్టత, నిస్వార్థం వంటి విలువలే ఉద్యమాన్ని నడిపించే చక్రాలు. వీటి ద్వారా పరమాత్ముడు వేలకొలదీ శిబిరాలలో లక్షల కొలదీ విద్యార్థులను మార్పు ప్రతినిధులుగా మార్చాడు. తెలుగు రాష్ట్రాలలో ఒక పల్లెటూరినుండి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన దీని ప్రభావం ఆసక్తి దాయకం. చదవండి! గమనించండి.

## చూడటమే నమ్మడం

మనిషి నమ్మకం అనేక విధాలుగా ఉంటుంది. తన జ్ఞానంతో, సమాచారంతో, విన్నదానితో నమ్మవచ్చు, నమ్మకపోవచ్చు. కానీ ప్రత్యక్షంగా చూసింది తప్పకుండా నమ్మవలసిందే. బాలభారతి నుండి లీడ్ ఇండియా 2020 వరకు నిరంతరంగా జరుగుతున్న మార్పులను ఎవరు ఎప్పుడు ఎక్కడ ప్రత్యేక్షంగా చూస్తారో, వాళ్ళంతా బాలభారతి లీడ్ ఇండియాలో వారికి తోచిన తన్, మన్, ధన్ సేవలతో నిర్వహణ బాధ్యతలు వహిస్తారు.

## 2) డా. బండి పార్థసారథి రెడ్డి గారు



లౌకికం, వ్యవహారికం, భౌతికం, వాటిని కొలిచే ప్రమాణాలన్నీ భౌతికంగా ఏదో ఒక రకమైన లాభం చూపవలసిందే. లాభాలు అంటే ధనం కావచ్చు, పేరుప్రతిష్ఠలు కావచ్చు, ఇంకా మరో రకమైన మేలుకావచ్చు. అది ఏదైనా సరే, స్వార్థం, లౌకికం మాత్రమే. పారమార్థికం అనేది అభౌతికం, అదృశ్యం, అనంత అనుభూతి. వ్యక్తి తన సాధన ద్వారా ఈ అనుభూతిగా పొందవలసిందే. భక్తి, సేవలు ఈ పారమార్థిక జ్ఞానాన్నీ, తృప్తిని, అనుభూతినీ, ఆత్మానందాన్నీ కలిగిస్తాయి. ఖమ్మం జిల్లా కందుకూరులో పుట్టిన డా. బండి పార్థసారథి రెడ్డిగారు రసాయనిక శాస్త్రంలో హెటిరో కణముల ప్రత్యేక గుణాలను గుర్తించి హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీని స్థాపించి కోట్ల కొలది మానవుల రుగ్మతలను నయం చేయడానికి కారణం అయ్యారు. 20,000 కుటుంబాల పోషణను భరిస్తున్నారు. అనేక దేశాలలో హెటిరో కంపెనీ విస్తరించింది.

1989లో బాలభారతి శిక్షణ శిబిరంలో వారి కుమారుడిలో వచ్చిన మార్పుకు సంతోషించి నాటి నుండి నేడు లీడ్ ఇండియా మిషన్ 2020 వరకు ఒక ట్రస్ట్‌గా నిరంతరం ఎనలేని సేవ చేస్తున్నారు.

2004లో ఎల్.బి. స్టేడియంలో 50 వేల మంది విద్యార్థుల సమక్షంలో జరిగిన కలాంగారి 74వ జన్మదిన వేడుకల్లో ప్రధాన భూమిక పోషించిన ప్రాణదాత.

ఇప్పుడు మిషన్ 2020కి ప్రాణదాతయై 3 సంవత్సరాలలో ఒక ఖమ్మం మరియు కొత్తగూడెం జిల్లాలలోనే కాక తెలంగాణలోని 31 జిల్లాలకు విస్తరింప చేయడానికి హెటిరో సి.ఎస్.ఆర్ ద్వారా దేశమంతా ఈ ఉద్యమాన్ని నడిపించడానికి సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేశారు. పిల్లలలో వస్తున్న మార్పులను నిర్ధారించడానికి శాస్త్రీయమైన, శాశ్వతమైన విధివిధానాలను రూపొందించడానికి నడుంబిగించిన సారథి మన డా॥ బండి పార్థసారథి. తమలాగే పల్లె పల్లెలోని బాలబాలికలందరూ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే వారి సంకల్పం.

### 3) శ్రీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిగారు



ఒక దేశం అభివృద్ధి జరగడం లేదా జరగక పోవడానికి కారణం ప్రత్యక్షంగా దేశ రాజకీయ నాయకులు. పరోక్షంగా ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యం.

శ్రీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిగారు కె.ఎల్.ఆర్‌గా ప్రసిద్ధులు. గ్రామ స్థాయిలో జరుగుతున్న అవతవకలను సరిదిద్దే ప్రయత్నంచేసి, ఒక యువ నాయకుడై యువతను జాగృతం చేశారు.

చదువులో రాణిస్తూ రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకు సంపాదించి ఎం.ఎస్.సి పట్టభద్రులైనారు. తమ జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని కాలేజీ లెక్చరర్ అయ్యారు. నెల జీతం కొరకు బానిసలా బ్రతికే కంటే నలుగురికి ఉపాధినిచ్చే విధంగా పారిశ్రామికవేత్త అవ్వాలనుకున్నారు. ఆనాటి రైతుల సమస్యలకు హృదయం చలించగా తమ చదువుకి సంబంధించింది కాకపోయినా తమ బుద్ధి కుశలతతో భూమి నుండి నీళ్ళు తీసే బోర్‌వెల్ కర్మాగారాన్ని స్థాపించారు. లాభాల కొరకు చూడకుండా వ్యవసాయదారుల కష్టాలను తీర్చాలని, ప్రజల నీటి దాహం తీర్చాలని, ఊరూరా ఉచితంగా బోర్‌వెల్స్ వేసి ప్రజల నాయకుడైనారు. మన కె.ఎల్. ఆర్ గారు తమలాగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలనీ, ఎందరినో ఆఫ్రికా తీసుకువెళ్ళారు. వారిని పారిశ్రామిక వేత్తలుగా స్థిరపరిచారు. ఆఫ్రికా వాళ్ళు మన వాళ్ళే అనుకుని వాళ్ళ దాహం తీర్చి కులం, మతం, భాష, ప్రాంతం, దేశం విభేదాలు లేని మానవత్వ మున్న నాయకుడిగా, ఇటు గ్రామ ప్రజల దగ్గర నుండి అటు ఆఫ్రికా ప్రభుత్వం వరకూ మన్ననలు పొందారు.

1996లో రావిర్యాలలో జరుగుతున్న లీడ్ యూత్ క్యాంపుల యొక్క మార్పు ప్రభావం ప్రత్యక్షంగా చూసి, ఆనాటి నుండి ఈనాటి లీడ్ ఇండియా 2020 జాతీయ

ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు. తమదైన శైలిలో 2008లో కరీంనగర్ జిల్లాను దత్తత తీసుకుని 2.50 లక్షల మందికి శిక్షణ ఇప్పించారు.

ఇప్పుడు 2020 నాటికి 20 కోట్ల యువశక్తిని దేశశక్తిగా మార్చడానికి నడుం బిగించి తోడ్పడుతున్న ధైర్యవంతులు కె.ఎల్.ఆర్.

### 4) జస్టిస్ వి. భాస్కరరావుగారు

ఇక ఆచార్యగారు కలాం గారి స్థాయికి తగిన సత్యవంతులు. ధర్మవంతులైన వారితో బాలభారతి, లీడ్ ఇండియా శిక్షణ ప్రభావాలను చూసి ఆకర్షితులై, స్వచ్ఛందంగా నిస్వార్థంగా బాధ్యతలు చేపట్టే వారితో లీడ్ ఇండియా 2020 ఫౌండేషన్ స్థాపించారు.

బాలభారతి వేసవి శిబిరంలో తమ మనుమరాలులో జరిగిన ఉన్నతమైన మార్పులను గమనించి తన సంపూర్ణ సహకారాన్ని అందించారు జస్టిస్ వి.భాస్కర్‌రావు గారు. అప్పట్లో ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సిట్టింగ్ జడ్జి. లీడ్ ఇండియా 2020 ఫౌండేషన్ ట్రస్టు బైలాస్ రచించారు. ఆ తరువాత అధ్యక్షులుగా పనిచేశారు.పదవీ విరమణ తరువాత కూడా వారు లీడ్ ఇండియాకు సేవలు అందించారు. శివానంద స్వామి ఆశీస్సులు అందించారు. ఎనలేని సేవలు చేశారు. తరువాత కొంతకాలం పాటు జస్టిస్ చంద్రకుమార్‌గారు సేవలందించారు.

### 5) జస్టిస్ వి. ఈశ్వరయ్యగారు



తరువాత జస్టిస్ వి. ఈశ్వరయ్య గారు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సిట్టింగ్ జడ్జిగా డా. కలాంగారి 74వ జన్మదినోత్సవ వేడుకల్లో పరిచయమయినారు. 2008లో లలిత కళాతోరణంలో డా. కలాంగారితో కలసి గణతంత్ర దినోత్సవ సందర్భంగా పౌర హక్కులతో పాటు పౌర బాధ్యతలను కూడా వివరించారు. నేషనల్ బి.సి. కమీషన్

ఛైర్మన్‌గా సేవలందించారు. దేశంలో ఉన్న విద్యాలయాలన్నింటికి లీడ్ ఇండియా శిక్షణ అందించాలని వ్రాసినా ప్రభుత్వాలు ఏమీ చేయలేదు, స్పందించడంలేదు. ఇప్పుడు జె.ఇ. గా లీడ్ ఇండియా అధ్యక్షునిగా ప్రభుత్వాలను స్పందింప చేసేలా కృషి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారిని కలిసి ఆంధ్రప్రదేశ్ విద్యార్థులందరికీ లీడ్ ఇండియా శిక్షణ అందేలా కృషి చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకి సైతం విస్తరింపజేయడానికి కృషి చేస్తున్నారు.

**6) పద్మభూషణ్ డా. వరప్రసాద్ రెడ్డి భారతీయుల ధర్మాగ్రహ ప్రతినిధి**





మనిషిని రక్షించే వ్యాక్సిన్స్ కూడా చేయలేని అసమర్థుల దేశం."ఎప్పుడూ భిక్షమడిగే భిక్షగాళ్ళ దేశం'' అనీ జెనీవా సభలో కించపరిచిన సంఘటనతో డా. కె.ఐ వరప్రసాద్ రెడ్డి గారి హృదయానికి గట్టి గాయం తగిలింది. భారతీయుడికి కోపం వస్తే అద్భుతాలు సృష్టిస్తాడు అని, దేశ ఆత్మ గౌరవం నిలపడానికి వారు ఎంతో మంది దగ్గరకు తిరిగారు. ఆ ధర్మాగ్రహంతో తాను ఒక ఎలక్ట్రానిక్ ఇంజినీర్ అయినప్పటికీ, సంబంధించిన శాస్త్రజ్ఞులను సమకూర్చుకుని వారి ద్వారా ఆ విజ్ఞానాన్ని పెంపొందించుకుని, పట్టుదలతో పరిశ్రమించి, "మాతృదేవో భవ" అని మాతృమూర్తి ఆశీస్సులతో 'శాంతా బయోటిక్స్' స్థాపించారు. తమ నిరంతర కృషితో అంతర్జాతీయ సంస్థగా మార్చగలిగారు.

ఒక వ్యాక్సిన్ ధర 2 వేలకు ఉన్న దానిని ఎక్కువ లాభం

ఆపేక్షించకుండా, మానవ మనుగడ కొరకు కేవలం 22 రూపాయలకు అందించారు. డా.కలాంగారి లాగా ఆచార్యగారిని ఆకర్షించిన అనన్య దేశ భక్తుడు. పద్మభూషణ్ డా. వరప్రసాద్ రెడ్డిగారు. లీడ్ ఇండియా అధ్యక్షులుగా ఒక డిన్నర్ మీటింగ్ ఏర్పాటు చేసి రూ. 49 లక్షలు విరాళాలు సేకరించి ఉద్యమానికి రూ. 27 లక్షలతో ఒక లఘు సినిమా అందించి ఈ రోజుకు ఉద్యమాన్ని నడిపిస్తున్న నాయకుడు పద్మభూషణ్ డా. వరప్రసాద్ రెడ్డిగారు.

చూడండి. https://www.youtube.com/watch?v=sAjjFKan_i4

### 7) శ్రీ డిజె రమేష్ గారు



1992లో లీడ్ యూత్ క్యాంప్స్‌కి యువతను జాగృతం చేసే విషయంలో సత్యంతో విజయం సాధించిన పారిశ్రామిక వేత్త గురించి వెతుకుతున్నారు. శ్రీ డి.జె. రమేష్ గారు విజయ్ ఎలక్ట్రికల్స్ సి.ఎం.డి. "బెస్టు ఇన్‌కంట్యాక్సు పేయర్" అవార్డు వచ్చిందని తెలిసి, వారిని ఆహ్వానించారు. ఆయన ద్వారా లీడ్ ఇండియా క్యాంపులలో ఆహ్వానించారు. చాలా మంది విద్యార్థులు ప్రేరణ పొంది, సత్యాన్ని పాటిస్తూ పారిశ్రామిక వేత్తలైనారు. తమ జన్మభూమి కృష్ణా జిల్లాలో 1,50,000 మంది విద్యార్థులకి లీడ్ ఇండియా శిక్షణ ఇప్పించారు. విజయ్ ఎలక్ట్రికల్స్‌లో లీడ్ ఇండియాకి కార్యాలయమిచ్చి ఉద్యమ వ్యాప్తికి తోడ్పడ్డారు.

**8) మంచితనానికి మారుపేరు శ్రీ పుల్లారెడ్డి గారు**



స్వీట్స్ కింగ్ శ్రీ జి. పుల్లా రెడ్డిగారు. "నాకు వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బు సమాజం ద్వారా వచ్చింది. నేను ఈ డబ్బును సమాజం కొరకు కొంత తిరిగి ఇవ్వాలి" అనే సిద్ధాంతాన్ని నమ్మి, లాభాలలో నికరంగా కొంత శాతం జి.పుల్లా రెడ్డి ట్రస్టు నిర్వహించే విద్యా, సేవ, దాన ధర్మాలకు వినియోగించేవారు. ఆచార్యగారికి గురుతుల్యులు సన్నిహిత మిత్రులు, మార్గదర్శి ఆయన. బాల భారతి లీడ్ ఇండియా కార్యక్రమాలకు పూర్తి ప్రోత్సాహాన్ని ఇచ్చిన దాతలు. ఆచార్యగారు ఇచ్చిన శిక్షణలన్నీ వారి సౌజన్యంతో ఒయాసిస్ స్కూల్‌లో జరిగేవి. ఆచార్యగారు గుర్తు చేస్తూ ఈ రోజుకూ ఎన్నో లక్షల మంది విద్యార్థులలో శ్రీ పుల్లారెడ్డిగారిని జీవింప చేస్తున్నారు.

**9) శ్రీ జి.వి. ఆంజనేయులు గారు**



2010 గుంటూరు ఎ.పి.ఎస్.ఆర్. ఇ.ఐ. విద్యార్థులలో వచ్చిన మార్పులను చూసి తమ సంస్థ అంజనా ఫౌండేషన్ ద్వారా గుంటూరు జిల్లాలో ఈనాటికీ సేవలందిస్తున్న వినుకొండ ఎం.ఎల్.ఎ. శ్రీ జి.వి. అంజనేయులు. ఈ ఉద్యమానికి ఒక గొప్ప ఊపిరి. వారి ధర్మపత్ని శ్రీమతి లీలావతిగారు ఒక ట్రైనర్ స్థాయి నుండి ఈ రోజు లీడ్ ఇండియా ట్రస్టీగా సేవలు అందిస్తున్నారు. వారికి తోడుగా రిటైర్డ్ హెడ్‌మాష్టరు శ్రీ పాపారావుగారు గుంటూరు

కో-ఆర్డినేటర్‌గా సేవలు కొనసాగిస్తున్నారు. పల్నాడు జిల్లా నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా ఉద్యమం విస్తరణకై నడుం బిగిస్తున్నారు.

## 10) శ్రీ జె. జగన్‌మోహన్ రెడ్డి గారు



బాల భారతి, లీడ్ యంూత్ క్యాంప్నుకి ఆహ్వానించినప్పుడు విద్యార్థులలో వచ్చిన మార్పులకు ఆకర్షితులై ఆచార్యగారికి సన్నిహితులైనారు. శిబిరానికి వెంటనే 10,000 రూపాయిలు విరాళంగా అందించారు. బాలభారతి శిక్షణలో తమ పిల్లలను చేర్చి, భార్యతో సహా తాము చేరి శిక్షణ పొందారు. బాలభారతి లీడ్ ఇండియాగా మారినప్పుడు ఆచార్యగారు వారిని ట్రస్టీగా తీసుకున్నారు. వారు లయన్స్ క్లబ్‌లను లీడ్ ఇండియాతో అనుసంధానించి, ప్రభుత్వంతో కలసి పని చేసే వెసులుబాటు కలిగించారు. తండ్రి ప్రమాద స్థితిలో వున్నా, ఎల్.బి. స్టేడియంలో డా॥ రమణాచారి ఐఎఎస్ ఆధ్వర్యంలో 20.2.2013 నాడు గొప్ప సభ నిర్వహించారు. లీడ్ ఇండియాలో వారు వేసిన ముద్ర ఎన్నటికీ మరువలేని మలుపు.



MOU with Govt., & Lions Clubs

# 12. ప్రభావిత హృదయాల సేవా ప్రస్థానం

## 1) నిస్వార్థ సేవ - నిజమైన భక్తి :

పది మందికీ మంచి పని చేయాలనిపించే దృఢమైన సంకల్పమే సేవ. ఇది చేసినందుకు తృప్తినీ, ఆనందాన్నీ పొందుతాం. ఆ విధంగా సేవ చేస్తున్న వారికి ఏ ఇతర చింతనలూ ఉండవు. ఎంత కష్టమైనా ఇష్టంతో చేస్తారు. ఏ హద్దులూ లేకుండా, చివరి వరకు కష్టపడతారు. శ్రీ కృష్ణన్న తన అన్న కుమారులు ఇద్దరినీ బాలభారతి శిక్షణలో చేర్పించడానికి వచ్చారు. అక్కడ జరుగుతున్న తరగతులను గమనించారు. పిల్లలు ఏవిధంగా స్పందిస్తున్నారో కూడా చూశారు.

కృష్ణన్నకు పిల్లలంటే చాల ప్రీతి. పిల్లలు తెల్లవారుజామున వచ్చేలోపుగానే స్నానాల గదులనీ మరుగుదొడ్లనీ రాత్రిళ్ళు శుభ్రం చేసేవారు. ఒక రోజు పిల్లలందరికీ బాస్మతి బిర్యానీ వండి పెట్టాలనుకున్నారు. రాత్రి 11గంటలకు స్కూటర్ పై 60 కి.మీ దూరంలో ఉన్న తన ఇంటికి వెళ్ళి, బాస్మతి బియ్యం తీసుకు వచ్చి ఉదయం 10గంటలకు అందజేశారు. తన ప్రేమతో శిబిరంలో అందరిని ఆకట్టుకున్నారు. శ్రీ హరిశ్చంద్రారెడ్డి గారితో కలిసి హరిద్వార్, ఋషికేశ్ యాత్రలకు వెళ్ళారు. ఋషికేశ్‌లో కృష్ణయ్యకు ఒక సాధువు ఓంకారం ప్రణవ మంత్రం ఉపదేశం చేశారు. అది సాధన చేస్తూ అక్కడి కక్కడే జీవన ముక్తి పొందారు. ఆయన్ని ఈ రోజుకూ బాలభారతి రత్నమాలగా అందరం తలచుకుంటూ ఉంటాము.

## 2) తల్లిని మరిపించిన ప్రేమ



ప్రపంచంలో ఎవరికైనా తల్లి తల్లే. తల్లి చేసే త్యాగం, తల్లి చూపే ప్రేమ, తల్లి చేసే సేవ, తల్లి పడే కష్టాలు, ఏ కోణంలో చూసినా తల్లి తల్లే! అందుకే తల్లి అంటే కంటికి కనిపించే దైవం. అందుకే "మాతృదేవో భవ" అంటాం. ఆమెను ఎవ్వరు మరిపించగలరు? బాలభారతి శిబిరం జరిగినప్పుడు ప్రతి సంవత్సరం 15 రోజుల సెలవు పెట్టి వచ్చేవారు స్టెనో గ్రాఫర్ శ్రీమతి అను లక్ష్మి. శిబిరానికి కావలసిన వ్యవహారాలను అన్నింటినీ చక్క దిద్దేవారు. ఆచార్యగారికి ఏ సమయమంటే ఆ సయయంలో డిక్టేషన్ తీసుకుని పనులు ముందుకు సాగించేవారు. ఎలాంటి ఆఫీస్ వర్కు అయినా రాత్రి-పగలు తేడా లేకుండా చక్కగా చేసే వారు. ఆచార్యులందరికీ ఎక్కడున్నా, వారి వారి నియమం ప్రకారం కావలసిన ఆహారాన్ని అందించేవారు. చిన్న పిల్లలకు స్నానాలు చేయించి, తలలు దువ్వి, డ్రెస్సులు వేసేవారు. ఆడపిల్లలచేత యోగా చేయించేవారు. భజనలు చేయించేవారు. తరువాత శిబిరంలో అందరికీ ఒక తల్లిలా వారి తల్లినే మరిపించేవారు. తరువాత తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఒయాసిస్ స్కూల్లో నే ఉంటూ లీడ్ ఇండియాకు ఫుల్ టైం వాలంటీర్‌గా సేవ చేస్తూ, రాష్ట్రమంతటా లీడ్ ఇండియా శిబిరాలు నిర్వహించడానికి ఆమె చేసే సేవలు మరవ లేనివి. ఆమెలో ఒక భక్త మీరాబాయి గోచరిస్తుంది.

### 3) అనుభవంతో వచ్చేది ధైర్యం.

బాలభారతి శిబిరంలో శ్రీ జె.వివేకానందుడు కమాండో శిక్షణ పూర్తి చేసుకుని సేవ చేయడానికి అన్నయ్యగా వచ్చారు. ప్రతిరోజూ శిబిరానికి కావలసిన కూరగాయలు పండ్లు, ఇతర కొనుగోళ్లు చేసే బాధ్యత పడింది. మంచి కూరగాయలు తక్కువ ధరలో తెచ్చే మంచి అనుభవం వచ్చింది. ఒక రోజు మార్కెట్లో ఒక దొంగ అతని జేబు కత్తిరించి డబ్బు దోచుకున్నాడు. ఆ విషయం చెప్పే ధైర్యం లేక, ఏమీ చేయలేక బిక్కు బిక్కు మంటు ఏడుస్తూ ఒక మూలకు నక్కాడు. "ఇక శిబిరం సేవ చేయను, ఇంటికి వెళ్ళిపోతాను" అని ఏడ్చాడు. దానికి ఆచార్య గారు అంగీకరించలేదు. "ఇది నీకు ఓ అనుభవం, ఇక మీదట జాగ్రత్తగా చేయి" అని అనునయించారు. అదే అనుభవం ఆ పిల్లవానికి ధైర్యాన్నిచ్చాయి. వివేకానందుని స్ఫూర్తి పొందాడు. ఐ.ఐ.ఎం కలకత్తాలో ఎం.బి.ఎ. చేశారు. ఆ తర్వాత తండ్రి శ్రీ జె. జనార్ధన్ గారు నడిపిస్తున్న డెక్కన్ ఇంజనీరింగ్ బాడి బిల్డింగ్ లోకల్ కంపెనీని అంతర్జాతీయ స్థాయి కంపెనీగా తీర్చిదిద్దారు. ఈ వివేకానందుని సోదరి శ్రీమతి అను వైదేహి ఆ రోజు బాలభారతికి చేసిన సేవలు "నేను కన్న నా పిల్లలను సంస్కారవంతులుగా చేయడానికి నా జీవితానికి ఉపయోగపడతాయి" అంటుంది.

ఈ వివేకానందుడు, వైదేహిల తండ్రి శ్రీ జనార్ధన్‌గారు, "ఆచార్య త్రయం. ముగ్గురు ఆచార్యులకు మా జీవితాలు, మా కుటుంబ జీవితాలు,

వ్యాపార విలువలు తీర్చిదిద్దారని అందుకు మేము జీవితాంతం ఋణపడి ఉంటామ”ని ఇప్పటికీ తాను ఏదో చేయాలని తపన పడుతుంటారు.


**4) మనిషి ఎంత వరకు ఎదగవచ్చు?**



ఒక రబ్బర్ బ్యాండును సాగదీస్తే కొంతవరకు సాగుతుంది. వదిలివేస్తే తిరిగి అది దగ్గరకు వస్తుంది. కానీ, మితిమీరి సాగదీస్తే అది తెగిపోతుంది. అదే విధంగా మనిషి పనిలో నిమగ్నమై శారీరకంగా, మానసికంగా, పని వత్తిడిని బట్టి సాగుబడి జరిగి విస్తారము/ విస్తరీకరణ (ఎక్స్‌పాన్షన్) జరుగుతుంది. ఆ విధంగా జరిగిన ఎక్స్‌పాన్షన్ దగ్గరకు (కాన్‌ట్రాక్షన్) అవ్వదు. ఆ ఎదుగుదల మనిషిలో శాశ్వతంగా నిలిచిపోతుంది. అటువంటి కష్టం ఎప్పుడు వచ్చినా ఎదుర్కోనే సమర్థత పెరుగుతుంది. ఆచార్యగారి ఆత్మీయ స్నేహితులు శ్రీ కొత్తూరు సత్తయ్యగారు పి.ఎన్.టి ఎకౌంట్సులో కలసి పనిచేశారు. వారు కూడా బాలభారతి కోశాధికారిగా రాత్రనక, పగలనక ధర్మబద్ధ:గా, నిక్కచ్చిగా వ్యవహరించేవారు. వారి గుణగణాలే వారి కుమారులకి అబ్బాయి. బాలబారతిలో చిన్నన్నగా సేవచేసిన సుయోదన్ కార్గిల్ యుద్ధంలో అహర్నిశలూ పట్టుదలతో పోరాడి, పనివత్తిడి తట్టుకుని అందరి మన్ననలూ పొందారు. ఇప్పుడు వారి జ్యేష్ఠ కుమారుడు కొత్తూరు శ్రీనివాస్ అమెరికాలో ఉన్నా రేయింబవళ్ళు కష్టపడి ఈ గ్రంథ సంకలనం చేశారు.

**5) ఎంత లోతుగా బాధ్యత వహిస్తే, అంత ఎత్తుకు ఎదుగుతారు.**





బంతిని ఎంత గట్టిగా నేలకు కొడితే, అంతే వేగంతో పైకి ఎగురుతుంది. అలాగే ఒక వ్యక్తి తను చేసే పనిలో ఎంత లోతుగా నిమగ్నమై బాధ్యతలు వహించి దాన్ని దిగ్విజయం చేస్తాడో, అంత అనుభవం అతని ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.

బాలభారతి శిక్షణ శిబిరం ప్రాముఖ్యత పెరిగి ఏకకాలంలో 3-4, శిబిరాలు చేయవలసిన పరిస్థితి వచ్చింది. 1998లో 9వ తరగతి చదువుతున్న కనకాల మణికుమార్ బాలభారతి శిక్షణ శిబిరానికి మొట్టమొదటి సారి వచ్చారు. చక్కని మార్పులు పొందాడు. ఈ శిక్షణకు ఆకర్షితులై మణికుమార్ తమ్ముడు, చెల్లెలు కూడా తరువాత జరిగిన శిక్షణ శిబిరాలకు హజరైనారు. వాళ్ళంతా మంచి ఉత్తీర్ణత పొందారు. మణికుమార్ ప్రతి సంవత్సరం అన్నయ్యగా సేవ చేసి మంచి అనుభవం సంపాదించాడు. తాను మిలటరీ ఆఫీసర్ అవ్వాలని కృషి చేశారు. పరీక్షలన్నీ పాస్ అయి ఒక చిన్న కారణం చేత మెడికల్ పరీక్షలో నిరాకరింపబడ్డాడు. దాంతో తన కల నెరవేర్చుకోలేక పోతున్నానని నిరుత్సాహపడినారు. అప్పుడు ఆచార్యగారు చెప్పిన మాటలు మరువలేనివి.

“కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూర్మాతే సంగోస్త్వ కర్మణి”

కర్మము నాచరించుట యందే నీకు అధికారము ఉండేది, కానీ ఎన్నడూ దాని ఫలముల యందు కాదు. కర్మలను మానుటయందు నీవు ఆసక్తుడవు కావలదు. అనగా ఫలాపేక్షరహితుడవై కర్తవ్యబుద్ధితో కర్మలనాచరింపుము. “ఈ గీతా ప్రబోధంతో ఊరట పొందిన మణికుమార్ తమ లక్ష్యం మార్చుకున్నారు. తరువాత బాలభారతి లీడ్ ఇండియాగా మారిన తరుణంలో, ఆచార్యకు కుడిభుజమై, వారితో పాటు ఒయాసిస్ స్కూల్‌లో 4 నెలలు ఉండి ఉద్యమానికి కావలసిన విధివిధానాలనూ, శిక్షణ పద్ధతులనూ రూపొందించి గొప్ప అనుభవం సంపాదించారు. ఎంతో మంది లీడ్ ఇండియా ట్రైనర్స్‌కి ఆదర్శమైన నాయకులైనారు. తరువాత ఒక గొప్ప కంపెనీకి హెచ్.ఆర్. హెడ్‌గా ఎదిగారు.

ఈ విధంగా బాలభారతి రత్నాలు ఎంతో మంది! ఎక్కడెక్కడో విస్తరించి తమ తమ విలువల ప్రత్యేకతలు చాటుతూ తమ కుటుంబాలు, తమ చుట్టూ ఏర్పాటైన సమాజం వ్యవస్థలలో మార్పులు తెస్తున్నారు.

## విద్య - నిత్య పరిశోధన

విద్య అంటే పుస్తకంలో ఉన్న దానిని బట్టీపట్టి విషయాన్నంతా గుర్తించుకుని పరీక్షల్లో మార్కులు తెచ్చుకోవడమే కాదు. అది ప్రయోగాత్మక విద్యగా మారాలి. అనగా మనిషిలో దాగిన చైతన్య శక్తినీ, ఆలోచనా శక్తినీ పెంపొందించి, చదివే విషయాన్ని విశ్లేషించి, పరిశోధించి, ఆ విషయ జ్ఞానం జీవితంలో, సమాజంలో ఎక్కడ ఏ విధంగా వినియోగించబడుతుందో, అనుభవంతో గ్రహించడమే ప్రయోగాత్మక విద్య. దీని వల్ల వ్యక్తి మేధాశక్తి నిర్మాణం జరుగుతుంది. దేశం

విజ్ఞానవంతమైన దేశంగా వెలుగొందుతుంది. దానివల్ల అందరూ అభివృద్ధి చెందుతారు.

1997లో డా. ఎ.పి.జె .అబ్దుల్ కలాంగారు పృథ్వి, ఆకాశ్, నాగ్, త్రిశూల్, అగ్ని మిసైల్స్‌కి రూపకల్పన చేసినందుకు వారికి " భారతరత్న " బిరుదును ఇచ్చారు. "ఫాదర్ ఆఫ్ మిసైల్ టెక్నాలజి" అని దేశం అంతా గౌరవించింది. అదే సంవత్సరం వారు "అభివృద్ధి చెందుతున్న భారత్–అభివృద్ధి చెందిన భారత్‌గా" ఎలా ఆవిర్భవించగలదు అని 12 సంవత్సరాలపాటు పరిశోధన చేసిన విషయాలను "ఇండియా 2020" అనే పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. ఈ విషయాల పట్ల ఆకర్షితులై ఆచార్యగారు మొట్టమొదటి సారి డా. అబ్దుల్ కలాంగారి పుస్తకం చదివి ఆయన పట్ల తన పరిశోధనను ప్రారంభించారు.

**డా. అబ్దుల్ కలాం రీబిల్డ్ ఇండియా ఫోర్సు ( ఏ.కె.ఆర్ ఐ.ఎఫ్ )**

బాలభారతి శిక్షణ శిబిరంలో విద్యార్థుల బృందాలు శివాజీ, వివేకానంద, మహాత్మా గాంధీ, ఝాన్సీ లాంటి నాయకుల పేర్లతో ఉండేవి. వాటితో పాటు కలాం బృందం అని చేర్చబడింది. డా॥ కలాంగారి పరిశోధనలు, వారు సాధించిన విజయాలు వారి విలువల గురించి సమాచారం సేకరించి పిల్లలకు అందించి స్ఫూర్తినిచ్చారు. వారు కలాం సైనికులలాగ పరిశోధనలు చేసి యంగ్ సైటిస్టులు అయి "అబ్దుల్ కలాం రీబిల్డ్ ఇండియా ఫోర్సు"గా చిన్నారులను తయారు చేశారు.

భారతదేశ రక్షణ విభాగం పరిశోధనలు డి.ఆర్.డి.ఒ, డి.ఆర్.డి.ఎల్ ఇత్యాది సంస్థలను దశాబ్దాల కొలదీ రహస్యంగా ఉంచి, వాటిని కేవలం దేశ రక్షణ నిమిత్తమే వాడేవారు. కానీ డా॥ అబ్దుల్ కలాంగారు బాధ్యతలు

తీసుకున్న తరువాత రక్షణ విభాగం పరిశోధనలు సామాన్య మానవుల సమస్యలు తీర్చడానికీ మరియు విద్యార్థుల విజ్ఞానం పెంపొందించడానికీ దేశవ్యాప్తంగా వాటిని వాడే విధానాన్ని అందించారు. ఒక రోజు ఎయిర్‌పోర్టులో ఒక పిల్లవాడు ఒక కాలు లేక కృత్రిమ కాలు (ఆర్టిఫీషియల్ లింబు) తొడిగి, ఇతర బాలులతో సమానంగా నడవలేక బాధపడుతున్న విషయం డా॥ కలాంగారి హృదయాన్ని కదిలించివేసింది. దీనికి ఏమీ మార్గంలేదా? కృత్రిమ కాలు (ఆర్టిఫీషియల్ లింబు) బరువు తగ్గించలేమా? అని ఆలోచన చేయడం మొదలుపెట్టారు. తరువాత నిజాం ఆసుపత్రి ఎముకల వైద్యులు (ఆర్థోపెడీషియన్) డా॥ ప్రసాద్ గారితో కలసి రక్షణ విభాగం విమానాలలో వాడే అతి తేలికైన లోహాన్ని వాడి, స్టీల్‌ను తీసివేసి, కృత్రిమ కాలు (ఆర్టీఫీషియల్ లింబు) తయారు చేయించారు.

ఆ విధంగా దాదాపు 12 కిలోల బరువును తగ్గించారు. అది తొడిగి కుంటి పిల్లలు మిగతా పిల్లలతో సమానంగా ఉత్సాహంగా పరుగెత్తుతుంటే చూసి చాలా ఆనందించారు.

గుండె జబ్బులతో బాధపడే పేదలు, గుండె ఆపరేషన్ చేయించుకోలేని పరిస్థితి అప్పుడు. దానికి పరిష్కార మార్గం ఏమిటని గుండె డాక్టర్లనందరినీ హైద్రాబాద్ కేర్ హస్పిటల్‌లో సమావేశపరిచి పరిష్కార మార్గాన్ని అడిగారు. అందరూ ఏవేవో కారణాలు చెప్పి, "ఇది సాధ్యం అవదు" అని చెప్పారు. ఓపికతో చివరి వరకు అన్నీ విని, "కాదనే సమాధానాన్ని మీరు చెప్పనక్కర్లేదు. దాంతో ఏమీ లాభం జరగదు. "అవును" అని ఒక్కరిద్దరు చెప్పిన పరిష్కారమార్గం అందిస్తే, పేద ప్రజలు సంతోషిస్తారు"

అని అన్నారు. తరువాత వారే కేర్ హస్పిటల్ డా॥ సోమరాజుగారితో కలసి "కలాం – రాజు స్టెంట్" కనిపెట్టారు. ప్రజల దీవెనలు పొందారు. ఈ విధంగా కలాంగారు విజ్ఞానశాస్త్రాన్ని సమాజంలోని సమస్యలను తీర్చడానికి వినియోగించి విద్యార్థులలో విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంపొందించి ఇండియాను పునర్నిర్మాణం చేశారు. అదే లీడ్ ఇండియా "మీ అభివృద్ధే దేశాభివృద్ధి" శిక్షణ తరగతులలో శాస్త్రీయ జిజ్ఞాసగా మారింది.

## నిత్య జీవితంలో శాస్త్రీయ జిజ్ఞాస

దేవుడు మానవుడికి మాత్రమే ఇచ్చిన గొప్ప వరం – శాస్రీయ జిజ్ఞాస. కాని దురదృష్టవశాత్తూ శాస్త్రీయ జిజ్ఞాస విజ్ఞాన శాస్త్రానికి మాత్రమే పరిమితమయింది. ఇక విజ్ఞాన శాస్త్రం విద్యార్థులు చదివే మిగతా విషయాలు గణాంక శాస్త్రం, సామాజిక శాస్త్రం వాటి సిలబస్, మార్పులతో ముడిపడింది. ఈ ప్రక్రియ మూలంగా విద్యార్థులు విజ్ఞానశాస్త్ర జ్ఞానమును పరీక్షల కొరకే పరిమితం చేస్తున్నారు. మనం తినే ఆహారంలో, త్రాగే నీటిలో, పీల్చే గాలిలో, చుట్టూ ఉన్న వాతావరణంలో, ఇంటా బయటా విజ్ఞాన శాస్త్రం లేనిది ఏదీ లేదు. వీటిని పరిశీలించడానికి శాస్త్రీయ జిజ్ఞాస అవసరం. ఈ శాస్త్రీయ జిజ్ఞాస పెంపొందించడానికి విద్యార్థిలో పరిశీలించే, గమనించే, ఆసక్తి, జిజ్ఞాస అవసరం.

సైన్స్ ప్రయోగశాలతో సంబంధం లేకుండా డా॥అరుణ్‌కుమార్ గారు డా॥ అబ్దుల్ కలాంగారి శాస్త్రీయ జిజ్ఞాసను శ్రీ అరవిందగుప్తా, ప్రొఫెసర్ శ్రీ సాయి ప్రకాశ్‌గారు మరియు తదితర మిత్రుల సహకారంతో ప్రయోగాత్మకంగా పరిశోధనలు చేశారు. వారు పనికిరాని వస్తువులతో,

ఆటపాటలతో మాజీ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ప్రొ॥ శ్రీ ఐ.వి సుబ్బారావు గారి ప్రేరణతో, 93వ సైన్స్ కాంగ్రెస్‌లో తమ పరిశోధనలు చాలా చక్కగా ప్రదర్శించి బహుమతులు పొందారు. చివరకు డా॥ అబ్దుల్ కలాంగారు ప్రత్యక్షంగా చూసి, తమ సందేశాలలో లీడ్ ఇండియాలోని శాస్త్రీయ జిజ్ఞాస గురించి ప్రశంసించారు. అది ఈనాటికీ శిక్షణ కార్యక్రమాలలో శాస్త్రీయ జిజ్ఞాసగా అభివృద్ధి చెందుతుంది.

**డా॥ కలాంగారిలో విలువలు-రూపొందిన తీరు**

చిన్న పల్లెటూరైన రామేశ్వరం నుండి భారతరత్నగా, తరువాత రాష్ట్రపతి భవన్ వరకూ చేరిన డా॥ కలాంగారి గురించి మనకు తెలుసు. ఆ జీవనగమనంలో చింతగింజలమ్మి, ఇంటింటికీ పత్రికలు పంచిన పేపర్ బాయ్ జీవితం తదితర విషయాలు మనకు తెలుసు. ఈ ప్రయాణంలో చదువు ఆగిపోయే ప్రమాదంలో ఉన్న పేద విద్యార్థి దేశ రక్షణ, శాస్త్రీయ సాంకేతిక శాఖ అధిపతిగా మారి, ఆకాశంలో ఎగిరే పక్షిని చూసి తాను ఎగరాలనుకున్న స్వాప్నికుడు.

బి.టెక్ ఇంజనీరింగ్ చేసి ఫాదర్ ఆఫ్ మిసైల్ టెక్నాలజిస్టుగా మారిన డా॥ అబ్దుల్ కలాం గారి జీవితంలోని మలుపులు, వారి ఎదుగుదలకు కారణాలు, వారి వ్యక్తిత్వంలో విలువలను, వారి గురించి అంతవరకు ప్రచురించిన సమస్త సాహిత్యాన్ని వడబోసి వాటి సారాన్ని అంతా యువతకు అందించడం కోసం ఆచార్య బాలభారతి బి.టెక్ విద్యార్థులు, శ్రీ పి.నరోత్తమ్, శ్రీ భవానీ శంకర్ ప్రసాద్, శ్రీ వి. అజయ్‌కుమార్‌ల సహాయంతో ఆరు నెలల పరిశ్రమ అనంతరం "జాతికి కలాం పిలుపు – కలాం ది కాల్ టూ ది నేషన్" అనే పుస్తకాన్ని రచించారు.



Kalam's Call to the Nation

వారి పట్ల అభిమానాన్ని ఈ క్రింది విధంగా వ్యక్తం చేశారు.” మీరు చేసిన ఒక్క ఫోన్ కాల్ మా మనసులో అద్భుతాలకి తెర తీసింది.

మీ మాట - మర్యాద - మీ మహోన్నతిని చాటింది.

నే రాసిన పుస్తకం పై మీరు తెలిపిన అభినందనలు
నన్ను ఆనంద సాగరంలో ముంచెత్తాయి.!
నన్ను హనుమంతునిగా మార్చాయి.!
నాటి మిస్సైల్స్ మేన్ - నేటి మిషన్ మేన్‌గా
భారత జాతిని జాగృతం చేయడానికి
2020 స్వర్ణభారతికి పిలుపునిచ్చారు.
యువశక్తి మేల్కొన్న మేధాశక్తీ..!
ఎవరూ ఆపలేని అనంత శక్తీ ..!
మీ మేధస్సుతో భారతావనికి స్ఫూర్తి”

ఆచార్యగారు డా॥ కలాంగారి సన్నిహిత మిత్రులు. పద్మశ్రీ డా॥ కాకర్ల సుబ్బారావుగారికి బాలభారతి ముగింపు సభలో “కలాం కాల్ టు ద నేషన్ ” పుస్తకం అందించారు. వారు చదివి ప్రేరణ పొంది “చాలా బాగుంది. మీకు కలాం గారితో సమావేశం ఏర్పాటు చేస్తాను. ఆయనకు మీరే ఇవ్వండి” అని అన్నారు. కొద్ది రోజులకే నిమ్స్ హస్పిటల్ డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఆచార్యగారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అది ఆచార్యగారితో డా॥ కలాంగారి మొదటి సమావేశం.

ఆచార్యగారు సగౌరవంగా ఆ పుస్తకాన్ని కలాం గారికి అందించి, "మీరు గాంధీజీ తరువాత గాంధీజీ లాంటి వారు. నా హృదయానికి హత్తుకున్న వారు. భగవంతుడు ఇచ్చినట్లుగా భారతీయ యువతకు మీ పిలుపుని అందించే ప్రయత్నం చేశాను. మీరు పూర్తిగా చదివి, తరువాత నేను ఏమి చేయాలో నాకు మార్గదర్శనం చేయండి" అని పుస్తకం అందించి ఆశీస్సులు కోరారు. కలాంగారు పుస్తకం తీసుకుని ఒకసారి చూసి "15 రోజుల సమయం ఇవ్వండి. నేనే మీతో మాట్లాడతాను" అని అన్నారు.

"ఒక రోజు రాష్ట్రపతి భవన్ నుంచి మాట్లాడుతున్నాం. కలాం కాల్ టూ ది నేషన్ పుస్తకం రచయిత డా. ఎన్.బి. సుదర్శనాచార్యగారేనా?" అని ఫోన్‌లో అడిగారు. అది 2003 జనవరి 19వ తేదీ సాయంత్రం "అవును" అని అన్నారు ఆచార్యగారు. "ఇదిగో రాష్ట్రపతి గారు మాట్లాడతారు" అని ఫోన్ ఇచ్చారు.

# 13. కలాం స్ఫూర్తి - ఉద్యమ వ్యాప్తి

## డా॥ కలాం గారి ఫోన్ ఏమి చెప్పింది?

"సుదర్శన్! నీవు వ్రాసిన పుస్తకం మొత్తం చదివాను. ఈ పుస్తకంలో నా జీవితంలో జరిగిన ముఖ్య ఘట్టాలనూ, నేను రచించిన పుస్తకాల సారాంశమంతా వివరించి, నేటి యువతను మేల్కొల్పడానికి మంచి స్ఫూర్తి నిచ్చారు." అని అన్న తరువాత "ఆచార్యగారూ ఎక్కడ పుట్టారు? ఏమి చదివారు? ఏమి చేస్తుంటారు?" తదితర విషయాలన్నీ సవివరంగా అడిగి తెలుసుకున్నారు.

ఆ సమయంలో ఆచార్యగారు రాష్ట్రపతితో మాట్లాడుతున్నానని జాగ్రత్త వహించి గడియారం వంక చూస్తూ, వారి విలువైన సమయాన్ని వృథా చేయకూడదని సంక్షిప్తంగా సమాధానాలు ఇస్తూ వచ్చారు. ఐనా, ఆపకుండా వారు 18 నిమిషాలు మాట్లాడారు. మధ్యలో డా॥ కలాంగారు ఆచార్యగారితో "నాకర్థంకాని విషయం ఒకటుంది. చెప్తారా సార్?" అన్నారు. "అడగండి సార్!" అని అన్నారు ఆచార్యగారు. ఏ రచయిత అయినా తాను వ్రాసిన పుస్తకాన్ని తన తల్లిదండ్రులకో, ఆప్తులకో, ఇంకా ఎవరైనా ఉపాధ్యాయులకో, తెలిసినవారికో అంకితం ఇస్తారు. కానీ ఈ పుస్తకాన్ని మీరు నా తల్లిదండ్రులకు, గురువులకు అంకితం ఇచ్చారు. ఎందుకని?" అని అడిగారు.

అందుకు ఆచార్యగారు "నావారికి అంకితం చేస్తే నావారే సంతోషించ గలుగుతారు. మీ తల్లిదండ్రులకూ, గురువులకూ అంకితం

చేయడం వలన భారతీయులందరూ ఆనందించ గలుగుతారు." అనగానే డా॥ కలాంగారు కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు. కాసేపటికి తేరుకుని "ఓ.కే" అన్నారు "తరువాత నీవు నాకు ఒక ఋణం కలిగించావు. నీ ఋణాన్ని ఎలా తీర్చుకోగలను?" అని అన్నారు. అప్పుడు ఆచార్యగారు వినయంగా – "సార్! మీ జీవిత పర్యంతం దేశం కొరకు పాటు పడ్డారు. యువతకు స్ఫూర్తినిస్తున్నారు. నా జీవితంలో కూడా నా స్థాయిలో ఈ దేశయువత కోసమే పని చేస్తున్నాను. కాబట్టి మనిద్దరి లక్ష్యాలు దాదాపు ఒకటే. అందుకే మన మధ్య ఋణానుబంధం ఏర్పడదు సార్" అన్నారు. "నీవు నా హృదయాన్ని జయించావు. నీ కొరకు నా తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి. మనం మాట్లాడుకోవలసింది చాలా ఉందని పిస్తుంది. కలుద్దాం. నీవు ఎప్పుడైనా ఏవిషయంలోనైనా నాతో నిర్భయంగా మాట్లాడవచ్చు" అని అన్నారు నాటి రాష్ట్రపతి గారు. దానికి ఆచార్య గారు "దేవుని దయవల్ల నాకన్నీ బాగానే ఉన్నాయి. మీ ఆశయాలకు అంకితమయి, మీతో కలసి పనిచేసే అవకాశం ఇస్తే, అదే మహాభాగ్యంగా భావిస్తాను" అని అన్నారు. కలాంగారు "అట్లాగే! ఆలోచన చేద్దాం. నీవు కూడా ఆలోచన చేయి – ఏమి చేస్తే బాగుంటుందని. తొందరగానే కలుద్దాం" అని ఫోన్ పెట్టేశారు.

**డా॥ కలాంగారి కలయిక ఏమి చేసింది ?**

గచ్చిబౌలిలోని బాలయోగి స్పోర్ట్సు స్టేడియంను ప్రారంభోత్సవం చేసిన రోజు రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలాంగారు ఆచార్యగారిని పిలిపించుకుని ఏకాంతంగా గంటసేపు మాట్లాడారు. దేశ విద్యావిధానం, అందులోని

లోటుపాట్లు, వాటిని పూరించే విధానం గురించి "మనం కలసి పని చేద్దామా?" అని అనుకున్నారు. అగ్ని, మిసైల్ పరిశోధనలో సంచాలకులుగా పని చేసిన డా॥ ప్రహ్లాదగారిని పరిచయం చేశారు. అప్పటి నుండి డా॥ ప్రహ్లాద్‌గారు ఇద్దరి మధ్య కథ నడిపించేవారు.

**విద్యార్థులకు కలాం ప్రతిజ్ఞ** – దేశ సమస్యలకు పరిష్కారం

2003, జనవరి 26 నాడు పిల్లలకు 55వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు 10 సూత్రాల ప్రతిజ్ఞను కలాంగారు అందించే ప్రతిని ఆచార్యగారికి జనవరి 19నాడు పంపించి, దీని ప్రభావంపై మీ అభిప్రాయాన్ని అందించమని అడిగారు. అదే ప్రతిజ్ఞను 2003, జనవరి 26 తేదీన రాష్ట్రపతి భవన్‌లో 10 మంది విద్యార్థులకు అందిస్తూ దేశమంతా ప్రసారం చేశారు.

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి డా॥ ఐ.వి సుబ్బారావుగారు ఐ.ఎ.ఎస్, విద్యాశాఖ సంచాలకులు డా॥ మన్మోహన్ సింగ్, ఐ.ఎ.ఎస్ మరియు 200 మంది ప్రముఖ విద్యావేత్తలతో ఆచార్యగారు, డా॥ కలాంగారి ప్రతిజ్ఞపై ఒయాసిస్ పాఠశాలలో 2003, ఫిబ్రవరి 13 నాడు చర్చాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. దాని సారాంశాన్ని డా॥ కలాంగారికి అందించారు.

విద్యార్థులకు డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి పది సూత్రముల ప్రతిజ్ఞ :



రాష్ట్రపతి ప్రతిజ్ఞ




ప్రతిజ్ఞ ప్రభావం విశ్లేషణ




విద్యా మంత్రి ప్రతిజ్ఞ



విద్యార్థుల ప్రతిజ్ఞ

| వ.నె. | ప్రతిజ్ఞ | వ్యక్తిత్వాభివృద్ధి | దేశాభివృద్ధి |
|---|---|---|---|
| 1. | నేను నా చదువును లేదా పనిని నిబద్ధతతో నిర్వహిస్తాను. అందులో నైపుణ్యం సాధిస్తాను. | అంకిత భావం, పరిపూర్ణత | పరిపూర్ణ దేశం |
| 2. | కనీసం పదిమంది నిరక్షరాస్యులకు నేటినుంచే తప్పకుండా చదువు చెబుతాను. | నాయకత్వం, భావ ప్రకటనా శక్తి, సామాజిక బాధ్యత | సంపూర్ణ అక్షరాస్యత దేశం |
| 3. | కనీసం పది మొక్కలు నాటుతాను. అవి చక్కగా పెరిగి పెద్దయ్యేలా శ్రద్ధ తీసుకుంటాను. | శ్రద్ధ, క్రమశిక్షణ, పరిశుద్ధ వాతావరణ స్పృహ | కాలుష్య రహిత పరిశుద్ధ దేశం |
| 4 | గ్రామాలకు, పట్టణాలకు వెళ్తూ కనీసం ఐదుగురిని తాగుడు, జూదం నుండి విముక్తుల్ని చేస్తాను. | చెడు అలవాట్లకు దూరం | ఆరోగ్యవంతమైన దేశం |
| 5. | కష్టాలలో ఉన్న నా తోటివారి బాధలను తొలగించడానికి నేను నిరంతరం సుఖశాంతులు కృషి చేస్తాను. | సానుభూతి సేవ తత్పరత కలిగిన నాయకత్వం | సుఖశాంతులు నిండిన దేశం |
| 6. | కుల, మత, భాషాపరమైన ఎలాంటి విభేదాలకు నేను ఎంత మాత్రం తావు ఇవ్వను. | సమానత్వము, సమైక్యతా భావము | నేను మొదట భారతీయుడిని |
| 7. | నేను నిజాయితీగా వుంటాను. అవినీతి లేని సమాజం ఏర్పడేలా కృషి చేస్తాను. | నీతి, నిజాయితీ | నీతి, నిజాయితీ గల దేశం |
| 8. | విజ్ఞానవంతుడై పౌరునిగా ఎదిగేందుకు నేను కృషి చేస్తాను. నా కుటుంబాన్ని సరైన మార్గంలో నడిపిస్తాను. | ఉత్తమ పౌరసత్వము ధర్మ నిబద్ధత | ధర్మ బద్ధమైన దేశం |
| 9. | శారీరక, మానసిక వికలాంగులకు నేను మిత్రుడిగా వ్యవహరిస్తాను. వారూ మామూలు వారుగా మారేందుకు సహకరిస్తాను. | స్నేహము, దయ, సానుభూతి | సర్వమానవ సమానత్వంతో నిండిన దేశం |
| 10. | నా దేశ పౌరుల విజయాలను నేను సగర్వంగా అభినందిస్తాను. పండుగ చేసుకుంటాను. | దేశభక్తి | గర్వించదగ దేశం |

కలాంగారి ప్రతిజ్ఞలను విద్యార్థులు అమలు పరచడం వలన వారి వ్యక్తిత్వాభివృద్ధి జరుగుతుంది. “మీ అభివృద్ధే దేశాభివృద్ధి” మంత్రం దేశ సమస్యలు తీర్చి, దేశాభివృద్ధి జరుగుతుంది” అనే తీర్మానం ఆ చర్చాగోష్టిలో జరిగింది.

దీని ద్వారా “ఆప్ బఢో దేశ్‌కో బఢావో” అనే నినాదం కూడా వచ్చింది. ఈ తీర్మానాన్ని డా॥ కలాంగారు, మేజర్ జనరల్ శ్రీ స్వామినాథన్‌గారు, డా॥ ప్రహ్లాదగార్లు వారి కార్యదర్శులందరు చర్చించి ఆచార్యగారిని అభినందించారు.

డా॥ కలాంగారు, ఆచార్యగారు ఇరువురు చేసిన పరిశోధనలను పరస్పరం చర్చించుకున్నారు. “నేటి విద్యా విధానంలో ఉన్న లోపాలను కనిపెట్టి, వాటిని సరిదిద్దే మార్గాన్ని అన్వేషించండి. ఇంకా మేము దేశాభివృద్ధి కొరకు చేసిన పరిశోధన, మీరు వ్యక్తి అభివృద్ధి కొరకు చేసిన పరిశోధనలను జోడించి ఒక ప్రోగ్రాంను డిజైన్ చేయగలరా?” అని డా॥ కలాంగారు ఆచార్యగారిని అడిగారు.

ఇది ఒక మంచి అవకాశంగా భావించి, ఆచార్యగారు నేటి విద్యావిధానంలో వున్న లోపాలను ఈ క్రింది విధంగా పొందుపరిచారు.

# 14. వ్యక్తి అభివృద్ధి - దేశాభివృద్ధి

## నేటి విద్యావిధానంలో ఉన్న లోపాలు

1. నేటి విద్య జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించడం లేదు. జీవితంలో జరిగే ఒడిదుడుకులను ఎదుర్కోవడానికి కావలసిన ఆత్మస్థైర్యాన్ని, జీవిత నైపుణ్యాలనీ, అందించడంలేదు. జీవితనగ్న సత్యాలను తెలపడంలేదు. జీవితానికి ఒక ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ ఇవ్వడం లేదు.
2. మానవ విలువలను విద్యార్థుల్లో పెంపొందింపజేయడానికి మిగతా విషయాల (సబ్జెక్టు) మాదిరి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక, సిలబస్, పరీక్షలు నిర్ధారణ చేసే మార్గాలు విద్యాలయాలకు, వుపాధ్యాయు లకు సూచించడం లేదు. ఐచ్ఛికంగా వదిలిపెడుతున్నారు.
3. దేశానికి ఎంత మంది డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు ఇత్యాది కావాలి? అందుకు ఏ కోర్సులు రూపొందించాలి? ఎన్ని ఉద్యోగ, ఉపాధి, వాణిజ్య అవకాశాలు కల్పించవచ్చునో తెలియదు. రెండూ రెండు పట్టాలలాగా సమాంతరంగా ప్రయాణం చేస్తున్నాయి.
4. సంస్కృతి, సంస్కారాలు, చరిత్రలను విద్య ద్వారా తగు మోతాదులో బోధించడం లేదు. హక్కుల కొరకు పోరాటాలు జరుగుతున్నాయి. కానీ బాధ్యతలను విస్మరిస్తున్నారు. స్వార్థం పెరిగి దేశభక్తి సన్నగిల్లుతోంది.
5. అవసరాల కొరకు ప్రకృతిని అతిగా వాడుకుంటూ గాలినీ, నీటినీ,

భూమినీ, వాతావరణాన్నీ కాలుష్యం చేస్తున్నాం. వాటిని పరిరక్షించుటకు పటిష్టమైన విధానం లేదు.

ఈ విధంగా విద్యలో లోపాలను పరిశోధన చేసి ఆచార్యగారు డా. కలాంగారికి నివేదించారు. వారు తమ మిత్రులతో చర్చించి, "విద్య చట్టాన్నీ, విధానాలనూ రూపొందించడం కష్టం. కాని విద్యాలయాలలోకి ఒక ట్రైనింగ్ ప్రోగ్రామ్‌గా వెళ్ళి, వీటిని సరిదిద్దడానికి ఒక కోర్సును తయారు చేయండి" అని ఆచార్యగారికి చెప్పారు. ఆచార్యగారు తమ జీవితకాలంలో చేసిన పరిశోధనలనన్నింటినీ పొందుపరిచి, విద్యలో వున్న ఏ లోపానికి, ఏ విషయాన్ని అందించాలి అని మేధోమథనం చేశారు. వాటికి వ్యక్తి నిర్మాణ అంశాలను జోడించుటకు ఆలోచించారు.

**వ్యక్తిలోని వివిధ భాగాలు**

మన విద్య కేవలం జీవనోపాధికి బోధిస్తున్నామే కానీ సంపూర్ణ వ్యక్తిగా జీవించడానికీ, అందులోని విభిన్నమైన విషయాలనీ, లోతులనూ తెలుసుకుని అభివృద్ధి చెంది ఆనందంగా ఉండే నిజమైన విద్యను అందించడం లేదు.




ఉదా: మనం వేసుకునే ఒక మందు బిళ్ళలో ఏమేమి పదార్థాలు ఉన్నాయి అని తెలుసుకుంటాం. మనం తినే ఆహారంలో ఏమేమి విటమిన్లు, ప్రొటీన్లు,కొవ్వులు ఉన్నాయో తెలుసుకుంటాం. వాటి ప్రభావాలని తెలుసుకుని వాడతాం. అలాగే వ్యక్తిలోని విభిన్న అంశములు/

భాగములు ఏమిటి? అని నాకు నేను ప్రశ్నించుకున్నప్పుడు నాలో ఉండే అంశాలు/భాగములు.




1. నేను "నేను"గా బయటకు కనిపించే భౌతిక శరీరం. నేను అనుకునే జీవిస్తాను. పరిచయం చేసుకుంటున్నప్పుడు నా భౌతిక శరీరాన్ని చూపిస్తూ పరిచయం చేసుకుంటాను. అంటే నేనే ఈ భౌతిక (స్థూల) శరీరం అనే భావనతో జీవిస్తాను. ఈ విధంగా స్థూల శరీరం నేను అనబడే మొదటి భాగం .


2. కంటికి కనిపించకుండా ఈ శరీరాన్ని నడిపించేది సూక్ష్మ శరీరం "నేను అనే" మనసు. ఈ మనసుకి చావులేదు. మనసులో తీరని కోరికలతో మరణించిన తరువాత ఆ తీరని కోరికలను తీర్చుకోవడానికి మరో జన్మ ఎత్తవలసి ఉంటుంది. ఈ విధంగా సూక్ష్మ శరీరం "నేను అనే" మనసు రెండవ భాగం.



3. కోరికల పుట్ట అయిన మనసు, ఏ కోరికలనూ తీర్చలేదు. కారణం ఏ కోరిక తీర్చడానికీ చేయవలసిన ఏ నిర్ణయం చేయలేదు. ఎందుకనగా నిర్ణయం చేసేది "నేను అనే" "బుద్ధి" నాలోని మూడో భాగం.




4. నా అనే నా భార్య, పిల్లలు, ఇల్లు, ఆస్తి ఇత్యాది వాటి వలన కలిగే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు, నాలో



భవబంధాలనీ, సుఖ దుఃఖాలనీ, భావోద్రేకాలనీ "నా" హృదయంలో కల్గిస్తాయి. ఇదే నాలోని నాలుగో భాగం.



5. జీవితంలో అనేక పాత్రలు పోషించడం ద్వారా అనేక సంబంధాలు, అనేక కార్యకలాపాలు చేయడం ద్వారా కర్మ ఏర్పడుతుంది. ఇవ్వడం, తీసుకోవడం ద్వారా ఋణం ఏర్పడుతుంది. ఈ కర్మను, ఋణాన్ని తీర్చుకోడానికి ఎన్నో జన్మలు ఎత్తవలసి ఉంటుంది. ఇదే "నా" కారణ శరీరం. నాలోని ఐదవ భాగం.



6. పై అన్ని అంశాలకు, శరీరానికీ, మనసుకీ, బుద్ధికీ అన్నింటికీ మూలమై అన్ని తానే అయి నడిపించు పరమాత్మ స్వరూపం మనలో అసలైన శక్తి "నేను" అనే "ఆత్మ" నాలోని ఆరవ భాగం.

ఈ ఆరు అంశాలు మానవుల్లోని వివిధ భాగాలు. ఏయే అంశాలతో ఏ విధంగా జీవిస్తాము. ఏయే విలువలను ఏ విధంగా రూపొందించి వ్యక్తిని ఒక శక్తిగా సంపూర్ణ అభివృద్ధి చేయవచ్చో, ఆచార్యగారు 30 సంవత్సరాలు పరిశోధన చేయగా, ధ్యాన మార్గంలో లభించిన పరిశోధన ప్రసాదం ఈ "శ్రీ సుదర్శన చక్రం"

## శ్రీ సుదర్శన చక్రం - అభివృద్ధి యంత్రం




శ్రీ సుదర్శన చక్రం ద్వారా సంపూర్ణ వ్యక్తి నిర్మాణాత్మక విషయాలనీ, విలువలనీ విద్యార్థులలో రూపొందించిన విధివిధానాలనీ, నైపుణ్యాలనీ పెంపొందించే మార్గాలనీ వ్యక్తిత్వాభివృద్ధి అంశాలనీ మరియు డా॥ కలాంగారు చేసిన పరిశోధననీ, 2020 నాటికి అభివృద్ధి భారత్‌ని సాధించుటకు వారి దృక్పథాన్నీ, కోర్ ఏరియాస్ మూల్యాంకనాలనీ, వారు విద్యార్థులకు ఇచ్చిన ప్రతిజ్ఞను, తద్వారా దేశ సమస్యలను తీర్చడం, అమలు విధానం, ఏ విధంగా వ్యక్తి సమస్యలను తీర్చి, వాటి ద్వారా దేశ సమస్యలను పరిష్కరించు విధానాల నన్నింటినీ దేశాభివృద్ధి విషయాలుగా జత చేసి "ఆప్ బఢో దేశ్ కో బఢావో" "మీ అభివృద్ధే దేశాభివృద్ధి" అనే పాఠ్యాంశాలుగా రూపొందించి డా॥ కలాంగారికి సమర్పించి వివరించారు.

డా॥ కలాంగారు, వారి బృందం క్షుణ్ణంగా పరిశీలన చేసి "ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని రచించారు. ఇప్పుడు మీరు రెండు పనులు చేయాలి" అని అన్నారు.

1. మీరు "మీ అభివృద్ధే దేశాభివృద్ధి" శిక్షణలను దేశంలోని విద్యార్థులందరికీ శిక్షణ ఇవ్వడానికి ఒక స్వచ్ఛంద సంస్థ స్థాపించండి. నేను దానికి కావలసిన సహకారమందిస్తాను."
2. ఈ శిక్షణ కార్యక్రమం విద్యార్థులలో అందరికన్నా తక్కువ అవకాశాలున్న గిరిజన, దళిత విద్యార్థులను మార్చడానికి మొదటి ప్రయోగం చేయుండని "జనవరి 2005లో కలాంగారు

వుపదేశించారు. ఆనాటి సంయుక్త ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీమతి ఛాయారతన్ ఐ.ఎ.ఎస్ గారికి డా॥ కలాంగారి ప్రతిపాదనను అందించారు.

## అట్టడుగువారి అభివృద్ధి - అందరి అభివృద్ధి

శ్రీమతి ఛాయారతన్ గారు "గిరిజనులను అభివృద్ధి చేయడానికి మేము ఎంతో చేస్తున్నాము. కాని వారి అభివృద్ధి అంతంత మాత్రమే. మీరిచ్చే 7 రోజుల శిక్షణ కార్యక్రమంతో వారు మారతారు అని అనుకోవడం లేదు" అని అన్నారు. "ఇది సమయం, డబ్బు వృథా చేయడమే కాక, మరొకటి కాదు" అని ఆచార్యగారిని నిరుత్సాహపరిచారు. అప్పుడు ఆయన "అమ్మా! మీరు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి, ఒక్క పాఠశాల విద్యార్థులను ఇవ్వండి, వారిలో మార్పు వస్తే, అప్పుడు మీరు ఈ కార్యక్రమం కొనసాగించండి. లేకుంటే వద్దు అని చెప్పండి" అని అన్నారు. దానికి వారు "సరే" అని 200 మంది ఆడపిల్లల బృందాన్ని ఒయాసిస్ స్కూల్‌కి పంపారు. శిక్షణ ప్రభావాన్ని పరిశీలించడానికి ఆఖరి రోజు తామే స్వయంగా వచ్చారు. "మొట్టమొదట మాటలే రాని విద్యార్థులందరూ ఈ రోజు మైకు వదలని మైకాసురులు అయ్యారు" అని వారి జాయింట్ సెక్రటరీ శ్రీ రామానంద్‌స్వామిగారు ఆమెకు నివేదించారు. దానికి తోడుగా పిల్లలను ఉద్దేశించి "మేడం ముందర ఎంతమంది మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నారో అడగండి" అని అన్నారు. అందరూ చేతులు ఎత్తడంతో శ్రీమతి ఛాయారతన్ గారికి ఆశ్చర్యం కలిగింది. ఆమె ఎవరిని అడిగితే వారు చాలా చక్కగా మాట్లాడారు. తర్వాత ఆమె మాట్లాడుతూ "కేవలం 7 రోజుల శిక్షణతో పిల్లల్లో ఇంతటి అనూహ్యమైనటువంటి మార్పును తెచ్చిన

ఈ లీడ్ ఇండియా 2020 సంస్థకు, నేను రిటైరైన తర్వాత దీనికే అంకితం అవుతాను" అని చెప్పారు. వెంటనే రాష్ట్రంలో ఉన్న గిరిజన గురుకుల ప్రధానాచార్యులందరినీ హైదరాబాద్‌లో సమావేశపరిచి ఆచార్యగారిని పిలిపించారు. "ప్రభుత్వ గిరిజన విద్యార్థుల అభివృద్ధి కొరకై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ మిమ్మల్నందరినీ అధికారులుగా నియమించినా విద్యార్థులలో కావలసినంత మార్పును తీసుకురాలేక పోతున్నారు. ఇదిగో చూడండి... కేవలం 7 రోజులలో లీడ్ ఇండియా 2020 శిక్షణ ద్వారా మార్పులు ఎలా రాగల్గుతున్నాయో అని వారందరినీ నిలదీశారు. ఇదే వేసవిలో మీ గురుకుల విద్యార్థులందరికీ ఈ శిక్షణను అందించండి" అని ఆదేశాలు జారీ చేశారు.

6000 మంది విద్యార్థులు 2005లో బృందాలవారీగా వచ్చి ఈ 7 రోజుల శిక్షణ పొందారు. మళ్ళీ 2006లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకులాల నుండి 25000 మంది విద్యార్థులకు ఈ శిక్షణను అందించడం జరిగింది. ఈ పరిణామాలను స్వయంగా పరిశీలించడానికి అన్ని గిరిజన గురుకులాల నుండి ఎంపిక చేసిన ఒక నమూనా బృందాన్ని రాష్ట్రపతి భవన్‌కు తీసుకురావాలని రాష్ట్రపతి గారు ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ సెక్రటరీ శ్రీ రాళ్ళబండి కవితా ప్రసాద్‌గారి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అన్నీ గ్రూపులలో నుండి ఎంపిక చేసిన వందమందిని రాష్ట్రపతి భవన్‌కు తీసుకువెళ్ళారు.



రాష్ట్రపతిగారు మొఘల్ దర్బారు హాలులో పిల్లలలో వచ్చిన మార్పులను

పరిశీలించి, "ఈ పరిశోధన చాలా బాగుంది. మీరు ఇప్పుడు జిల్లాకు ఒక లక్షమందికి ఈ శిక్షణను ఇవ్వగలరా?" అని ఆచార్యగారిని ప్రశ్నించారు. ఆచార్యగారు "తప్పకుండా చేస్తాను" అని అన్నారు.

శ్రీ బుర్రా వెంకటేశం ఐ.ఎ.ఎస్, మెదక్ జిల్లా కలెక్టర్. వారు ఈ కార్యక్రమం చేయడానికి సంసిద్ధులయ్యారు. దీని కొరకు శిక్షకులకు శిక్షణ "ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్" (టి.ఒ.టి) 7 రోజుల శిక్షణ శిబిరాలని మెదక్‌లో నిర్వహించారు. ఆ నిర్వహణను శ్రీ బుర్రా వెంకటేశం ఐ.ఎ.ఎస్ గారు స్వయంగా పర్యవేక్షించారు.

**తల్లి విలువ - అన్ని విలువలకు మూలం**

ఒకరోజు కలెక్టర్‌గారు ఆచార్యగారిని పిలిచి "మీ శిక్షణ బాగుంది. కాని తల్లిని గురించి ఒక సెషన్ చెబుతూ పిల్లలను ఏడిపించి పాదాలు నమస్కరించే ప్రక్రియ నాకు నచ్చలేదు, దాని వలన వ్యక్తి ఆత్మగౌరవాన్ని కోల్పోతాడు" అని అన్నారు. అందుకు ఆచార్యగారు "సార్...మీరు ఒక్కసారి ఈ మదర్ సెషన్ పూర్తిగా విని, మాతో మాట్లాడండి" అని అన్నారు. ఆయన "సరే" అన్నారు. సిద్ధిపేటలో మదర్ సెషన్ పూర్తిగా విని వారు కూడా తన్మయత్వం చెందారు. విలువలను బోధించడమే కాక, ప్రతి మనిషీ తన తల్లిని ప్రేమిస్తాడు కాబట్టి తల్లి విలువ తెలుసుకుంటే, అన్ని విలువలూ తెలుస్తాయి. అందుకోసం తల్లి సేవలను, త్యాగాలను, ప్రేమను గుర్తుచేసి, తాము తల్లిని దుఃఖ పెట్టిన సంఘటనలను నెమరు వేసుకొని, పిల్లలు పశ్చాత్తాపం పొంది, "మాతృదేవో భవ", "పితృదేవో భవ" అని, కళ్ళకు కనబడుతున్న దైవం తల్లియే అని గ్రహించి, ఈ జీవితకాలమంతా తల్లిదండ్రులకు సేవ చేసి వారి లక్ష్యాలను నెరవేర్చి, ఆనందపరచడమే

మా ధ్యేయం" అని అభినందించారు.

అమ్మ విలువ అన్ని విలువలకు మూలం. అందరూ అమ్మ దీవెనలు తీసుకుంటేనే అమ్మ భారతి అమ్మలను కన్న అమ్మ మూలపుటమ్మ. ఆ జగన్మాత ఆశీస్సులు పొందవచ్చని "అమ్మ" దీవెనలు అంశమును చేర్చాలి. లీడ్ ఇండియా శిక్షణలో లక్షలాది మంది భావోద్రేకులై మాతృదేవో భవ అంటూ సేవ చేస్తున్నారు. చూడండి అమ్మ దీవెనలు

చూడండి. https://www.youtube.com/watch?v=L0rR52CKC8I

## డా॥ కలాం రాష్ట్రపతి పదవీ విరమణ - లీడ్ ఇండియా సమర్థన

2007, జూలై 22 నాడు రాష్ట్రపతి లాంఛనప్రాయంగా ఇచ్చిన వీడుకోలు విందుకు శ్రీ బి.వెంకటేశంగారినీ, ఆచార్యగారినీ రాష్ట్రపతి భవన్‌కి ఆహ్వానించారు. రాష్ట్రపతి భవన్ స్వర్గధామంగా అలంకరించ బడింది. అందులో సభామండపానికి ఒక ప్రక్క మంత్రి మండలి, మరియొక ప్రక్క గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు, అధికారులు, పారిశ్రామిక వేత్తలు, పద్మ అవార్డు గ్రహీతలు ఇత్యాది ప్రముఖుల మధ్యలో రాష్ట్రపతి, ప్రధాన మంత్రులు ఆసీనులై ఉన్నారు. ఆ సమయంలో ఆచార్యగారిని పిలిచి అక్కడవారందరికీ పరిచయం చేశారు. తర్వాత వారు ఆచార్యగారిని స్టూడియోలోకి తీసుకువెళ్ళి రాష్ట్రపతిగా ప్రజలందరినీ ఉద్దేశిస్తూ లీడ్ ఇండియా గురించి ప్రస్తావించారు. ఈ రోజు మీరు కూడా వినండి.

ఇంతటి అరుదైన మహద్భాగ్యాన్ని ప్రసాదించిన తరుణంలో అక్కడ కొంతమంది ప్రముఖులు "ఇది డా॥ కలాంగారు అందించిన పద్మశ్రీ, పద్మభూషణ్‌ల కంటే ఎన్నో రెట్లు అధికం. మీరు అదృష్ట వంతులు" అన్న

మాటలు ఆచార్యగారు ఎన్నటికీ మరువలేరు. సాక్షాత్తూ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారే వారిని యావత్ భారత్‌దేశానికీ పరిచయం చేయడం, లీడ్ ఇండియా 2020 ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని అర్థించడం – ఈ ఉద్యమం వారి వారసత్వమే అనడానికి నిదర్శనం.

**లీడ్ ఇండియా ఉద్యమానికి కలాంగారి పిలుపు**




పదవీ విరమణ చేసిన వెంటనే 15.8.2007 నాడు, 60వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీ బి.వెంకటేశం గారు సంగారెడ్డిలో దాదాపు 50 వేల మంది విద్యార్థులతో అద్భుతంగా ఏర్పాటు చేసిన చారిత్రాత్మక సభలో డా॥ కలాం గారు "లీడ్ ఇండియా 2020... ఇది 2వ జాతీయ ఉద్యమం" అని ప్రకటించారు.

మొదటి జాతీయ ఉద్యమంగా గాంధీగారి నేతృత్వంలోని "క్విట్ ఇండియా" స్వాతంత్ర్యం కొరకు కాగా, ఆ తరువాత దేశానికి స్వాతంత్ర్యం లాంటి జాతీయ లక్ష్యం లేకుండా కాలగమనంలో కలసిపోతూ అనేక అసమానతలు దేశ సమస్యలకు కారణమౌతున్న ఈ తరుణంలో "అభివృద్ధే 2వ జాతీయ లక్ష్యం కావాలి. దానికే లీడ్ ఇండియా 2020... ఇది 2వ జాతీయ ఉద్యమం" అని ఉద్ఘాటించారు.

**శిక్షణ నుండి ఉద్యమానికి**

"2020 నాటికి అభివృద్ధి భారత్‌ను సాధించడమే భారతీయుల కర్తవ్యం. ఈ లీడ్ ఇండియా 2020 "ఆప్ బఢో దేశ్‌కో బఢావో" అనే మిషన్ ఓరియంటేషన్ ప్రోగ్రాంతో యువతను మారుస్తుంది. అభివృద్ధి

భారత్‌ను సాధిస్తుంది అని నమ్ముతున్నాను" అని అన్నారు. ఆరోజు నుంచి చివరి రోజు వరకు "లీడ్ ఇండియా కార్యక్రమాలకి ఎప్పుడు ఎక్కడికి పిలిచినా నేను వస్తాను" అనీ, "నా క్యాలెండర్‌లో మీ కొరకు ఎప్పుడూ సమయం ఉంటుంది" అనీ అన్నారు.

"నా సందేశాలను, ఫొటోలను అన్నిటినీ ఉద్యమానికి స్వేచ్ఛగా వాడుకోవచ్చు" అని వారిచ్చిన స్వాతంత్ర్యం, ఆదరణ, అభిమానం వారి వారసత్వం కాదా? ఈ లీడ్ ఇండియా 2020 ఉద్యమం మనందరి కర్తవ్యంకాదా? ఆలోచించండి!!

మెదక్ జిల్లా శిక్షణలో వచ్చిన మార్పులనూ, తదుపరి కార్యక్రమాలనూ చూసి పొరుగు జిల్లా కరీంనగర్ కలెక్టర్, శ్రీ ఎం.వి.సత్యనారాయణ ఐ.ఎ.ఎస్ గారు ఆహ్వానించి, కరీంనగర్ జిల్లా మొత్తానికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జరపాలని కోరారు. వారికి తోడుగా లీడ్ ఇండియా 2020 సెక్రటరీ జనరల్ శ్రీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సొంత డబ్బు దాదాపు రూ.50 లక్షలు ఖర్చుపెట్టి, రాత్రింబవళ్ళు జిల్లా అంతా పర్యటిస్తూ గొప్ప మలుపుని ఇచ్చారు.

## డా॥ గీతా చల్లా ఉద్యమ ప్రభంజనం



ప్రభుత్వము - ప్రజలు అందరూ లీడ్ ఇండియా ప్రభంజనము పల్లె పల్లెకు తీసుకు



వెళ్ళిన వేళ డా॥ గీతా చల్లా ఆచార్యగారి కనుసన్నలలో శిక్షకులకు శిక్షణ కార్యాక్రమముల ద్వారా జిల్లాలో యువతనందరిని శిక్షకులుగా మార్చారు. రాత్రి పగలు ఏకమైనవి. శ్రీ సురేంద్రరెడ్డి, డి.ఇ.ఓ, శ్రీ హరి డి.డి.ఇ.ఓ

అధికారులు జిల్లా ప్రధాన ఉపాధ్యాయులు, వుపాధ్యాయులందరూ దేశ నిర్మాతలై దాదాపు 2,38,000 మంది విద్యార్థులకు మరియు 20 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి చరిత్ర సృష్టించారు. శ్రీ సింగం రాజు జిల్లా అంతా ఏకం చేశారు. పాటల రచయిత శ్రీ తోటపల్లి భాస్కర్‌గారు, తమ పాటలతో విద్యార్థుల నందరినీ కవులను చేశారు. శ్రీ శ్రీనివాసాచారి శ్రీ ఓంకార్, శ్రీరామాంజనేయరాజు, జెట్టి నరేశ్, సంపత్ మొదలగు ఎందరో ట్రైనర్స్ సైనికులై పని చేశారు. దాని ప్రభావాన్ని పరిశీలించడానికి డా॥కలాంగారు స్వయంగా కరీంనగర్ జిల్లా అంబేద్కర్ స్టేడియంలో విద్యార్థులను వుద్దేశించి శిక్షణ ప్రభావాన్ని పరిశీలించి ఆనందించారు. దాని తర్వాత చిత్తూరు జిల్లా కలెక్టర్ శ్రీ ముద్దాడ రవిచంద్ర ఐ.ఎ.ఎస్. గారు లక్షమంది విద్యార్థులకు ఈ ట్రైనింగ్ ఇప్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా॥ కె. వి రమణాచారి, ఐ.ఎ.ఎస్ గారు కలాంగారిని తిరుపతికి ఆహ్వానించి తిరుమలేశుని దర్శనం చేయించి, 50000 మంది విద్యార్థులతో గొప్ప సభ నిర్వహించారు.

**సమకాలీన ప్రభావంతో జాతీయ మానవ వనరుల అభివృద్ధి ఉద్యమం**

'సబ్రహ్మచారిభ్యంః పాదం' అనగా విద్యార్థులు, తోటి స్నేహితుల ప్రభావం ద్వారా జీవితంలో 25% జ్ఞానం సంపాదించగలరు అని పెద్దలు చెప్పారు. కాని సమకాలీన ప్రభావం దాని కన్న మెండుగా ఉంటుంది. ఆసక్తికరంగా ఉంటుంది.

దీనిని ఆధారం చేసుకుని 2010లో శ్రీమతి దమయంతి ఐ.ఎ.ఎస్, సెక్రటరీ ఎ.పి. ఐ.ఎ.ఐ. వారి అధ్వర్యంలో 23 జిల్లాలలో 300 పాఠశాలల్లో ప్రతి పాఠశాల నుండి 12 మంది విద్యార్థులకు లీడ్ ఇండియా

మార్పు ప్రతినిధులుగా శిక్షకుల శిక్షణ టి.ఒ.టి శిక్షణ ఇచ్చి, ఆ పిల్లలతో మిగతా పిల్లలకు రాష్ట్రమంతటా అన్ని పాఠశాలల్లో 3 రోజుల శిక్షణ "మీ అభివృద్ధే దేశాభివృద్ధి శిక్షణ ఇవ్వడం జరిగింది.

ఈ మార్పు ప్రతినిధులు ఇచ్చిన శిక్షణతో మిగిలిన పిల్లల్లో ఏ రకమైన ప్రభావం కలిగిందో పరిశీలించుటకు ఆచార్య గారు విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం పాఠశాలలకు వెళ్ళారు. ప్రతి చోట విద్యార్థులను గమనించారు.

1. పెద్దవాళ్ళు శిక్షణ ఇచ్చిన దాని కన్నా ఆసక్తికరంగా క్రమశిక్షణతో జాగ్రత్తగా విన్నారు.
2. ప్రతి విషయాన్నీ తేదీవారీగా, విషయాలవారీగా పాయింట్స్ నోట్ చేసుకున్నారు.
3. బృందం వారీగా జరిగిన చర్చల్లో ఉపాధ్యాయులు ఎవ్వరూ లేకుండా ఇచ్చిన విషయాలపై తమ వాదనలను వినిపించారు.
4. శిక్షణ శిబిరం చివరలో ఫీడ్ బ్యాక్ రిపోర్టు దాదాపు 90% మార్పులు సూచించాయి.

ఆచార్యగారు ఆసక్తిగా మధ్యలో కొంత మంది పిల్లలను లేపి "మీరు ఏమి వ్రాసుకుంటున్నారు? మీరు ఏమి నేర్చుకున్నారు?" అని అడిగినప్పుడు, ఆ సెషన్‌లో చెప్పిన మార్పు ప్రతినిధులకు ధీటుగా యథాతథంగా సబ్జెక్టు గురించి చెప్పారు. ఆ పిల్లల మాటలు వింటున్న ఆచార్య గారి హృదయం కరిగి కన్నీళ్ళు ఉబికేయి. "ఓరి భగవంతుడా! ఎంత గొప్ప మార్పు తీసుకొస్తున్నావు" అంటూ మూగవోయేది ఆయన హృదయం చెప్పలేని భావాలతో. ఈ సమకాలీన ప్రభావం చాలా గొప్పదిగా ప్రస్ఫుటించి

రాష్ట్రమంతటా ఇదే సమకాలీన ప్రభావం ఋజువయ్యింది. అన్ని విద్యాలయాల్లో, విద్యార్థులలో, చదువుపై ఆసక్తి పెరిగి, వారి విజ్ఞాన స్థాయి ఎదిగింది. 10వ తరగతి పరీక్షల్లో అగ్రస్థాయి విద్యాలయాలుగా నిలిచాయి. వాటి పునాది ప్రభావంతో ఈ రోజుకూ ఈ విద్యాలయాలు అగ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. వారిలో చాలా మంది ఉన్నత విద్యల్లో అగ్రగాములుగా రాణిస్తున్నారు.





ఖమ్మం ఎ.పి.ఎస్.డబ్ల్యా. ఆర్.ఇ.ఐ పాల్వంచ విద్యార్థి శ్రీ నవీన్ కారుణ్య అప్పటి 10వ తరగతిలో, ఇంటర్లో, బి.టెక్‌లో, ఎం.టెక్‌లో స్టేట్ ర్యాంకర్‌గా నిలిచి, ఈ రోజు జె.ఎన్.యూ నుండి పి.హెచ్.డి చేసి ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అలాగే శ్రీ పి.ఎస్. రాజు ఎ.పి.ఎస్. డబ్ల్యా. ఆర్.ఇ.ఐ మెదక్‌లో ఈ శిక్షణ పొంది, ఐ.ఐ.ఐ.టి బాసరలో మంచి ర్యాంక్ సంపాదించి, ఇప్పుడు ఐ.ఎ.ఎస్ పాస్ అయ్యేవరకు ఎవ్వరికీ కనపడనని రాత్రి పగలు కష్టపడుతున్నారు. వాళ్ళందరి సమాచారం ఈ రోజు సేకరించకపోయినా, వారంతా గొప్పగా వృద్ధి చెందారని అక్కడక్కనుండి వస్తున్న సమాచారం ధృవపరుస్తుంది.



ఖమ్మం జిల్లాలో సాయి స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీ సత్తుపల్లికి ఆచార్య వస్తున్నారని తెలిసి నాయక్ అనే పూర్వ విద్యార్థి 10 గంటల వరకు ఎదురుచూసి,

ఆ విద్యాలయంలో ఆచార్యగారి ఉపన్యాసం అయిపోగానే మధ్యలో నుండి లేచి "ఆచార్యా! నేను 8వ తరగతిలో ఉన్నప్పుడు మీరు ఇచ్చిన శిక్షణతో నా జీవితానికి ఒక లక్ష్యం పెట్టుకుని అనేక కష్టాలుపడుతూ చదువు ఆపకుండా, ఎక్కడా ఒక్క రూపాయి చెల్లించకుండా ఈ రోజు పవర్ ఎలక్ట్రానిక్స్‌లో ఎం.టెక్ చదివాను. త్వరలో మీలాగే పిహెచ్.డి పొందుతాను. మీకు అండగా ఉండి మన లీడ్ ఇండియా బాధ్యతలను చేపడతాను" అని అన్నారు. అంతేకాదు... 6వ తరగతిలో తాను విన్న ఆచార్య గారి స్ఫూరిదాయకమైన మాటలను యథాతథంగా అందరికీ వినిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. మరుసటి రోజు ఆచార్య గారు కాకతీయ యూనివర్సిటీ పి.జి.కళాశాల బి.పి.ఇ.డి. విద్యార్థులతో మాట్లాడుతున్నప్పుడు కుమారి రమాదేవి లేచి "ఆచార్యా! 8వ తరగతిలో ఉన్నప్పుడు మీరు నాకు ఇచ్చిన ఈ లీడ్ ఇండియా శిక్షణ ద్వారా గొప్ప టీచర్ అవ్వాలనే లక్ష్యం పెట్టుకుని, ఇప్పుడు ఇక్కడ బి.పి.ఇ.డి. చేస్తున్నాను. ఒక గొప్ప ఉపాధ్యాయురాలినై లీడ్ ఇండియా ఉద్యమానికి ఒక సైనికురాలిగా పనిచేస్తాను." అని పలికి ఆశ్చర్యపరిచింది. ఇటువంటి లీడ్ ఇండియా ఉద్యమకారులు ఎక్కడెక్కడ ఎవరెవరు ఎంతెంత అభివృద్ధి చెందనున్నారో కాలమే తెలుపుతుంది.

**ఒకటే దృక్పథం- ఒకటే గమనం- ఒకటే గమ్యం**




ఒక లక్ష్యం నెరవేర్చడానికి ఇద్దరు వ్యక్తుల కలయిక ఏకమైనప్పుడు, వారి జీవన విధానాలు, భావాలు ఏకమైనప్పుడు,



ఆ ఇద్దరు వ్యక్తుల హృదయాలు కలసినప్పుడు, అది స్నేహమనే పవిత్ర బంధంగా మారుతుంది. ఇక వారి మధ్య కులం, మతం, వయసు, చదువు, అధికారం ఇత్యాది హద్దులన్నీ రద్దయిపోతాయి.

దేశాధ్యక్ష్యుడై రాష్ట్రపతి భవన్‌లో ఉండి భారతరత్నగా భాసిల్లుతున్న డా॥ అబ్దుల్ కలాంగారికీ ఒక చిన్న పాఠశాలకి ప్రధానాచార్యులైన ఆచార్యకూ భగవంతుడి ఆశీర్వాదం వల్ల కేవలం దేశం, యువత, అభివృద్ధి అనే లక్ష్యం వారి మధ్య ఉన్న హద్దులన్నీ తొలగించి ఒక పవిత్రమైన మహోన్నత స్నేహబంధం కుదిర్చింది. ఇక మళ్ళీ మళ్ళీ కలవడం, తరచుగా మాట్లాడటం, కలసి కార్యక్రమాలు చేయడం, అనుకున్న ఫలితాలు రాబట్టడం, మొదలైనవన్నీ వారి మధ్యన ఉన్న అంతరాలను తొలగించి, అతి సన్నిహిత స్నేహం ఏర్పరచింది.

డా॥ కలాంగారు అందరితో మాట్లాడి పంపించి, చివరికి వారి సిబ్బందిని కూడా పంపించి, ఆచార్యగారితో కొద్ది సమయం కబుర్లు చెప్తూ రాష్ట్రపతి భవన్‌లోని ఉద్యానవనంలో నడిచేవారు. ఆ తరువాత ఇద్దరూ ఏకాంతంగా, సమయంతో నిమిత్తం లేకుండా మనసుకు వచ్చిన విషయాలన్నీ మనస్ఫూర్తిగా చర్చించుకునే వాళ్ళు .



డా॥ కలాంగారిలో అంతర్గతంగా రాముడు ఉండేవాడు. ఆ రాముడే ఆచార్య గారిలో బహిర్గతంగా ఉండేవాడు. అయినా ఇద్దరూ “అంతా రామమయం జగమంతా రామమయం” “ఈశ్వర్ అల్లా తేరే నాం, సబ్‌కో సన్మతి దే భగవాన్” అని పాడుకునే వారు. ఆ విధంగా ఆధ్యాత్మిక

తాదాత్మ్యం చెందేవారు. వ్యవహారంలో వచ్చే కొన్ని విషయాలు కావచ్చు, దేశంలో జరుగుతున్న ఉద్యమాలు కావచ్చు, రాజకీయ స్థితిగతులు కావచ్చు, లీడ్ ఇండియా ఉద్యమ అభివృద్ధి కావచ్చు, ఇలాంటి ఎన్నో విషయాలు మాట్లాడుకుని భోజనాలు చేసేవారు. ఆ తరువాత డా॥ కలాంగారు, ఆచార్యగారి భుజంపై చేయివేసి "ఆచార్యా! మీలాంటి వాళ్ళు చాలా అరుదు. అందుకే మీరంటే నాకు ఎంతో గౌరవం" అని హృదయ పూర్వకంగా చెప్పేవారు. సెక్యూరిటీ సిబ్బందితో "సార్‌ని జాగ్రత్తగా గెస్టు హౌస్‌లో దింపి రండి" అని చెప్పి మరీ సాగనంపేవారు. ఈ రోజున ఆ స్నేహమూర్తి కరువైపోయిన వేళ "నా స్నేహితుని కొరకు నేను ఏమి చేయగలను అని నిరంతరం తపిస్తున్నాను" అని అంటూ ఎన్నోసార్లు కన్నీళ్ళు పెట్టుకుంటుంటారు ఆచార్యగారు.

# 15. అభివృద్ధి భారత్ నిర్మాత కలాం

## డా॥ అబ్దుల్ కలాంగారు ఎటువంటివారు ?



దేశాధ్యక్షులు డా॥ అబ్దుల్ కలాంగారు ఒక గొప్ప మహాత్ముడు, సత్యవంతుడు, ధర్మనిష్ఠాగరిష్ఠుడు, క్రమశిక్షణ 360 డి, మితాహారి, శాకాహారి, మితభాషి, శాంతికాముకుడు. గాంధేయుడు, దైవభక్తుడు, దేశభక్తుడు, సనాతన భారతీయ వేద వాంఙ్మయం, వేద శాస్త్రాలను నమ్ముతూ, స్వయంగా ఆచరిస్తూ ఆంగ్ల విజ్ఞాన శాస్త్రంలో ఉన్న శాటిలైట్ లాంచ్ వెహికిల్స్ పేర్లను వేదంలో ఉన్న పంచభూతముల పేర్లు పృథ్వి, అగ్ని, ఆకాశ్, త్రిశూల్, నాగ్ అని మిసైల్స్‌కి నామకరణం చేసిన ధీశాలి.

ప్రతి ఒక్కరి దగ్గర నుండీ ప్రతి విషయాన్నీ ఎంతో ఓపికగా సాంతం వినే వారు. ఎవరు ఏది అడిగినా కానీ నచ్చని పక్షంలో చాలా సున్నితంగా తిరస్కరించేవారు. వారి అంతరంగ భావన ఎవ్వరూ అంత సులభంగా అర్థం చేసుకోలేరు. కారణం – వాటిని తమ ముఖచ్ఛాయలలో బహిర్గతం కానీయని గంభీరుడు ఆయన.

ప్రతి విషయాన్నీ సునిశితంగా పరిశీలించే వారు. వాటి భవిష్యత్ పరిణామాలను ఊహించేవారు. వాటి గురించి చర్చించేవారు. విషయ సేకరణ చేసేవారు. గణాంకాలు జోడించేవారు. ఏ ఉపన్యాసానికైనా ముందుగానే హోంవర్క్ చేసుకునేవారు. సంబంధించిన వారితో జరగవలసిన వాటిని నిర్ధారించుకునే దూరదృష్టిగల జ్ఞాని.

ఎప్పుడూ ఎక్కడా ఎవరితోనూ విభేదాలు పెంచుకోని, మనస్పర్ధలు తెచ్చుకుని, ప్రశాంతతను భంగం చేసుకోని సానుకూల హృదయుడు.

**ఉచిత బహుమతులు - అవినీతికి ప్రేరణలు**

సామాజిక జీవితంలో అనేక సందర్భాలలో, అనేక ఉచిత బహుమతులు ఇస్తుంటాం, తీసుకుంటుంటాం. అంతవరకు ఆనందంగానే ఉంటుంది. కానీ ఉచిత బహుమతులు తీసుకున్న తరువాత, దాని పరిణామాలు తప్పకుండా వ్యక్తినీ, అతని కర్తవ్యాన్నీ, బాధ్యతను ధర్మబద్ధంగా నిర్వర్తించకుండా బహుమతి ఇచ్చిన వ్యక్తికి మేలు చేసేలా ప్రభావితం అవడం అనేది సర్వసాధారణం.

అప్పట్లో డా॥ అబ్దుల్‌కలాంగారి తండ్రి గారు గ్రామ పంచాయితీ సభ్యుడిగా ఎన్నికైనారు. మరుసటి రోజు తాను ఇంట్లోలేని సమయంలో బాలుడైన డా. కలాంగారికి ఒక తెలియని వ్యక్తి ఒక బహుమానాన్ని అందించి, "ఇది మీ నాన్న గారికి ఇవ్వమ"న్నారు. తండ్రిగారు వచ్చిన తరువాత బాల కలాంగారు ఆ బహుమతిని వారికి అందించారు. తండ్రి గారు వెంటనే డా॥ కలాంగారిని ఒక చెంప దెబ్బ కొట్టారు. "ఎప్పుడూ ఎవ్వరి దగ్గరా ఏదీ ఉచితంగా తీసుకోకూడదు. అది లంచం అవుతుంది. అదే అవినీతికి మూలం. ఆ తరువాత నీ బాధ్యత నీవు సరిగా చేయలేవు" అని హెచ్చరించారు. ఆనాడు మదిలో నాటుకుపోయిన ఆ నీతి నాటి నుండి కడవరకూ డా॥ అబ్దుల్ కలాంగారి జీవితంలో అలాగే నిలిచి పోయింది.

ఎన్నెన్ని పదవుల బాధ్యతలు తీసుకున్నా, చివరకు రాష్ట్రపతి అయినా ఎప్పుడూ ఎవ్వరి దగ్గర నుండీ ఏ ఉచిత బహుమతీ అంగీకరించని

నీతిమంతులు డా॥ కలాం. ఆచార్యగారు ఆంగ్లంలో వ్రాసిన “కలామ్స్ కాల్ టు ది నేషన్ ” పుస్తకాన్ని శ్రీ ముదునూరు వెంకటేశ్వర రావుగారు “జాతికి కలాం పిలుపు” పేరుతో తెలుగులో అనువదించారు. ఒక రోజు వారి మిత్రుడు 95 సంవత్సరాల వృద్ధులు, స్వాతంత్ర్య సమర యోధులు శ్రీ వై. సన్యాసిరావుగారిని పరిచయం చేశారు. వారు ఆచార్య గారితో “నా చిన్నతనంలో స్వాతంత్ర్యం గురించి చక్కగా ఉపన్యాసం ఇచ్చినందుకు, గాంధీగారు ఈ జేబు గడియారాన్ని బహూకరించారు. ఈనాటి స్వతంత్ర భారతంలో గాంధీలాంటి గొప్ప వ్యక్తి డా॥ అబ్దుల్‌కలాంగారు. వారంటే నాకు చాలా అభిమానం. వారికి నేను ఈ గడియారాన్ని బహూకరించాలని చాలామంది నాయకుల ద్వారా ప్రయత్నించాను. కానీ అది ఫలించలేదు. మిత్రుడు శ్రీ వెంకటేశ్వరరావు గారు మీకూ కలాంగారికి ఉన్న సాన్నిహిత్యాన్ని చెప్పారు. ఎలాగైనా ఈ జన్మలో నా కోరిక తీర్చండి సార్!” అని ఆచార్యగారిని బ్రతిమాలారు. హైదరాబాద్ నోవొటెల్ హోటల్లో డా॥ కలాంగారితో సమావేశం అయినప్పుడు ఆచార్యగారు ఈ విషయాన్ని డా॥ కలాం గారికి వివరించి, శ్రీ సన్యాసిరావుగారిని పరిచయం చేశారు. శ్రీ సన్యాసిరావుగారు డా॥ కలాంగారికి అన్ని విషయాలు చెప్పి గడియారం తీసుకోమని ఒప్పించే ప్రయత్నం చాలా చేశారు. కాని డా॥ కలాంగారు దాన్ని తాకి, తిరిగి ఇచ్చి “ఇది మీ దగ్గరే ఉండాలి. మీ మనుమలు, మీ బంధువులు, మీ ప్రాంతం వారు – అందరూ మీ గురించీ, గాంధీగారి గురించీ చెప్పుకుని స్ఫూర్తి పొందుతారు” అని ఎంతో సున్నితంగా తిరస్కరించారు.

2004, జులై 14న లీడ్ ఇండియా ఫౌండేషన్ ట్రస్టీలను హైదరాబాద్




రాజ్‌భవన్‌లో ఆచార్యగారు కలాంగారికి పరిచయం చేస్తున్నప్పుడు శ్రీ జి.పుల్లారెడ్డిగారు డా॥ కలాంగారికి శాలువ కప్పి, మిఠాయి పెట్టె ఇవ్వబోయారు. డా॥ కలాం గారు వాటిని తాకి, తిరిగి ఇచ్చి నమస్కరించారు. శ్రీ జి.పుల్లారెడ్డిగారు "ఇది తినే మిఠాయి. చాలా ప్రాచుర్యంగల మిఠాయి. మీరు తప్పకుండా తినాలి" అని బ్రతిమిలాడారు. డా॥కలాం గారు చిరునవ్వుతో "ఎక్సలెంట్ – కీపిటప్, కీపిటప్" అని ముందుకు నడిచారు.

**అవినీతిపై కలాంగారి పోరు**

"నీరు పల్లమెరుగు... నిజం దేవుడెరుగు" అనేది ఆర్యోక్తి.

నాడైనా, నేడైనా, ఏనాడైనా – సత్యమే ధృవతార! కానీ, ఈనాటి సమాజం సత్యానికి దూరమై , అసత్యం ప్రబలి, అవినీతి ఆనవాయితీగా మారిపోయింది.

దేశంలోని గొప్ప వ్యక్తులు దేశంలో ఈ అవినీతిపై పోరుకు దిగారు. శ్రీ అన్నా హజారే, శ్రీ రామ్‌దేవ్ బాబా, శ్రీశ్రీశ్రీ రవిశంకర్ గురూజీ ఇత్యాది పెద్దలందరూ ఒక కూటమిగా మారి, డా॥ కలాంగారి అధ్యక్షతన దేశంలో పోరు ఆరంభించాలనుకున్నారు. కాని ఆ కూటమిలో కలాంగారు చేరలేదు. ఆచార్య గారు వారితో "అవినీతిని అంతం చేయడానికి ఇది ఒక గొప్ప అవకాశం కదా! వాళ్ళంతా రాజకీయాలకు అతీతమైన గొప్ప నాయకులు కదా! చేస్తే బాగుంటుంది కదా!" అని సూచించారు. దానికి వారు స్పందిస్తూ "అవినీతి ఒక బురద లాంటిది. ఎటువంటి వారైనా

అందులో అడుగుపెడితే, ఆ బురద అంటుకుంటుంది. అవినీతిని తొలగించాలంటే అవినీతికి మూలమైన మనిషి మనసులోని లోభం, దురాశ వంటి వాటిని తొలగించడానికి మీరు చేస్తున్న కార్యక్రమమే మంచి మార్గం" అని అన్నారు.

ఆచార్య గారు డా॥ కలాంగారు విద్యార్థులకు ఇచ్చిన ప్రతిజ్ఞను "నేను లంచం తీసుకోను. లంచం ఇవ్వను. అవినీతితో పోరాడతాను. అవినీతి లేని దేశ నిర్మాణం చేస్తాను." అన్న దానిని 2009 సాధారణ ఎన్నికల సమయంలో అప్పటి టి.టి.డి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా॥ కె.వి. రమణాచారిగారు ఐ.ఎ.ఎస్. ఆధ్వర్యంలో అప్పటి చిత్తూరు జిల్లా కలెక్టర్ శ్రీ ముద్దాడ రవిచంద్ర గారి నేతృత్వంలో ఒక లక్ష మంది విద్యార్థులకు లీడ్ ఇండియా శిక్షణ ఇచ్చిన సమయంలో చెప్పారు. ఆ విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకూ, వారి చుట్టూ ఉన్న ఓటర్లకూ ప్రేరణ కలిగించి "ఏ ప్రలోభాలకూ లొంగక నోటుకు ఓటు అమ్మను" అని పోస్టుకార్డులపై వారి సంతకాలు తీసుకుని లక్ష పోస్టుకార్డులను ఒక పూలదండగా మార్చి విద్యార్థులు కలాంగారికి సన్మానం చేశారు. అవినీతిని ప్రక్షాళన చేయడానికి ఈ విద్యార్థుల మార్గమే ఏకైక మార్గం అని ప్రశంసించారు. ఆనాటి వారి ప్రసంగం విద్యార్థులలో ఒక గొప్ప మార్పును తెచ్చింది. డా॥ రమణాచారి గారు ఆయన మాటలని తెలుగులోకి అద్భుతంగా అనువదించారు.




మొదటి నుండీ ఈ లీడ్ ఇండియా ఉద్యమం ప్రగతి ప్రయాణంలో డా॥ రమణాచారి గారు ఉద్యమానికి అధ్యక్షులుగా పనిచేస్తూ, ఎనలేని సేవలు అందించారు. తరువాత

రాజీవ్ విద్యా మిషన్ ద్వారా శిక్షణలు ఇప్పించారు. 13.2.2013న డా॥ కలాంగారితో కలసి ఎల్.బి స్టేడియంలో గొప్ప సభను ఏర్పాటు చేసి, వారు ఎక్కడ ఏ పదవిలో ఉన్నా, లీడ్ ఇండియాలో తమదైన ముద్ర వేసి, ఉద్యమ చరిత్రకు ప్రభుత్వంలో ఒక గొప్ప విలువ నిచ్చారు. ఇంకా, వారి నాయకత్వంలో ఈ ఉద్యమం నిరంతరంగా ముందుకు సాగనుంది.

# 16. లీడ్ ఇండియా అంటే 2వ జాతీయ ఉద్యమం

## కలాంగారి విజన్ "లీడ్ ఇండియా జాతీయ ఉద్యమం"






"స్వాతంత్ర్యం" దేశానికి మొదటి దృక్పథం (విజన్). అలాంటి దృక్పథం (విజన్) నేడు లేకపోవడం వల్ల, దేశానికి అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. అభివృద్ధి కుంటువడుతోంది.

అందువల్ల "దేశానికి రెండవ దృక్పథం (విజన్) అవసరం ఉన్నది" "ఇండియా 2020" అని డా॥ కలాంగారు వ్రాసిన పుస్తకంలో అనేక చోట్ల డా॥ కలాంగారు ప్రస్తావించారు. ఆచార్యగారు డా॥ కలాం గారితో "మీరు ప్రస్తావిస్తున్న ఈ రెండవ దృక్పథం (విజన్) ప్రజలకు అర్థం కాదు. ప్రజలకు అర్థమై ప్రజలు ఈ రెండవ దృక్పథం (విజన్) పెట్టుకోవాలంటే దానిని మనం "రెండవ జాతీయ ఉద్యమం" అని పిలవాల్సి ఉంటుంది అని అన్నారు. దీనిపై అనేకసార్లు ఆచార్య గారు, డా॥ కలాంగారు చర్చించుకున్నారు. చివరకు డా॥ కలాంగారు "ఆచార్య గారూ ! మీరు ప్రతిపాదించినట్లే నా ఈ రెండవ దృక్పథం (విజన్)ను మీరు 2వ జాతీయ ఉద్యమంగా పిలవండి! ఈ ఉద్యమాన్ని నడిపించండి" అని అన్నారు. లీడ్ ఇండియా ట్రస్టీలలో ఒక ప్రముఖుడు "మీ అభివృద్దే దేశాభివృద్ధి" శిక్షణ జాతీయ ఉద్యమంగా ఎలా కాగలుగుతుంది?" అని సుదీర్ఘంగా విమర్శించారు. ఆచార్య గారి దృక్పథంతో, ఒక దూరదృష్టితో, శిక్షణపై నమ్మకంతో డా॥ కలాంగారు ఇచ్చిన స్వాతంత్ర్యంతో "లీడ్ ఇండియా

2020" 2వ జాతీయ ఉద్యమంగా ఉపయోగిస్తూ వచ్చారు. ఈ శిక్షణల ప్రభావాలను 2005 నుండి 2007 వరకు వేలకొలదీ విద్యార్థులను ఒకే స్థాయిలో మార్పు చేస్తున్న ఈ శిక్షణ దేశ యువతను మారుస్తుంది – 2020 నాటికి అభివృద్ధి భారత్‌ను సాధిస్తుంది – అని తన చివరి అధ్యక్ష ఉపన్యాసంలో ఆచార్య గారిని, లీడ్ ఇండియా 2020నీ, దేశ ప్రజలందరికి డా॥ కలాంగారు పరిచయం చేశారు.

వినండి. https://youtube/3CxU6R77q4E

60వ స్వాతంత్ర్య దినోత్సవం నాడు డా॥ కలాం గారు 50వేల మంది విద్యార్థుల సమక్షంలో "లీడ్ ఇండియా 2020 2వ జాతీయ వుద్యమం" అని ప్రకటించారు. వారు నిరంతరంగా ఈ శిక్షణ ప్రభావాన్ని పరిశీలిస్తునే వచ్చారు. వాటి ఫలితాలను చూసి 13.2.2013 నాడు డా॥ రమణాచారిగారు ఎల్.బి. స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలాంగారు ఒక చిన్న చీటి ఆచార్యకు ఇచ్చి, "ఈ విధంగా ప్రకటించాలను కుంటున్నాను. మీరు ఏమంటారు" అని అన్నారు.

"లీడ్ ఇండియా 2020 – ఆప్ బఢో.. దేశ్ కో బఢావో శిక్షణను లోతుగా పరిశీలించాను. ఇది అన్ని విధాలా పరీక్షించి, నిరూపించబడిన జాతీయ యువజన ఉద్యమంగా ప్రకటిస్తున్నాను" అని చీటీపై వ్రాసి వుంది. దానిని ఆచార్య గారు నాటి సభలో అధ్యక్ష్యులైన డా॥ రమణాచారి గారికి ఇచ్చారు. వారు చదివి నమస్కారం చేసి, డా॥ కలాంగారికి ఇచ్చి "తప్పకుండా ప్రకటించండి సార్" అని అన్నారు. డా॥ కలాంగారు తమ ఉపన్యాసంలో అదే విధంగా ప్రకటించారు. అప్పటి విద్యాశాఖ మంత్రి శ్రీ పార్థసారధిగారితో పాటు అందరికీ ఆ రోజు ఒక జాతీయ యువజన

ఉద్యమంగా ఒక గొప్ప గుర్తింపు వచ్చింది.

**"యువశక్తి" రూపకర్త ఆలపాటి - ఉద్యమవ్యాప్తికి నవశక్తి**



ఆనాటి సమావేశంలోనే ఆచార్యగారితోనూ, లీడ్ ఇండియా వుద్యమ కార్యక్రమాలతోనూ సన్నిహిత సంబంధాలున్న ప్రముఖ రచయిత శ్రీ ఆలపాటి గారి సంపాదకత్వంలో రూపుదిద్దుకున్న "యువశక్తి" తెలుగు మాసపత్రికను డా।। అబ్దుల్ కలాంగారు అందరి సమక్షంలో ఆవిష్కరించారు. ప్రఖ్యాత రచయితలు, కవులు, గాయకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి మరియు బహుభాషా కోవిదులు అయిన శ్రీ ఆలపాటిగారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి 'యువశక్తి' మాసపత్రికకి రూపకల్పన చేయడం మొదలు సర్వాంగసుందరంగా అంతిమ రూపం ఇచ్చే వరకూ నిస్వార్థసేవలు అందిస్తున్నందుకు కలాంగారు, ఆచార్యగారితో సహా అందరూ కొనియాడారు. ప్రింట్, ఆడియో,వీడియో మరియు మీడియాల ద్వారా ఈ మహోద్యమాన్ని మరింతగా విస్తరింప చేయడానికి నడుం బిగించిన శ్రీ ఆలపాటి గారిని ఇప్పుడు లీడ్ ఇండియా 2020 మీడియా డైరెక్టర్‌గా ఆనందంగా ఆహ్వానించుకున్నాం.

**సాన్నిహిత్యం ఎలా ఏర్పడుతుంది**




నిరంతర సమావేశాలు, సమాలోచనలు, తదనుగుణంగా నిరంతర కార్యక్రమాలు, వాటి ప్రభావాలు, విజయాలు, తృప్తి, ఆనందం, ఇవన్నీ

వ్యక్తులను సన్నిహితం చేస్తాయి. అలాగే డా॥ అబ్దుల్ కలాంగారినీ, ఆచార్యగారినీ లీడ్ ఇండియా 2020 – "ఆప్ బఢో దేశ్ కో బఢావో" శిక్షణ ప్రభావాలు, అత్యంత సన్నిహితులుగా మార్చాయి. వారి సెక్రటరీలు శ్రీ ఆర్.కె ప్రసాద్, శ్రీ శరిడన్, శ్రీ శర్మ, శ్రీ పొణ్ రాజ్ గార్లు అందరూ ఈ ఉద్యమానికి చాల గొప్ప ఊతమిచ్చారు.

డా॥ కలాంగారు సహజంగా ఎవరినైనా ఆమడ దూరంలో ఉంచి, ఎవరితో ఎంతవరకో అంతవరకే మాట్లాడేవారు. ఆ విషయం వరకే వుండేవారు. కానీ ఆచార్యగారు వారి సాన్నిహిత్యంతో ఒక వ్యక్తిగత అధికారం సంపాదించుకున్నట్లు వారిని అనేక ప్రశ్నలు వేసేవారు, కొన్నిసార్లు "మీరు తప్పని సరిగా రావలసిందే" అని డిమాండ్ చేసేవారు. "వీళ్ళతో కలవవలసిందే" అని సమావేశాలు ఏర్పాటు చేసేవారు. ఆ విధంగా లీడ్ ఇండియాకు సంబంధించి శ్రీ హరికిషన్ ఇప్పనపల్లి, జస్టిస్ చంద్రకుమార్ గారు, శ్రీ జగన్ మోహన్ రెడ్డి గారు, లయన్స్ క్లబ్ నాయకులు, పూర్వ సి.బి.ఐ.జె.డి శ్రీలక్ష్మీనారాయణగారు – ఇలా ఎందరినో కలిపించారు. కానీ ఎన్నడూ తమ పిల్లలను కానీ, బంధువులను కానీ, మిత్రులను కానీ ఏ రోజూ కలపలేదు. కలాంగారే ఒక రోజు కలగచేసుకుని ఇంటిపై కూడా శ్రద్ధ వహించాలని ఆచార్యగారి సతీమణిని పిలిపించి, కుటుంబ విషయాలు, స్థితిగతులు ఏమిటని అడిగారు. ఆమె "అన్ని విషయాలు బాగానే ఉన్నాయి. పిల్లలందరూ చదువుకుని, పెళ్ళిళు ్ళ చేసుకుని అమెరికాలో ఎవరంతట వారు స్థిరపడ్డారు. వాళ్ళెంతగా అమెరికాకు రమ్మన్నా, ఈయన వెళ్ళరు. దాని గురించి పిల్లలకు మాకు 15 సంవత్సరాల నుండి తగాదాలు. మీరైనా చెప్పండి. అది తప్ప మాకు

ఏ సమస్య లేదు" అని అన్నారు. అప్పుడు డా॥ కలాంగారు "ఆచార్యగారితో నేను మాట్లాడతాను" అని సర్ది చెప్పారు.

## పద్మశ్రీ కాదన్న ఆచార్యగారు

ఆచార్య గారితో డా॥ కలాంగారి సెక్రటరీలు "కలాం గారు మీకు ఇంత సన్నిహితులు. ఎప్పుడూ మీరు లీడ్ ఇండియా గురించే అడుగుతారు గానీ, మీ గురించి ఏమీ అడగరే? మీకు తెలుసా? డా॥ కలాంగారు ప్రతి సంవత్సరం ఒకరిని 'పద్మశ్రీ' అవార్డు కొరకు సిఫార్సు (రికమెండ్) చేయవచ్చు, అడగండి" అని అనే వారు. చివరకు కలాం గారితో కలసి వారి పుస్తకాలు వ్రాసిన ప్రొ॥ అరుణ్ తివారీ గారు కూడా రెండుసార్లు ఆచార్యగారికి సలహా ఇచ్చారు. సహాయం చేస్తానన్నారు. కానీ ఏ రోజూ ఆచార్య గారు "నేను ఎప్పుడూ ఏ అవార్డు ఆశించి పని చేయడం లేదు. జీవితం తరువాత ఆ దేవుడు అవార్డు ఇస్తే చాలు. నేను ఎప్పుడూ ఎవ్వరినీ ఏదీ అడగలేదు. ఈ ఉద్యమం ద్వారా ఎంతో మంది ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్‌లు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు సన్నిహితులైనా, ఎప్పుడూ ఎవ్వరినీ ఏదీ అడగలేదు. కలాంగారిని అసలే అడగను" అని అన్నారు.

ఈనాడు కలాంగారు కాల గమనంలో కలిసినాక "మీరు ఎంతో దీక్షతో ఆనాటి నుండి ఈనాటికి లీడ్ ఇండియా ఉద్యమాన్ని ఎన్నో కష్టాలు పడుతూ నడిపిస్తున్నారు. నేను నీకు తోడు ఉంటాను. చేయగల్గిన సహాయం చేస్తూ ఉంటాను" అంటున్నారు ప్రొ॥ అరుణ్ తివారీగారు.

**కలాంగారి వ్యక్తిగత వికసిత్ భారత్ ట్రస్టు లీడ్ ఇండియా ట్రస్టుతో విలీనం.**



"ఎవరినీ" డబ్బు అడగకుండా లీడ్ ఇండియా జాతీయ ఉద్యమం నడపడానికీ, దాని ఆఫీసు నడపడానికీ చాలా కష్టమవుతుంది. దీనికి మీరు శాశ్వత మార్గం చూపాలి'' అని ఆచార్యగారు కలాం గారితో తమ బాధను వ్యక్తం చేశారు."ఈఉద్యమంప్రజా ఉద్యమం కావాలి. దాని కొరకు మనం నిరాశ చెందకుండా ప్రయత్నిస్తూనే ఉండాలి. కష్టాలతో సిద్ధాంతాలు రాజీపడకూడ"దని కలాంగారు స్ఫూర్తినిచ్చారు. డా॥ ఎస్.ఎస్ ఎన్ మూర్తి, డి.ఆర్.డి.ఓ. డైరెక్టర్‌గా రిటైర్ అవగానే లీడ్ ఇండియాలో చేరి ఆచార్యగారికి సహాయం చేస్తారని సూచించారు. వారు డా॥ గోమతిగారితో కలిసి రెండు సంవత్సరాలు లీడ్ ఇండియా పరిశోధన విభాగానికి జీవం పోశారు.

డా॥ కలాంగారు ఆచార్యగారి కష్టాలకు ఉపశమనం కల్గించాలని విప్రో ఫౌండర్ శ్రీ అజీమ్ ప్రేమ్‌జీ గారితో మాట్లాడారు. ఆచార్యగారికి ఉత్తరం వ్రాసి ఇచ్చి, వారి సి.ఈ.ఓ.తో కలవమన్నారు. కలసినా ఏమీ ప్రయోజనం జరగలేదు. చివరకు లీడ్ ఇండియా ఎ.బి.డి.బి మాడ్యూలు ఇచ్చేస్తామన్నా, వాళ్ళు ఒప్పుకోలేదు.

తరువాత డా.కలాంగారు తమ ఆశయ సిద్ధికై స్థాపించుకున్న "వికసిత్ భారత్ ట్రస్టు" బోర్డును రద్దు చేసి, లీడ్ ఇండియా ఫౌండేషన్ ట్రస్టుతో

విలీనం చేయాలని ఆదేశించారు. 2 బోర్డులు కలసి వారి వారి చార్టర్డ్ ఎకౌంట్సుకు, ఐ.టి డిపార్టుమెంట్‌కు, అప్పగించారు. కాని ప్రభుత్వపు ప్రొసీజర్స్ పూర్తిగాక, ఆ విలీనం పూర్తికాకమునుపే కలాంగారి జీవితం సమాప్తమయింది. ఎన్ని ఆవాంతరాలు ఎదురైనా, ఆచార్యగారి భగీరథ ఉద్యమం మాత్రం ఆగకుండా సాగుతూనే ఉంది.

**వివేకానందుడి వారసత్వం ఎవరం ఎలా తీసుకోవచ్చు?**

కన్యాకుమారిలో ధ్యానం చేస్తూ, గురువు ఆజ్ఞను అందుకుని స్వామీ వివేకానంద 4 సంవత్సరాలపాటు అమెరికా, ఐరోపా తదితర పాశ్చాత్య దేశాలన్నీ పర్యటించి, తన వేదవిజ్ఞానంతో సనాతన భారతీయ విలువలను చాటి, భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపారు.

ఆచార్యగారు విద్యార్థి దశలో వివేకానందుడి జీవన సిద్ధాంతాలకు ఆకర్షితులై తాము కూడా విదేశాలకు వెళ్ళవలసి వస్తే, వివేకానందుడిలాగా దేశం కొరకు వెళ్ళాలి కానీ వ్యక్తిగత బోగభాగ్యాలకు వెళ్ళకూడదని సంకల్పం తీసుకున్నారు. అందువలన పిల్లలు వెళ్ళినా "నేను వెళ్ళడం లేదు" అని డా॥ కలాంగారితో చెప్పారు.

కొంతకాలం తరువాత ఆచార్య గారికి డా॥ కలాంగారు ఫోన్ చేసి "అమెరికాలో 100 భారతీయ సంఘాలు నన్ను ఆహ్వానించాయి. మీరు కూడా వస్తే, లీడ్ ఇండియా ఉద్యమంలో వారందరినీ చేర్చి, భారతదేశంలో ఉన్న వారి వారి పల్లెల్లోని పాఠశాల విద్యార్థులకు లీడ్ ఇండియా శిక్షణ ఇవ్వమని వారిని అడుగుదాం" అని అన్నారు. అప్పుడు ఆచార్య గారు "తప్పకుండా వస్తాను సార్" అన్నారు. దేశం కోసం వివేకానందుడిలా

వెళ్ళే తన కలని భగవంతుడు ఈ విధంగా నెరవేరుస్తున్నందుకు ఆచార్యగారు ఆనందపడ్డారు.

## ఒకసారి నచ్చితే ఎప్పటికీ నచ్చుతుంది



మనిషి మనసుకి నచ్చిన విషయం ఆనందం కలిగిస్తుంది. ఆ ఆనందం కొరకు మనసు జీవితాంతం పరితపిస్తుంది.

శ్రీ హరికిషన్ ఇప్పనపల్లి, కరీంనగర్ జిల్లాలో ఒక పేద కుటుంబంలో పుట్టి, ఎన్ని కష్టాలు వచ్చినా ఓర్చి, ఉన్నత విద్యయే అభివృద్ధికి ఏకైక మార్గం అనే పట్టుదలతో చొప్పదండి ప్రభుత్వ పాఠశాల నుండి జె.ఎన్.టి.యు మెట్లు ఎక్కి, అమెరికా చేరి, అందరిలా ఉద్యోగిగా వెళ్ళినా, ఉద్యోగాలు ఇచ్చే అధినేతగా ఎదిగారు. తనతో పాటు వేల మందిని అమెరికా చేర్చారు. అమెరికాలోనే అగ్రగామి అయి "భారత్‌కు నేను ఏమి తిరిగి ఇవ్వగలను?" అని ఆలోచించి ఇప్పనపల్లి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి నోబుల్ బహుమతిలాగా "శాంతి' అవార్డు"ను డా॥ అబ్దుల్ కలాంగారి చేతుల మీదుగా ఇవ్వటానికి సంకల్పించారు. దీనికొరకు వారు ఆచార్య గారిని కలిశారు. ఆచార్యగారు వెంటనే 2008, మార్చి 8 నాడు శ్రీ హరికిషన్ గారిని డా॥ కలాంగారితో ఢిల్లీలో కలిపారు. డా॥ కలాంగారికి "శాంతి అవార్డు" ఇవ్వాలనే తన ఆలోచనను తెలిపారు. డా॥ కలాంగారు సంతోషం వ్యక్తం చేసి, "మీ ఆలోచన గొప్పది; మీరు లీడ్ ఇండియా కార్యక్రమాలు చూసి, ఆ ఉద్యమాన్ని ముందుకు నడపగలరా! చూడండి" అని అన్నారు. మరుసటి రోజే ఆచార్య గారు శ్రీ హరికిషన్ గారిని కరీంనగర్ జిల్లాలో ఒక లీడ్ ఇండియా 2020 శిక్షణ



పొందిన ఎస్.టి. గర్ల్స్ హస్టల్‌కు రాత్రి 11:30 గంటలకు తీసుకువెళ్ళారు. ఒక గంట సేపు పిల్లలను ప్రశ్నించి, వారి మాటలను విన్నారు. ఆరోజు వారిని చూసిన తరువాత నచ్చిన శ్రీ హరికిషన్ గారు ఏ రోజుకైనా ఈ లీడ్ ఇండియా "ఆప్ బఢో దేశ్‌కో బఢావో" శిక్షణయే దేశం మార్పుకు మూలం అని భావించారు... ఈనాటికీ నమ్ముతున్నారు. నాయకత్వం వహిస్తున్నారు. "లీడ్ ఇండియా 2020 యూ.ఎస్.ఎ. ఛాప్టర్" చైర్మన్‌గా ఎంతో మంది ఎన్.ఆర్.ఐలను ఉద్యమంలోకి తీసుకొస్తున్నారు. అమెరికా ప్రభుత్వం నుండి 501 టాక్స్ మినహాయింపు కూడా తెచ్చారు. ఆచార్యగారు చేసే సామాజిక మార్పుకి "శాంతి అవార్డు"ను బహూకరించారు. ఆచార్యగారి సహకారంతో ఎన్నో పర్యాయాలు అమెరికాలో కలాంగారి సమావేశాలు ఏర్పాటు చేశారు. డా॥ కలాంగారి తదనంతరం కూడా న్యూయార్క్‌లో 2016, జూలై 27నాడు ఆచార్యగారి ద్వారా కలాంగారి రెండవ వర్ధంతి దిగ్విజయంగా నిర్వహించారు. తాను చేయగలిగినంత చేస్తూ శ్రీ శ్రీనివాస్ గనగొని, శ్రీమతి ఛాయా పాముల, ప్రొ॥ రాజారావు, శ్రీ తెంజర్ల ప్రసాద్ లాంటి ఎంతో మంది దేశభక్తులైన వారికి లీడ్ ఇండియా ఉద్యమ నాయకత్వం అందిస్తున్నారు. ప్రస్తుతం సాగుతున్న లీడ్ ఇండియా మిషన్ 2020ని "పాన్ ఇండియా"గా దేశవ్యాప్తంగా విస్తరించచడానికి కృషి చేస్తున్న లీడ్ ఇండియా సమర్థకులు వీళ్ళు.

## ఏ దేశమేగినా తల్లిభారతి తనయులకు సరిలేరు ఎవ్వరూ

2008, మార్చి 28నాడు న్యూయార్క్ నగరంలో భారతీయ సంతతి సంఘాల సామూహిక సమావేశంలో డా॥అబ్దుల్ కలాంగారు "లీడ్ ఇండియా 2020 యూ.ఎస్.ఎ చాప్టర్" ప్రారంభించారు. ఆచార్యగారిని పరిచయం చేశారు, "వీరిని మీకు అప్పగిస్తున్నాను. వీరు ఇండియాలో లీడ్ ఇండియా 2020 2వ జాతీయ ఉద్యమాన్ని నడిపిస్తున్నారు. "ఆప్ బఢో దేశ్‌కో బఢావో" శిక్షణ లక్షల మంది పిల్లలను మారుస్తుంది. మీరందరూ అమెరికాలో ఉన్న భారతీయ ఎన్.ఆర్.ఐ లందరినీ సంఘటిత పరచి జన్మభూమి ఋణం తీర్చుకోవడానికి పల్లెల్లో పేదపిల్లలకు ఈ శిక్షణ ఇప్పించమని వారితో చెప్పండి. ఆచార్యగారు దీని గురించి వివరాలు ఇస్తారు. గొప్ప బలము చేకూర్చగలరు" అని అందరికీ ఉద్యమాన్ని పరిచయం చేశారు.




తరువాత వ్యాపారవేత్త శ్రీ రవి కోనేరు, "లీడ్ ఇండియా 2020 యూ.ఎస్.ఎ చాప్టర్ " కోఆర్డినేటర్‌గా బాధ్యతలను చేపట్టారు. ఆచార్య గారి సమావేశాలను ఏర్పాటు చేశారు. వారికి తోడుగా శ్రీ హరికిషన్ ఇప్పనపల్లి న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్‌టన్ డి.సి, మసాచుసెట్స్, కాలిఫోర్నియా, లాస్ ఎంజిల్స్, డల్లాస్ మరియు అనేక నగరాలలో వుపన్యాసాలు ఏర్పాటు చేశారు. తానా, ఆటా, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్ ఎన్.ఆర్.ఐ సంఘాల వారికి లీడ్ ఇండియాను పరిచయం చేశారు. దాదాపు 75 రోజుల్లో 26 రాష్ట్రాల్లో గొప్ప సభలను నిర్వహించారు. తల్లి భారతి

సేవలను అందించడానికి పులకరించిన ఎన్.ఆర్.ఐ లందరూ ముక్తకంఠంతో ఉద్యమాన్ని నడపడం కోసం సంసిద్ధులైనారు.

"ఆచార్య గారు ఎటు వెళ్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? ఎక్కడ వుంటారు?" అంతా సస్పెన్సే వారికి. కాని నిర్వహించే ఎన్.ఆర్.ఐ. నాయకులు అది దేశానికి ఒక గొప్ప సేవగా భావించి, అందరినీ పెద్ద సంఖ్యలో పెద్ద పెద్ద హోటళ్ళలో, దేవాలయాల్లో, చారిత్రాత్మకమైన భవనాల్లో సమావేశాలు ఏర్పరిచి, సన్మానాలు చేసి, "లీడ్ ఇండియా! లీడ్ ఇండియా! లీడ్ ఇండియా!" అంటూ నినాదాలు చేస్తూ, దేశభక్తిని చాటారు. ఆనాడు వివేకానందుడికి ఏ విధంగా సన్మానాలు జరిగాయో ఊహించుకున్నారు ఆచార్యగారు. వారి లాంటి వేల మంది ఆచార్యులను తయారు చేసి ప్రపంచంలో ఉన్న ఎన్.ఆర్.ఐ లందరినీ లీడ్ ఇండియా ఉద్యమంలోకి చేర్చి, కోట్లకొలది విద్యార్థులకు శిక్షణలు ఇచ్చి, భారత్‌ను తిరిగి విశ్వగురువుగా చేయగలమనే నూతన సాధ్యతా అవకాశాన్ని తీసుకువచ్చారు.

**బాలలందరూ భారతరత్నాలే!!!**

బాలలు భగవత్ స్వరూపులు! బాల్యదశలోనే విలువలు నాటి, వారి ద్వారా దేశానికి దృఢమైన విలువల పునాది వేయవచ్చు. వారిని విశ్వనేతలుగా చేయవచ్చు. భారత్‌ను మళ్ళీ విశ్వగురువుగా మార్చవచ్చు. భారత గత వైభవాన్ని సాకారం చేసుకోవచ్చు. ఈనాటి దేశ జనాభాలో బాలలు అత్యధికంగా ఉన్నారు. వారి తెలివి తేటలు వారి తల్లిదండ్రులనే మించినవి. వారి సాంకేతిక నైపుణ్యాలే వారికి వరాలు. వారిలో దాగిన సృజనాత్మకతను వెలికితీసి జాగృతం చేస్తే బాలలందరూ భారత రత్నాలు

కాగలరు. లీడ్ ఇండియా 2020 "ఆప్ బఢో దేశ్‌కో బఢావో" శిక్షణ గొప్ప మార్పు తెస్తున్నప్పటికీ, ఆ మార్పులను జీవితాంతం పదిలంగా నిలపడం వారి తల్లిదండ్రులపైన,


ఉపాధ్యాయులపైన ఆధారపడి ఉంటుంది. ఏ విద్యార్థి మనసులో మార్పు గట్టిగా నిలుస్తుందో, ఆ విద్యార్థే గొప్పగా అభివృద్ధి చెందుతూ, చాలా మంది లక్ష్యాలు పెట్టుకుంటున్నారు. కానీ, ఎంతో కొంత మాత్రమే ఎదుగుతున్నారు. కొంతమంది స్తబ్ధతతో అలాగే ఉండిపోతున్నారు.




రైతు విత్తనాలు చల్లుతూ వెళ్ళిపోతుంటాడు. ఏ విత్తనానికి అనువైన వనరులు లభిస్తాయో, ఆ విత్తనం మొలకెత్తి, బాగా ఎదుగుతుంది. మిగతావి భూమిలో అలాగే ఉండి పోతుంటాయి. అందుకే రైతు ఒక నర్సరీని పెట్టి, కావలసిన మొక్కలకు వనరులు అందించి, కావలసిన పంట పండిస్తున్నారు. ఆ జీవన సత్యాలని గమనించిన ఆచార్య గారు లీడ్ ఇండియా 2020 ఉద్యమానికి తోడుగా లీడ్ ఇండియా భారత రత్నాస్ ఒక నర్సరీ లాగా, ఒక పరిశోధనాశాల లాగా ఆరంభించారు. ప్రతి పిల్లవాడిని ఏ విధంగా రత్నంగా మార్చవచ్చును? అని ఆలోచించి "ఆప్ బఢో... దేశ్‌కో బఢావో" అంశాలను పాఠశాల అంశాలతో జత చేసి, విద్యార్థులను శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసి, దేశభక్తి, దైవభక్తితో నింపి, దేశాభివృద్ధికి తోడ్పడే లీడ్ ఇండియన్స్ సైనికులుగా తీర్చిదిద్దుతున్నారు. అవే సిద్ధాంతాలతో డా॥ కలాంగారి మార్గదర్శనంలో వారి చేతుల మీదుగా 20.06.2013

నాడు లీడ్ ఇండియా భారత్‌రత్నాస్ స్కూల్ స్థాపించబడింది. దేశం మొత్తం సి.బి.ఎస్.సి, స్కూల్స్‌లో సిసిఇని అనుకరిస్తున్నారు. కాని భారత్‌రత్నాస్ స్కూల్‌లో సిసిఇ (Continuous Comprehensive learning) మరియు లీడ్ ఇండియా మీ అభివృద్ధే దేశాభివృద్ధి పాఠ్యాంశాలతో జోడిస్తూ, పాఠశాల కార్యచరణ ప్రణాళికలని రూపొందిస్తున్నారు. పరిశోధిస్తున్నారు. వ్యక్తి శక్తిగా విలువలతో, నిర్దిష్టమైన విశ్వనాయకత్వపు నైపుణ్యాలతో లీడ్ ఇండియన్స్‌గా మలచే ఇది ఒక విద్యా ఉద్యమం

## లీడ్ ఇండియా ట్రైనీస్



**పి.వి.సింధు**

రీయో ఓలంపిక్ సిల్వర్ మెడలిస్ట్



**బొల్లా శ్రీకాంత్**


బెస్టు ఎంటర్ పెన్యూర్ 2016

## లీడ్ ఇండియా భారత్ రత్నాస్ స్కూల్ విద్యార్థులు



**దుర్గశరత్**

ఆసియా త్రో బాల్



**కృతిక**

కమ్యూనికేషన్ లీడర్, ఎవార్డి టోరంటో యూనివర్శిటీ, కెనడా 2017

## అన్ని విధాలా అపురూపం - అబ్దుల్‌కలాం

మనిషి ఉన్నప్పుడు మామూలు మనిషిలానే అనుకుంటాం. మామూలు విలువలే ఇస్తాం. కాని అదే మనిషిని, పోయిన తరువాత, మహామనిషిగా గుర్తిస్తాం... వారి విలువలని గ్రహిస్తాం. మరో ప్రక్క కాలం గడిచే కొద్దీ, మనిషి చేసిన గొప్ప విషయాలు అన్నీ మరిచిపోతుంటాం. డా॥ అబ్దుల్ కలాంగారు బ్రతికి ఉన్నప్పటి కంటే మరణించిన తరువాత ప్రజలందరూ వారి విలువలను ఎక్కువగా కొనియాడుతున్నారు.

"డా॥ అబ్దుల్ కలాంగారూ! మీరు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు? ఎందుకు చిన్న ఇల్లైనా కట్టుకోలేదు? ఎందుకు అందరిలాగా ఒక మొబైల్ ఫోన్ కూడా లేకుండా వున్నారు?" అని అడిగినప్పుడు, "అసలు వాటి గురించిన ఆలోచన చేయడానికి కూడా నాకు సమయం లేదు" అని అన్నారు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసి, కేవలం రెండు బ్యాగులతో బయటకు వచ్చారు. అదే రాష్ట్రపతి భవన్ నుండి మరో రాష్ట్రపతి తీసుకువెళ్ళిన సామాన్లు తిరిగి ఇవ్వమని సమన్లు జారీ చేసిన విషయం పాఠకులకు విదితమే.

డా॥ కలాంగారు చనిపోయిన వెంటనే వివిధ ప్రభుత్వాలు వివిధమైన అంశాలను ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులు 'అబ్దుల్ కలాం ఫౌండేషన్'ను స్థాపించారు. వారి సెక్రెటరీ శ్రీ పొణ్‌రాజ్ కాలం ప్రాజెక్టుకి ప్రాణం పోయడానికి ఇంటర్‌నెట్‌పై ఒక సంచలనం సృష్టించి, ఎన్నికల్లో పోటీ చేశారు. క్రమేణా డా॥ కలాంగారు కాల గమనంలో కలసిపోతున్నారు. అందరూ ఆయన్ని మరిచిపోతున్నారు.

2020 నాటికి అభివృద్ధి భారత్‌ని సాధించి, డా॥ కలాంగారి కలలను నిజం చేయడానికీ, డా॥ కలాంగారి విలువలను నిలపడానికీ డా॥ కలాంగారి అనుయాయు లందరినీ కలుపుకుని అందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చి, యువశక్తిని దేశశక్తిగా చేస్తున్న ఏకైక ఉద్యమం లీడ్ ఇండియా 2020 "ఆప్ బఢో దేశ్‌కో బఢావో".

**డా॥ కలాంగారు హనుమంతుని అంశం**



మనలో ఒక్కొక్కరం ఒక్కొక్క కారణంతో జన్మిస్తాము. కార్యం ముగిసిన తరువాత వెళ్ళిపోతాం. భారతదేశ బానిసత్వాన్ని రూపుమాపడానికి జన్మించాడు గాంధీజీ. సరిగ్గా 60 సంవత్సరాల స్వతంత్ర భారతదేశానికి దక్కిన గాంధీజీ లాంటి మహనీయుడు కలాంగారు. దేశానికి 2020 నాటికి 'అభివృద్ధి భారత్' అనే జాతీయ లక్ష్యాన్నిచ్చి, "లీడ్ ఇండియా 2020 రెండవ జాతీయ ఉద్యమం" అని ప్రకటించారు.

ఆచార్యగారు 11 సంవత్సరాలు డా॥ అబ్దుల్ కలాం గారితో కలసి, భుజం భుజం కలిపి, మాట మాట కలిపి, చేతలకు చేదోడై లీడ్ ఇండియా ఉద్యమాన్ని నడిపారు.ఆచార్యగారు తమ అనుభవంతో గమనించి, విశ్లేషించి, గ్రహించి కలాంగారు హనుమంతుని అంశ అని భావించారు. హనుమంతుణ్ణి – కలాంగారిని ప్రక్కప్రక్కన పెట్టి గమనించండి! ఇద్దరి స్వరూపాలు దాదాపు ఒకేలా ఉంటాయి.

**శారీరకంగా...**

భౌతికంగా చేతులనూ, చేతివేళ్ళనూ గమనించండి. ఇద్దరి చేతులూ చేతి వేళ్ళూ మీరే గుర్తిస్తారు. ప్రతి విషయాన్నీ పరిశీలించి, గమనించే చూపులు, ఉంగరాల జుట్టు, వారి నడక చిన్న చిన్న అడుగులతో తాపీగా నడిచే హనుమంతుడి అడుగుల్లా గోచరిస్తాయి. వారి బ్రహ్మచర్యం, శాకాహార భోజనం, మితాహారం ఇంకా ఎన్నో మీరే గమనించండి!

**మానసికంగా...**

వారి మనసు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. ఎప్పుడూ పాజటివ్ ఆలోచనలు. సృజనాత్మకతతో, శక్తివంతంగా, బలోపేతమైన విధంగా అసాధ్యాలను సుసాధ్యం చేస్తారు. వారి గురువులు వాటిని గుర్తింపజేశారు. హనుమంతుడు సూర్యుణ్ణి ఫలంగా భావించి మ్రింగినట్లుగా, కలాంగారు అగ్ని, బ్రహ్మోస్‌లను భారత్‌కి అందించాడు. హనుమంతుడు అమ్మవారి జాడ కనుగొని శ్రీరామునికి ప్రీతిపాత్రుడైన విధంగా, కలాంగారు 'మిసైల్ మ్యాన్'గా ఎదిగి భారతమాత ప్రియపుత్రులైనారు.

**బుద్ధి జ్ఞానములు...**

ప్రతి విషయాన్నీ పరిశీలించే బలమైన బుద్ధి, తత్వవిచారణతో తీసుకునే మంచి – చెడు నిర్ణయాలు, విషయంపై గట్టి పట్టు, ప్రకృతి పరిరక్షణకి ఆయన పడుతున్న తపన తమ ఇంటిలోని 200 ఏళ్ళ ఆశోక వృక్షంతో రోజు మాట, నెమలులతో ఆట, భూతదయ ఇవన్నీ వారి నైజాలే!!!

**మానవతామూర్తి - మన కలాం**

సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస, ధైర్యం, కరుణ, వినయం, నమ్రత, నిరహంకారం, భక్తి, జ్ఞానం, వైరాగ్యం – ఇలా ఎన్నో సద్గుణాలకు నెలవైన హనుమత్ స్వరూపం మన కలాంగారు.

కలాంగారు ఆఖరి రోజు షిల్లాంగ్ వెళ్తూ తమ ముందున్న రక్షకవాహనంపై ఒక జవాన్ తుపాకీ పట్టుకుని 5 గంటలు నిలబడినది గమనించి, తన సెక్రెటరీతో చెప్పి అతణ్ణి కూర్చోపెట్టడానికి అనేక ప్రయత్నాలు చేశారు. కాని ప్రొటోకాల్ ప్రకారం ఎవ్వరూ ఆయనని కూర్చోబెట్టలేక పోయారు. కలాంగారు కారు దిగగానే అతణ్ణి పిలిపించి భుజంపై తట్టి అతడి సేవను కొనియాడారు. "నావల్ల నీకు కష్టం కలిగింది" అని అతడికి బిస్కెట్లు, పండ్లరసం ఇచ్చిన ప్రేమస్వరూపుడు మన కలాంగారు.

**దైవభక్తి...**

హనుమంతుడు రాముడికి గొప్ప భక్తుడు. అలాగే కలాంగారు కూడా రాముడి భక్తుడే! ఖురాన్, భగవద్గీత రెండింటినీ సమానంగా పఠించేవారు ఆయన. త్యాగరాజ కీర్తనలని పాడుతూ తన్మయత్వం చెందేవారు.

**దేశభక్తి...**

హనుమంతుడు సుగ్రీవుడికీ, విభీషణుడికీ పట్టాభిషేకం చేయించారు. అలాగే కలాంగారు దేశానికి చేసిన ఘనమైన సేవలు బి.జె.పి ప్రభుత్వానికి దోహదపడ్డాయి.

రాజకీయ రగడలతో ఒకరితో ఒకరు తమ తమ లబ్ధి కొరకు పోట్లాడుకుంటూ ప్రజల సమస్యలు చర్చించకుండా పార్లమెంటు సమయాన్ని వృథాచేస్తున్న సమస్యకు మీరే పరిష్కారం కనుక్కోవాలని షిల్లాంగ్ విద్యార్థులకు ఉద్బోధిస్తూ ఆఖరి శ్వాస వదిలి, సాటిలేని తమ దేశభక్తిని చాటుకున్నారు... దైవంలో కలసిపోయారు మన ప్రియాతి ప్రియమైన కలాంగారు.

**లీడ్ ఇండియా మిషన్ 2020 - మిసైల్ విజేతలు మీరే**

కోట్లాది మంది విద్యార్థులని తీర్చి దిద్దడం

**వివేకానందుడు/కలాంగారు/ఆచార్యగారు**

## వారసుడిగా నేను

- నేను విలువలతో, నైపుణ్యాలతో, లక్ష్యంతో విశ్వ నేతగా ఎదుగుతాను.
- దేశం మారాలి అంటే, నేను మారాలి... నా కుటుంబం మారాలి.
- చదువులో / అభివృద్ధిలో ఇతరులతో కాకుండా నాతో నేను పోటీ పడతాను .
- నా ఆలోచన, మాట, చేత త్రికరణశుద్ధితో అభివృద్ధి చెందుతాను.
- నా కర్మ కు నేనే బాధ్యుణ్ణి అనే సత్యాన్ని గ్రహించాను.
- సత్యం శాంతినీ, ధైర్యాన్నీ, ఆనందాన్నీ అన్ని విలువలనీ ఇస్తుంది.
- అసత్యంతో ఆందోళన, అశాంతి, అనారోగ్యం అని తెలుసుకున్నాను
- ప్రతి దాన్నీ పరిశీలించి,పశ్నించి, పరిశోధన చేస్తాను
- నా స్వలాభం కొరకు ఎన్నడూ అవినీతికి పాల్పడను.
- చట్టాలను గౌరవిస్తున్నాను, నియమ నిబంధనలు పాటిస్తున్నాను.
- సేవా దీక్షా దక్షతలతో మానవతావాదిగా మన్ననలు పొందుతాను.
- నా తల్లిదండ్రులనూ, గురువులనూ దైవంగా పూజిస్తున్నాను.
- ఏ కష్టాన్నైనా ఎదుర్కొనే ధైర్య సాహసాలనూ, సానుకూల దృక్పథాన్నీ పెంపొందించుకున్నాను.
- ఎలాంటి పరిస్థితులనైనా ఎవరితోనైనా సర్దుకుపోతాను.